- ఎరుకల సంయుక్త ధ్వనులు : భాషాశాస్త్ర విశ్లేషణ
- ఆచార్య గుమ్మన్నగారి బాలశ్రీనివాస మూర్తి
- తెలంగాణ మాగాణంలో అక్షరమూర్తి
- చిన్న వాక్యాల రచనలో మేటి
- తెలుగు భావ కవితా సౌందర్యం
- మాతృశతకం - వస్తు వైశిష్ట్యం
- ప్రపంచ సాహిత్యంగా తెలుగు : అంతర్జాల పాత్ర
- నీలగిరుల యాత్ర

# మూసీ
# MUSI

◆ Samputi : 26 ◆ Sanchika : 07 ◆ Pages : 64 ◆ Rs. 20
◆ May 2023

UGC Care List
Approved Journal





Scanned with OKEN Scanner



వ్యవస్థాపకులు
శ్రీ బి.ఎన్.శాస్త్రి

సంపుటి : 26 సంచిక : 7
మే - 2023
'శోభకృత్' వైశాఖ మాసం

సంపాదకులు (EDITOR)
సాగి కమలాకర శర్మ
SAGI KAMALAKARA SHARMA

సహ సంపాదకులు (ASSOCIATE EDITOR)
డా. దత్తయ్య అట్టెం
Dr. DATTAIAH ATTEM

Printed and Published by
**B. Anantha Laxmi**

*Type Setting at :*
**Kavyasree Graphics**
Ph: 934 797 1177

Printed at : Sri Sai Process
Ph. 27563075

విడిప్రతి : 20/-
సంవత్సర చందా : 200/-
శాశ్వత సభ్యత్వం : 2500/-
(పది సంవత్సరాలు మాత్రమే)

చెక్కులు, డి.డి.లు 'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine) పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : మేనేజర్, మూసీ మాసపత్రిక, 2-2-1109/బికె - ఎల్ఐజి-10, బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ - 500 013
ఫోన్ : 934 797 1177
email : editormusi@gmail.com

INTERNATIONAL STANDARD SERIAL NUMBER
ISSN 2457-0796

UGC APPROVED JOURNAL




# మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక
చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

## ఈ సంచికలో ...

### వ్యాసాలు


ఎరుకల సంయుక్త ధ్వనులు : భాషాశాస్త్ర విశ్లేషణ ... డా. వి.ఎం. సుబ్రహ్మణ్య శర్మ 7
పద్య మనోహరం - 42 ... డా. గన్నమరాజు గిరిజా మనోహర్ బాబు 12
ఎటమటం (బందారం కథలు -18) ... డా. నందిని సిధారెడ్డి 13
**ఆచార్య గుమ్మన్నగారి బాలశ్రీనివాస మూర్తి...**
తెలంగాణ మాగాణంలో అక్షరమూర్తి ... డా. సుభ్యా 17
చిన్న వాక్యాల రచనలో మేటి ... గురిజాల రామశేషయ్య 19
విలక్షణ వక్త ... ఆచార్య కరిమిండ్ల లావణ్య 20
భారతీయీకరణ12 : ఆంగ్లమూలం : బలరాజ్ మధోక్, తెలుగు : కోవెల సంపత్కుమార21
బాలభాష (గ్రంథాంతరంగం-24) ... ఘట్టమరాజు 25
తెలుగు భావ కవితా సౌందర్యం ... ఆచార్య ఎం. రామనాథం నాయుడు 29
మాతృశతకం - వస్తు వైశిష్ట్యం ... డా. జొన్నలగడ్డ భారతి 35
సావిత్రి : శ్రీ అరవిందుల వారి ఆధునిక మహాకావ్యం ... వేలూరి కృష్ణమూర్తి 39
ప్రపంచ సాహిత్యంగా తెలుగు : అంతర్జాలం పాత్ర ... డా. వెంకటరామయ్య గంపా 43
కథాసాహితి కథల సంకలనాలు : ఆదివాసుల అస్తిత్వ చిత్రణ ... లెంక సత్యనారాయణ 49
నీలగిరుల యాత్ర ... ప్రవీణ్ కుమార్ బోళ్ళ 53


### కవితలు


శ్రీ లలితా నటేశ్వరా! ... డా. వి. శరత్ బాబు - 5; తుకారాం అభంగం ... డా. మంత్రి శ్రీనివాస్ -6; అక్షరాయుధుడు - మా బాలుడు ... ఆచార్య వి. నిత్యానందరావు - 16; విజయ సౌధం - వనపట్ల సుబ్బయ్య ... 48; నేతల కాలం ... డా. కందుల శ్రీను - 52; అసలు ముఖం ... తండ హరీష్ గౌడ్ - 56; కార్మిక వీరుడా ... ఓ శ్రామిక ధీరుడా ... డా. నీలిమా కృష్ణమూర్తి - 62;


### సమీక్షలు


తాళ్ళపాక సంకీర్తనలు ... శివప్రియ 57
బంజారా జీవితాల ప్రతీక - ఝోళి ... ఆచార్య కె. లావణ్య 59
స్వీకృతి ... 61


**ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.**

*Printed, Published and Owned by* : **B. Anantha Laxmi,** 3-4-245/1, Lingampally, Kachiguda, Hyderbad - 500 027. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma. RNI No. 37723/80**

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 7  UGC Care List Approved Journal
హైదరాబాద్ మే : 2023

సంపాదకీయం







వ్యక్తి శక్తి కావాలి

మనిషి మనీషి కావాలి

మానవుడు
మహనీయుడు కావాలి

ఉన్న స్థానం నుండి
ఉన్నత స్థానానికి చేరాలి

పరిమితుడు
అపరిమితుడు కావాలి

స్థాయి విస్తరించాలి

దైవత్వం మేల్కొనాలి

తనను తాను నిరంతరం
ఉద్ధరించుకోవాలి

అందరికీ ఆదర్శంగా
ఆమృతమూర్తిగా
మారాలి

నీలో దీపం వెలిగించు
నీవే వెలుగై వ్యాపించు





## అన్వేషణ

వెదకడం అనే అర్థంలో వినియోగించే అన్వేషణ అని ఉపయోగిస్తాం. (ఇషగతౌ). గవేషణ, పర్యేషణ మొదలైన పర్యాయపదాలను కూడా వినియోగించుకుంటాం. అన్వేషించడం బుద్ధిజీవికి ప్రాథమికమైన కార్యం. అన్వేషించడం వల్లనే అనేక ప్రకృతి రహస్యాలు ఛేదించబడినాయి. లోక వ్యవహారాలలోని లోతులు తెలుసుకున్నదీ అన్వేషణ వల్లనే. అన్నింటికీ మూలమైన శక్తియొక్క రూపాలుగా ప్రకృతినీ, లోకాన్ని గమనించిందీ అన్వేషించడం వల్లనే. మానవ బుద్ధిలో అన్వేషించడం అనేది ఒక భాగంగా ఉండడం వల్లనే ఇది సాధ్యం అవుతూ వచ్చింది. ఇప్పటికీ తెలిసింది చాలా తక్కువే. ఈ జీవులు, జీవితాలకు సంబంధించిన ఎన్నో విషయాలు ఇంకా అన్వేషిస్తూనే ఉండాలి.

ఈ లోకంలో సౌఖ్య జీవితానికి సంబంధించిన వ్యవహారాల అన్వేషణ కొనసాగినంతగా ప్రాకృతిక వ్యవహారాల అన్వేషణ సాగడం లేదు. ఈ లోకంలోకి వచ్చి, బుద్ధి వికసించి జీవించే అతి కొద్ది కాలంలో చేయదగినంత పనిని చేయకుండానే కాలంలో కలిసిపోతూనే ఉంటున్నారు. ఆ భావాలు లేకుండానే జీవితం గడిస్తే చాలు అనుకునే వాళ్ళూ చాలామంది ఉన్నారు. అవకాశాలు లేని వాళ్ళే చాలామంది. ఉన్నా ఉపయోగించుకోని వాళ్ళు కూడా అంతే. నిజమైన అన్వేషకులు కాలగర్భం చేరుతుంటే, తమ శోధనలు లోకానికి పూర్తిగా అందకముందే కాలగర్భంలో చేరడమే బాధాకరమైన అంశం. అంగీకరింపక తప్పని విషయం.

లోక వ్యవహారాలను నియంత్రించేది అంతా ప్రకృతి పరిశోధన. ప్రకృతికి అనుగుణంగా వ్యక్తి జీవించాలి గానీ, ప్రకృతిని శాసించే స్థితికి ఇంకా ఎదగలేదు. పంచభూతాలను బాగా అధ్యయనం చేస్తే తప్ప ఇది సాధ్యం కాదు. భూమి, నీరు, నిప్పు, గాలి, ఆకాశాదుల్లో దేనిని తీసుకున్నా అద్భుతమైన శక్తి స్వరూపం కనిపిస్తుంది. ఒకదానికి మరొకటి అనుబంధంగానే కనిపిస్తుంది. ఇవి లేకుండా ఈ లోకజీవనం లేనే లేదు. వాటిల్లో కొంచెం లోపం ఏర్పడినా ఇక్కడి జీవులకు మరణం తప్ప ఇంకో మార్గం లేనే లేదు. ఇటీవల ఈ అంశాన్ని మనమంతా అనుభవించి వచ్చిన వాళ్ళమే. ప్రకృతి లోతులను అధ్యయనం చేస్తే ఇంకా ఎన్నో ప్రాకృతిక రహస్యాలు మనకు తెలుస్తూనే ఉంటాయి. ఇంకా సౌఖ్యవంతమైన భూ గ్రహ జీవనం మనకు లభిస్తూనే ఉంటుంది.

ప్రకృతిలోని పంచభూతాలలో అంతా నిండి ఉండేది, ప్రకృతి లేని చోట కూడా ఉండేది, విశ్వమంతా నిండి ఉన్నది ఒక్క శక్తి మాత్రమే. ఆ శక్తి, దాని విస్తరణ, వినియోగించుకునే విధానమే మానవుని ప్రధాన అన్వేషణ కావాలి. శక్తిని అన్వేషించి, దానిని పొందేవారంతా శక్తివంతులే అవుతారు. దేనినైనా మనం సాధించి, దానితో కలిసి ఉండి, దానిని మన జీవితంలో కావలసినంత అనుభవించినప్పుడే దాని లక్షణం అర్థం అవుతుంది. శక్తి విషయమూ అంతే. ఆ శక్తిని బాగా నింపుకుంటూ, నిరంతరం శక్తితోనే జీవించే వారికి ప్రకృతి పూర్ణంగా సహకరిస్తుంది. దేహాలు ఆరోగ్యవంతమవుతాయి. ఆనందం వెల్లివిరుస్తుంది. వారి శరీరాలను వినియోగించుకునే మార్గం అవగతమవుతుంది. ఆ యా విషయాలు అర్థం కాని వారికి, అన్వేషించని వారికి తమలోనూ, తమ చుట్టూ ఉండే శక్తి వినియోగం అర్థం కాక అనవసరంగా వ్యర్థం చేస్తూ ఉండడం జరుగుతుంది. శక్తివంతులైన వారే సమాజాన్ని వారి వారి కాలాల్లో ప్రభావితం చేయగలుగుతారు. ఇంకా శక్తి వంతులు శరీర కాలం తీరిన తర్వాత కూడా ప్రభావితం చేయగలరు. వారు శరీరంతో ఉన్నంత సేపు తమకున్న శక్తిని వినియోగించుకున్న దాని ప్రకారమే వారి ప్రభావం ఉంటుంది. శక్తి అన్వేషణే లక్ష్యంగా మారాలి. బోధనలన్నీ మానవుణ్ణి శక్తియుతున్ని చేయడానికే ఉండాలి.

# శ్రీ లలితా నటేశ్వరా!!





మారక! నీవు నా హృదయ మందిరమందున నిల్వుమిప్పుడే
దారగ నామ తోయమిడి ధ్యానము చేసెడి బుద్ధి నీయుమా!
సారము గూర్చు జీవనము చాలిన బొక్కస మీయుమెప్పుడున్
ధీరత నిన్ను గొల్వడమె దిక్కిక శ్రీ లలితా నటేశ్వరా! 1

ఎవ్వరి మూడుకన్నులవి యేతరియైనను జ్ఞానదీప్తమౌ
ఎవ్వరి మౌళి లోకహితమెంచి సదా కృప గూర్చుచుండునో
ఎవ్వరి కంఠమెప్పుడు జనేచ్ఛకు మంగళ కారకంబునౌ
నవ్వరు పార్వతీపతియె నందురు శ్రీ లలితా నటేశ్వరా! 2

కొందరు భక్తి గొల్తురట కొందరు కీర్తికి గొల్తురయ్య నిన్
కొందరు భీతి గొల్తురిక కొందరు కోర్కెల గొల్తురు శాంతి గాన నిం
కొందరు గొల్తురే యసలు కొందరు లేవని యన్న గాతువే
యిందరి కర్మబంధవిధి నీశ్వర! శ్రీ లలితా నటేశ్వరా! 3

ఆటల నాటజేసి మము నన్నిట పాత్రల జేసి జూతువే
మేటిగ పాత్ర పోషణల మెచ్చుట ద్రుంచుట చేయవెప్పుడున్
ధాటిగ భక్తి నిల్పి నిను దల్చెడి తాపస యోగులింక నీ
గూటికి చేరవచ్చెదరు కూర్మిని శ్రీ లలితా నటేశ్వరా! 4

తాండవమద్భుతంబు కన దండిగ జేసెడి వాడవీ వటన్
మెండుగ లోక రక్షణకు మేలుకు తోడ్పడువైనమేనటన్
డిండిమ నాదవల్లరులు డెక్కల శబ్దము జాగృతంబటన్
నిండుగ మ్రొక్కుచుంటి హర! నిన్నన శ్రీ లలితా నటేశ్వరా! 5

లోకపు క్షేమమున్ గనె విలోక సుధామయ మూర్తి సజ్జనో
ద్రేకము శాంతికై వరలు ధీయుతమౌ విధి బుద్ధి మార్చుమో
శోకము పెచ్చరిల్లగను శూన్యత నెల్లెడ నావహించగన్
శ్రీకరముద్ధతిన్ విసర జేయుము శ్రీ లలితా నటేశ్వరా! 6

భోగము లేల గూర్చితిని? భోగము ముక్తికి భంగమంటివే
రాగములేల గూర్చితివి? రాతము ముక్తికి బంధమంటివే
యోగములేల గూర్చితివి యోగము ముక్తికి కూడదంటివే
వేగమె బంధపాశముల విచ్చుము శ్రీ లలితా నటేశ్వరా! 7

బూడిద బూసుటేలనట? భూరి విషంబును కంఠమందునన్
పాడిగ నుంచుటేలనట? పామును బాయక నుండుటేలటన్
మాడను గంగనెందుకట? మోదము గూర్చని యంబరంబు? నీ
గూడిన నిన్ను గాంచ సిరి గూరును! శ్రీ లలితా నటేశ్వరా! 8

వేదము దెల్పె నీ యునికి వేడ్కల నిర్గుణ సద్గుణంబులన్
వేదమె దెల్పె నీ ప్రళయ భీర రూపపు సంస్థితీయమున్
వేదమె దెల్పె నీ కరుణ విస్తృతి జాడల దారులన్నిటిన్
వే?దమె విద్యయౌ జగతి వేదికి శ్రీ లలితా నటేశ్వరా! 9

(తరువాతి పేజీలో .... మిగిలిన పద్యాలు)

డా. వి. శరత్ బాబు
ఫోన్ : 996 353 3937

నీ చరణారవిందపు వినీల మహోన్నత దీప్తి దిక్కికన్
నీ చలితాంఘ్రి యుగ్మ సరి నీరజ కోమలమే శరణ్యమున్
నీ చరణాబ్జ బంధుర వినిర్మల కాంతియె దిక్కు నాకికన్
నీచుని సైచి సన్మతుల నీయుము శ్రీ లలితా నటేశ్వరా! 10

డమరుక నాద లాస్యకర! డాంబిక దూర! యనీశ తత్త్వమా!
గమక సుధామృతేశ్వర! శికార వకార యకార రూపమా!
సమహిత! సామగానమ! విశారద విశ్వ గుణైక సిద్ధమా!
మమ హృదయేశ్వరా! వర! నమస్సులు శ్రీ లలితా నటేశ్వరా! 11

సరస విలోల తాండవ! వశంకర భక్త జనాళి భక్తికిన్
కరుణ రసాంతరేశ్వర! వికార నిహంత! భవాబ్ధి మోచకై
క రుచిర కేళి శోభిత! సుఖైక నివాసము నంద జేసెడిన్
పరమ స్వరూప! శంకర! ప్రణామము శ్రీ లలితా నటేశ్వరా! 12

కలవర పెట్టకో హర! సకామ నిశీథ నికృష్ట జీవనం
బిల జరుగంగ నీ స్మరణ పేరుకు గూడ తలంపు నొంద రా
దలతి నిమేశ కాలము, సదా విషయాంచిత సక్త చిత్తమై
చెలగగ బ్రోవుమో నను విశిష్టత! శ్రీ లలితా నటేశ్వరా! 13

పరమ దయాళో! పాపము నపారపు సాగరమోలె తోచుచుం
డె రవి ప్రసార భాసుర తటీ భువియెల్ల! ప్రమోద భావ సుం
దరమది యెంత జారెనో! విదారక దృవ్యములెన్నొ గాంచి యీ
గరళము మ్రింగి లోకహితకారిగ నిల్పుము శ్రీ లలితా నటేశ్వరా!14

వదనము వెక్కసంబు వలువల్ కనరాని శరీర మైకమున్
నది, శిఖపైన భారము పినాక భయంబు త్రినేత్ర కంపనం
బిది యటరూప మేటికి? పేర్మి వరంబులొసంగి లోకమున్
పదిలముగాచు శక్తి విభవైకత శ్రీ లలితా నటేశ్వరా! 15



# తుకారాం అభంగం

కోరి సుఖము పరుగు లీడుట
బండ బరువు లెత్తుకొనుటకే
బాధలకు భయపడి మనసా
పారిపోతే బతుకు లేదులే

తేనెటీగ గ్రోలును మకరందం
విఠలు గ్రోలు మనసా నువ్వు
అది అనంత శాశ్వత మూర్తిని
యదన నిలుపుకొనే మనసా

నిజము కావు సుఖభోగాలు
వెంటరావు భవబంధాలు
ఒక్కతై వచ్చినావు ఇలకు
తరలిపోవ ఒక్కతే నిజము

తుకా పలుకు నిత్య సత్యము
క్షణభంగురమీ జీవనము
పాడు పదము పట్టుకో పాదం
విఠలుడొకడే జగతికి ఆధారం




అనువాదం : డా॥ మంత్రి శ్రీనివాస్
ఫోన్ : 83283 33720

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 7 హైదరాబాద్ మే : 2023


# ఎరుకల సంయుక్త ధ్వనులు : భాషాశాస్త్ర విశ్లేషణ

**డా. వి.ఎం. సుబ్రహ్మణ్య శర్మ**, సహాయ ఆచార్యులు, భాషాశాస్త్ర విభాగం, ఢిల్లీ విశ్వవిద్యాలయం,

ఫోన్ : 986670774

**పత్ర సారాంశం** (Abstract):

భాషలో వాగ్వ్యవహారం వాక్యాల్లో జరిగినప్పటికీ అందులో పదాలు (words) అక్షరాలు (syllables), ధ్వనులు (Speech Sounds)గా విభజించడానికి అవకాశం ఉంటుంది. ప్రతి భాషలో కొన్ని పరిమితమైన ధ్వనులు మాత్రమే?ల ఉంటాయి. ఈ పరిమితమైన ధ్వనులు అన్ని కుడా అన్ని ధ్వనులతో కలిసి సంయుక్త అక్షరాలుగా జతకట్టే అవకాశం ఉండదు. ఒక భాషలో 30 హల్లులు ఉన్నట్లయితే అన్ని హల్లులు మిగిలిన అన్ని హల్లులతో సంయుక్త అక్షరాలుగా ఏర్పడే అవకాశాలు తక్కువగా ఉంటుంది.

తెలుగులో ప్రేమ అనే పదం కనబడుతుంది. కాని 'ప్వేమ' అనే పదం కనిపించదు. అదేవిధంగా 'వ'కార 'ల'కారాలు సంయుక్తాక్షరంగా 'ప్లీహము' అనే అటువంటి పదాల్లో కనిపిస్తుంది. తెలుగులో సంయుక్త ధ్వనుల గూర్చి చాలా మంది భాషా శాస్త్రవేత్తలు పరిశోధనలు జరిపారు. కానీ, గిరిజన భాషగా ఉన్న ఎరుకల భాషలో ఉన్న సంయుక్త ధ్వనుల గూర్చి పరిశోధనలు జరగలేదు. ఎరుకల భాషలో సంయుక్త ధ్వనుల గూర్చిభాషాశాస్త్ర దృక్పథంతోచర్చిండమే పత్ర ముఖ్య ఉద్దేశం.

**ముఖ్య పదాలు: ఎరుకల భాష, సంయుక్త ధ్వనులు, భాషాశాస్త్రం.**

**ప్రారంభం:**

భారతదేశంలో భాషలను నాలుగు భాషా కుటుంబాలుగా భాషా శాస్త్రజ్ఞులు విభజించారు. అవి 1. ఇండో-ఆర్యన్ భాషా కుటుంబం, 2. ద్రావిడ భాషా కుటుంబం, 3. ఆస్ట్రోఏషియాటిక్ భాషా కుటుంబం, 4. టిబెటో బర్మన్ భాషా కుటుంబం.

ఎరుకలను ద్రావిడ భాషగా గ్రియర్సన్ (1909), కృష్ణమూర్తి (2003), సుబ్రహ్మణ్య శర్మ (2007) లు పేర్కొన్నారు. పూర్వకాలంలో గిరిజనలుగా ఉండి ఇటీవల కాలంలో జనసామాన్యంలో భాగంగా మారిన గిరిజన తెగను తెలుగువారు "ఎరుక" , "ఎరుకులు" అని పిలుస్తారు. కొర, కుఱ్ఱు, కొరవ, కొరచ, కులువారు అనే పదాలు కూడా ఎరుకలకు సమానార్థాలుగా వాడుకలో ఉన్నాయి. తెలుగు ప్రాంతంలో మాత్రం ఎరుకల, కొరచ, కొరవ, ఎలుకల అనే పేర్లు వ్యవహారంలో ఉన్నాయి. ఎరుకల తెగలోని వారు తమని తాము కుర్రు గా పిలుచుకుంటారు.తమ భాషను ఎరుకల భాష, కుఱ్ఱు భాష, కులవాతగా చెప్పుకుంటుంటారు.

ఎరుకల స్త్రీలు సోదె చెప్పటం, ఎరుక చెప్పటం వలన వీరికి ఈ పేరు వచ్చింది. కేవలం స్త్రీల వృత్తి విశేషం ఆధారంగా తెగకు పేరు రావటం ఒక ప్రత్యేకమైన, గమనార్హమైన అంశంగా పరిగణించాలి. ఈ తెగలో పురుషులు ఎరుక చెప్పే వృత్తిని కలిగి ఉన్నట్లుగా కనిపించదు, కాని ఇటివలకాలంలో పురుషులు కూడా అడపాదడపా ఎరుక చెప్పడం గమనార్హం. ఈ తెగవారి ఆధ్యాత్మిక విజ్ఞానాన్నిబ్రతుకు తెరువులో తమ తెలివితేటలను ఉపయోగించుకునే నేర్పును, గౌరవప్రదమైన జీవనోపాధిని కలిగి ఉండటాన్ని ఎరుక అనే పేరు తెలియజేస్తుంది. ఎరుక అనే పదానికి తెలివి అని అర్థం.

ప్రస్తుత వ్యవహారంలో మూడు రూపాంతరాలలో 'ఎరుక' అనే పదం కనిపిస్తుంది. 1. యెరుక, 2. ఎరుక, 3. ఎఱుక అనేవి. ద్రవిడియన్ ఎటిమలాజికల్ డిక్షనరీ (1984) లో తెలుగు పదంగా 'ఎఱుక' కనిపిస్తుంది. 'ఎఱుక' అనే పదానికి – to know, understand, perceive, ascertain అనేవి క్రియాపరమైన అర్థాలు. 'ఎఱుక'కు నామవాచకంగా knowledge (జ్ఞానం) అని అర్థం.

**'ఎఱుక'** – తెలివికి, జ్ఞానానికి, అవగాహనకు సంబంధించిన



క్రియారూపం. అది కలిగిన వారిని ఎఱుకువ వారుగా, ఎఱుకువారిగా పిలుస్తున్నాము. ఎఱుక పదానికి బహువచన రూపాలుగా ఎఱుకలు, ఎఱుకవారు కన్పిస్తాయి. ఎఱుక కలవారులో రెండు 'క' కారాలు వెంటవెంట రావడం వల్ల ఒక 'క' కారం లోపించి ఎఱుకలవారుగా మారింది అని కూడా చెప్పవచ్చు. ఈ రకమైన ధ్వని మార్పుని 'హప్లోలజీ' అని భాషాశాస్త్రంలో పిలుస్తారు.

ఎరుకల తెగవారు తమకుతాము 'కుర్రు'గా పిలుచుకుంటారు. జాతి, దేశ, భాషా వాచకంగా దీని మూలాల్లో కూడా విశేషాలు కన్పిస్తాయి. కుర్రు, కున్రు అనే తమిళ మూల పదం నుండి పుట్టిందనీ, పర్వతం అనే అర్థంలో వాడబడిందని శ్రీనివాస వర్మ (1978) భావించారు. పర్వత ప్రాంతీయులు కాబట్టి ఈ పదం వారి చరిత్రను తెలిపేదిగా ఉంది.

ద్రవిడియన్ ఎటిమలాజికల్ డిక్షనరీలో ఈ పదం కుఱ్ఱు అనే రూపంలో కన్పిస్తుంది. ఈ పదం తెలుగు పదమే గురుక అని అర్థం. గుర్రు అనేది దీని రూపాంతరం. గుర్రుకు కోపం, కఠినమైన, చిరచిరలాడే, ఆగ్రహమైన మాటలు కలిగిన అనే అర్థాలున్నాయి. కుర్రు అనే పదాని బట్టి ఈ తెగవారి స్వభావ విశేషం, మాట్లాడే పద్ధతి, వారి మూల ప్రాంత అనే అంశాలు తెలుస్తున్నాయి.

**ఎరుకల భాష - క్షేత్ర పర్యటన:**

నా పరిశోధనకు కావాల్సిన సమాచారం కోసం వరంగల్ జిల్లాలోని ఎరుకల వారి వద్దకు వెళ్లాను. స్వయంగా సమాచారం సేకరించాను. కేంద్రీయ భారతీయ భాషా సంస్థ (Central Institute of Indian Languages) వారు అంతరించి పోతున్న భాషల అధ్యయనానికి తయారు చేసిన ప్రశ్నావళి ఆధారంగా చేసుకొని సమాచారాన్ని - ప్రాథమిక పదజాలం, వేషధారణ, వృత్తులు, రోగాలు, పండుగలు, ఆచారాలు, బంధుత్వం, సంఖ్యావాచకాలు, ప్రకృతి, పక్షులు, జంతువులు, వృత్తులు, పనిముట్లు మున్నగు విభాగాలుగా పదసేకరణ చేసాను. క్షేత్ర పర్యటనలో సమయంలో అడగవలసిన ప్రశ్నలు రూపొందించుకున్నాను. ఎరుకల భాష తెలిసిన వారితోనే సంభాషించి విషయ సేకరణ చేసాను. యాభై సంవత్సరాలు మించిన స్త్రీ, పురుషుల నుండి స్పష్టమైన వ్యక్తీకరణ ఆధారంగా సమాచార సేకరణ జరిగింది. పదాలను సాధ్యమైనంత వరకు ఉచ్చారణా విధేయంగా రాసుకోవడమే కాకుండావారి సంభాషణను రికార్డ్ చేసి భద్రపరిచాను. పున: పరిశీలనకు ఇది బాగా తోడ్పడింది. ఎరుకల భాషను వర్ణనాత్మక (structuralist) విధానంలో విశ్లేషించాను.

**ఎరుకల భాష-వర్ణాలు :**

ఎరుకల భాషలో ఇరవై ఏడు వర్ణాలున్నాయి అందులో 17 హల్లులు, 10 అచ్చులు. అచ్చులలో ఐదు హ్రస్వాచ్చులు, ఐదు దీర్ఘాచ్చులు. ఛాంస్కి (1968) చేసిన అనేక ధ్వని విభజనల్లో ఒకటైన నిరుద్ధ (Non-continuant), అనిరుద్ధ (Continuant) అనే విభజన ఎరుకల హల్లుల్లో స్పష్టంగా కనిపిస్తుంది. ఎందుకంటే ఈ హల్లుల్లో ఒక్క నిరుద్ధ వర్ణాలలోనే నాద (voiced), శ్వాస (voiceless) భేదకత్వం, ఉన్న అన్ని స్థానాల్లో కన్పిస్తుంది. అనిరుద్ధ వర్ణాలలో మాత్రం ఊష్మశ్వాసం (voiceless fricative) తప్ప మిగిలిన అన్ని కేవలం నాదాలే. వాటికి సమస్థానప్రయత్నాలయిన శ్వాస ధ్వనులు (voiceless counterparts) కన్పించవు. అయితే ఊష్మశ్వాసమైన 'స' అనే వర్ణమే తప్ప దానికి నాద ప్రతిబింబము (voiced counterparts) వర్ణముగా లేదు.

నిరుద్ధ స్పర్శాల ఉత్పత్తి స్థానాలు వరుసగా ఉభయోష్ఠ, దంత, మూర్ధ, తాలవ్య, కంఠాలు- పబ, తద, టడ, చజ, కగ, చజ, లను స్పృష్టోష్మాలు (affricates) అని కూడా అంటారు.

**ఎరుకల- హల్లు వర్ణాలు :**

| | | |
|---|---|---|
| స్పర్శాలు | : | ప, బ, త, ద, ట, డ, చ , జ, క, గ. |
| ఊష్మాలు | : | (స) |
| కంపితాలు | : | (ర) |
| అనునాసికాలు | : | (మ, న) |
| పార్శ్వికం | : | (ల) |
| అంతస్థాలు | : | (య, వ) |

**ఎరుకల అచ్చులు :**

ఎరుకలలో అచ్చు వర్ణాలు మొత్తం పది. అందులో ఐదు హ్రస్వాచ్చులు, ఐదు దీర్ఘాచ్చులు. అవి నాలుక ఎత్తును బట్టి ఉన్నత, మధ్యమ, నిమ్న స్థాయిలలోను, నాలుక ముందువెనుకలను బట్టి అగ్ర, కేంద్ర, పశ్చిమ స్థానాల్లోనూ విస్తరించి ఉంటాయి. వీటిలో అగ్రాచ్చులు అవ్యోష్టాలు. పశ్చిమాచ్చులు ఓష్టాలు.

| | అగ్ర | కేంద్ర | పశ్చిమ |
|---|---|---|---|
| ఉన్నత | ఇ, ఈ | | ఉ, ఊ |
| మధ్య | ఎ, ఏ | | ఒ, ఓ |
| నిమ్న | | అ ,ఆ | |

**ఎరుకల సంయుక్త ధ్వనులు** (Clusters):

భాషాశాస్త్రంలో clusters, sequences అనే రెండు రకాల పదాలను సంయుక్త ధ్వనులు సూచిస్తాయి. పుర్గ్రోమ్ (1965) ప్రకారం, consonants clusters అనే పదాన్నిరెండు హల్లులు ఒకే అక్షరం (syllable) లో వచ్చినప్పుడు, అదే విధంగా వేరు వేరు అక్షరాలలో వచ్చినప్పుడు దాన్ని (consonants sequences) పరిగణించాలి. ఈ రెండింటిని కలిపి consonant combination అని కూడా ఉపయోగిస్తారు. ప్రస్తుత విభాగంలో, ఎరుకల భాషలో పదాది, పదమధ్య, పదాంతంలో సంయుక్త హల్లుల వ్యాప్తి ఏ విధంగా అవుతుందో చూద్దాం.

వాస్తవానికి సంయుక్త ధ్వనుల వ్యాప్తిని చర్చించడానికి అక్షరం కంటే కూడా పదాన్ని ఆధారంగా తీసుకొని విశ్లేషించడమే సరైన పద్ధతి. ఆ పదాలలో అక్షరనిర్మితిలో సంయుక్త ధ్వనుల స్థానాన్ని విశ్లేషించడం ద్వారా అక్షర హద్దుని సరిగ్గా గుర్తుపట్టే వీలుంటుంది. ఎరుకలలో ముఖ్యంగా ఒకటి నుండి ఏడు అక్షరాల (syllable) పదాలున్నాయి. వీటిలో ఏకాక్షర పదాలు (mono-syllabic) తక్కువగాను, అనేకాక్షర పదాలు (poly-syllabic) ఎక్కువగాను కనిపిస్తున్నాయి.

ఏకాక్షర పదాల నిర్మాణంలో హల్లుల సముదాయం చాలా తక్కువ మోతాదులో కన్పిస్తుంది. అనేకాక్షర పదాల హల్లుల సముదాయంతో పోల్చి చూస్తే సంయుక్త హల్లుల ఉపస్థితి పదాదిన కంటే పదమధ్యంలో ఎక్కువగా కనబడ్తుంది. పదాంతంలో సంయుక్త హల్లులు ఎరుకల భాషలో కనబడవు. ఒకవేళ అవి కనబడినా అవి ఇతర భాషల నుండి ఎరుకల భాషలో వచ్చి చేరినవి. ముఖ్యంగా ఆంగ్ల భాష నుండి వచ్చిన 'పోస్ట్' వంటి పదాలు. ఇవి కూడా ఎక్కువగా అచ్చు అంతంతో పలుకుతారు.

**ఎరుకల పదాది ద్విసంయుక్త హల్లులు** (C1C2-):

ఎరుకల భాషలో సంయుక్త హల్లులు మాత్రమే ఉన్నాయి. వీటిల్లో ద్విసంయుక్త, త్రిసంయుక్త హల్లులు మాత్రమే ఉన్నాయి. పదాదిలో ద్విసంయుక్త హల్లులే తప్ప త్రిసంయుక్త హల్లులు రావు. పదాదిలో ద్విసంయుక్త హల్లులు కూడా చాలా తక్కువగా ఉన్నాయి. ఎరుకలలో ద్విత్వ హల్లులున్నాయి, కాని పదాదిన, పదాంతంలో రావు. కేవలం పదమధ్యలోనే వస్తాయి. నేను సేకరించిన పదాజాలంలో కేవలం రెండు మాత్రమే పదాది సంయుక్త హల్లులు ఉన్నాయి. అవి (క్య), (ద్య).

| ఎరుకల పదం | అర్థం |
|---|---|
| క్యాద | గాడిద |
| క్యాంబ | క్యాంబ |
| ద్యామో | దయ్యం |

పై సంయుక్త హల్లులో (C1) మొదటి హల్లు క, లేదా ద వర్ణాలు. అంటే C1 అఘోష ధ్వని (obstruent), C2 – గా య (y) వర్ణం తప్ప ఇంకోకటి రాదు. అంటే C2 సఘోష ధ్వని (sonorant). కాబట్టి ఎరుకలలో C1– గా అఘోష ధ్వని వస్తే C2– గా సఘోష ధ్వని మాత్రమే వస్తుందని మనం ఇక్కడ సిద్ధాంతంగా చెప్పవచ్చు.

**ఎరుకల పదమధ్యద్విసంయుక్త అక్షరాలు :**

ఎరుకలో పదాదిన కంటే పదమధ్యలో ద్విసంయుక్త అక్షరాలు ఎక్కువ జతల్లో కనబడతాయి. ఎరుకల పదం దాని అర్థం తెలుగులో వరుసగా ఇవ్వబడింది.

| | ఎరుకల పదం | అర్థం |
|---|---|---|
| 1. | నడ్పాన్ (అ) | కాలు |
| 2. | నొద్ద మోన్ | ఒక్కటి మనిషి |
| 3. | చూట్కన్ | నడ్డి |
| 4. | ఓట్నాయ్ | వేటకుక్క |
| 5. | కెయ్లు | చేతులు |
| 6. | కేర్ల | అడుగు |
| 7. | ఒంబెదు | తొమ్మిది |
| 8. | ఒందు | ఒక్కటి |

పై ఉదాహరణల్లో 1, 2, లో ఉన్న ద్విసంయుక్త హల్లుల జత అఘోషధ్వని C1+ అఘోషధ్వని C2. అంటే మొదటి హల్లు 'డ' అయితే రెండో హల్లు 'ప' లేదా 'ద' తప్ప వేరే ధ్వనులు రావు. 3, 4 ఉదాహరణల్లో ద్విసంయుక్త హల్లుల జత అఘోష ధ్వనులు, సఘోష ధ్వనులు. 5, 6 ఉదాహరణల్లో, C1- సఘోష ధ్వని, C2- కూడా సఘోష ధ్వని. C1-(య),తీ (ర)అయితే C2 మాత్రం ల (l) వర్ణం మాత్రమె వస్తుంది. C1- అంతస్థం, కంపితం వస్తే C2 పార్శ్వికం వస్తుంది . 7, 8 ఉదాహరణల్లో, ద్విసంయుక్త హల్లులలో C1 - సఘోష ధ్వని అయితే C2– అఘోష ధ్వని వస్తుంది. అంటే C1– అనునాసికం వస్తే C2– స్పర్శం తప్ప మరొకటి రాదు.

**ఎరుకల భాష ద్విత్వఅక్షరాలు :**

పదమధ్యలో ద్విత్వ అక్షరాలుగా అన్నిహల్లులువస్తాయి.

| | | ఎరుకల పదం | అర్థం |
|---|---|---|---|
| /ప/ | ప్ప– | కప్ప | 'కప్ప' |
| /బ/ | –బ్బ– | కొబ్బరి | 'కొబ్బరి' |
| /త/ | –త్త– | గొత్తు | 'కమ్మ' |
| /ద/ | –ద్ద– | అద్ది | 'అన్ని ' |
| /ట/ | –ట్ట– | పొట్ట | 'ఆడ' |
| /డ/ | –డ్డ– | ఒడ్డిగే | 'బొక్క' |
| /చ/ | –చ్చ– | కెచ్చు | 'చేదు ' |
| /జ/ | –జ్జ – | గెజ్జి | 'గజ్జి' |
| /క/ | –క్క– | కొక్కు | 'కొంగ' |
| /గ/ | –గ్గ– | నుగ్గు | 'కట్టే' |
| /మ/ | –మ్మ– | తెమ్మి | 'తమ్ముడు' |
| /న/ | –న్న– | కన్నాలమ్ | 'పెళ్ళి' |
| /ర/ | –ర్ర– | కర్రి | 'చర్మం' |
| /ల/ | –ల్ల– | ఒల్ల | 'తెల్ల' |
| /వ/ | –వ్వ– | కెవ్వు | 'త్రవ్వు' |
| /య/ | –య్య– | కెయ్యి | 'చెయ్యి' |
| /స/ | –స్స– | పెస్సి | 'ఆకలి' |

ఎరుకల భాషలో పదమధ్య సంయుక్తాక్షరాలలో C1C2- లు వరుసగా నాద, శ్వాస వర్ణాలు వస్తాయి, రెండు శ్వాస వర్ణాలు వస్తాయి, రెండు నాద వర్ణాలు వస్తాయి అని పైన ఇచ్చిన సంయుక్త హల్లుల ద్విత్వ అక్షర జతలు తెలిపే విషయం.

సాధారణంగా సంయుక్త అక్షరాలలో అనునాసిక వర్ణాలు C1 – అయినప్పుడు, C2- వర్ణాలు వాటి స్థానానికి సంబంధించిన వర్ణాలుగా వస్తాయి.

| | | |
|---|---|---|
| -మ్ప్- | ఒంపు | 'వంపు' |
| ఞ్చ్- | సెంఞ్చి | 'సంచి' |
| -న్ద్- | కందిపప్పు | 'కందిపప్పు' |
| -ణ్ట్- | నెంణ్టొ | 'చుట్టము' |
| ఙ్గ్ - | పంగ | 'పండు' |

అయితే దీనికి భిన్నంగా కూడా సంయుక్త హల్లులు అనునాసిక వర్ణాలతో కలిసి కన్పించే సందర్భాలు ఉన్నాయి. -న్ప్-, నాన్పు - - నాన్పుడం (నానబెట్టడం) ఇక్కడ న్,ప్ లకు మధ్యలో కనిష్ఠ భేధకత్వం కలిగిన'ఉ' అనే (less functional load) స్వరం వినబడుతుంది.

**ఎరుకల పదాల్లో కనిపించే సంయుక్త హల్లుల పట్టిక :**

క్రింది పట్టికలో మొదట సంయుక్త హల్లు, తరువాత ఎరుకల పదం దాని అర్థం తెలుగులో వరుసగా ఇవ్వబడ్డాయి.

**1. పదాది సంయుక్త హల్లులు**

| | | |
|---|---|---|
| /క్యా/ | క్యాదా | 'గాడిద' |
| /ద్యా/ | ధ్యామో | 'దయ్యం' |

**2. పద మధ్య సంయుక్త హల్లులు**

| | | | |
|---|---|---|---|
| /ప/ | -ప్ప- | కప్ప | 'కప్ప' |
| | -ప్ల- | కూప్లు | 'కొడవళ్ళు' |
| /బ / | -బ్బ్- | కొబ్బరి | 'కొబ్బరి' |
| /త / | -త్ప్ - | సిత్పల్ సెడి | 'సీతాఫల చెట్టు' |
| | -త్క్- | బొత్కు | 'సొమ్ము' |
| | -త్త్- | మొత్తు | 'కొట్టు' |
| /ద/ | -ద్మ్- | చీద్మాన్ | 'ముక్కు' |
| | 'ద్ద్' | అద్ది | 'అన్ని' |
| | -ద్వ్- | చీద్వాన్ | 'ముక్కు' |

ద్విత్వం కాని సంయుక్త ధ్వనులు, ద్విత్వంగా మారకుండా ఉ ండటానికి వాటిలోని హల్లుల మధ్య ఒక చిన్న భాజకమైన స్వరమేదో ఉంటుంది.

| | | | |
|---|---|---|---|
| /ట/ | -ట్మ్- | చూట్మాన్ | 'పిర్ర' |
| | -ట్ప్- | పొట్పకాపాను | 'పొట్లకాయ' |
| | -ట్ట్- | ఓట్టాయ్ | 'వేటకుక్క' |
| | -ట్ర్- | ఏట్రోజు | 'వారం' |
| /ట్ట/ | | సెట్ట | 'రవిక' |
| /డ / | -డ్ట్- | మడ్త | 'మడత' |
| | -డ్డ్- | నొడ్డమోన్ | 'బక్క మనిసి' |
| | -డ్ప్ - | నడ్పాన్ | 'పాదం' |
| | -డ్డ్- | ఒడ్డిగే | 'బొక్క' |
| | -డ్బ్- | పడ్బుగుణ్ట | 'ఆడపిల్ల' |
| | -డ్క్ - | ఉడ్కాన్ | 'డబ్బు' |
| /చ/ | -చ్చ్- | కేచ్చోడి | 'వేపకల్లు' |
| | -చ్స్ - | పెచ్సు | 'చెప్పిందు, చెప్పింది' |
| /జ/ | -జ్జ్- | గజ్జే | 'గజ్జే' |
| | -జ్గ్- | బూజ్గొ | 'పడుకో' |
| /క/ | -క్క్- | కొక్కు | 'కొంగ' |
| | -క్ర్- | కెయ్ పొక్రామోన్ | 'జ్యోతిషుడు" |
| /గ/ | -గ్గ్- | నుగ్గు | 'కట్టే' |
| | -గ్స్- | దిగ్సు | 'దిగింది, దిగిందు' |
| /స/ | -స్ర్- | ఒస్రం | 'పొదువు' |
| | -స్గ్- | ఇస్గు | 'విసుగు' |
| /శ / | -శ్క్- | ఉశ్కె | 'ఇసుక' |
| | -శ్ట్- | ఇశ్టన్ | 'ఇష్టము' |
| /మ/ | -మ్బ్- | ఒంబెదు | 'తొమ్మిది' |
| | -మ్ప్- | ఒంపు | 'వంపుట' |
| | -మ్మ్- | తెమ్మి | 'తమ్ముడు' |
| /న/ | -న్ప్- | నాన్పు | 'నానబెట్టు' |
| | - ఞ్చ్- | చెంఞ్చి | 'సంచి' |
| | -న్న్- | ఒన్న | 'నూనె' |
| | -ఞ్జ్- | నెంఞ్జు | 'రొమ్ము' |
| | -న్ద్- | కెందిపప్పు | 'కందిపప్పు' |
| | -ణ్ట్- | నెంణ్టొ | 'చుట్టము' |
| | -ణ్డ్- | పొంణ్డు | 'భార్య' |
| | -న్గ్ - | పంగ | 'పండు' |
| | -న్ద్- | కుందొ | 'కుందేలు' |
| | -న్య్- | కన్యాలం | 'పెళ్లి' |
| /ర / | -ర్ద్- | ఇర్దు | 'ఇరువై' |
| | -ర్త్- | ఒర్తు | 'వేయించు' |
| | -ర్క్- | ముర్కి | 'మురికి' |
| | -ర్గ్- | కర్గు | 'తాడు' |
| | -ర్ర్- | కర్రి | 'మాంసం, కండ' |
| | -ర్జ్- | మెర్జు | 'మందు' |
| | -ర్స్- | ఎర్సి | 'బియ్యం' |
| | -ర్ప్- | సెర్పులు | 'చెప్పులు' |

| | | | |
|---|---|---|---|
| | -ర్ల్- | కేర్ల | 'అడుగు' (క్రియ) |
| /ల/ | -ల్ప్- | ఒల్ప్(ఉ) | 'పాలు' |
| | -ల్క్- | ఒల్కు | 'దీపం' |
| | -ల్స్ - | బెల్సినమోన్ | 'లావటి వాడు' |
| | -ల్ల్- | ఒల్ల | 'తెల్ల' |
| | -ల్ట్- | పల్టోడు | 'పగుల గొట్టు' |
| | -ల్చ్- | కుల్చి | 'స్త్రీ' |
| /వ/ | -వ్వ్- | కెవ్వు | 'కడుగు' (క్రియ |
| /య/ | -య్ల్- | కెయ్లు | 'చేతులు' |
| | -య్య్- | ముయ్యి | 'నోరు |

పదమధ్య సంయుక్త హల్లు C1 కనుక b/v అయితే -C2 తప్పని సరిగా b/v నే వస్తుంది. మరే ఇతర హల్లులు రావు, అంటే తప్పని సరిగా b/v లు ద్విరుక్తంగా వస్తాయి.

**ఎరుకల త్రిసంయుక్త హల్లులు** (Three consonant clusters):

ఎరుకల భాషలో పదాదిన, పదాంతంలో త్రిసంయుక్త హల్లులు రావు, కేవలం పద మధ్యలోనే కనపడతాయి. త్రిసంయుక్త హల్లులు, ఎరుకల పదం, తెలుగులో దాని అర్థం వరుసగా ఇవ్వడం జరిగింది.

| | | |
|---|---|---|
| -న్ద్ర్- | గంద్రు | 'బావి' |
| -ణ్ఢ్- | సింఢ్డి | 'ఇంద్రధనుస్సు' |
| - ఞ్చ్- | పిచ్చుంట్లుడు | 'ఒక కులం' |
| - ణ్ఢ్- | తుణ్ఢేమొతింగరాయె | 'బట్టలు ఉతికే వారు' |

పై ఉదాహరణలలో C1 అన్ని పదాల్లో అనునాసికం కాగా C2- అన్ని పదాల్లో స్పర్శం , C3 - కంపితం, స్పర్శము, పార్శ్వికము తప్ప మరే వర్ణాలు రావు.

**ముగింపు :**

ఈ పత్రంలో ఎరుకల భాషలోని సంయుక్త అక్షరాలు, ద్విత్వ అక్షరాలు , ద్విత్వ అక్షరాల అమరిక గురించి చర్చించడం జరిగింది. ఎరుకల భాషలో పదాదిన సంయుక్త అక్షరాలలో స్పర్శము (శ్వాసము, నాదము) + అంతస్థము అనే ఒకే ఒక్క క్రమత (pattern) కనబడుతుంది. సాధారణంగా ద్రావిడ భాషల్లో పదాది సంయుక్త అక్షరాలు ఉండవు. తెలుగులో ఉన్న పదాది సంయుక్త అక్షరాలు కూడా సంస్కృతం నుండి, ఇతర భాషల నుండి వచ్చి చేరినవే. పద మధ్యలో సంయుక్త అక్షరాల క్రమత తక్కువగా కనబడుతుంది పదాది కంటే. రెండు అక్షరాల సంయుక్త ధ్వనులే, ఏకాక్షర, త్ర్యక్షరాల సంయక్త ధ్వనుల కంటే ఎక్కువగా ఉన్నాయి. త్రిసంయుక్త అక్షరాలు పదాదిన ఎరుకలలో కన్పించలేదు. పదాంత సంయుక్త అక్షరాలుకూడా ఎరుకలలో కనిపించలేదు. గిరిజన భాష అయిన ఎరుకలలో పదాది సంయుక్త హల్లులు ఉండడం, అవి కూడా సంస్కృతం నుండి తెలుగు భాష నుండి కాకుండా ఉండడం ఆలోచింపజేస్తుంది.

భాషాశాస్త్ర దృక్పథంతో ఎరుకల లాంటి భాషల పైన పరిశోధన చేయడం ద్వారా ఆ భాషలో వర్ణశాస్త్రాన్ని అర్థం చేసుకోవడం, విశ్లేషించడం మొట్టమొదటి ఉపయోగం. ఎన్నో భాషలు అంతరించి పోతున్న పరిస్థితుల్లో భాషా సమాచారాన్ని సేకరించడం, సంగ్రహించడం అనేది అతిముఖ్యమైనది. భాషాశాస్త్ర దృష్ట్యా ఎరుకలకు వర్ణశాస్త్రాన్ని రాస్తున్నప్పుడు అ భాషలోని పదాలకు అందులోని అక్షరాలకు మధ్య ఉన్న సంబంధాన్ని తెలుసుకోవచ్చు. ప్రస్తుత సాంకేతిక యుగంలో ఎరుకలకు సహజ భాషా ప్రక్రియ (NLP)లో భాగమైన భాషోపకరణాలను అంటే పద విశ్లేషిణి లాంటివి తయారు చేసే క్రమంలో ప్రస్తుత పత్రం ఉపయోగ పడుతుంది. అంతే కాకుండా ఎరుకల భాషీయులకు మాతృభాషలో విద్యాబోధన చేయదలిస్తే వారికి వాచకాలను తయారు చేయడానికి కూడా ప్రస్తుత పత్రం ఉపయోగ పడుతుంది.

**ఉపయుక్త గ్రంథాలు:**

**తెలుగు**

1. సుబ్రహ్మణ్య శర్మ, V.M. (2007). ఎరుకల భాష:వర్ణనాత్మకఅధ్యయనం. అముద్రిత M.Phil సిద్ధాంత గ్రంథం. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

**ఆంగ్లం**

1. Burrow,T. & M. Emeneau (1984). Dravidian Etymological Dictionary. Oxford:OUP.
2. Chomsky,N. & M.Halle (1968). The Sound Patterns of English. Harper & Row. New York.
3. Grierson,G.A. (1906). Linguistic Survey of India.Vol.IV. Munda and Dravidian Languages. Culcutta: Government of India.
4. Krishnamurti,Bh. (2003). The Dravidian Languages, Cambridge: CUP.
5. Pulgram, E. (1965). Consonant clusters, consonant sequences and the syllable. Phonetica13;76-81.
6. Sreenivasa varma,G.(1978). Yerukala Dialect. Annamalai Nagar; Annamalai University.



(వ్యాస రచయిత)

# పద్యమనోహరం - 42

## గన్నమరాజు గిరిజామనోహర్ బాబు

వరంగల్, ఫోన్ : 994 901 3448



"కొందరికి తెనుగు గుణమగు
కొందరికి సంస్కృతంబు గుణమగు, రెండున్
కొందరికి గుణములగు నే
నందరి మెప్పింతు కృతుల నయ్యెయెడలన్"

ఇది ప్రతి సాహితీ ప్రియునికీ పరిచయమైన బమ్మెర పోతనామాత్యుని శ్రీమదాంధ్ర మహాభాగవతంలోనిది. పోతనగారు తమ సంపూర్ణ వ్యక్తిత్వానికి దర్పణంగా అవతారికను తీర్చిదిద్దాడు. అందులోని ప్రతి పద్యం పోతన్నలోని వినయ శీలతకు, మహత్వ కవిత్వ పటుత్వ శక్తికీ తార్కాణంగా పేర్కొనవచ్చు. ఆయన సమన్వయ దృక్పథం, ఆయనలోని భక్తితత్త్వం తెలిపే పద్యాలు ఈ భాగవతావతారికలో చోటు చేసుకున్నాయి.

"సాహిత్య ప్రియుల్లో కొందరు ఎక్కువగా తెలుగును ఇష్టపడతారు. మరికొందరు సంస్కృతాన్ని అభిమానిస్తారు. చాలామంది రెండు భాషలనూ ఇష్టపడుతుంటారు. కాబట్టి నేను నా భాగవతంలో అందరినీ మెప్పించేవిధంగా పద్యరచన చేస్తాను" అని తనలోని సమన్వయ దృక్పథాన్ని చాటి చెప్పాడు పోతన మహాకవి.

తెలుగు కవిత్వంలో సంస్కృత పదభూయిష్టమైన సమాస బంధురత ఎక్కువే. అయితే చక్కని తెలుగు పదాల పొందికతో కూడా కవిత్వాన్ని అందించి కావ్యాల్ని రసవత్తరం చేసిన కవులు కూడా ఉన్నారు. అంతేగాక అచ్చతెనుగు కవిత్వంతో పాఠకులను కట్టిపడేసిన కవులు సైతం తెలుగు సాహిత్య ప్రపంచంలో కీర్తి గడించారు. అంటే సంస్కృతంపై ఇష్టం కలిగిన కవులు తెలుగుపైనే మక్కువ ఎక్కువ కలిగిన కవులు ఉన్న వాస్తవాన్ని పోతన్న గమనించిన వాడు గనుకనే ఈ విధమైన పద్యాన్ని భాగవతావతారికలో నిబద్ధించాడు. తన హృదయాన్ని తేటబరచాడు.

కవిత్వాన్ని ఆస్వాదించేవారి అభిరుచులను బట్టి తన కావ్యరచన సాగడం వల్ల ఆ కావ్యం పదికాలాల పాటు మనగలుగుతుంది. అయితే ఆ అభిరుచి అర్థవంతమైనది అయి ఉండాలి. సంస్కృత పద బాహుళ్యంతో రచన చేయబడిన కావ్యాలన్నో పాఠక లోకంలో కీర్తినొందాయి. అందమైన తెలుగు పదాల పొందికతో కూడా కీర్తినందుకున్న కావ్యాలు కూడా మనకు కనిపిస్తాయి. అందుకే పోతన అటువంటి అభిరుచులను కలిగి ఉన్న పాఠకులను అలరిస్తారని స్పష్టంగా చెప్పాడు. ఒకవిధంగా ప్రతిజ్ఞ చేశాడనవచ్చు.

అయితే ఈవిధంగా రాయాలంటే కవి ప్రతిభ అసదృశమైనది కావాలి. సందర్భశుద్ధి తెలిసుండాలి. ఏ ఏ సందర్భాల్లో ఎటువంటి శబ్దప్రయోగం చెయ్యాలన్నా సమగ్రదర్శనం కవికి అవసరం. భాషాపటుత్వం అధికంగా ఉండాలి. శబ్దాలపై సంపూర్ణ అధికారం ఉండాలి. ముఖ్యంగా కవిత్వ నిర్మాణం పట్ల, కవిత్వ వ్యవసాయం చేసే కవుల పట్ల కూడా అభిమానం, గౌరవం కూడా ఉండాలి.

సహజంగా వినయాధిక్యత కలిగిన కవి గనుకనే పోతన్న భాగవత రచనావకాశం తనకు దక్కడమనేది తన "పురాకృత శుభాధిక్యతమని" భావించి, పూర్వకవి స్తుతితో బాటు, సమకాలీన కవులను కూడా సంభావించి, భావికవులను సైతం అభినందించిన వినయశీలి. కనుకనే సంస్కృతాభిమానులను, తెలుగు భాషాభిమానులను ఉభయులను మెప్పిస్తానని చెప్పి, మనసా, వాచా, కర్మణా చేసి చూపించి భాగవతాన్ని పరమ ప్రమాణ గ్రంథంగా నిర్మించిన కీర్తిశాలి బమ్మెర పోతనామాత్యుడు.

ఈ పద్యం చిన్న కందపద్యమే గావచ్చు. కాని ప్రతి కవికీ మార్గదర్శనం చేసే మహత్తర భావాన్ని వెలిబుచ్చే పద్యం. ఏ కవైనా కొందరికి మాత్రమే ఇష్టమైన రీతిలో కవిత్వ రచనను నిర్వహించరాదు. తన ప్రతిభకు మరింత పదును పెట్టి భిన్నమైన అభిరుచులను పరిగణనలోనికి తీసుకొని అందరినీ అలరించేరీతిలో రచనను సాగించినప్పుడు ఆ రచనకు చిరంజీవిత్వం కలుగుతుంది. కాని పక్షంలో ఈ కాలప్రవాహంలో అది అంతర్ధానమవుతుందన్న సత్యాన్ని కావ్య రచనారంగంలోని ప్రతి కవీ గుర్తుంచుకోవాలి.

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 7 (13) హైదరాబాద్ మే : 2023

బందారం కథలు
18

# ఎటమటం

డా. నందిని సిధారెడ్డి, ఫోన్ : 9440 381148

**"చాయ కావాల్నంటె చాపత్త తెచ్చుకోవాలె. దుకాండ్లకు పోనంటె ఎట్ల కొడుకా? ఊర్లె ఉందుకుంట ఊల్లెకు పోనంటె కలుస్తడా – బాయికాన్నె బతుకుతనంటె ఎల్లదారా? పోవాలె కొడుక – ఊల్లెకు పోతనే మంచి చెడ్డ తెలుస్తయి. కోరికెప్పుడు పుట్టిందో కొట్లాడి తీర్చుకోవాలె! దుకాండ్లకు పోయి చాపత్త కొనుక్కరాపో. చాయ చేపిస్త. తాగుదువు"** బుద్ధి చెప్పింది పెరట్ల లచ్చవ్వ.

**"ఊల్లెకు పోవాల్నంటె ఇజ్జతనిపిస్తదే. పోరగాండ్లు ఎంటపడి ఎగ్గిస్తదే. ఏంజెయ్యాలె. అవ్వా... నన్ను జూడంగనే బెల్లం లెక్కనే. అందరికి అగ్గువ దొరికిన. ఇజ్జత్తీస్తుంటె ఇకారమనిపిస్తది. చాయ లేకపోతెవాయె గాని... సోను"** బతిమాలుతున్నట్టు దీనంగా అన్నాడు శంభయ్య.

**"గదే – వొద్దంటున్న పోవాలె బిడ్డా. దుకాండ్లకైనా పోవాలె. ఊల్లెకైనా పోవాలె. పోకపోతె ఎట్టెల్లుతదిరా. ఈ తాప పోరగాండ్లు ఎవలైన ఎక్కిరిస్తె దొరకపట్టి తోలుపలుగ్గొట్టు. ఇకమల్ల నీ జోలికి రావొద్దు. పో... ఏం గాదుపో... చాపత్త తేపో"** ధైర్యం చెప్పింది లచ్చవ్వ.

తప్పదనుకొని బయల్దేరాడు శంభయ్య. ధోతిని మీదికి చెక్కి గోచి కంటె పొడుగు పెట్టుకున్నాడు. కుట్టించిన బనీనుకు ఒక పెద్ద జేబు. అందులో చిల్లరపైసలు నడుస్తుంటె గల్లర గల్లర చప్పుడు చేస్తున్నాయి. మెల్లగా అడుగులు వేస్తూ భయం భయంగానే గోటీలాడుకుంటున్నారు. ఒకడు సూటిగ చూస్తుంటే నలుగురు 'తాకొద్దు, తాకొద్దు' అనుకుంటూ తదేకంగా చూస్తున్నారు. గోటి విసరగానే వెళ్లి గురిచూసిన గోటికి తాకింది. గట్టిగా అరిచారందరు. ఉన్న గోటీలన్నీ ఊడ్చుకొని జేబు నింపుకున్నాడతను. కదుల్తుంటె గోటీలు కూడా గల్లర గల్లర మంటున్నాయి. శంభయ్య వాళ్ల దృష్టి పడకముందే దాటాలని తొందర తొందరగా నడుస్తున్నాడు. నడక వేగం పెరగగానే చేతుల కదలిక పెరిగింది. జేబుల చప్పుడు పెరిగింది. నడుము తింపుడు పెరిగింది. పోరగాండ్ల దృష్టి పడనే పడింది. తీటనోరు ఆగలేదు.

**"అగో... ఆడిగుట్ల శెంబయ్య పోతుండు. అగో... అగో.. ఆడిగుట్టు..."** అంతే మిగతావాళ్లు అందుకున్నారు. గోటీలాట అయిపోయింది. నోటి తీట మొదలయింది. **"ఆడిగుట్టు... ఆడిగుట్టు"** చప్పట్లు కొట్టుకుంటూ పోరగాండ్లు శంభయ్య వెంటపడ్డారు. శంభయ్యకు కోపం ఆగలేదు. వాళ్ల అరుపులాగలేదు. శంభయ్య వెనుదిరిగాడు. పిల్లలు ఉరుకుతున్నారు. అయినా ఆగి... ఆగి... అరుపులు.. చప్పట్లు... వాళ్లకదో ఆట. శంభయ్యకు అదే అవమానం. వాళ్లు ఉరికారు. అవ్వ చెప్పింది గుర్తుంది. వేగంగా ఉరికి ఒకన్ని



పట్టుకున్నాడు. వంగబెట్టి దంచుతున్నాడు. **"వాయ్యో... వామ్మో నేననలేదు. గవాడు అన్నడు"**. శంభయ్య దెబ్బలు ఆపలేదు. వాళ్లందరి మీద ఉన్న కోపం ఒక్కని మీదే తీస్తున్నాడు. వాడు కిందబడి పొర్లుతున్నాడు. **"ఇక అన... ఇగ అనన్న... నన్నిడిసి పెట్టు"** బతిలాడుతున్నాడు.

**"అరరె.... పోరడు సచ్చిపోతడు. గాతీర్గ కొదుతున్నవేంది పటేల. ఇడిసిపెట్టు"** బజారు సందులోంచి ఉరుకొచ్చి విడిపించింది రాజవ్వ. శంభయ్య దమ్ము దీస్తున్నాడు. **"నీకంటె సిన్నపోరడు. గట్ల కొడుతరా..."** నిలదీసింది. **"సిన్నపోరడట సిన్న పోరడు. వాని మాటలు జూడు. పెద్ద పెద్ద మాటలు"**, **"గంత కాని మాట ఏమన్నడయ్యా..."** **"సూడొదినె. నేను ఆడిగుట్లోన్నట. అనుకుంట ఎగురుతుండ్రు"**... **"అది గాదు పటేలా... వాడనంగనే కోపం వొచ్చిందిగని... ఊల్లె అందరు గట్లె అనుకుంటండ్రు. సాటుకు అనుకుంటండ్రు. పోరడు గనుక నేటుగ అన్నడు. అయినా... శెంబయ్య పటేలా నేనొకటి సెప్పుత. ఏమనుకోకు... నీ రేషం నీ పెండ్లాం మీద జూపెట్టు. పోరని మీద గాదు. పెండ్లి జేసుకోంగనే గాదు. పెండ్లాన్ని తోలుకొచ్చుకో. నీ పతాపం అంత పెండ్లాం మీద జూపెట్టు. అందరి నోళ్లు మూతలాడుతయి...."**.

ఇంతలోనే ఇంకా నలుగురు కూడారు. మూడు గుంట్లన్నా, మూడు బాటలన్నా ఊరికది ముఖ్యమైన కూడలి. జరసేపట్లో గుంపు

తయారైంది. శంభయ్యకు అక్కడ ఉండాలనిపించలేదు. దుకాండ్లకు పోవాలనీ అనిపించలేదు. చాయ తాగాలని కూడా అనిపించలేదు. ఇజ్జత్ మొత్తం పోయినట్లనిపించింది. ఏడుపొచ్చింది అందరికి చులకన అయినందుకు అవమానం తట్టుకోలేకపోయాడు. **"అవ్వకేం? అవ్వ మస్తు చెప్తది. అవమానమంత ఎవలికి? తనకే?"** సరాసరా ఇంటివైపు నడిచాడు. దర్వాజలో అడుగు పెడుతుంటే కండ్లల్లో నీళ్లు తిరిగాయి. 'తన తప్పేం లేకున్నా పడరాని అవమానాలు పడాల్సి వొస్తుంది. బాయి దగ్గర ఎంత బలుపు పని చేస్తడు. ఎంత బరువు మోస్తడు. ఇరాం లేకుంట కష్టం చేస్తనే ఉంటడు. అవ్వకు తప్పు ఎవ్వలకు జాలి లేదు. దయలేదు. తనదేం తప్పు. దేవుడట్లిచ్చె. మాట మాట్లాడితె అట్లనొచ్చె. చేతులు కావాలని తప్పుతడా.... తెల్వకుంటనే చేతులట్ల తిర్గుతయి. కాళ్లల్ల ఏం పాడయిందో కాళ్లట్ల తిరిగె... నడుమట్ల దిరిగె... అవ్వను జూసిజూసి అట్లాయె. అట్లొచ్చె. ఏం జేతు? దేవుడు పాడుగాను. గీ పుట్టువడియ్యాల్నా... గిట్లనే బతుకుదామంటె గట్లెట్ల కొడుకా అని అవ్వ పట్టు పట్టె. పెండ్లి జేసె. దాని పాడుగాను. అది ఉండకపాయె. నడుమ నాకొచ్చింది సావు.... ఇజ్జత్ కచ్‌రా...నలుగుట్లకు పోవాలంటది అవ్వ. పోతె పజీత. నలుగురే గద కాకులు... గద్దలు... పొడుచుక తంటరు. అదేమీ ఆనందమో... ఒకన్ని ఏడిపిచ్చిపొందే ఆనందం. అదేం పిచ్చో?... ఎన్నిసార్లేడ్సిండు. ఎన్నిసార్లు అవ్వ తుడ్సింది ఏడుపేనా? బతుకంత బతుకు పాడుగాను.. ఏం బతుకు పాడయింది.

ఎదురొచ్చిన లచ్చవ్వను చూసి గొల్లుమన్నాడు. శంభయ్య ఎక్కెక్కి ఏడుస్తున్నాడు. లచ్చవ్వ ఓదార్చతరం కాలేదు. జరిగిందంతా విని కొడుకు స్థితికి లచ్చవ్వకు ఏడుపు ఆగలేదు. ఒకరిమీద ఒకరు పడి ఏడ్చారు. దేవున్ని తిట్టుకున్నారు. కొద్దిసేపట్లో కుదుట పడ్డారు. కొడుకు కళ్లల్లో నీరు కొంగుతో తుడిచింది లచ్చవ్వ. ఎంత దు:ఖం ఎల్లదీసింది తను. చేతనయి చేతకాని భర్తను నిలబెట్టడానికి, సంసారం నిలబెట్టడానికి మామూలు దు:ఖమా? ఈ యింత కొడుకును కనగానే మొగుడు చనిపోవటం పెద్ద దు:ఖం. మొగుడు పోంగనే పాలోల్లు పెట్టిన తిప్పలు ఎన్ని? పాలు కాడ... బాయికాడ... గెట్టు కాడ... తలుగుకాడ... దొడ్డికాడ... గుడ్డం కాడ... ఎన్ని కష్టాలు, ఎంత దు:ఖం... కొడుకును చూసి మాడుద్దామంటె పాలొల్ల ముంగట నల్లమొకం... నిలబెట్టాలె. వంశం నిలబడాలె. ఏడుపుదేముంది? ఏడ్చినా కొద్ది ఏడిపిస్తరు. నలుగురి సమానం నిలబడాలె' లచ్చవ్వ పట్టుదల గొప్పది. కొడుకును నిలబెట్టింది. ఎవుసం నిలబెట్టింది. సంసారం నిలబెట్టింది. ఉడుం పట్టుతోని వంశం నిలబెట్టుకుంటూ వస్తున్నది.

శంభయ్యను తీసుకొని పెద్ద మనుషుల ఇల్లిల్లూ తిరిగింది లచ్చవ్వ. శంభయ్య భార్య కాపురానికి వచ్చేటట్టు చెయ్యమని వాళ్ల కాళ్లు వేళ్లూ పట్టుకొన్నది. తలాయింత ధైర్యం చెప్పారు. నచ్చజెప్పి కోడలును తోలుకొచ్చుకొమ్మని సలహా ఇచ్చారు. రానన్నప్పుడు పంచాయతికి పిలుద్దామని భరోసా ఇచ్చారు. లచ్చవ్వలో కొత్త మెరుపు మెరిసింది. కొడుకుకు, అంతులేని ధైర్యం నూరిపోసింది.

శంభయ్య అత్తగారింటికి కొడుకును, అన్నను తీసుకొని వెళ్లింది లచ్చవ్వ. కాపురానికి కోడలును పంపించుమని అడిగారు. ఎవ్వరూ ఎదురు చెప్పలేదు. మేం పంపించటానికి సిద్ధంగా ఉన్నామనీ, తోలుకపొమ్మనీ చెప్పారు. కోడలు భయంతో వణికిపోతున్నది. ససేమిరా రానని పంతం పట్టింది. లచ్చవ్వ కొడుకు చెవిలో ఏదో చెప్పింది.

శంభయ్య దబదబా వెళ్ళి భార్య పార్వతి చెయ్యి పట్టుకొని బలంగా ఈడ్చాడు. పార్వతి ఏడ్పు, శంభయ్య ఈడ్పు, లచ్చవ్వ ఊబదర... మొత్తానికి పార్వతిని ఈడ్చుకుంటూ బందారం చేరుకున్నారు. బజార్లో నేలమీద పడి కొట్టుకుంటున్నది పార్వతి. బలమంతా ఉపయోగించి ఈడ్చుకొస్తున్నాడు శంభయ్య. ఊర్లో, బజార్లో అమ్మలక్కలు ముక్కుమీద వేలేసుకొని గుసగుసలు పెడుతున్నారు. **"పాపం, పిల్ల చస్తది. గదే గుంజుడు"** అన్నదో ముసలమ్మ ధైర్యం చేసి **'చావనియ్యి. ఎవలకోసం జస్తది. ఏంత తక్కువైందని జస్తది. పెండ్లయినంక సంసారం జెయ్యాలె గద.'** లచ్చవ్వ కొడుకుకు వంత పాడింది. పార్వతి గోస చూసి ముసలమ్మకు జాలేసింది. అడ్డుకున్నది. శంభయ్య చెయ్యి గుంజేసింది. శంభయ్యకు కోపమొచ్చింది. ముసలమ్మను నూకేశాడు. **"అది జెయ్యకపోతే సంసారమెవలు జేస్తరు. నువ్వు జేస్తవా?"** అన్నాడు శంభయ్య. **"కుక్క తెరువు పోవాలెందుకు! లచ్చనాలు పడాలెందుకు? పిచ్చి కుక్కయిందదు. ఎవల్ని కరుత్తదో తెల్వదు"** అన్నాడెవరో. ఎక్కడివాళ్లక్కడ ఉండిపోయారు. శంభయ్య పార్వతిని ఈడ్చుకొని ఇంట్లో పడేశాడు. పగ్గం తెచ్చి మొగురానికి కట్టేశాడు. ఇంటి తలుపులు పెట్టి తాళం వేసి బాయి దగ్గరికి వెళ్లిపోయారు లచ్చవ్వ, శంభయ్య.

చూస్తుండగానే వారం రోజులు గడిచిపోయింది. పార్వతి తనకు తాను ఏదో సమాధానం చెప్పుకున్నది. వ్యవసాయం పనులకు రావటం మొదలు పెట్టింది. వంటచెయ్యటం, భర్తకు సద్దిపట్టుక రావటం క్రమంగా అలవాటయిపోయింది. బయట అమ్మలక్కల ముచ్చట్లు మాత్రం ఆగలేదు. రాత్రిపూట తల్లీ కొడుకులు కలిసి పార్వతిని ఎంత హింసిస్తున్నదీ ఎట్లా హింసిస్తున్నదీ కథలు కథలుగా చెప్పుకోసాగారు. పార్వతి పట్ల చాలామందికి జాలి కలిగింది. అంత నిర్దయగా వదిలిపెట్టినందుకు పార్వతి తల్లి దండ్రి పట్ల ఊర్లో కొందరికి కోపం కూడా వస్తున్నది. **"ఎంత కోడలుదైతే మాత్రం ప్రతిరాత్రి కొడితే తట్టుకుంటుందా? ఎంత భార్యయితే కొనుపులు కాల్చి వాతలు పెడితే ఆమెది పెయ్యి కాదా? పానం కాదా? అయ్యో... ఇసోంటి సంసారం దునియల ఉంటదా? తిండి కూడా పెట్టరంట.**

**ఎట్లా భరిస్తుందో... పాపం... నోట్లె నాలుక లేదు. అదో సంసారం. వాడో మొగడు... అది గోస గాదు".** ఊరు చింతిస్తూనే ఉన్నది. రాత్రి వల పోస్తూనే ఉన్నది. పొద్దు పొడుస్తున్నది. దూకుతున్నది. శంభయ్య సంసారం నిలబెట్టడానికి ఉపాయాలు వెతుకుతూనే ఉన్నది లచ్చవ్వ.

పొద్దు సెగలు గక్కుతున్నప్పుడు ఊర్లో వార్త గుప్పుమన్నది. పిల్లలు, స్త్రీలు మక్తబాయి వైపు పరిగెత్తుతున్నారు. అప్పటికే మస్కూరులు చేరుకున్నారు. యువకులు కొందరు సొరికెలోంచి శవాన్ని లాగుతున్నారు. అతికష్టంగా కట్టెలకు కట్టి బాయి గడ్డ మీదికి చేదినారు. వెల్లకిల్లా పడుకోబెట్టారు. చేపలు కొరుకుక తిన్నట్టు తెలుస్తూనే ఉన్నది. అయినా ముఖం చూస్తే 'పార్వతి' అని తెలిసిపోయింది. పరువు నిలబెట్టటానికి పార్వతి ప్రాణమే వదిలింది. ఇటు తల్లితండ్రులు, అటు అత్తా భర్తా వొచ్చి ఇప్పుడు చేసేదేముంది? ఏడుపులూ, బొబ్బలూ, ఆరోపణలూ ఆడిపోసుకోవటాలూ తప్ప. ఊరు సానుభూతి కూడా పార్వతికి అక్కర లేదిప్పుడు. పంచనామాలు, కేసులు ఎవరు కోరుకోలేదు.

పార్వతిని మరిచిపోవటానికి ఏడాది దాటింది. శంభయ్య సంసారం సగవెట్టటానికి పెరట్ల లచ్చవ్వ ఉపాయాలు వెతుకుతూనే ఉన్నది. పాలోల్ల ముందట నగుబాటయినందుకు పాపం లచ్చవ్వ మనసు మనసులో లేదు. కోతిని చెయ్యవోతే కొండెంగ అయినట్టు వంశం నిలబెట్టవోతే వంశానికే మచ్చ వచ్చినందుకు బాధ పడింది. పెద్దలకు బియ్యమిచ్చేరోజు పెద్దలకు మొక్కింది. తిమ్మాయిపల్లి నుంచి మరో సంబంధం చూసింది. ఈసారి గుళ్లోపెళ్లి గుట్టుగా జరిపించింది. పనిమంతుల కుటుంబం. ఇగురవంతురాలు నర్సవ్వ. తొలి కాపురం కథలు విన్నా నెగ్గుకు రాగలనని చేసుకుంది.

నర్సవ్వ వ్యవసాయ పనులన్నీ చేస్తుంది. మగవాళ్లు చేసే పనులు కూడా చేసేది. మగవాళ్లు చేసే పనులు కూడా చేసేది. కొద్దిరోజుల్లో లచ్చవ్వ మన్నన పొందింది. శంభయ్యకు కూడా నర్సవ్వ ప్రీతిపాత్ర మైంది. నర్సవ్వ సంసారాన్ని దారిలో పెట్టింది కానీ మొగన్ని సంసారంలోకి నడిపించలేకపోయింది. శంభయ్యతో ముఖం దొరకదని తెలుసుకొని పక్కదారులు కూడా వెతికింది. అయితే కొద్దిరోజుల్లోనే శంభయ్యకు అనుమానం మొదలైంది. కాపుగాసి దొరికించుకున్నాడు. నర్సవ్వ సమర్థించుకున్నది. తనకు సంసారం నిలబెట్టుకోవటం కోసం తప్పు చేయటానికి కూడా వెనుకాడనని చెప్పింది.

శంభయ్య చూసీ చూడనట్లు ఉండిపోయినా ఊరు చూసీచూడనట్లు ఉండలేదు. శంభయ్యను మరింత సూటిగా అవమానించటం మొదలైంది. చేతులు ఊపుతుంటే అన్నవాళ్లు నడుమా తిరుగుతుంటే అన్నవాళ్లు కనబడితే ముఖం పట్టుకొని ఇజ్జత్ తీస్తున్నారు. పటేలే గని, పటేలుతనం లేదని పరువు తీస్తుంటే తట్టుకోలేకపోయాడు. పిల్లలంటే సహించాడు. బావ బామ్మర్దులు వరుసకు పరాచికమాడితే భరించాడు. రానురాను ఆడవాళ్లు అంటుంటే, తన పనివాళ్లు అంటుంటే తట్టుకోలేకపోయాడు. నర్సవ్వకు వాతలు పెట్టబోతే తిరగబడింది. కొనుపులు గుంజుకొని తిరిగి శంభయ్యకే వాత పెట్టింది. లచ్చవ్వ సర్ది చెప్పితే శంభయ్య వినలేదు. శంభయ్య హింసకు దిగితే నర్సవ్వ వినలేదు. ఈ మాత్రందానికి మొగడెందుకని పుట్టినింటికి వెళ్ళింది. అసమర్థుడని ఢంకా బజాయించి చెప్పింది.

ఆరునెలల తర్వాత ఇరువైపుల పెద్దలు పంచాయతికి కూర్చున్నారు. దడువతులు పెట్టుకున్నారు. అటు నలుగురు ఇటు నలుగురు పంచులు నడుమ నలుగురు పెద్దమనుషులు. కాక – నర్సవ్వ తరపు తిమ్మాయిపల్లి వాళ్లు ఇరువైమంది. శంభయ్య తరపు లచ్చవ్వ బంధువులు పదిమంది. పంచాయతి వినటానికి ఊరి ఆడవాళ్లు కొందరు, ఖాళీగా ఉన్న మగవాళ్లు కొందరు. మొత్తానికి మూడు బాటలో నిండిపోయాయి. ముందు పంచాయతీ పెట్టింది శంభయ్య గనుక సంగతంతా చెప్పుకున్నారు. పెళ్ళి దగ్గరనుంచి తనకు వాత పెట్టిందాకా వివరంగా చెప్పుకొచ్చారు. తర్వాత నర్సవ్వను చెప్పుమన్నారు. పూస గుచ్చినట్టు అంతా చెప్పింది. ఇటు శంభయ్య గానీ, అటు నర్సవ్వ గానీ వేరే సంబంధం ముచ్చట తీయలేదు. నలుగుట్లో పరువు కాపాడుకోవాలని ఇరువురూ ప్రయత్నిస్తున్నారు.

**"మరింక సమస్య ఏముంది? సంసారమన్నంక కొట్లాటలు వస్తయి. పోతయి. సదురుకోవాలె"** అన్నాడు బాలిరెడ్డి. **"అదొస్తె చాలు, నేను సదురుకుంట"** అన్నాడు శంభయ్య. లచ్చవ్వ కూడా సదురుకుంటానన్నది. అటు తిరిగి నర్సవ్వను అడిగారు. నేలమీద గీతలు మౌనంగా ఉండిపోయింది. నర్సవ్వ తండ్రినడిగారు. మౌనంగా ఉండిపోయాడు. నర్సవ్వ తల్లి నోరు విప్పింది. **"మాకు కలువనే కలువది. సదురుకునుడొద్దు. సంపుకునుడొద్దు. ఆ పిల్లను జంపినంక మా పిల్లను, ఇయ్యనే ఇయ్యొద్దు. మొగోడనుకొని ఇచ్చినం. అరంరవె, మొగోడు గాదా శంభయ్య".** దారం లాగాడు పెద్దమనిషి మల్లయ్య.

**"నాతోని అనిపియ్యాల్నని అడుగుతున్నావా? ఊరంత ఎరికేవాడు మొగోడు కాదని ఆడి గుట్లోడనే పిలుస్తరట కద"** మీ వూరోల్లకు నేను జెప్పేదేంది? అన్నదామె.

అత్త అంత మాట అనేసరికి శంభయ్యకు కోపం నషాళానికి ఎక్కింది. లేచి అత్త దగ్గరికి ఉరుకొచ్చాడు. గట్టిగ అరిచాడు. **'అంజెముండా, ఏం మాట్లాడుతున్నవే. నేను మొగోన్ని గాదా? రాయె. పండుకో. మొగోన్నో కాదో చూపెదుత. నీ యవ్వ. బంచోత్. ఆడి గుట్లోడంటవా? ఈన్నే – ఈ మందిల్నె తేలాలె. మొగతనం జూపెదుత దా! పండు"** అని చేతులు తిప్పుకుంటూ అందరిముందే

## అక్షరాయుధుడు – మా బాలుడు

అక్షరాన్ని ఆయుధంగా చేసి జీవితంపై విజయకేతనం ఎగురవేసినవాడు

అక్షరాన్ని ఉపాధిగా మలచుకొని జీవించినవాడు

అక్షరాన్నే నిరంతరం ఉపాసించినవాడు

పత్రికా రంగాన్ని, రచనా వ్యాసంగాన్ని బతుకు తెరువుగా మార్చి కష్టాలను కడగండ్లను దాటినవాడు

ఎన్నో సమీక్షలు – ఎన్ని సాంస్కృతిక వ్యాఖ్యలు, మరెన్నో అనువాదాలు, ఎన్నెన్ని బహిరంగతరంగ జీవన చిత్రణలు

తెలంగాణ పత్రిక గర్భాల్లో, ఆత్మకథల్లో నిద్రిస్తున్న సాహిత్య సామాజిక విశేష అనుభవ సమాచారాల సంఘటనల వెలికి తీతలు

ఎందరి అనుభవాల ఆరాటాల ఆక్రోశాలకు అక్షర చిత్రణలు!!

ఏది రాసినా, ఏది మాట్లాడినా ఆధార సమన్వితం

ప్రమాణాల పరిరక్షణ పరమావధి అని మరవని వాడు

ఔచిత్య సుశోభితం చేయకుండా వదలని వాడు

కొట్టివేతలు – తిరిగి రాయడాలు ఎరుగని ప్రజ్ఞాశాలి

అలవోకగా అందరికీ సందేహాలు తీర్చే తెరిచిన పుస్తకం

మా బాల శ్రీనివాసుడు ప్రౌఢ సాహిత్య శ్రీనివాసుడు

నా మిత్ర కోటిలో నాకు నచ్చిన నేను మెచ్చిన సాహిత్య నిత్యకృషీవలుడు

అక్షరానికి, బోధనకు సెలవు చెప్పి మా హృదయాలను ఆర్ద్రీభవింపజేసిన మనీషి ... మా బాలుడు...

---

**ఆచార్య వెలుదండ నిత్యానంద రావు**

**విశ్రాంత ఆచార్యులు, తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం.**

ఆమె చెయ్యి పట్టి గుంజాడు. ఆమె చెయ్యి అదిలిచ్చింది. **"ఆ చేతులు తింపుడు జూదుంద్రి. మా అయ్య. ఆ.... మాట జూదుంద్రి. మొగోల్లకాబిలేనా? కట్టుకున్నదాన్ని మొగోని లెక్క జూసుకున్నంక నలుగుట్లెకెందుకొస్తది..."**. అత్త చెయ్యి పట్టుకోవటం తప్పని వారించారందరు. పెరట్ల లచ్చవ్వ వచ్చి కొడుకును చెంపమీద కొట్టింది. పెద్దమనుషుల నిర్ణయానికి వదిలిపెట్టింది. పెద్ద మనుషులు ఆఖరుగా నర్సవ్వ అభిప్రాయం అడిగారు. చెప్పుమని ఒత్తిడి చేశారు. **"నూనె లేని వొత్తి ఎగదోస్తేంది? దిగదోస్తేంది? బంగారం కేటుదయితే అవసులోన్ననేదేముంది? అసలుది లేదు, ఆత్మకి లేదు. ఇడిపిచ్చుకునేదే మంచిది"**. కుండ బద్దలు కొట్టింది. అన్నీ ఆలోచించి, విచారించి ఇడుపు కాయితం రాశారు పెద్దలు.

ఎండాకాలం పోయి వానాకాలం, వానాకాలం పోయి చలికాలం వచ్చినట్టు, కాలాలు మారుతూనే ఉన్నాయి. నిండిన చెరువులుండినా, ఎండిన చెరువులు నిండినా, ఊరు తట్టుకుంటూనే ఉన్నది. పొలం పారినా, పారకపోయినా, వ్యవసాయం నడిచినట్లే శంభయ్య వ్యవసాయం నడుస్తున్నది. సంసారం మాత్రం నడబటం లేదు. శంభయ్య బాయి దగ్గర దీనంగా కూర్చుని బిక్కు బిక్కుమంటుంటే లచ్చవ్వకు ఏమీ తోచటం లేదు. మూడేళ్లు దాటినా శంభయ్య దిగులు పోలేదు. లచ్చవ్వ రంది పోలేదు.

పెరట్ల లచ్చవ్వ వంశం నిలబెట్టలేకపోతున్నందుకు పెద్దలెవురో కలవరపెడుతున్నట్లనిపించింది. నాలుగో ఏడాది పెత్తర అమాసనాడు పెద్దలకు మొక్కి ఒక నిర్ణయం తీసుకున్నది. అనుభవమంతా కూడదీసుకొని, సాహసమంతా గుండె నింపుకొని శంభయ్యకు మారుమనువు తచ్చింది. కొమరవెల్లిలో మారుమానం పెళ్ళి చేసింది.

లచ్చవ్వ, కొత్తకోడలు ఇంతకుముందు వేరే ఇంట్లో పాత కోడలు ఆటుపోట్లు తట్టుకున్న కోడలు. అనుభవాలు పెనవేసుకున్న కోడలు, శంభయ్య దూరపు వదిన చెల్లెలు. గాలవ్వ, ఓపికకు ఓపిక. సర్దుబాటుకు సర్దుబాటు, ఇగురానికి, ఇగురం. అత్త లచ్చవ్వకు అర్థం చేసుకున్నది. భర్త శంభయ్యను లొంగదీసుకున్నది. సంసారం, వ్యయసాయం ఆమెకు కొట్టిన పిండి. సంతాన వ్రతం చేసింది. పుట్టలో పాలు పోసింది. గుళ్లల్లో నిద్ర చేసింది. జాలాట్లో కాళ్ల మీద పడుకోబెట్టుకొని, మనుమరాళ్లకి స్నానం చేయిస్తున్నది లచ్చవ్వ. పాప పిడికిలి వేళ్ళు నిమురుతూ తన వేలు పట్టుకుంటంటే శంభయ్య మురిపానికి అంతులేదు. వంశం నిలబెట్టినందుకు – పరువు నిలబెట్టిందుకు, గాలవ్వను మెచ్చుకొని రోజులేదు. ఎవరి మురిపెం వాళ్ళది. చిన్న చిన్న మురిపాలు వాళ్ళది. చిన్న చిన్న మురిపాలు లేకుంటే మనుషులు బతకలేరు.

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 7 17 హైదరాబాద్ మే : 2023

# తెలంగాణ మాగాణంలో అక్షరమూర్తి – ఆచార్య గుమ్మన్నగారి బాల శ్రీనివాసమూర్తి

**డా. సుభ్యా**, తెలుగు భాషోపాధ్యాయులు, వికారాబాద్. ఫోన్ : 730 686 4798

ఆయన అక్షరయానం అన్ని దిశల్లోను, దశల్లోను సాగింది. ఆయన అక్షరయానం శాతవాహన సామ్రాజ్యం మొదలుకొని స్వతంత్ర తెలంగాణ కాలంవరకు స్పృశించింది. ఆయన గ్రంథయానం సిద్ధిపేట పురపాలకం మొదలుకొని విలక్షణ పి.వి.వరకు నడిచింది. ఈ పయనంలో ఎన్నో గొప్ప అవార్డులు, రివార్డులు, అనుభూతులు, ఆత్మీయతలు ఈ సాహితీవనంలో ఆయన యాత్ర అక్షరాల మూటను, పుస్తకాల పుటలను పట్టుకొని అలా సాగిపోయింది. ఈ యాత్రికుడు మరెవరో కాదు ఆత్మకథలలో ఆనాటి తెలంగాణను, యాసవాసల తెలంగాణను పట్టి వాక్య నిర్మాణం చేసిన ప్రయాణికుడు, సుపరిచితులు, అత్యుత్తమ విమర్శకులు, పరిశోధకులు, సమీక్షకులు, వ్యాఖ్యాత, సాహితీవేత్త, ఉపన్యాసకులు, విశ్వవిద్యాలయ ఆచార్యులు గుమ్మన్నగారి బాలశ్రీనివాసమూర్తి. ఈ పేరు వినగానే సాహిత్యంపై మక్కువ ఉన్న విద్యార్థులకు, పరిశోధ కులకు, ఉపన్యాసకులకు, విశ్వవిద్యాలయ ఆచార్యలకు ప్రత్యేకంగా పరిచయం చేయవలసిన అవసరం లేని మూర్తిమత్వం వారిది.

ఆచార్య గుమ్మన్నగారి బాలశ్రీనివాసమూర్తిగారు 1966 సెప్టెంబర్ 5న నాటి మెదక్ జిల్లా (నేటి సిద్ధిపేట) పోతారెడ్డి పాలెం, తెలుగు అవధానుల్లో సుప్రసిద్ధులు, సాహితీమూర్తులు స్వర్గీయ గుమ్మన్నగారి లక్ష్మీనరసింహశర్మ, పద్మావతి పుణ్యదంపతులకు జన్మించారు. స్వగ్రామం పోతారెడ్డిపాలెం అయినప్పటికీ గుమ్మన్నగారి లక్ష్మీనరసింహశర్మ 1965–75 కాలంలో వృత్తిరీత్యా దుబ్బాక పాఠశాల నుండి నేటి సిద్ధిపేటలోనే చిన్న కోడూరు గ్రామానికి బదిలీకావడం జరిగింది. ఇక్కడే వీరికి నలుగురు సంతానం కలిగారు. వీరిలో తొలుసూరు బిడ్డే ఆచార్య గుమ్మన్నగారి బాలశ్రీనివాసమూర్తి. రెండవవారు గుమ్మన్నగారి వేణుమాధవశర్మ, మూడవవారు గుమ్మన్నగారి బాలసరస్వతి (ఆడపిల్ల), నాల్గవవారు గుమ్మన్నగారి రాజేశ్వర శర్మలు. వీరికి ముందు ఏడవతరానికి చెందిన గుమ్మన సోమయాజి గొప్ప వేదపండితుడు, సంస్కర్త. యజ్ఞయాగాదులతో కీర్తిప్రతిష్టలు పొందిన మహాజ్ఞాని. ఈయన పేరు మీదనే ఈ వంశస్తులకు “గుమ్మన్న” అనే ఇంటిపేరు స్థిరపడింది.

**బాల్యం, విద్యాభ్యాసం**

నాన్నగారికి చిన్న కోడూరు పాఠశాలకు బదిలీ అయిన తర్వాత వీరి 5వ తరగతి వరకు సాగాల్సిన చదువంతా అక్కడే సాగింది. అనంతరం 1976లో జరిగిన బదిలీల కారణంగా ఆపై 12వ తరగతివరకు పోతారెడ్డిపేట, రామాయంపేట, గజ్వేల్ పట్టణాల్లో సాగింది. ఇక్కడే పోతన భాగవత అధ్యయనం, భారత కథలు,




రామాయణ భక్తి తత్త్వాలు బాల శ్రీనివాసమూర్తిగారి మదిని తట్టాయి. 1985–86లో డిగ్రీ చేసే రోజుల్లో నాటి మినీ విశ్వవిద్యాలయంగా భావించే సిద్ధిపేట డిగ్రీ కళాశాల గొప్ప సాహిత్య సంపదను అందించింది. తెలంగాణలో నిజాం కళాశాల, సిటీ కళాశాల, వరంగల్ కళాశాల వంటి గొప్ప కళాశాలలో ఇదీ ఒకటి. ఈ కళాశాల నుండే అసాధారణ నైపుణ్యాన్ని, వక్తృత్వపటిమను, నాయకత్వ భావనను పెంపొందించుకున్నారు. సాహిత్యంలో 1985లో రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో ద్వితీయ స్థానం పొందారు. అనంతరం ఉస్మానియా విద్యాలయంలో పి.జి., డాక్టరేట్ పట్టాను 1993లో తీసుకున్నారు.

**అబ్బిన సాహిత్యం**

ఆచార్య గుమ్మన్నగారి బాలశ్రీనివాసమూర్తిగారికి సాహిత్య సంపద ఒకటి రెండు రోజుల్లో వచ్చింది కాదు. తెలంగాణ ప్రాంతంలో 1970ల కాలంలో సిద్ధిపేట మొదలు రామాయంపేట, హుజురాబాద్, హుస్నాబాద్, మెదక్, కరీంనగర్, హైదరాబాద్, వరంగల్ వంటి ప్రాంతాల వరకు లక్ష్మీనరసింహశర్మగారు చేయని అవధానాలు లేవు. వారిని సహజంగా అనుసరించిన బాల శ్రీనివాసమూర్తికి ఎంతోమంది సాహితీవేత్తల, అవధానుల, విమర్శకుల పరిచయం కలిగింది. వారిలో వాకాటి పాండురంగారావు, కసిరెడ్డి వెంకటరెడ్డి, ఎల్లూరి శివారెడ్డి, ఫణిహారం వల్లభాచార్య, తిగుళ్ల వేంకటేశ్వరశర్మ, ఎస్.వి.రామారావు, ఎన్.గోపి వంటి ఎందరో మహానుభావుల పరిచయం ఆయనను సాహితీ క్షేత్రంలో గొప్ప పరిశోధకుడిగా, విమర్శకుడిగా నిలబెట్టాయి.

మరోవైపు సిద్ధిపేట డిగ్రీ కళాశాల అధ్యాపక బృందంలోని ముదిగొండ వీరభద్రయ్య, కె.వి.రాఘవాచార్యులు, ఐనవోలు హరీంద్రబాబు, ఎస్.ఎల్.ఎన్.ఆచార్య, తిరునగరి శ్రీనివాస్ వంటివారు ఆయనకు మార్గదర్శకులయ్యారు.



**"నాన్న సాహితీ విమర్శకుడు కాదు గానీ విమర్శక హృదయమున్న జిజ్ఞాసువు"** అంటారు బాలశ్రీనివాసమూర్తి. సాహిత్యం పట్ల ఖచ్చితమైన విధి విధానాలు, స్పష్టమైన ధోరణులను తండ్రి నుండి నేర్చుకున్నారు. గురజాడ అప్పారావు, విశ్వనాథ సత్యనారాయణ, ఉన్నవ లక్ష్మీనారాయణ, వేటూరి ప్రభాకర శాస్త్రి, పుట్టపర్తి నారాయణాచార్య, రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ వంటి మహోన్నతుల సద్గ్రంథాలను విమర్శనాత్మక ధోరణిలో అధ్యయనం చేసి పట్టు సాధించారు.

**సాహిత్య క్షేత్రంలో విశ్రమించని కృషి**

ఇంట్లోని ఎదురు గూట్లో దొరికిన 'సింగిడి' ఆయన నిశ్చల స్థితిలో ఉన్న మెదడును పరుగులు పెట్టించింది. నేనూ ఒక పుస్తకం రాయాలి అని మెలిక కలిగించింది. ఇట్లా మొదలైన ఆయన రచనా వ్యాసంగం ఆయన యాత్ర చివరిక్షణంవరకు ఎన్నో చారిత్రక గ్రంథాలు, సాహిత్య గ్రంథాలు, ప్రాంతీయ చరిత్రలు, జీవిత చరిత్రలు, ఆత్మకథలను ఔపోసన పట్టేలా చేసింది.

ఆయన నడిచిన సాహితీవనంలో నేటికీ ఎన్నో జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పత్ర సమర్పణలు చేశారు. వందకుపైగా పరిశోధనా వ్యాసాలు రాశారు. అనేక గ్రంథాలకు సమీక్షలు రాశారు. విశ్వవిద్యాలయంలో ఎందరో పరిశోధకులకు పర్యవేక్షకులుగా నిలబడి అత్యుత్తమ పరిశోధకా గ్రంథాలను, పరిశోధకులను తయారుచేశారు.

**విభిన్న శైలి, విలక్షణ రచనలు**

**'నియతికృత నియమరహితాం -**
**హ్లాదైకమయీ, అనన్య పరతంత్రాన్**
**నవరస రుచిరాం నిర్మితి -**
**మావధాతీ భారతీ కవేర్జయతీ'** అంటారు మమ్మటుడు.

బ్రహ్మ సృష్టిలా కాకుండా నియమరహితమైనదై, ఆనందదాయక మైనదై, షడ్రుచులు కాక నవరస రుచులతో కూడినదై, స్వతంత్ర మైనదైన రచన, నిర్మాణం, నిర్మితి ఉండాలని పై మాటల తాత్పర్యం.

ఈ నియమాలను ఏ మాత్రం ఉల్లంఘించని రచనలుగా ఆచార్య గుమ్మన్నగారి బాల శ్రీనివాస మూర్తిగారి రచనా శైలి ప్రస్ఫుటిస్తుంది. వారు రచించిన సమకాలీన వాదాలు - సాహిత్య విమర్శ, తుషార సమీరం, మాప్రసిద్ధిపేట, తెలంగాణ పత్రికలు, ఆత్మకథల్లో ఆనాటి తెలంగాణ, వెలుతురు కొలను, తెలంగాణ- తెలుగు మాగాణం, తెలంగాణ వైతాళికులు - జననేతలు, తెలంగాణ వైతాళికులు అక్షరమూర్తులు, తెలంగాణ వైతాళికులు - ప్రతిభామూర్తులు, సాహితీసుధ, జీవన హిందోళం, అటల్ బీహారీ వాజపేయి జీవిత చరిత్ర (అసమగ్రం) వంటి ఎన్నో గ్రంథాలు ఆయన కృషి ఫలితం. ఒక్కో గ్రంథానిది ఒక్కో ప్రయాణం ఉంటుంది. ఈ గ్రంథాలను చదువుతున్నప్పుడు పాఠకునికి నాటికాలంలో నాటి వ్యక్తులతో, నాటి అనుభూతులతో కలిసి ప్రయాణం చేస్తున్న భావన కలుగుతుంది.

ఆత్మకథల్లో ఆనాటి తెలంగాణ గ్రంథానికి తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారంతోపాటు వికారాబాద్ జిల్లా సాహితీ సమితీ అవార్డు కూడా దక్కింది. అంతేకాదు ఆయన సాహిత్యానికిగాను త్వరలో కరీంనగర్ జిల్లా సాహితీ గౌతమి గంగ్ర హనుమంతరావు పురస్కారాన్ని కూడా అందుకునేవారు.

**తెలంగాణ విశ్వవిద్యాలయం - విద్యార్థులతో ప్రయాణం**

2007లో నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి రాములవారి సన్నిధిలో వారి ఉద్యోగ జీవితం ఆరభమైంది. హైదరాబాద్ నగరానికి ఉత్తరాన ఉన్న నగరమైనప్పటికి, వీరి సాహిత్య బీజప్రస్థానం ఆ ప్రాంతానికే పరిమితం కాలేదు. 2007 నుండి 2023 కాలం వరకు విశ్వవిద్యాలయంలో వివిధ హోదాల్లో పనిచేసి తమ సేవలు అందించారు. ఎందరో విద్యార్థులకు సాహిత్యాన్ని అందించారు. ప్రాచీన సాహిత్యం, ఆధునిక సాహిత్యం, విమర్శ, భాషాశాస్త్రం, పత్రికారంగం వంటి వాటిలో భాషాశాస్త్రం, విమర్శ వంటివి కఠినమైన విషయాలు. ఆ కఠినత్వాన్ని అధిగమించి వీరి పాండితీధారను అందిపుచ్చుకున్న ఎందరో విద్యార్థులు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నిర్వహించే నేషనల్ ఎలిజిబులిటి టెస్ట్, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే స్టేట్ ఎలిజిబులిటి టెస్ట్, జూనియర్ రిసెర్చ్ ఫెలోషిప్ సాధించి డిగ్రీ కళాశాల అధ్యాపకులుగా, జూనియర్ కళాశాల అధ్యాపకులుగా, ఉపాధ్యాయులుగా, పాత్రికేయులుగా తెలంగాణలో ప్రతి జిల్లాలో నాటుకుపోయారు. అంతేకాదు, కేంద్ర ప్రభుత్వం నిర్వహించే సివిల్ సర్వీస్ అభ్యర్థులకు కూడా సాహిత్యాన్నందించి ఉన్నతిని చాటుకున్నారు.

**విశ్వవిద్యాలయ ఆచార్యులతో సఖ్యత**

**'కొట్టివేతలు తిరగ రాయడాలు ఎరుగని ప్రజ్ఞాశాలి, అలవోకగా మాకు సందేహాలు తీర్చే తెరిచిన పుస్తకం'** అనేవారు ఆచార్య వెలుదండ నిత్యానందరావుగారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో

నెలవై ఉన్న అన్ని విశ్వవిద్యాలయాల ఆచార్యులతో, గురువులతో వారికి గొప్ప అనుబంధం ఉండేది.

కసిరెడ్డి వెంకటరెడ్డి, ఎస్వీ సత్యనారాయణ, వెలుదండ నిత్యానందరావు, బన్న ఐలయ్య, వై.రెడ్డిశ్యామల, సాగి కమలాకర శర్మ, సూర్యా ధనుంజయ్, రఘు, పి.కనకయ్య, వంగరి త్రివేణి, లక్ష్మణచక్రవర్తి, లావణ్య, గోనానాయక్ వంటి వారందరితో కలిసిమెలిసి సాహిత్య బోధన చేసి గొప్ప అనుబంధాలను నిర్మించుకున్న వ్యక్తిత్వం ఆయనది.

తరచుగా వాడే పదం 'యాది'. మనలో మనకు తెలియకుండానే ఉన్న మనాదుల్ని దూరంచేసే మందు అది అంటారు వారు. ఇవాళ సాహితీ లోకానికి ఆచార్య గుమ్మన్నగారి బాలశ్రీనివాస మూర్తిగారు చేసింది కూడా అదే. శాశ్వతంగా 'యాది'లోకి వెళ్లిపోయి ఎంతోమంది విద్యార్థులు, పరిశోధకులు, విమర్శకులు, ఆచార్యులు, సాహితీకారుల హృదయాల్లో నిలిచిపోయారు. సాహిత్యానికి ఇంకా ఎంతో సేవలు అందించాల్సిన వీరు పరుగులు పెడుతున్న వారి కలాన్ని తెల్ల కాగితాలకు అప్పజెప్పి కొత్తతరానికి రాయవలసినవి సూచిస్తూ 24 ఏప్రిల్ 2023 ఉదయ కాలంలో స్వర్గస్థులయ్యారు. నిన్న మొన్నటి జ్ఞాపకంగా మిగిలిపోయారు. వారికి హృదయపూర్వక శ్రద్ధాంజలి. నివాళి.

## చిన్న వాక్యాల రచనలో మేటి – బాల శ్రీనివాస మూర్తి

**గురిజాల రామశేషయ్య,** ఫోన్ : 703 267 9471

కీర్తిశేషుడైన డాక్టర్ గుమ్మనగారి బాలశ్రీనివాసమూర్తి తెలంగాణ విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో అసిస్టెంట్ ప్రొఫెసర్ స్థానం నుంచి ఆచార్య స్థాయి వరకు ఎదిగినవాడు. వీరి తండ్రిగారు తెలంగాణలోనే కాదు తెలుగు సాహిత్య ప్రపంచంలోనే గొప్ప గుర్తింపు పొందిన అవధానిగారు. సగర్వంగా జీవించిన పండితకవి. బాలశ్రీనివాస మూర్తి తండ్రికి తగిన తనయుడుగా గుర్తింపు, రాణింపు పొందినవాడే. తండ్రిగారి గురించి మంచి పుస్తకం రాసినాడు.

బాలశ్రీనివాసమూర్తి సాహిత్య విమర్శ రచనలలో అందెవేసిన చేయిగా పేరు తెచ్చుకున్నాడు. తెలంగాణం, తెలుగు మాగాణం, వెలుతురు కొలను, తుషార సమీరం ఈతని విమర్శరీతికి అద్దం పట్టి చూపే గ్రంథాలు. సుప్రసిద్ధ విమర్శకుల ప్రశంసలు పొందినవి.

మలి ఉద్యమకాలంలో తెలంగాణ రచయితల పాత్ర విలక్షణమైనది. కేవలం రాజకీయ విశ్లేషకుల రచనలు, ఉద్యమపాటలే కాక వచన కవితలు, కథలు, నవలలు తగిన విధంగా ఉద్యమ పంథాను బలపరిచినాయి. ఈ క్రమంలో బాలశ్రీనివాసమూర్తి ఒక అత్యంత విలక్షణమైన, విశిష్టమైన, అపురూపమైన పుస్తకం రచించి వెలువరించాడు. అదే **'ఆత్మకథల్లో ఆనాటి తెలంగాణ'**. ఈ రచన కోసం ఈ రచయిత తీసుకున్న జాగ్రత్తలు ఒక రాజకీయ నిబద్ధతకు చెందిన పుస్తక రచన దృష్ట్యా అవసరమైనవి, ప్రశంసనీయమైనవి అని చదువరులు గుర్తిస్తారు.

తెలుగులో ఆధ్యాత్మిక అమృతవాహిని రచనలకు ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. ప్రత్యేకంగా వచన కావ్యాలు కూడా వెలువడ్డాయి. **'తెలుగులో ఆధ్యాత్మిక వచన కావ్యాలు'** అనే అంశంపై బాలశ్రీనివాసమూర్తి శ్రమించి రచించిన పరిశోధన గ్రంథం పండితుల అంచనాల్లో చెప్పుకోదగినదిగా పరిగణనలోకి వచ్చింది.

36 సంవత్సరాల వ్యవధికాలానికి చెందిన 1920-56 మధ్యకాలంలో తెలంగాణలో సాహిత్య సాంస్కృతిక చైతన్యం – పత్రికల పాత్ర గురించి శ్రీనివాసమూర్తి చేసిన పిహెచ్.డి. పరిశోధన కూడా సుమారు నాలుగు దశాబ్దాల తెలంగాణ సామాజిక చారిత్రక ఘట్టాల నేపథ్యంలో విస్మరించరానిదే.

జాతీయ స్వాతంత్ర్య సమర కాలంనాటి నుంచి దివంగతు లయ్యేంత వరకూ దేశంలో ప్రబలమైన రాజకీయ సేవా జీవితం గడిపిన మహానుభావులు తెలంగాణకు చెందిన మాన్యశ్రీ పి.వి. నరసింహారావు గారు. పి.వీ.గారి బహుముఖీనమైన విలక్షణ విశేషాలను తెలియజేస్తూ పి.వీ.గారి శతజయంతి సందర్భంగా మంచి మోనోగ్రాఫ్‌ను జీవితచరిత్ర గ్రంథంగా **'విలక్షణ పీవీ'** రచించాడు. ఇంకా నీల్‌కమల్ పుస్తక సంస్థ కోసం తెలంగాణ గురించి మూడు ప్రత్యేక సాహిత్య వ్యాస సంపుటాలకు సంపాదకత్వం వహించాడు. మరెందరో సాహిత్య వేత్తల గురించి వ్యాసాలు రాశాడు, రాయించాడు. ఇది ఆధునిక సాహిత్య తెలంగాణకు ఒక మంచి అకడమిక్ బుక్ నిర్మాణాత్మక కృషి.

చివరికి చెప్పున్నప్పటికీ బాలశ్రీనివాసమూర్తిలో నేను మొదట గుర్తించిన అంశం ఈతని వచన రచనాశైలి. చిన్న చిన్న వాక్యాలను క్రమపద్ధతిలో పేరుస్తాడు. మనసుకెక్కవలసిన అంశాలు మన మనసుకెక్కి పోతాయి. ఈయనది వేగంగా చదివించే శైలి అయ్యేతీరుకు ఆశ్చర్యపోవటం మనవంతు. అట్లని పలుచని వాక్యాలని అర్థం కాదు. తగిన మాటలు వరుసగా ముత్యాలవలె చిన్న చిన్న వాక్యాలలో క్రమపద్ధతిలో అర్థావగాహన కుదురుగా ఉండేటట్లు చూసుకున్నాడు. తన శైలి తనది అనిపించుకున్న వ్యాస రచయిత బాలశ్రీనివాసమూర్తి.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 7  UGC Care List Approved Journal
హైదరాబాద్ మే : 2023

# విలక్షణ వక్త – ఆచార్య గుమ్మన్నగారి బాల శ్రీనివాస మూర్తి

**ఆచార్య కరిమిండ్ల లావణ్య,** ఫోన్ : 98484 10244













2006 లో తెలంగాణ విశ్వవిద్యాలయం పుట్టిన మొదటిరోజు నుంచి చాక్‌పీస్ పట్టి పాఠాలు చెప్పిన తెలుగు అధ్యాపకుడు.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియామకం పొందిన డా. బాలశ్రీనివాస మూర్తి అసోసియేట్ ప్రొఫెసర్‌గా, ప్రొఫెసర్‌గా ప్రమోషన్ సాధించారు. తెలుగు అధ్యయనశాఖలో విభాగాధిపతిగా, పాఠ్య ప్రణాళిక సంఘ చైర్ పర్సన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. తెలంగాణ విశ్వవిద్యాలయా నికి సౌత్ క్యాంపస్ బిక్నూరు ప్రిన్సిపల్‌గా, ప్రజా సంబంధాల అధికారి (పీఆర్‌ఓ)గా, ఎన్.ఎస్.ఎస్.యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా, కాంపిటీటీవ్ సెల్ డైరెక్టర్‌గా, వివిధ కమిటీలకు సభ్యులుగా వివిధ పాలనాపరమైన పదవులు పొందారు.

మొదట వివిధ సాహిత్య పత్రికలకు జర్నలిస్టుగా, తర్వాత సర్దార్ పటేల్ డిగ్రీ, పీజీ కళాశాలలో అధ్యాపకుడిగా, కొంతకాలం డిప్యూటేషన్ మీద పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేశారు. తెలుగు అకాడమీ, తెలంగాణ సాహిత్య అకాడమీ, నీల్‌కమల్, విజేత కాంపిటీషన్స్ తదితర ప్రముఖ సంస్థలతో కూడి అనేక సాహిత్య పుస్తకాలకు సంపాదకులుగా వ్యవహరించారు.

**విలక్షణ పీవీ, ఆత్మ కథల్లో ఆనాటి తెలంగాణ, అభినవ పోతన వానమామలై వరదాచార్యులు, దేవులపల్లి రామానుజారావు, తెలంగాణం – తెలుగు మాగాణం, వెలుతురు కొలను, జీవన హిందోళం, మా ప్రసిద్ధిపేట, బ్రహ్మశ్రీ అవధానులు గుమ్మన్నగారి లక్ష్మీ నరసింహ శర్మ స్మృతీ పరిమళం, విజేత కాంపిటీషన్స్ సాహితీ సుధ, తెలంగాణ వైతాళికులలో కూడి ప్రతిభా మూర్తులు, సాహితీ మూర్తులు** వంటి పుస్తకాలను రచించారు.

జూనియర్ లెక్చరర్స్, డిగ్రీ లెక్చరర్స్, పీజీ, ఎం. ఫిల్., పిహెచ్.డి., గ్రూప్స్ ప్రిపేర్ పుస్తకాలు, వివిధ ప్రభుత్వ ఉద్యోగ పోటీ పరీక్షల కేంద్రాలకు రీసోర్స్ పర్సన్ గా వ్యవహరించారు. ఆత్మకథల్లో ఆనాటి తెలంగాణకు తెలుగు యూనివర్సిటి ఉత్తమ వచన రచనలో సాహితీ పురస్కారం స్వీకరించారు. సర్వ వైదిక సంస్థాన్ వారి పండిత పురస్కారం, జీవన హిందోళం పుస్తకానికి ప్రతిష్ఠాత్మకమైన గంధ్ర హన్మంతరావు పురస్కారానికి ఎంపిక అయ్యారు. ఇంకా అనేక సాహితీ పురస్కారాలను పొందారు.డా. బాల శ్రీనివాస మూర్తి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి పర్యవేక్షణలో **తెలంగాణ పత్రికలు సామాజిక సాంస్కృతిక చైతన్యం,** సెంట్రల్ యూనివర్సిటిలో ముదిగొండ వీరభద్రయ్య పర్యవేక్షణలో **తాత్విక కావ్యాలు శతాంకుర సాహిత్యం** మీద పరిశోధనలు చేశారు.

డా. జి. బాలశ్రీనివాస మూర్తి తమ పరిశోధక విద్యార్థులకు మంచి మార్గనిర్దేశం చేసేవారు. వారి పర్యవేక్షణలో ఐదుగురు పిహెచ్.డి. పూర్తి చేశారు. ఇంకా చాలా పరిశోధక విద్యార్థులు పిహెచ్.డి. పరిశోధన చేశారు.

తెలంగాణ విశ్వవిద్యాలయంలోని తెలుగు అధ్యయనశాఖ ప్రొఫెసర్ డా. బాలశ్రీనివాస మూర్తి 24.4.2023 ఉదయం గుండెపోటుతో మరణించారని తెలుపడానికి చింతిస్తున్నాము. ఇంతటి విషాద సంఘటనను మేము జీర్ణించుకోలేక పోతున్నాము. తెలుగు అధ్యయనశాఖ మంచి పరిశోధకులు, ఉత్తమ అధ్యాపకులు, గొప్ప సాహితీవేత్తను కోల్పోయింది. వారి మృతి పట్ల ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నాము. వారి ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులకు మనో స్థైర్యాన్ని, ధైర్యాన్ని కలిగించాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాం. వారికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సిద్దిపేట జిల్లా పోతిరెడ్డిపేటలో 1966,సెప్టెంబర్ 5న జన్మించారు. తెలంగాణలో ప్రముఖ అవధాని గుమ్మన్నగారి లక్ష్మీ నరసింహ శర్మ గారి కుమారులు వీరు. ఒక గొప్ప సాహితీవేత్తను తెలుగు ప్రజలు కోల్పోయారు.

# భారతీయీకరణ - 12

## ఆంగ్ల మూలం : బలరాజ్ మధోక్, అనువాదం : కోవెల సంపత్కుమార

బలరాజ్ మధోక్ దేశశాంతి సమైక్యతలను పరిరక్షించడానికి భారతీయ ప్రజల ఆలోచనలను భారతీయీకరించవలసిన అవసరాన్ని చెబుతూ ఇంగ్లీష్ లో వ్రాసిన Indianness కు అనువాదం ఈ భారతీయీకరణ. భారతీయీకరణ అంటే అన్ని రకాల దీపాసనా మార్గాలను స్థలాలను సమానంగా గౌరవించడం. ఒక వ్యక్తి తాను ఏ కుల, మత, భాషావర్గాలకు చెందినవాడైన వాటి ప్రయోజనాలన్నిటి కన్నా దేశ ప్రయోజనానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం ప్రధానమన్న అభిప్రాయాలు బలరాజ్ మధోక్ ఆలోచనల్లో కనిపిస్తాయి.

రాజకీయ వ్యవస్థలో జాతీయ భావన స్వరూపాన్ని, భారతీయీకరణ విషయంలో జరుగుతున్న చర్చలు, వ్రాసిన వ్యాసాలు, లేఖలు వాదోపవాదాలు ఈ గ్రంథ రచనకు బలరాజ్ మధోక్‌ను ప్రేరేపించాయి. భారతీయీకరణను గురించి ఒక జాతీయ భావన గల మేధావి ఆలోచనల ప్రతిబింబం భారతీయీకరణ. 1970లో వచ్చిన ఈ రచనను సంపత్కుమార తర్వాత కాలంలో సుమారు 80లకు ముందే అనువదించిందంటారు.

భారతదేశం భౌగోళిక స్వరూపం, జాతీయత - భారతీయత మధ్య గల తేడా, భారతీయీకరణ అంటే ఏమిటి? ఎందుకు? దానివల్ల ప్రయోజనమేమిటి? అది జరగవలసిన తీరు ఏమిటి? అన్న విషయాలను యథామూలంగా సంపత్కుమార అందించారు. అనువాదకుడిగానూ జాతీయభావనా చైతన్యం, దేశీయ ఆలోచనా విధానం వ్యక్తమయ్యే రచనను ఎన్నుకోవడం ఆయన దేశీయ నిబద్ధతను చెబుతుంది.




భారత ప్రభుత్వం గూడా, రష్యా లేక యుగోస్లోవియా అనుభవాల నుంచీ, కార్యక్రమాల నుంచీ, ముస్లింలనూ ఇంకా ఇతరులనూ తెగలవారినీ, భాషీయులనూ జాతీయ జీవన ప్రవాహంలో కలుపుకొనడానికీ, విలీనీకరించుకొనడానికీ అవసరమయిన గుణపాఠం ఎందుకు నేర్చుకొనగూడదు?

కొన్ని ఇస్లామీయ ప్రభుత్వాలు గల దేశాలలో గూడా అల్పసంఖ్యాక మతవర్గాల, ప్రజల సమస్య ఉన్నది. UAR, సుడాన్, సిరియాలలో ముస్లిమేతర వర్గాలు - ప్రధానంగా క్రైస్తవులు 15 శాతం ఉన్నారు. ఇస్లాం పుట్టుకకూ, ఈ దేశాల్లో దాని ప్రవేశానికి ముందు నుంచే శతాబ్దాల నాటి అతి ప్రాచీన, విశిష్ట చరిత్ర, సంస్కృతీ సంప్రదాయాలు వారికున్నాయి. భారతదేశం గుర్తించినట్లుగానే, తమకుతాముగా సామ్యవాద, లౌకిక రాజ్యాలుగా చెప్పుకొంటున్న ఈ ఇస్లామీయ దేశాలలో ఆ అల్పసంఖ్యాక వర్గాల వారి పరిస్థితి ఏమిటి? ఈ దేశాలలో ముస్లిమేతర అల్పసంఖ్యాక వర్గాల సమస్య అంటూ ఒకటి ఉన్నదని భారతదేశంలోని ఎవరైనాసరే, వినిఉన్నారా? ఆ వర్గాలవారు ఆయా దేశాల ప్రధాన జాతీయ జీవన ప్రవాహంలో విలీనీకరింపబడినారు లేదా ఆ దేశాలలోని వర్తమాన వాస్తవికతలతో తమకు తాముగా వారు రాజీపడినారు.

మలేషియా ఉదాహరణ మరింత కొట్టవచ్చినట్లుగా కన్పిస్తుంది. ఆ దేశం మొత్తం జనాభాలో మలయా ముస్లింలు కేవలం 48 శాతం మాత్రమే. మిగిలిన వారంతా మౌలికంగా భారతీయులయి హిందూ ధర్మ మార్గాన్ని అనుసరించే ప్రజలు, మరియు మౌలికంగా చైనీయులు - ప్రధానంగా బౌద్ధులు, క్రైస్తవులు. మలేషియా అధికారికంగా ఇస్లామీయదేశం, అయినా లౌకికరాజ్యం. మరి ఇక్కడ, అధిక సంఖ్యాకులయిన ముస్లిమేతరులు కొన్ని అర్హతలు కలిగించబడని కారణంగా బాధలు పడుతున్నారు. ఉదాహరణ : ఒక ముస్లిం యువతి గానీ యువకుడు గానీ ముస్లిమేతర యువకుని లేదా యువతిని వివాహమాడడానికి వీలులేదు. ఇట్లాంటి వివాహం జరుగవలెనంటే, ముస్లిమేతరులు ఇస్లాం మతాన్ని స్వీకరించవలసిన ఉంటుంది. లేకపోతే ఆ వివాహం రద్ద వుతుంది. ఇస్లాం మత సూత్రాలకనుగుణ మయింది. కానీ ఇది ముస్లిమేతర మలేషియనుల ఈ విషయంలో ఒక విధమయిన ఇబ్బంది. నేనీ మధ్య మలేషియాలో పర్యటించి నప్పుడు కౌలాలంపూరులో ఆ దేశపు ఉపప్రధాని- నిజానికి అసలు పాలకుడు - టున్ అబ్దుల్ రజాక్ తో ఈ విషయం ప్రస్తావించినాను. దానికి **"ఎవరు మాత్రం ఎందుకు బాధపడాలి?"** అంటూ ఆయన ఎగతాళిగా ఇలా అన్నాడు - మాది మత ప్రసక్తి రహిత లౌకిక రాజ్యవిధానం అంటే, మేము అన్ని రకాల ఉపాసనా మార్గాలను గౌరవిస్తామనే తప్ప, మలేషియా జాతీయ జీవనంలో ముఖ్య పాత్ర వహించే మలేషియా ముస్లింలకు ప్రత్యేక సౌకర్యాలుండవని

మాత్రంగాదు. భారత ప్రభుత్వం మలేషియా అనుసరించే లౌకికరాజ్య విధాన లక్షణాలను జాగ్రత్తగా కనీసం పరిశీలించవలెననయినా అనుగొనడం లేదంటే, నాకెంతో ఆశ్చర్యంగా ఉన్నది.

పాకిస్తాన్‌కు సంబంధించినంతవరకు ఎంత తక్కువగా చెప్పుకుంటే అంత మంచిది. ముస్లిమేతర – అంటే, హిందూ, బౌద్ధ, క్రైస్తవ – జనాభా పాకిస్తాన్ జనాభాలో ఇప్పటికి 10 శాతం ఉన్నది. నిజానికి 1947లో పాకిస్తాన్ ఏర్పడినప్పుడూ ఈ ముస్లిమేతర జనాభా దాదాపు 25 శాతం కన్నా ఎక్కువే ఉండేది. కాని గడిచిన ఈ 22 సంవత్సరాలలో దాదాపు 20 మిలియన్ల ముస్లిమేతరులు వధింప బడినారు లేదా మతం మార్చబడినారు లేదా ఇళ్ళ నుంచీ, వాకిళ్ళ నుంచీ, దేశం నుంచీ తరిమివేయబడినారు. ఈ సంవత్సరాలలో పాకిస్తాన్‌లో జరుగుతున్న ఈ జాతి విధ్వంసకాండకు ప్రపంచ చరిత్రలో ఎక్కడ గూడా పోల్చదగిన సంఘటనే కనిపించదు.

ఇప్పటికీ ఇంకా మిగిలి ఉన్న 10 శాతం – అంటే, దాదాపు భారతదేశ జనాభాలో ముస్లిం జనాభాతో సమాన శాతం – మూడవ తరగతి పౌరులుగా చూడబడుతున్నది. దేశ విధానసభలోగాని, న్యాయవ్యవస్థలో గానీ, రాయబార వర్గాలలోగానీ వీరి ప్రతినిధి ఒక్కడు గూడా లేడు. అతి ప్రాథమికమయిన హక్కులు గూడా వారికి నిరాకరించబడినయి. భారతదేశంలో ఉండి ఉభయ ప్రపంచ సౌఖ్యాలను పొందుతున్నవారు ఈ విషయంలో పాకిస్తాన్‌ను నిరసిస్తూ ఈనాటి దాకా ఒక్కమాట కూడా అనలేదు.

ఏ నిజమయిన భారతీయుడుగానీ, భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను ఏమాత్రం అర్థం చేసుకున్నా, భారత ప్రభుత్వం పాకిస్తాన్‌ను ఆదర్శంగా తీసుకోవలెనని ఏ మాత్రం అనుకోడు. కాని, ఒక వైపు USA నుంచీ, అట్లాగే మరోవైపు, భారతదేశం కూడా అంగీకరించినట్లు, తమకు తాము సామ్యవాద, ప్రగతివాద, మతప్రసక్తి రహిత లౌకిక రాజ్య విధానాలను అనుసరిస్తున్నామని చెప్పుకునే USSR, UAR, యుగోస్లావియాల నుంచి కనీసం కొంతయినా ఈ విషయంలో భారత ప్రభుత్వం నేర్చుకోవలసి ఉన్నది. వారి అనుభవాలూ, ఉదాహరణలూ ఈ క్రింది మార్గాల్లో రాజకీయ ప్రవృత్తిని సూచిస్తాయి.

**ప్రాంతీయతాతత్వం :** ప్రాంతీయతాతత్వం, భాషా దురభిమానం భారతీయ సమైక్యతకు ఈ సమయంలో ప్రమాదకరమైన వాటిలో ప్రధానమయినవి. ప్రాంతీయ పక్షాలు విరివిగా ఉద్భవించి అభివృద్ధి పొందుతున్నయి. వీటిలో కొన్ని తమ తమ రాష్ట్రాలలో అధికారం లోనూ ఉన్నయి. ఈ స్థితిలో ప్రతి భాషా రాష్ట్రమూ ఒక ప్రత్యేక దేశమే అనే కమ్యూనిస్టుల సిద్ధాంతాన్ని బలపరిచే క్రొత్త క్రొత్త వ్యక్తులు ఈ ప్రాంతీయ పక్షాల నుంచి ముందుకు వస్తున్నారు. భారతీయ భావనను బలిపెట్టి ప్రాంతీయతాతత్వాన్నీ, భావననూ తీవ్రతరం చేయడం వారికి లాభకరమయిన విషయం. ఆయా ప్రాంతాల్లో – రాష్ట్రాల్లో– నివసించే ప్రజలు– అన్ని అల్పసంఖ్యాక వర్గాలతో సహా– ఉత్తమ భారతీయులు కావడానికి బదులుగా, ఉత్తమ మహారాష్ట్రులుగా, ఉత్తమ తమిళులుగా, ఉత్తమ గుజరాతీయులుగా తయారుకావలెనని వారు వాంఛిస్తున్నారు. శ్రీ రషీద్ బేగ్ చెప్పినట్టుగా – **“ భారతదేశమనే ఉద్యానవనంలోని ప్రతి పూల మడికీ ఒక్కొక్క మాలి ఉన్నాడు. అతనికి మొత్తం తోట మీదకన్నా, తన మడి మీదనే ఆసక్తి అధికం.”**

ఒక ప్రాంతంలోనే వేర్వేరు భాగాల ప్రజల ఆర్థికాభివృద్ధిలోని అసమానతలు కారణంగానో లేక అదే భాషా ప్రాంతంలోని అభివృద్ధి పొందిన భాగాల ప్రజల దురధికార ప్రవృత్తి కారణంగానో ఉపరాష్ట్ర తత్వం ఉద్భవిస్తున్నది. ఇది ప్రాంతీయతాతత్వ సమస్యను మరింత తీవ్రం చేస్తున్నది. ప్రత్యేక తెలంగాణ, ప్రత్యేక విదర్భ వంటి ఉద్యమాలొకవైపు మరింత విచ్ఛిన్నతను సూచిస్తూ, మరోవైపు భాషా రాష్ట్ర సిద్ధాంతంలోని లోపాలను బయటపెడుతున్నయి.

దేశంలోని దేశాభిమానంగల వారందరూ ఈ భాషా రాష్ట్ర వ్యవస్థతో విసిగిపోయినారు. వారి భ్రాంతి విచ్చుకొని పోయింది. అందుకని, వారు ఈ భాషా రాష్ట్రాలన్నింటినీ రద్దుచేసి, పరిపాలన, ఆర్థిక విషయాలు ప్రాతిపదికగా మొత్తం దేశాన్ని పెద్ద పెద్ద రాష్ట్రాలు గానో, జోన్సుగానో పునర్ వ్యవస్థీకరించవలెనని వాదిస్తున్నారు.

కానీ దేశంలో మరి కొందరున్నారు. వారిలో దేశాభిమానం పై వారికన్నా ఏమాత్రం తక్కువ కాదు. పైగా వీరికి వాస్తవిక దృక్పథం ఉన్నది. ప్రస్తుత భాషా రాష్ట్రాలను రద్దు చేయడంగానీ వాటి స్థానంలో జోన్సు ఏర్పాటు చేయడం కానీ ప్రస్తుత పరిస్థితులలో ఆలోచనకు కూడా వీలుకానిదని వారు గుర్తించినారు, పైగా ప్రస్తుతం దినదినం పెరుగుతున్న ఉపరాష్ట్రతత్వమూ పెద్ద పెద్ద రాష్ట్రాల వెనుకబడిన తీరూ రాష్ట్రాలను మరింత పెంచడం కన్నా, చిన్న పరిమాణానికి తగ్గించవలెననే అంశాన్ని సూచిస్తున్నాయి. క్రొత్తగా నాగరాష్ట్రాన్నీ, మేఘాలయ రాష్ట్రాన్నీ ఏర్పరచడం, భాషా రాష్ట్ర సిద్ధాంతాన్ని అనుసరించి మహారాష్ట్ర, తమిళనాడులలో కలపవలసి ఉండగా గోవా, పాండిచ్చేరీలను ఇంకా కేంద్రపాలిత ప్రాంతాలుగానే ఉంచడం మొదలయిన అంశాలు ఈ ఆలోచన పద్ధతిలోని సామంజస్యాన్ని మరింత ధ్రువపరుస్తున్నాయి. ఆర్థికాభివృద్ధి రంగంలో పంజాబ్, హర్యానాలవల్ల కలిగిన అనుభవం కూడా చిన్న రాష్ట్రాల సిద్ధాంతాన్ని బలపరుస్తున్నది. ఈ కారణాల వల్ల, ప్రస్తుత పరిస్థితులను బట్టి చిన్న చిన్న రాష్ట్రాలు ఉపయోగకరమన్న భావన సాధారణంగా అంగీకృతమయింది. చిన్న రాష్ట్రాలు దేశపు ఆర్థికాభ్యున్నతి త్వరితంగా జరగడానికి దోహదం చేస్తాయి. అంతే కాదు, ప్రజాస్వామ్యం యొక్క వేళ్లను మరింత బలిష్టం చేస్తాయి. ఎందుకంటే, చిన్నచిన్న నియోజకవర్గాలు ఏర్పడడం వల్ల ఓటర్లకూ, వారి ప్రజాస్వామిక ప్రతినిధులకూ మధ్య ప్రత్యక్ష సంబంధం పెరుగుతుంది. వీటన్నింటిని మించి చిన్న రాష్ట్రాల వల్ల కేంద్రం పటిష్టమవుతుంది. ఎందుకంటే,

ఇవి కేంద్రం మీద అధికంగా ఆధారపడి ఉంటాయి. అంతేగాక కేంద్రాన్ని సవాలు చేసే శక్తి వీటికి లోపిస్తుంది.

20 కోట్ల జనాభా గల USAలో 50 రాష్ట్రాలున్నప్పుడు, భారతదేశంలో మాత్రం అధిక సంఖ్యలో రాష్ట్రాలు ఎందుకుండ గూడదు? అని వీరు వాదిస్తున్నారు. నిజానికి మధ్యప్రదేశ్ వంటి భారతదేశంలోని కొన్ని రాష్ట్రాలు పాలనా నిర్వహణ సౌలభ్యానికి అసాధ్యంగా ఉన్నాయి. ఈ అంశం కూడా చిన్న రాష్ట్రాల ప్రతిపాదనకు బలకరమయింది.

అందువల్ల, ప్రస్తుత నాయకత్వం ఈ విషయంలో గట్టి నిర్ణయం తీసుకొవలసి ఉన్నది. క్రొత్తగా మరొక రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ సంఘం ఏర్పాటు కావలసి ఉన్నది. పరిపాలనా సౌలభ్యం, చారిత్రక పృష్ఠభూమి, సాంఘిక సజాతీయత, భాషా సమానత, ఆర్థిక స్థోమతలు ప్రాతిపదికగా దేశాన్ని ఆ సంఘం పునర్ వ్యవస్థీకరించవలసి ఉన్నది.

ఇది కనుక జరిగితే, తెలంగాణ, మధుర, విదర్భ, ఛాటిస్ ఘర్, సౌరాష్ట్ర, జోద్ వంటి పలు చిన్న రాష్ట్రాలు ప్రస్తుతం ఉన్న ఆంధ్ర ప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల నుండి ఏర్పడతాయి.

ఒకే భాష మాట్లాడేవారికి ఒకటి కన్నా ఎక్కువ రాష్ట్రాలు ఏర్పడితే, అవి భాషాదురభిమానాన్ని తగ్గించడమే కాకుండా, పెరిగిపోతున్న ప్రాంతీయతాతత్వాన్ని గూడా నిరోధిస్తాయి. ఇది- ఈ ఏర్పాటు- భాషా రాష్ట్ర సిద్ధాంతానికి విరుద్ధం కాదు కూడా. హిందీ మాట్లాడే వారి రాష్ట్రాలు పది ఉన్నప్పుడు, మరాఠీ, తెలుగు, తమిళం మాట్లాడే వారి రాష్ట్రాలు ఒకటికన్నా ఎక్కువ ఉండగూడదనడానికి కారణం కనిపించదు. అయితే, ఇది ప్రస్తుత విధానం నుంచి విడిపోవడం కావచ్చు. ప్రస్తుత రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నవారు దీన్ని వ్యతిరేకించ వచ్చు. కానీ, విపరీతంగా పెరుగుతున్న ప్రాంతీయతాతత్వాన్ని నిరోధించడానికి మాత్రమే కాకుండా, దేశంలో సమస్థాయికంగా ఆర్థికాభ్యున్నతి త్వరితగతిలో సాగడానికి కూడా ఈ ఏర్పాటు అత్యవసరం. ఇంతే కాకుండా, ఈ విధమయిన పునర్ వ్యవస్థీకరణ, దేశంలోని వెనుకటి సాంప్రదాయిక విభాగాలతో సరిపోవడం మూలాన ప్రజలకు గూడా ఇతోధికంగా తృప్తి కలుగుతుంది.

ఈ పునర్ వ్యవస్థీకరణతోబాటు, విభిన్న రాష్ట్రాల మధ్య వ్యవహారా లను నిర్వహించడానికీ, దేశంలోని వివిధ ప్రాంతాల మేధావుల భావవినిమయానికీ తగిన విధంగా ఒక భారతీయ భాషను అభివృద్ధి చేసి, అన్ని భాషలకూ సమానంగా ఒక ప్రత్యామ్నాయ లిపిని అనుసరించడానికి గట్టి కృషి చేయవలసి ఉంటుంది. ఈ విషయంలో హిందీ లేదా ''భారతీ'' భాష మరియు దేవనాగరీ లిపి ఎన్నుకోదగినవని అందరికీ తెలిసిందే. కొన్ని రాష్ట్రాలలో హిందీని గూర్చి రాజకీయ వ్యతిరేకత పెరిగిపోయింది. ఇట్లాంటి రాష్ట్రాలలో నెమ్మదిగా ఆ వ్యతిరేకతను తొలగించి హిందీని ప్రవేశపెట్ట వలసిందే తప్ప, ఏవిధంగానూ బలవంతంగా నెత్తిన రుద్దే ప్రయత్నం చేయగూడదు. హిందీని ప్రవేశపెట్టడాన్ని దేశ విచ్ఛిన్నతకు ఆయుధంగా కొందరుపయోగించడం దురదృష్టకరం. ఆంగ్లభాషా ప్రాధాన్యంలోనే ప్రయోజనాలను పెంచుకున్న ఈ వర్గాల వారిలో హిందీ నేర్చుకునే ప్రేరణలను సరియయిన విధానాల ద్వారా కలగించవలసి ఉంటుంది. తూర్పు, దక్షిణ ప్రాంతాల వారితో సహా దేశంలోని ప్రజా సామాన్యం దృష్టితో చూస్తే హిందీని స్వీకరించడం జరుగుతూనే ఉన్నది. దేశంలోని కొన్ని భాగాల్లో హిందీ, మరికొన్ని ఇతర భారతీయ భాషల పట్ల ఉన్నట్లుగా చెప్పబడుతున్న వ్యతిరేకత రాజకీయమయిందే తప్ప మరొక విధమయింది కాదు. అందుకని ఏ ఆర్భాటం లేకుండా ఆ భాషలను ప్రవేశపెట్టడమే దానికి చికిత్స.

ఈ విషయంలో ఇండోనేషియాను, USSRనూ ఆదర్శంగా స్వీకరించవచ్చు. అక్కడ వివిధ భాషలున్నా గూడా జాతీయ భాష, జాతీయ లిపి స్వీకరింపబడినయి. మనదేశంలో బలిష్ఠమయిన జాతీయ భావన యొక్క పెరుగుదల కూడా, హిందీ, తదితర భారతీయ భాషలను గూర్చి ప్రస్తుతం ఉన్న ఔదాసన్యాన్నీ, వ్యతిరేకతనూ తొలగించడంలో తోడ్పడగలుగుతుంది. జాతీయ భాష అంటూ లేకపోతే భారతీయ సమైక్యత అనేది అవాస్తవికంగానే మిగిలిపోతుంది. కేంద్ర ప్రభుత్వోద్యోగాల విషయంలోనూ, ఉన్నత న్యాయస్థానాలలో న్యాయ పతులను నియమించడంలోనూ ప్రాంతాన్ని కాకుండా దేశం మొత్తాన్ని ప్రాతిపదికగా గ్రహించి, రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ సంఘం చేసిన సిఫారసులను గట్టిగా అమలుపరచడం, అంతర్ ప్రాంతీయ వినోద పర్యటనలను ప్రోత్సహించడం, వివిధ వృత్తులవారిని తరచుగా వివిధ రాష్ట్రాలకు బదిలీలు చేయడం మొదలయిన అంశాలపై అధిక శ్రద్ధ చూపడం ద్వారా కూడా, ప్రాంతీయతాతత్వాన్ని బలహీనపరచి, ప్రజలలో అఖిల భారతీయ దృక్పథాన్ని పెంచవచ్చు.

**కులతత్వం :** కులతత్వం ప్రాథమికంగా ఒక సాంఘిక సమస్య. ఈనాడు భారతదేశంలో దాని స్వరూపాన్నీ, అది నిర్వహించే పాత్రను బట్టి చూస్తే, ప్రస్తుతం అది రాజకీయ సమస్యగా మారింది. కులతత్వం లోని ఒక అంశమయిన అస్పృశ్యత, మహర్షి దయానందుడు, గాంధీ మహాత్ముడు మొదలయిన సంస్కర్తల, రాజకీయ నాయకుల తీవ్ర ప్రయత్నాలవల్ల తెరమరుగవుతున్నది. పారిశ్రామికీకరణ వంటి ఆర్థికశక్తుల వల్ల, పల్లె ప్రజలు పట్టణాలకు తరలివస్తూ ఉండడం వల్ల, పనులలో విపరీతమయిన పెరుగుదలవల్ల, శ్రామిక వర్గాల స్థలాల మార్పిడివల్ల, సాంఘిక చైతన్యంలో వచ్చిన మెరుగుదలవల్ల అస్పృశ్యత అనేది ఈనాడు, ఈ 20 శతాబ్దపు తొలి దశాబ్దాలలో ఉన్నట్లుగా, కాకుండా తొలగిపోయింది. ఈనాడు దేశంలో అస్పృశ్యత పాటించే వారి సంఖ్య అతి స్వల్పం.

ఈనాడు దేశ సమైక్యతకు వచ్చిన ప్రమాదమల్లా కుల వ్యవస్థ రాజకీయాకరింపడమే. ఒక కులంలో పుట్టుక కారణంగా కొన్ని

కులాలు "ప్రత్యేకత"లు, ఇతర లాభాలు అనుభవించడానికి వీలుకలగడం మూలంగా, తమ కులం యొక్క "వెనుకబడిన" తనాన్ని పోనీయకుండా స్థిరంగా ఉంచుకోవలెననే ఆసక్తి ఆయా కులాల వారిలో పెరిగిపోయింది. రాజకీయకరింపబడిన ఈ కుల వ్యవస్థ యొక్క విచ్ఛేదకతా ప్రభావం, కేవలం రాజకీయ ప్రవృత్తి ద్వారా మాత్రమే నివారించడానికి వీలవుతుంది. నిజానికి, సాంఘికంగా, ఆర్థికంగా, విద్యావిషయంగా వెనుకబడినతనం పూర్తిగా నశించి, అట్లా వెనుకబడి ఉన్న వారికి ప్రత్యేక సదుపాయాలు కలిగించడం ద్వారా వారిని సమాజంలోని ఇతరవర్గాల వారితో సమానస్థాయికి తీసుకు రావడమన్నది నిశ్చితమయిన లక్ష్యం. అయితే, పుట్టుకను బట్టి వెనుకబడినతనాన్ని నిర్ణయించడం మాత్రం, ఆ వెనుకబడిన తనాన్ని సుస్థిరం చేయడమే అవుతుంది. కేవలం, రాజకీయంగా ఈ అంశంలో ఒక గట్టి నిర్ణయాన్ని తీసుకొనడం మాత్రమే పరిస్థితిలో మార్పు తేకలుగుతుంది.

కులం ప్రాతిపదికగా "ప్రత్యేకింపులు" కల్పించడం, ఆ కులాలవారిపై అవినీతికర ప్రభావాన్ని కలిగిస్తున్నదని కీ.శే.డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌కు సుస్పష్టంగా తెలుసు. అందుకనే, షెడ్యూల్డ్ కులాల ప్రత్యేక స్థానాలను రద్దు చేయవలెనని ఆయన స్థాపించిన రిపబ్లికన్ పార్టీ కోరింది. అయితే, ఆయన చూపిన ఈ సాహసాన్ని అనుసరించడానికి బదులుగా, క్రొత్త కులాలకూ, వర్గాలకూ– చివరకు ఈ కులాలనుంచి ఇతర మతాలకు మారినవారికి గూడా ఈ ప్రత్యేకింపులు విస్తరించబడినయి.


## 'కదంబం'

**(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)**

**మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం**

**ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు**

(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే

ఉత్తమ గ్రంథం **'కదంబం'.**

**440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/-**


ఎన్నికలలో ఈ కులతత్వం, మిగిలిన అన్నింటికన్నా, విచ్ఛిన్నతకు సాధారణమయిపోయింది. అందువల్ల కులం ప్రాతిపదికగా ప్రత్యేక స్థానాలను రద్దు చేయడంతోబాటు, దేశపు రాజకీయ జీవితం నుంచి కులతత్వాధారమైన నిషేధాలను తొలగించడానికి ఎన్నికల నిబంధనా సూత్రాలలో తర్కసహమయిన మార్పులు తీసుకురావలసి ఉన్నది. ఇట్లా ఒకసారి జరిగితే, విచ్ఛిన్నతకు కులతత్వం దారితీస్తుందనే సమస్య దానంతట అదే మాసిపోతుంది.

ఇదే సందర్భంలో మరొకటి, ప్రభుత్వరంగంలో కులాన్ని గుర్తించే పద్ధతిని ఆపివేయవలసి ఉంటుంది. జనాభా లెక్కల చిట్టాలలో, అభ్యర్థి పత్రాలలో, ఇట్లాంటి ఇంకా ఇతర పత్రాలలో కులాన్ని నమోదు చేయడాన్ని ఆపడం ద్వారా ఇది సులభంగా సాధ్యమవుతుంది.

ఈ విధంగా ఈ సమస్యను రాజకీయీకరణ నుండి తప్పిస్తూ, దీనితోబాటు, ఈ పనికి సంఘసంస్కర్తల, సాంఘిక సాంస్కృతిక సంస్థల ప్రయత్నాలను, సహకారాన్ని గూడా పొందవలసి ఉంటుంది. సాంఘిక సమస్యలు కేవలం రాజకీయాల ద్వారా పరిష్కరింపబడవు. రాజకీయ ప్రవృత్తికి కూడా, సమాజాన్ని, సాంఘిక విద్యారంగాలలో గాఢమయిన ప్రయత్నాల ద్వారానే సంసిద్ధం చేయవలసి ఉంటుంది. కులరహిత సమాజనిర్మాణం పేరిట రాజకీయాలు, రాజకీయ నాయకులూ కులవ్యవస్థను దుర్వినియోగపరచడం మొదలయినప్పటి నుంచి సంఘసంస్కర్తలు రంగంలో నుంచి త్రోసివేయబడినారు. ఈ పరిస్థితి సమూలంగా మారిపోవలసి ఉన్నది. ఆర్యసమాజం, రాష్ట్రీయ స్వయంసేవక సంఘం వంటి సంస్థలు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో రాజకీయాలతో సంపర్కం పెట్టుకోనడానికి బదులు, సామాజిక సంస్కరణల విషయంలో అధిక శ్రద్ధ చూపవలసి ఉంటుంది. భారతీయ సమాజంలోని అసమానతల నిర్మూలనకు రాజకీయేతర రంగాలలో శక్తిని కేంద్రీకరించడం ద్వారా, ఈ సంస్థలు రాజకీయాలను గూడా ఎంతో ప్రభావితం చేయగలవు.

**మతవర్గతత్వం :** మత వర్గతత్వమంటే, జాతీయ వర్గాలనూ, ఇతర మతవర్గ ప్రయోజనాలనూ, బలి చేసి, ఒకానొక మతవర్గం యొక్క ప్రత్యేక ప్రయోజనాలకు ప్రాధాన్యమివ్వడం మరియు రాజకీయాలలోనూ, ఇతర విషయాలలోనూ ప్రత్యేక హక్కులను మతం పేరిట కోరడం, ఈ విధమయిన స్థితి ఇటీవలి కాలంలోనే ఏర్పడింది తప్ప, పూర్వం నుంచి లేదు. ఇదివరకే వివరించిన ఈ విధంగా మతాన్ని గూర్చి పాశ్చాత్యుల ఆలోచనా విధానం భారతీయ విధానానికి పూర్తిగా విజాతీయమయినది. ఎవరో ఒక ప్రవక్తకో, ఏదో ఒక గ్రంథానికో, వాదాసహమయిన సిద్ధాంతానికో కట్టుబడదాన్ని మించి మతంలో ఏదో ఒకటి ఉన్నది. (సశేషం)

గ్రంథాంతరంగం
24

# బాలభాష

శ్రీ ఘట్టమరాజు, బెంగుళూరు, ఫోన్ : 9964082076

**"భాషాసస్యపు పంటలలో ఇదివఱకు సేకరము గాక గాలికి కొట్టుకుపోతూ వుండే చెదురుదు, రాలుదు పరిగ గింజలను బిచ్చగాడనై ఊళ్లునాళ్లు తిరుగుతూ ముప్పైఏళ్ల ముందు నుండీ – ఎక్కడ పడితే అక్కడల్లా యేరుకు తెచ్చుకొంటూ ఉంటున్నాను."**

ఈమాటలు ఎవరి వనుకుంటున్నారు? వినయమోహనులైన వేటూరి ప్రభాకరశాస్త్రి గారు 1939–40 లమధ్య రాసిన 'గాలి కబుర్లు' లోనివి. (పేజి: 292. ప్రభాకర స్మారిక– 4, 1990) అంటే ఈ అనాదృత వాఙ్మయ భిక్షువు సుమారు 1910 నాటి నుంచే పల్లెపాటలు, కథాగేయాలు, సామెతలు, పొడుపు కథలు, నుడికారాలు వగైరా జానపద సంపదను తవ్వి తెలుగు ప్రజల తలలకెత్తుతున్నా రన్నమాట!

తెలుగు జానపద గేయ సాహిత్యంలో ఒక శాఖ అయిన పిల్లల పాటల్ని సేకరించి ప్రకటించిన మహనీయులు, వాటిని ఇంగ్లీషులోకి అనువదించి, వివరిస్తూ వ్యాసాలు రాసిన విద్వాంసులు మనకు ఇరవయ్యవ శతాబ్ద పూర్వార్ధంలో కొంతమందైనా కనపడతారు. వీళ్లల్లో ఎం.ఎన్. వెంకటస్వామి ప్రథమగణ్యులు. వేటూరి ప్రభాకరశాస్త్రి గారు ఎన్నో పిల్లల పాటల్ని సేకరించి 'భారతి' మాసపత్రికలో (1930) ప్రచురించారు. టేకుమళ్ల కామేశ్వరరావు గారు 1940 లో వెలువరించిన "పాతపాటలు" చిన్నపొత్తంలో కొన్ని విలువైన పిల్లల పాటలున్నాయి. కాలక్రమంలో జానపద బాలగీతాల్ని సేకరించి, వ్యాఖ్యానించిన పండితులు ఎంతోమంది వర్ధిల్లారు.

జానపద బాలగీతాల్ని సేకరించడంతో పాటు వాటి విమర్శకు భద్రమైన పునాది వేసిన ప్రాతఃస్మరణీయులు బ్రహ్మశ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిగారు. పుణ్యశ్లోకులైన ప్రభాకరులు 'భారతి' (1930)లో ప్రచురించిన పిల్లల పాటలు 1956లో మద్రాసులోని 'ఆర్యశ్రీ ప్రచురణాలయం' **'బాలభాష'** అనే పేరుతో ముద్రించింది. ఈ గేయ సంకలనంలో 49 పాటలు బొమ్మలతో పిల్లల పాటలు కనపడతాయి. కొన్నేళ్ల తర్వాత హైద్రాబాద్ లోని బి.పి. యమ్.డి. సంస్థ అదనంగా చేర్చబడ్డ ఐదు గీతాలతో చూడముచ్చటగా వెలువరించింది. పిమ్మట ఆంధ్రప్రదేశ్ బాలల అకాడమీ దీన్ని ప్రచురించింది. 'బాలభాష' తొలి ముద్రణ పీఠిక **'ముగ్ధమనోహర వాఙ్మయము'** సుమారు 1924లో పాకాల వేంకట రాజమన్నారు సంపాదకత్వంలో మద్రాసు నుంచి వెలువడ్డ 'కళ' పత్రికలో ప్రచురితమైన విశిష్టవ్యాసం.

'బాలభాష' లోని పాటలు సుమారు 1900 నాటి నుంచీ వ్యవహారంలో వున్నవే. ఈ పాటలు మరొక 50 యేళ్ళ వెనకటివి అన్న తప్పుకాదు.

'బాలభాష' (మొదటి ముద్రణ,1956) 78 వ పేజీలోని జోలపాట **'శ్రీరమ్యదేహలాలీ! మా ముద్దు చిన్నారి కూన లాలీ'** మాత్రం వేటూరి వారి కలం నుండి వెలువడ్డదే! మిగతా పాటలన్నీ సేకరణలే.

**'ముక్కు గొప్పదైతేను మోమునకు సింగార'** మంటారు తాళ్లపాక అన్నమయ్య. 'బాలభాష'కు 'ముగ్ధమనోహర వాఙ్మయము' అన్న పీఠిక వెలయించి వేటూరివారు ఈ పుస్తక సౌందర్యాన్ని, వైశిష్ట్యాన్ని ఇబ్బడి ముబ్బడి చేశారు. ప్రభాకరుల వారు పీఠికలో ఏమన్నారంటే– **"విచ్చలవిడిగా జీబుకొని వెలయుచున్న యాంధ్ర భాషారణ్యము నుండి కవితో ద్యానమునకు గొని తేవలసిన హృద్యవచోవల్లరు లింక నెన్నో యున్నవి. చవులొలుకునవి, పలుకుబళ్లు, పాటలు, పదాలు, కథలు, గాథలు, సామెతలు ఇత్యాదులు పెక్కులు అపరిశోధితములై, యముద్రితములై లోకము వాకులందే పుట్టుచు గిట్టుచున్నవి.**



ఘట్టమరాజు అశ్వత్థ నారాయణ

**అట్టి వానిని బరిశోధించుటలోను, సేకరించుట లోను నాకు గోర్కి కొండంత."** (బాలభాష, పేజి:9) వేటూరి వారు కొండంత జానపద సామగ్రి సేకరించినా ముద్రణ భాగ్యం పొందింది మాత్రం గోరంతే. ఆ మహానుభావుడు శ్రమించి సేకరించిన ఈ సాహిత్య సంపద తిరుపతి తిరుమల దేవస్థానం వారు తిరుపతిలో స్థాపించిన వేటూరి ప్రభాకర శాస్త్రి సాహిత్య పీఠంలో దిక్కూదివాణం లేకుండా మగ్గిపోతుండటం మాత్రం విచారకరం.

"ముగ్ధ మధుర వాఙ్మయము' సుమారు నూరేళ్ల క్రితం సుశ్లోకులు శాస్త్రిగారు రాసిన వ్యాసం. నేటి తెలుగు జానపద విద్వాంసులు – ముఖ్యంగా జానపద పిల్లల పాటల గురించి పరిశోధించే వాళ్లు కూడా నేర్చుకోవలసిన పాఠాలు ఈ పీఠికావ్యాసంలో స్పష్టంగా కనబడతాయి. సునిశితమతి వేటూరి వారు తమ పీఠికలో బాలభాష గురించి లోతుగా ఆలోచించి కొన్ని ముఖ్య విషయాల్ని ప్రస్తావించారు. సరళాక్షర సౌష్ఠవము, సంగీతచ్ఛాయ, యతిప్రాస సంగతి, వాక్యార్థ సంగతి పిల్లల పాటల్లో ఉండ వలసిన లక్షణాలన్నారాయన. (బాలభాష. పేజి: 10) **'సరళాక్షర సౌష్ఠవము'** అంటే వినడానికి ఇంపుగా చదవడానికి

సొంపుగా ఎలాంటి కష్టమూ లేకుండా వుండే మాటల పొందిక, కూర్పు ఈ లక్షణానికి ఈ కింది పాట ఉదాహరణం :

**చప్పట్లు**
**చప్పట్లోయి, తాళాలోయి**
**దేవుడి గుళ్లో మేళాలోయ్!**
**పప్పూబెల్లం దేవుడికోయ్,**
**పాలూనెయ్యీ పాపాయికోయ్!** (పేజి: 45)

పిల్లల పాటలు పాడుకొనేందుకు అనుకూలంగా వుండాలి. వింటున్నప్పుడే పాట గుండెకు హత్తుకుపోవాలి. కొన్ని పాటలు శిశువులకు అర్థంకావు. అసలు ఆ పసికందులు తల్లినోటి నుంచి పాటలు వెలువడగానే చెవులురిక్కించి కేరింతలు కొట్టాలంటే శబ్ద మాధుర్యమే శరణం. పాటలో యతి, ప్రాసల సామంజస్యం చేకూరితేనే వాటికి పిల్లలు ఆకర్షింపబడుతారు. యతి, ప్రాసల పొందికకు ఈ పాట చక్కని తార్కాణం– వినండి మరి–

**ఉగ్గు**
**"ఊఉ ఊఉ ఉంగన్న,**
**ఉగ్గుపాలు ఇందన్న,**
**గుంటెడు ఉగ్గు కమ్మన్న,**
**ఉమ్మక కక్కక మింగన్న"** (పేజి: 20)

ప్రభాకరుల వారు పేర్కొన్న మరో లక్షణం వాక్యార్థముల సంగతి. కొన్ని పిల్లల పాటలు పొడుగ్గా వుంటాయి. పదాలు సులభంగా అర్థమవుతూ, మాటలు అవిరేణి కుండల్లాగా దొంతరలు దొంతరలగా పేర్చబడి వుంటాయి. ఒక వాక్యానికీ మరొక వాక్యానికీ సంబంధం వుండాలి. అర్థం పొందికగా అమరి వుండి వాక్యం మును ముందుకు సాగుతూ పోవాలి. చివరి వాక్యంతో భావం సమృద్ధమై, సమగ్రమై వుండాలి. అప్పుడాపాట ఎంత దీర్ఘంగా కొనసాగినా పాట అర్థవంతంగా వుంటుంది. ఇదిగో చూడండి ఈ పాట ఎంత అర్థగర్భితంగా, సరళంగా, సునాయాసంగా సాగిందో!

**ఎందుకు?**
**"ఎండలు కాసే దెందుకురా?**
**మబ్బులు పట్టేటందుకురా.**
**మబ్బులు పట్టేదెందుకురా?**
**వానలు కురిసే టందుకురా.**
**వానలు కురిసే దెందుకురా?**
**చెరువులు నిండేటందుకురా.**
**చెరువులు నిండే దెందుకురా?**
**పంటలు పండేటందుకురా.**
**పంటలు పండే దెందుకురా?**
**ప్రజలు బ్రతికే టందుకురా"** (పేజి: 33)

ఈ పాట మరో నాలుగు పంక్తులు కొనసాగుతుంది. ప్రశ్న-జవాబు రూపంలో వున్న ఈ పాట ఔచిత్యవంతమైనదీ, జ్ఞానవర్ధకమైనది కూడా. ఈ పాట చాలా విశిష్టమైనది. ఇది ప్రకృతికి, ప్రజలకు సంబంధించిన అతి ముఖ్యమైన విషయం. ఎండలు కాయడం. మబ్బులు పట్టడం, వానలు కురియడం, చెరువులు నిండటం, పంటలు పండటం, ప్రజలు బ్రతకటం– ఈ సంగతులన్నీ ముక్తపదగ్రస్త రీతిలో పరస్పర సంబంధం, ప్రజా సంక్షేమం పరమావధిగా కూర్చబడింది ఈ పాట. మరో నాలుగు పంక్తులతో ముగిసిన ఈ పాట మానవజాతి మోక్షం పొందటం జీవన పరమార్థంగా భావిస్తుందని పిండితార్థం. పిల్లల్లో జిజ్ఞాస రేకెత్తించడం, ప్రకృతి ప్రయోజనాలు, ప్రజల సుఖశాంతులు అరటి పండు వొలిచి చేతిలో పెట్టినట్లు కవి బాలగేయం అర్థాన్ని విడమరిచి చెప్పారు.

ఈ పుస్తకం 36, 37 పేజీల్లోని ఎనిమిది **'కూనలమ్మ పదాలు'** గమనిస్తే మనకొక పెద్ద తేడా కనపడుతుంది. ఈ 'బాలభాష' లోని పిల్లల పాటలన్నింటి కంటే ఆకర్షణీయమైన, నీతిబోధకమైన, సులభ గ్రాహ్యమైన పదాలివి.

**"జప తపంబుల కన్న**
**చదువు సాముల కన్న**
**ఉపకారమే మిన్న**
**ఓ కూనలమ్మా!**
**భీష్ముడు దనుభవశాలి**
**భీముడే బలశాలి**
**కర్ణుడే గుణశాలి**
**ఓ కూనలమ్మా!"**

ఈ పదాల్లోని శబ్ద సారళ్యం, యతిప్రాసల మైత్రి, వాక్యార్థాల పొందిక, జీవితానుభవ బోధ గమనార్హాలు. ఎనిమిది పదేళ్ల బాల బాలికలకు ఈ కూనలమ్మ పదాలు ప్రపంచజ్ఞానాన్ని, ఉన్నత జీవిత ప్రమాణాల్ని ప్రసాదిస్తాయి.

వేటూరి వారు బాలగేయాల్లో చిన్న చిన్న పదాలు, అంత్య ప్రాసలు వుంటే గేయం లయాత్మకమై వుంటుందన్నారు. **"అట్లే తెలియవలసిన విషయము గూడ ద్రుంచి త్రుంచి యించించుకగా జేసి నడుమ నడుమ, విశ్రాంతికై యెత్తు పలుకును గూడ జేర్చి చెప్పినచో, బాలురు తేలికగా దెలిసి కొనగల్గుదురు."** (బాలభాష, పేజి: 11)

పై గుణాలతో పాటు లయాత్మకమై, గణబద్ధమై వుంటే ఆ గేయం పిల్లలకు, చిత్తరంజకమై, మరవ రానిదై కూడ నుండును అంటారు శాస్త్రిగారు. (పై పేజీలోనిదే) శాస్త్రిగారు నిదర్శనాలుగా ఇచ్చిన కొన్ని బాలగేయాలు గమనించదగ్గవి.

**"బండో యమ్మ బండి,**
**బండికి కుచ్చులు తెండి**
**సుబ్బారాయడి పెండ్లి,**
**చూచి వత్తాం రండి"** (పేజి: 10)

**"రామన్న రాముడోయి రామ భజనా,**
**రాముడొస్తున్నాడు రామభజనా.**

**పూలరథము నెక్కి రామభజనా,**
**ఊరేగుతున్నాడు రామభజనా."** (పేజి: 11)

సొంత వూరు, సొంతఇల్లు, అమ్మభాష, అమ్మల పట్ల ప్రేమాదరాలు నిత్య సత్యాలు. కాని కాలం తెచ్చే మార్పుల్లో అన్ని నైతిక విలువలూ నిలబడవు. కొన్ని మారుతుంటాయి. జానపద కవి ఈ పదంలో ఎంత విలువైన మాటలు చెప్పాడో!

**ఉన్న ఊరు**
**"ఉన్న ఊరూ విడిచి**
**ఉండనే లేము**
**కన్నతల్లిని విడిచి**
**ఘడి యుండలేము.**
**ఉన్న ఊరే నాకు**
**చెన్న పట్ణమ్ము**
**కన్నతల్లే నాకు**
**కల్పవృక్షమ్ము."** (పేజి: 32)

నిత్య కల్యాణం పచ్చతోరణం లా కళకళలాడు తున్న పల్లెపట్టులు వెలవెలా పోతున్నాయి నేడు. పిల్లల కోళ్లలా వుండిన తల్లులు పిల్లలు రెక్కలొచ్చి దూరమైపోతే, రోగాలూ రుజినాలతో బాధపడుతూ వొంటరి జీవితం అనుభవిస్తూ కాకిశోకాలు చేస్తున్నారు. చన్న కాలమంతా పాతకథ. మరి వున్న కాలమో కొత్తకథ, వింతకథ. కాలం తెచ్చిన మార్పుల్ని, సహిస్తూ, బాధల్ని భరిస్తూ బతుకుబండిని ఈడ్చవలసిందేగా. **'ఏమి సేయవచ్చు గాల మెవ్వరి నెంత సేసునో'** అన్న అన్నమయ్య మాటలతో మనల్ని మనమూ, ఒకరిని మరొకరూ ఓదార్చు కోవల్సిందే. తప్పదు మరి.

**"తారంగం తారంగం**
**తాండవ కృష్ణా తారంగం**
**వేణూనాథ తారంగం**
**వేంకట రమణా తారంగం**
**వెన్నెల దొంగా తారంగం**
**చిన్ని కృష్ణా తారంగం."** (పేజి: 67)

ఎనిమిది, పదినెలల పాపను ఎదుట కూర్చో పెట్టి తల్లి వెండి గిలకనో, రేకు గిలకనో గలగలలాడిస్తూ పాడుతూ వుంటే బోసి నవ్వులు నవ్వే ఆపాప కేరింతలు కొట్టే దృశ్యం మన కళ్లముందు నిలుస్తుంది కదా కొద్దిపాటి మార్పుల్తో! పాశ్చాత్య నాగరికత పరుగులు పెడ్తున్న ఈ రోజుల్లో దేశీ సంస్కృతి శరవేగంగా అదృశ్యమై పోతున్న ఈ కాలంలో ఇంకా 'తారంగం తారంగం' పాట అక్కడో ఇక్కడో చెవులకు ఇంపుగా వినపడుతూ వుండటమే మన అదృష్టం.

పిల్లల పాటల్లో తొణికిసలాడే ప్రధానగుణం సహజత్వం. నిరాడంబరత, నిర్మలత, కల్పనా రాహిత్యం. కమనీయతలు వేటూరి వారు 'ముగ్ధ మధుర వాఙ్మయము' అన్న పీఠికలోని ఈ మాటలు శ్రద్ధతో గమనింపదగ్గవి-




**"ఉన్నత కవితా వాహినికి బాలవాఙ్మయ మూటపట్టని చెప్పవచ్చును. బాలభాషలో సహజముగా నంకుర ప్రాయములుగా గన్పట్టు కవితా గుణములే ప్రౌఢభాషలో సంస్కృతములై బలుపొందుచున్నవి. సరళాక్షర సౌష్ఠవము. సంగీతచ్ఛాయ, యతిప్రాస సంగతి యాంధ్ర కవిత కవతారము నాడే యలవడినవన్న విషయము నీ బాలవాఙ్మయము ప్రవ్యక్త పఱుచుచున్నవి."** (పేజి: 10)

బాలభాష, బాలగేయాల గురించి ప్రభాకరుల వారన్న మాటలు బాలసాహిత్యం సృజించే వాళ్లకు, విశ్లేషించే వాళ్లకు కైదివ్వెలు. ఈ మార్గంలో మునుముందుకు నడిచిన జానపద పరిశోధకుల్లో డా. బి. రామరాజు గారగ్రగణ్యులు. వారి సిద్ధాంత వ్యాసం **'తెలుగు జానపద గేయసాహిత్యము'** లోని ఎనిమిదవ అధ్యాయం **"పిల్లల పాటలు"** (పేజీలు 523–550) బాలగేయాల పరిశోధకులు తప్పక చదవాల్సినదే.

వేటూరి వారి పీఠిక **'పరిమళము సెడని, వాడని'** దివ్య పారిజాత పుష్పం లాంటిది. అయినా తాళ్లపాక అన్నమయ్య వారన్నట్లు **"ఒక్కరు తలచి నట్టు ఒక్కరి తలపు రాదు/ పక్కన నందరికి బహుభావాలు."** విద్వాంసులు, విమర్శకులు ప్రభాకరుల వారి విశ్లేషణా సుపథంలో మునుముందుకు సాగుతూ మౌలిక చింతన చేస్తూపోతే తెలుగు జానపద సాహిత్య విమర్శ స్తబ్ధతను విదిలించుకొని చైతన్యాన్ని సంతరించుకుంటుంది.

**(నాకు 'బాలభాష' (1956) పుస్తకాన్ని బహూకరించిన ఆచార్య వేటూరి ఆనందమూర్తిగారికి అభివందనాలు)**

## సాధన పంచకమ్

**ఏకాంతే సుఖమాస్యతాం పరతరే చేత స్సమాధీయతాం**
**పూర్ణాత్మా సుసమీక్ష్యతాం జగదిదం తద్బాధితం దృశ్యతామ్।**
**ప్రాక్కర్మ ప్రవిలాప్యతాం చితిబలా న్నాప్యుత్తరైః శ్లిష్యతాం**
**ప్రారబ్ధం త్విహ భుజ్యతాం అథ పరబ్రహ్మాత్మనా స్థీయతామ్॥**

**తాత్పర్యం :** 1. ఏకాంతంలో సుఖంగా ఉండవలెను. 2. పరబ్రహ్మమునందు మనస్సును చక్కగా నిలుపవలెను. 3. పూర్ణాత్మను బాగుగా దర్శించవలెను. 4. బ్రహ్మానుభూతిలో ప్రపంచమును మిథ్యగా చూడవలెను. 5. సంచితకర్మలు చక్కగా విలీనం చేయబడవలెను. 6. జ్ఞానశక్తి చేత ఆగామికర్మ నుండి విడిపోవలెను. 7. ఈ లోకంలో ప్రారబ్ద కర్మను పూర్తిగా అనుభవింపవలెను. 8. అటుమీదట పరబ్రహ్మ స్వరూపంగా భాసింపవలెను.

### వివరణ

**3. పూర్ణాత్మా సుసమీక్ష్యతామ్ –**

పూర్ణాత్మను చక్కగా సర్వత్రా దర్శించవలెను. బ్రహ్మానుభూతిని పొందినవాడు, బ్రహ్మ భావమును కలిగినవాడు కళ్ళు తెరిచినా, మూసినా అంతటా పూర్ణాత్మనే దర్శిస్తాడు. దేహాలు ఎన్ని చూసినా వాటికి ఆధారమైన చైతన్యాన్ని మాత్రమే అతడు దర్శిస్తాడు. విభిన్న నామరూపాలు ఎన్ని కనిపించినా అన్నింటిలో ఏకము, అద్వయము ఐన పూర్ణాత్మనే అతడు దర్శిస్తుంటాడు. కావున **'అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణ స్థితః'** అన్నట్లుగా బాహ్యంలో, అంతర్యంలో అంతటా నారాయణుడే వ్యాపించి ఉన్నాడు. ప్రపంచంలో ఉన్నదంతా పరమాత్మయే. పరమాత్మ మాత్రం ప్రపంచం కాదు, అనెడు పూర్ణజ్ఞానంలో, సమ్యక్ దర్శనంలో పూర్ణాత్మను సర్వత్రా దర్శించవలెను.

**4. జగదిదం తద్బాధితం దృశ్యతామ్ –**

బ్రహ్మానుభూతిలో జగత్తును మిథ్యగా చూడవలెను. ఈ దృశ్యమాన జగత్తు పరమాత్మ చేత బాధితం అని గ్రహించాలి. బాధితమైన జగత్తు మిథ్య. అబాధితమైన పరమాత్మ సత్యం అని తెలియాలి. ఆభరణాలు ఎన్ని ఉన్నా అందులోగల బంగారమే మనస్సుకు స్ఫురిస్తూ ఉంటుంది. అట్లే జగత్తు ఎట్లు కనిపించినా జగదీశ్వరుడే బుద్ధికి గోచరించాలి. కుండ తయారు కాకముందు మట్టి ఉంది. అదే కుండ పగిలి పోయిన తర్వాత కూడా మట్టే ఉంది. నామరూపాలు చెదిరిపోయినా వస్తువు మాత్రం ఎప్పటికీ ఉంటుంది. **'వాచారంభణో వికారో నామధేయం మృత్తికే త్యేవ సత్యం'** – కుండ అనబడే నామం, రూపం, మిథ్య. మట్టే సత్యం. కావున కుండ బాధితం ఐనది. మట్టి సత్యమైనది. ఇట్లే జగత్తు బాధితం. పరమాత్మ సత్యం అని చక్కగా గ్రహింపవలెను.

## సత్సంగం





### ముక్తి – సద్వర్తనం

ముక్తి ఎవరికి? ముక్తి ఎవరికి కావాలి? సద్వర్తనమంటే ఏమిటి? అసలు వర్తనమంటే ఏమిటి? ఏది తప్పో, ఏది ఒప్పో నిర్ణయించేదెవరు? పూర్వ సంస్కారాలను బట్టి ఒక్కొక్కరు ఒక్కొక్క దాన్ని తప్పుగానో, ఒప్పుగానో భావిస్తారు. సత్యం తెలిసినప్పుడే ఈ తప్పొప్పుల యథార్థం తెలుస్తుంది. ముక్తి ఎవరికి కావాలో తెలుసుకోవటం అన్నింటికంటె మంచి పద్ధతి. ఈ అహంకారానికి మూలాన్ని అన్వేషించడమే అందరికీ సద్వర్తనం. సద్వర్తనం మంచిదనీ, గమ్యాన్ని చేరుస్తుందనీ పుస్తకాలలో చెప్పబడింది. ఎవరు కాదన్నారు?

సత్కర్మ మనస్సును క్షాళనం చేసి, చిత్తశుద్ధిని ఇస్తుంది. అటువంటి మనస్సుకి జ్ఞానం లభిస్తుంది. అదే మోక్షం అంటే. చివరికి, జ్ఞానాన్నందుకోవాలి. అంటే, అహంకారం యొక్క మూలాన్ని కనుక్కోవాలి. అది నచ్చని వాళ్ళకి, ఇట్లా చెప్తారు. సత్కర్మలు చిత్తశుద్ధికి దారితీస్తాయి. చిత్తశుద్ధి జ్ఞానానికి దారితీస్తుంది. అది మోక్షాన్నిస్తుంది.

ప్రేమతో, ధార్మికమైన నిర్మలత్వంతో, శాంత చిత్తంతో, చేసినదంతా మంచిపనే. వాంఛతో, అశాంత చిత్తంతో, చేసినదంతా చెడ్డపనే. "ఫలం వస్తే చాలులే" అనుకుంటూ ఏ మంచిపనినీ చెడ్డ సాధనాలతో చేయవద్దు. సాధనాలు చెడ్డవయితే, మంచిపని కూడా చెడ్డగా పరిణమిస్తుంది. కాబట్టి సాధనాలు నిర్మలంగా ఉండాలి. పాపకార్యాలు చేస్తే వాటి ఫలితాన్ని అనుభవించాల్సిందే. దానిని తప్పించుకోలేవు.

మనిషి శరీరంలో ఒక పుండుందనుకో. శరీరంలో కొంచె భాగమే నంటూ నిర్లక్ష్యం చేస్తే అది శరీరానికంతా నొప్పిని కలిగిస్తుంది. మామూలు వైద్యంతో నయం కాకపోతే, డాక్టరు వచ్చి కత్తితో దానిని కోసివేసి ఆ మాలిన్యాన్ని తీసివేయాల్సి వస్తుంది. ఆ భాగాన్ని తీసివేయకపోతే, కుళ్ళుతుంది. తీసివేసిన తర్వాత సరిగ్గా కట్టుగట్టకపోతే, చీము పడుతుంది. ప్రవర్తన విషయమూ అంతే. దురభ్యాసాలూ, దురలవాట్లూ దేహంలో కురుపు వంటివే. ప్రతి రోగానికీ తగిన వైద్యాన్నివ్వాలి.

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 7 29 హైదరాబాద్ మే : 2023

# తెలుగు భావ కవితా సౌందర్యం

**ఆచార్య ఎం. రామనాథం నాయుడు,** తెలుగు శాఖాధిపతి, కర్నాటక రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం,
ఫోన్ : 876 235 7996

సంప్రదాయ కవిత్వ వృక్షానికి పూచిన నవ కుసుమమే భావికవిత్వం. నవ్య సాహిత్య చరిత్రలో ఆంగ్లకాల్పనికోద్యమ మానస పుత్రికయే భావికవిత్వమని కొందరు విమర్శకులు భావించారు. ఇది లిరిక్‌కు సమానార్థకం. భావకవిత్వాన్ని దువ్వూరి రామిరెడ్డిగారు **'గీతకవిత్వమని'**, దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు **'కాల్పనిక కవిత్వ'**మని, రాయప్రోలుగారు **'అభినయ కవిత'** అని, నోరి నరసింహశాస్త్రిగారు **'నవ్యకవిత'** అని వ్యవహరించారు. భావంలో పుట్టి పాఠకుల భావంలోకి ప్రాకి ఆ భావాన్ని ఆకట్టుకునే భావప్రధాన కవిత్వమే భావకవిత్వంగా భాసించింది. మూడు దశాబ్దాలపాటు ఆంధ్రదేశాన్ని ఆనంద డోలికల్లో ఊగించిన రసమయకవిత్వం భావకవిత్వం.


రాయప్రోలు సుబ్బారావు

ఆధునికయుగంలో వెలసిన నవ్యకవులలో భావకవులదే అగ్రతాంబూలం. భావకవిత్వాకాశంలో కమనీయ కాంతిని ప్రసరించే నక్షత్రాలుగా పలువురు కనిపిస్తారు. వారిలో పేర్కొనదగ్గవారు **రాయప్రోలు, విశ్వనాథ, వేంకట పార్వతీశ్వరులు, కృష్ణశాస్త్రి, దువ్వూరి, బసవరాజు, వేదుల, నాయని, పింగళి, కాటూరి, జాషువా, తుమ్మల, తల్లావజ్ఝల, బాపిరాజు** మొదలైనవారు.


గురజాడ అప్పారావు

భావకవిత్వ లక్షణాలుగల కవిత్వానికి భావకవిత్వమనే పేరు స్థిరపడడానికి కొన్నాళ్ళు పట్టింది. **'భావపదము', 'భావగీతము'** అనే పేర్లు రాయప్రోలు సుబ్బారావుగారి రచనల్లో మొట్టమొదట చోటుచేసుకున్నాయి. విశ్వనాథ సత్యనారాయణగారి గిరికుమారుని ప్రేమగీతములలో, కృష్ణశాస్త్రి గారి ఊర్వశిలో భావగీతము అనే పదం ప్రయోగింపబడింది. తరువాత చాలామంది భావగీతమనే శబ్దాన్ని ప్రయోగించారు. భావకవిత్వమనే పదాన్ని గాడిచర్ల హరిసర్వోత్తమరావు గారు ఖాయం చేశారు.

**నిర్వచనం**

కవులు, విమర్శకులు పలువురు భావకవిత్వాన్ని తమ తమ ఆలోచనకు, అభిరుచికి తగ్గట్టు నిర్వచించారు. **"కవియొక్క ఒక అవిస్పష్ట వాంఛాంకురం, ఒక అంతర్నిగూఢతాపము, ఒక చిన్న కావ్యంలో ఊదబడినచో అది భావకవిత్వమని"** విశ్వనాథ సత్యనారాయణగారు నిర్వచించారు. ఒక వ్యక్తి తన హృదయగత భావావేశాన్ని ఖండకావ్యంలో వ్యక్తీకరించడమే భావకవిత్వమని విశ్వనాథవారి అభిప్రాయం.


దేవులపల్లి కృష్ణశాస్త్రి

**"హృదయాలను, మానసాలను కలవరపరుస్తూ అల్లకల్లోలంగా ఘూర్ణిల్లే ప్రమాద ప్రాతరాలలో కవికి నిరాఘాటంగా విహరించే అధికారం కలదు. అట్టి అతని సంచారాలలో ఏ సమ్మూహూర్తానో కావ్యగీతం ఒకటి మెరుగులు తీరిన విలక్షణ రచనాధోరణిలో వెలుగు చూస్తుంది. ఆ గీతం కవి అనుభవించి రసస్థాయిని సమగ్రంగా పాఠకునిలో ఆవిష్కరించ గలుగుతుంది. ఉత్కృష్ట భావగీతానికి నా నిర్వచనం ఇది"** అని శ్రీశ్రీ పేర్కొన్నారు.

కవికొండల వెంకటరావుగారు **"భావము యొక్క కవితా స్వభావము భావకవిత్వమని"** నిర్వచించారు.

ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రిగారు **"భావప్రధాన కవిత్వమే భావకవిత్వమ"**న్నారు.

**"ఏదో ఒక భావాన్ని ఆధారం చేసుకొని అల్పావకాశంలో పూర్ణంగా రససిద్ధిని చేకూర్చే యత్నమ"**ని పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రిగారి అభిప్రాయం.

**"వస్తు భావ రచనలలో భావమునకు ప్రాధాన్యమిచ్చిన కవిత్వమని"** ఆచార్య సి.నారాయణ రెడ్డిగారు భావకవిత్వాన్ని నిర్వచించారు.


గుఱ్ఱం జాషువా

**లక్షణాలు**

విమర్శకుల నిర్వచనాలనుబట్టి భావకవిత్వ స్వరూప స్వభావాలను బట్టి భావకవిత్వ లక్షణాలను స్థూలంగా ఈ విధంగా చెప్పుకోవచ్చు.

1. భావకవిత్వం పద్యంలోగాని వచనంలోగాని గేయంలోగాని ఉండవచ్చు.

2. వస్తువుకన్న అభివ్యక్తికన్న భావానికే ప్రాధాన్యముండే కవిత్వం భావకవిత్వం.

3. ఇది ప్రధానంగా ఆత్మాశ్రయంగా ఉంటుంది.

4. హృదయంలో నాటుకొనేవిధంగా భావతీవ్రత దీనిలో ఉంటుంది.

5. మొదట భావానికి, తరువాత రచనకు, దానితర్వాత వస్తువుకు ప్రాధాన్యత ఉంటుంది.

6. ఇది వైవిధ్యభరితంగా ఉంటుంది.

7. భావకవిత్వంలో ప్రకృతి, ప్రణయం, ప్రబోధమే ప్రాధాన్యం వహిస్తాయి.

**భావకవిత్వ శాఖలు**

భావకవిత్వ స్వరూపాన్ని, స్వభావాన్ని దృష్టిలో ఉంచుకొని డాక్టర్ సి.నారాయణ రెడ్డిగారు భావకవిత్వాన్ని ఆరుశాఖలుగా వర్గీకరించారు. అవి ప్రణయకవిత్వం, దేశభక్తి కవిత్వం, ప్రకృతి కవిత్వం, సంఘసంస్కరణ కవిత్వం, భక్తికవిత్వం, స్మృతి కవిత్వం.

**1. ప్రణయ కవిత్వం**

భావకవుల్లో ఎక్కువమంది పాఠశాలల్లోను, కళాశాలల్లోను ఆంగ్లవిద్యనభ్యసించారు. వర్డ్స్‌వర్త్, షెల్లీ, కీట్స్ మొదలైన మేటి ఆంగ్లకవుల ప్రభావం వారిమీద పడింది. ఇంగ్లీషు కాల్పనిక కవిత్వంలోని స్వచ్ఛంద ప్రణయం వారి నాకర్షించింది. ప్రేమించడ మనేది ఎంతో ఉదాత్త కృత్యమని వారికనిపించింది. పైగా మేఘసందేశం వంటి మన ప్రాచీనకావ్యాల వియోగ శృంగార మాధుర్యం వారిని బాగా ఆకట్టుకొంది. వయసులో ఉన్న స్త్రీలను కలుసుకోవడం, మాట్లాడడం వారిని ఆకర్షణకు గురిచేశాయి. మనసులో ప్రేమబీజాలు వేశాయి. ప్రేమారాధనే పవిత్రకృత్యమనే భావన వారిలో బలపడింది. వారి యౌవనం కూడా ప్రణయకవిత్వ రచనకు పురికొల్పింది.

ప్రాచీన కవులు ప్రణయం అనేపదాన్ని స్నేహం అనే అర్థంలోనే ఎక్కువగా ఉపయోగించారు. కొందరు స్త్రీ, పురుష శృంగారపరంగా కూడా ప్రణయశబ్దాన్ని వాడి ఉన్నారు. భావకవులు మాత్రం స్త్రీ పురుషుల శృంగారాన్నే ప్రణయంగా పేర్కొన్నారు. అమలిన శృంగారాన్నే వారు ఆదరించారు. సంభోగ వియోగ శృంగారాల్లో వియోగ శృంగారానికే పెద్దపీట వేశారు. భావకవులు ఆవిష్కరించిన సంయోగ శృంగారంలో కూడ అసభ్య వర్ణనలకు చోటివ్వలేదు. వీరు స్త్రీకి పూజ్యస్థానాన్నిచ్చి గౌరవించారు. వీరు ప్రేయసీప్రియులకు, పార్వతీ పరమేశ్వరత్వాన్ని ఆపాదించారు. ఒక్కమాటలో చెప్పాలంటే వీరి సంయోగ శృంగారం సభ్యతాపరిధిని దాటలేదు. స్త్రీని ఆటవస్తువుగా గాక సహచరిగా, ప్రేయసిగా, ఇల్లాలుగా భావించారు. కాబట్టే స్త్రీ, పురుషులమధ్య ఏర్పడే శృంగారభావాన్ని ప్రణయంగా పరిగణించారు. కవితీకరించారు.

విప్రలంభ దశలోనే ప్రణయమాధుర్యమధికంగా ఉన్నట్టు గుర్తించి భావకవులు దాన్ని ఆకాశానికెత్తారు. వియోగంలోని వింత మాధుర్యాన్ని ఉత్కృష్టమైందిగా వీరు గ్రహించారు. ఒక వస్తువును పొందేముందు తపన అధికంగా ఉంటుంది. ఆ తపనలో మాధుర్యముంటుంది. వస్తువును పొందిన తరువాత ఆ మాధుర్యం ఉండదు. మనసు తేలిక పడుతుంది. ఈ విషయాన్ని గుర్తించో ఏమో భావకవులు ప్రణయానికెంతో ప్రాధాన్యమిచ్చారు.

ప్రణయకవిత్వంలో రెండు పాయలు కనిపిస్తాయి. 1. ఆత్మాశ్రయరీతి 2. వస్త్వాశ్రయ రీతి. ఈ రెంటిలో ఆత్మాశ్రయరీతే బలీయం. భావకవిత్వంలో వస్త్వాశ్రయరీతికి కూడా సముచిత స్థానం ఉంది. రాయప్రోలు వారి తృణకంకణం, అబ్బూరివారి మల్లికాంబ, దువ్వూరి రామిరెడ్డిగారి కడపటి వీడ్కోలు, వేంకట పార్వతీశ్వరుల జలజమాలిక వస్త్వాశ్రయానికి ఉదాహరణంగా చెప్పుకోదగ్గ కృతులే.

భావకవులు ప్రేమించడం ప్రకృతి సహజమన్నారు. ప్రేమకు హేతువులుండవని వారి అభిప్రాయం. ప్రకృతి సహజంగానే ప్రేమ ఏర్పడుతుందని దేవులపల్లి కృష్ణశాస్త్రి తెలియజేశాడు.

**సౌరభములేల చిమ్ము పుష్పవ్రజంబు?**
**చంద్రికల నేల వెదజల్లు చందమామ?**
**ఏల సలిలంబు పారు? గాడ్పేల విసరు?**
**ఏల నా హృదయంబు ప్రేమించు నిన్ను?**

బసవరాజు అప్పారావు తన ప్రేమ వైఫల్యాన్ని, ఆశాభంగాన్ని దేవుడితో మొరపెట్టుకున్నాడు.

**"పానకమ్ములో / పుడక నేటికిటు**
**పడవేసితివో దేవా! / ముద్దు గులాబిని**
**ముట్టబోవగా / ముల్లు విరిగెనో దేవా!**
**తీయని పూవుల / దేనెలాన బోవ**
**తేటి గుట్టెనోదేవా! / గగనమున పతం**
**గముపై బోవగ / తెగియెనో దారము దేవా!"**

భావకవుల్లో ఆశ ఎంత అధికంగా ఉండేదో నైరాశ్యం కూడా అంతే అధికంగా వారిని చుట్టి ముట్టింది. వారిలో గూడు కట్టుకుపోయిన నైరాశ్యం భక్తికి బాటవేసింది. ఎన్నో భక్తి కవితలను కుసుమింపజేసింది.

**2. దేశభక్తి కవిత్వం**

భావకవులలో దువ్వూరి రామిరెడ్డి, బసవరాజు అప్పారావు దేశభక్తి కవిత్వాన్ని వెలార్చారు. ప్రణయకవిత్వం తరువాత భావకవిత్వ క్షేత్రంలో దీనిదే పైచేయి అని సినారె అనడం దేశభక్తి కవిత్వ ప్రాధాన్యతను వెల్లడి చేస్తుంది.

భావకవుల భావాల్లో దేశభక్తి వికసించి పరమళించింది. గురజాడ వారి దేశభక్తి గేయం ఆంధ్రులందరికీ సుపరిచితమే; ఆదరణీయమే. దేశాన్ని ప్రేమించమని, మంచిని మాత్రమే పెంచుమని ఆయన ఉద్బోధించాడు. దేశమంటే మట్టి కాదని మనుషులతో కూడిందే దేశమని ఆయన ఎలుగెత్తి చాటాడు. **'దేశమును ప్రేమించుమన్నా, మంచి అన్నది పెంచుమన్నా, ఒట్టి మాటలు కట్టిపెట్టోయ్, గట్టిమేల్ తలపెట్టవోయ్', స్వంతలాభం కొంత మానుకు, పొరుగువారికి తోడుపడవోయ్, దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్'.** గురజాడ దేశభక్తి, విశ్వభక్తి వినుతికెక్కాయి. దానికి ఆయన రచించిన ఈ పంక్తులే తార్కాణం.

**"ఎల్ల లోకములొక్కయిల్లై**
**వర్ణభేదములెల్ల కల్లై**
**వేలనెరుగని ప్రేమ బంధము**
**వేడుకల కురియగా..."**

రాయప్రోలువారి దేశభక్తి అపారం. వారి ప్రబోధగీతం ప్రతి ఆంధ్ర హృదయంలోను మార్మోగుతూనే ఉంటుంది. ఎక్కడికి వెళ్ళినా, ఎంత ఉన్నత స్థితికి చేరుకున్నా మాతృదేశాన్ని మరువకూడదని రాయప్రోలు వారి ఆదేశం.

**"ఏ దేశమేగినా ఎందు కాలిడినా**
**ఏ పీఠమెక్కినా ఎవ్వరేమనినా**
**పొగడరా నీ తల్లి భూమి భారతిని**
**నిలుపరా నీ జాతి నిండు గౌరవము"**

భారతదేశానికి సాటి ఎక్కడా లేదని రాయప్రోలు వారన్నారు. భరత పుత్రుడనని సగౌరవంగా పలుకమని రాయప్రోలువారు భారతీయుల వెన్నుతట్టారు.

**"లేదురా యిటువంటి భూదేవి యెందు**
**లేరురా మనవంటి ధీరులింకెందు**
**అవమాన మేలరా అనుమానమేల**
**భరత పుత్రుడనంచు భక్తితో బలుక"**

స్వాతంత్ర్య రథాన్ని అంబరవీథిలో సంబరంగా దర్శించిన హృదయ దేశభక్తుడు దువ్వూరి రామిరెడ్డి.

**"అంబుదంబుల అమృతపూరంబులొలుకగా**
**ఇంద్రచాపంపు తోరణ మింపు గులుకగా"**

వినువీథిలో వెడలు స్వాతంత్ర్య రథమును దర్శించి అద్భుతావృతు లైనారు ఈ కవి. రామిరెడ్డి గారు నైవేద్యము, మాతృమందిరము వంటి ఖండికలే గాక **'మేలుకో భారత కుమారా మేలుకోరా తరుణ ధీరా'** అని ప్రారంభమయ్యే గేయాన్ని కూడా విరచించి దేశభక్తిని ప్రబోధించారు. వీరేగాక పలువురు కవులు భరతమాత వైభవాన్ని ప్రస్తుతించారు.

బిపిన్ చంద్రపాల్ రాజమహేంద్రవరంలో ఉపన్యసించాడు. అతని ఉపన్యాసంతో బాగా ప్రభావితులైన చిలకమర్తి లక్ష్మీనరసింహారావు ఒక పద్యాన్ని విరచించి వినిపించారు. అది ఉత్సాహంతో సభను ఉర్రూతలూగించింది. ఆ పద్యమిది –


నాయని సుబ్బారావు


తుమ్మల సీతారామమూర్తి


అడవి బాపిరాజు


దువ్వూరి రామిరెడ్డి

**"భరతఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగదూడలై యేడ్చుచుండ
తెల్లవారను గడుసరి గొల్లవారు
పితుకు చున్నారు మూతులు బిగియగట్టి"**

ఆనాటి జాతీయోద్యమంలో ఆంధ్రులు కూడా తమవంతు పాత్రను చక్కగా నిర్వహించారు. ఎన్నో త్యాగాలకు సిద్ధమయ్యారు. చెరసాలలకు వెళ్ళారు. దుర్భర జైలు జీవితాన్ని అనుభవించారు. ఈ అంశం చిలకమర్తి వారిచేత హృద్యమైన పద్యాన్ని ఆవిష్కరింపజేసింది.

**"చెరసాలల్ పృథు చంద్రశాలలెయగున్ చేదోయి గీలించు న
య్యరదండల్ విరిదండలయ్యెడున్ హేయంబైన చోడంబలే
పరమాన్నంబగు మోట కంబళులు దాల్పన్ పట్టు సెల్లాలగున్
స్థిరుడై యే నరుడాత్మ దేశమును భక్తింగొల్పు నవ్వానికిన్
భరతఖండంబె యొక పెద్ద బందెఖాన
అందులోనున్న ఖయిదీలు హిందు జనులు
ఒక్క గదినుండి మార్చి వేరొక్క గదిని
బెట్టుటే గాక చెరయంచు వేరగలదె"**

**3. ప్రకృతి కవిత్వం**

భావకవులు భగవంతునితోబాటు ప్రత్యక్షంగా కనిపించే ప్రకృతిని కూడా ఆరాధించారు. ప్రకృతి సౌందర్యానికి ముగ్ధులయ్యారు. పరవశించారు. భావముప్పొంగగా పద్యాలు గీతాలు హృద్యంగా విరచించారు.

గురజాడ అప్పారావుగారు తమ నీలగిరి పాటలలో నీలగిరి సౌందర్యాన్ని చిత్రించేందుకు ప్రయత్నించారు. గురజాడవారి కంటికి నీలగిరి **'బృందారక ముని బృందసేవిత నందనవనం'**గా గోచరించింది. అక్కడ అన్నిచోట్లా కనిపించే పచ్చని బయళ్ళు, రొదచేసే పిట్టలు, సువాసనలు గుబాళించే చెట్లు, కాసారాల గట్లు, కొండలు, తోటలు, అచ్చంగా తోచే మబ్బులు ఆయన్ను బాగా ఆకట్టుకొన్నాయి.

పూర్ణమ్మ కథను ప్రారంభిస్తూ **'కొండల నడుమను కోనొకటున్నది, కోనకి నడుమా కొలనొకటుంది, కొలనిగట్టునా కోవెల లోపల వెలసెను బంగరు దుర్గమ్మ'** అని ఒక భావచిత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కథలోనే గురజాడ వారు చేసిన సాయంకాలం వర్ణన కూడా చక్కగా హృదయాన్ని ఆకట్టుకొంటుంది. **'ఆవులు, పెయ్యలు మందల చేరినాయి, పిట్టలు చెట్లను గుమిగూడినాయి. మింటను చుక్కలు మెరుస్తున్నాయి. కొండల్లో చీకటి నిండింది. మేతకు మెకములు మెసలుతున్నాయి. దుర్గకు మెడలో హారములు అమరినాయి'.**

రాయప్రోలు సుబ్బారావుగారిని గ్రామ సౌందర్యం బాగా ఆకర్షించింది. గ్రామాల్లో ఆయనను ఆకట్టుకొన్న అంశాలు అనేకం. వాటిలో కొన్ని – **కొత్తగా పెండ్లయిన లేత జవ్వనులు, ఈ మధ్యనే ఈడేరిన కన్నియలు, గడుసుపోకడల నెఱజాణలు, తల్లిపాలు తాగకుండా బంధాలుపడ్డ వత్సాలు, చెర్లాటలాడే లేగలు, బువ్వనెత్తిన పెట్టుకొని రవిక తొడుగని గొల్ల కుఱ్ఱది, పిఱుదులసియాడ జీరరాపికు ్ళ పెరయ, ఒడిసెలతో పొలాన్ని కాచే కాపు కూతురు, అలల రాయంచ ఒయ్యారాలు, నదిలో నడిచే నావ.** ఈ విధంగానే నాయని సుబ్బారావు, బసవరాజు అప్పారావు మొదలైన భావకవుల రచనల్లో సముచితంగా, సందర్భోచితంగా ప్రకృతి రచనలు గోచరిస్తాయి.

**4. సంఘసంస్కరణ కవిత్వం**

భావకవుల సంఘసంస్కరణ కవిత్వం మీద మానవోద్యమ ప్రభావం, గాంధేయ ప్రభావం ఉన్నాయి.

వంగదేశంలో రాజారామ్మోహన్‌రాయ్ మానవోద్యమానికి శ్రీకారం చుట్టారు. ఆంధ్రదేశంలో కందుకూరి వీరేశలింగం పంతులు దాన్ని కొనసాగించారు. బాల్యవివాహాల ఖండనం, కన్యాశుల్క నిరసనం, వర్ణవ్యవస్థా నిరసనం, సంఘ వ్యవస్థానిరసనం క్రమంగా వచ్చాయి. మానవోద్యమం తరువాతి తరంలో గాంధేయోద్యమంగా రూపుదిద్దుకొంది. మానవోద్యమాన్ని గాంధేయోద్యమాన్ని దృష్టిలో పెట్టుకొని భావకవులు తమ సంఘసంస్కార కవిత్వాన్ని వెలయించారు. కొందరు భావకవులు వితంతువుల దైన్యాన్ని ఆవిష్కరించారు. మరికొందరు కన్యాశుల్క దౌష్ట్యాన్ని ఖండిస్తూ రాశారు. కొందరు వర్ణవ్యత్యాస మూఢవిశ్వాసాలను దుయ్యబట్టారు. కొందరు అస్పృశ్యతను నిరసించారు. ఇంకొందరు విశ్వప్రేమకు పెద్దపీట వేశారు.

ఆనాడు బాల్యవివాహాల సమస్య ఎంతో ఇబ్బందికరంగా పరిణమించింది. కన్యాశుల్కాలకు ఆశపడి కన్యల తల్లిదండ్రులు వృద్ధులకు కూడా ముక్కుపచ్చలారని తమ ముద్దుబిడ్డలను కట్టబెట్టేవారు. ఈ దౌష్ట్యాన్ని నిరసిస్తూ మంగిపూడి వెంకటశర్మ 'బాలవితంతు విలాప'మనే కావ్యాన్ని రచించారు. ఆనాటి తల్లిదండ్రుల వైఖరికి అద్దంపడుతూ శర్మగారు రచించిన పద్యం గమనార్హం.

**పొత్తిళ్ళలోనున్న నెత్తురు కందుల
పెండ్లిండ్లు సేయ భావించునొకడు
పురుడు వోవకమున్నె బొట్టెల నమ్మంగ
బేరసారములు గావించునొకడు
కన్నులు తెరవని కసుగాయలను గట్టి
పెట్టి వృద్ధులను సేవించునొకడు
పాలైన విడువని పసికూనలను గూర్ప
వెనరాయబారి రావించు నొకడు**

కన్యాశుల్కాన్ని నిరసిస్తూ గురజాడ అప్పారావు 'పూర్ణమ్మ' అనే ఖండికను, రాయప్రోలు సుబ్బారావు 'స్నేహలత' అనే ఖండకావ్యాన్ని రచించారు. ఆనాడు స్త్రీలకు పురుషులతో సరిసమానంగా స్వేచ్ఛ ఇవ్వబడేది కాదు. ఆడపిల్లలను చదివించేవారు కాదు. వారిని వంట

ఇంటికి పరిమితం చేసేవారు. ఈ స్థితిని నిరసిస్తూ వెంకటశర్మగారు స్త్రీలను కూడా పురుషులతో సమానంగా చూడమని ప్రబోధించారు.

**"బాలుర కెట్టులో బాలల కట్టులే**
**యున్నత విద్యల నొసగుదయ్య**
**యువకులకెట్టులో యువతుల కట్టులే**
**స్వేచ్ఛా ప్రదానంబు సేయరయ్య'**

ఏకేశ్వరోపాసన, విగ్రహారాధన నిరసన భావకవులను బాగా ప్రభావితం చేశాయి. దేవులపల్లి కృష్ణశాస్త్రి తన గేయంలో విగ్రహారాధనను పరోక్షంగా నిరసించిన తీరు గమనార్హం.

**"శిథిలాలయమ్ములో శివుడు లేడోయి**
**ప్రాంగణమ్మున గంట పలుకలేదోయి**
**దివ్య శంఖము గొంతు తెరువలేదోయి**
**పూజారి గుడినుండి పోవలేదోయి**
**చిత్ర చిత్రపు పూలు చైత్రమాసపు పూలు**
**ఊరూర ఇంటింట ఊరకే పూచాయి**
**శిథిలాలయమ్ము శిలకెదురుగా కునుకు**
**పూజారి కొకటేని పూవులేదోయి"**

వర్ణవ్యవస్థను అస్పృశ్యతను భావకవులు నిరసించారు. వర్ణవ్యవస్థ బంధాలను తెగద్రుంచవలసిందిగా భావకవి విజ్ఞప్తి చేశాడు. జగదీశ్వరాలయంలో చీకటి గదులుండవన్నాడు.

**"గుణములేనివానిదేకులమైతేనేమి**
**తృణమైతేనేమి శ్రీ చరణమంటునేని**
**ఏ కౌటిల్యము వీని నేర్పరిచిందో కాని**
**చీకటి గదులున్నే జగదీశ్వరాలయములోనే"**

జాషువా తన గబ్బిలంలో వర్ణవ్యవస్థను, అస్పృశ్యతను నిరసించడమే గాక వర్ణబాహ్యుని ఆవేదనను, ఆక్రందనను హరునికి వినిపించుమని గబ్బిలాన్ని కోరాడు.

**5. భక్తికవిత్వం**

భావకవులు పాపాలకు భయపడ్డారు. ప్రణయంలో కలిగిన తాపాలను పక్కనబెట్టి భగవంతుని పాదాలను ఆశ్రయించారు. భగవంతుణ్ణి ఆరాధిస్తే పాపాలు పటాపంచలౌతాయని విశ్వసించారు. కన్నీటితో భగవంతుణ్ణి ఆరాధించుమని కృష్ణశాస్త్రి భావజగత్తు నుద్బోధించాడు.

**"కురియుమురా కన్నీటిని / మరి మరి విలపింపుమురా**
**సరసము గూర్చి పరమేశుడు / తాల్చునురా పాపీ!"**

భగవంతుని పాదాలకు శోకిన కన్నీళ్ళు పవిత్రమౌతాయని భావ కవులు భావించారు. తమకా అవకాశం ఇమ్మని ఆర్ద్రహృదయంతో దేవులపల్లి వారు దేవుడికి విజ్ఞప్తి చేశారు.

**కలుష దుర్దాంత పంక సంకలిత కుహర**
**ముల జనించు మదీయాశ్రు మలినధార**
**స్వామి, భవదీయ పాద దేశమున పారి**
**పరమ పావన జాహ్నవీ ప్రతిభగాంచు**
**తావకీన పదనరోజ దళములందు**
**నిలువనిమ్మొక్కటేని కన్నీటి చుక్క**
**కదలి ప్రసరించు నెత్తావి కమ్మదనము**
**త్రావినిమ్మో ప్రభూ దాని తనివిదీర -**

భావకవులు భగవంతుడికి ఆత్మసమర్పణ చేసికొన్నారు. తమ జీవన కుసుమాన్ని స్వీకరించమని ప్రాధేయపడ్డారు. ఈ భావంతోనే వేదుల సత్యనారాయణగారు ఒక పద్యాన్ని, ఒక గీతాన్ని రచించారు. అవి రెండూ కూడా పాఠకుల దృష్టిని బాగా ఆకర్షించాయి.

**"నాదు జీవిత కార్యమే నాడు నీకు**
**నంకితము జేసికొంటి నాయంత నేను**
**నాటి ప్రేమాక్షరములు కన్నీట గడిగి**
**చెరిపి వేయ నాతరమౌనె జీవితేశ"**

**"కోసి కొనుము యీ కోమల కుసుమము**
**కోరి విరిసె నీ కోసమే స్వామీ**
**తేనెల సోనలు తీరిక మునుపే**
**తీయని వలపులు మూయక మునుపే**
**కోసికొనుము యీ కోమల కుసుమము**
**కోరి విరిసె నీ కోసమే స్వామీ"**

భావకవుల భక్తిని అనురక్తి కూడా స్పృశించింది. మధురభక్తి పరిమళించింది. శృంగార రసాధిదేవత అయిన శ్రీకృష్ణుడు వారి మధురోహలకు విందుగా లభించాడు. గోపికల గుండెలను ఆకట్టుకునేందుకు కృష్ణుడెలాంటి పాటలు పాడాడో తెలుసుకోవాలని వారికనిపించింది. మరుక్షణమే బసవరాజు అప్పారావు గారి గుండె నుంచి ఒక ప్రశ్నాస్త్రం సూటిగా కృష్ణుడికేసి బయలుదేరింది.

**"ఏమని పాడితివో గోపాల**
**గోపాల కృష్ణా**
**ఏమని పాడితివో?**
**భామలు పదియారువేలు**
**పరవశులై సొక్కి సోల"** ॥ఏమని॥

శృంగార రాయని బంగారు తలపు పాటగా పల్లవించి శ్రోతల హృదయవీణల్ని మీటింది. బసవరాజు గారే శ్రీకృష్ణుని శృంగార తత్త్వాన్ని చల్లగా మెల్లగా ఎద నిమిరేలా రచించారు.

**"నల్లవాడే / గొల్ల పిల్లవాడే**
**చెలియ / కల్లగాదె వాని**
**వల్లో జిక్కితినే"**



విశ్వనాథ
సత్యనారాయణ

**6. స్మృతి కవిత్వం**

భావకవిత్వంలో స్మృతి కవిత్వం కూడా పేర్కోదగ్గ శాఖే. భావకవులు ప్రణయానికీ, భక్తికీ ఇచ్చిన స్థానాన్నే స్మృతికి కూడా ఇచ్చారు. హృదయాన్ని ఆకర్షించిన మదిరాక్షికే గాక హృదయాన్ని ఆకట్టుకొన్న భగవంతుడికేగాక తమ హృదయాన్ని ప్రభావితం చేసిన బంధుమిత్రులకు కూడా తమ మనసులో స్థానం కల్పించారు. వారి వియోగాన్ని సహించలేక కవితలల్లారు. ఆ కవితలలో వారి స్మృతికి నివాళులర్పించారు. ఈ స్మృతి కవిత్వాన్ని సతీస్మృతి అని, సుతాధిక స్మృతి అనీ, మిత్రస్మృతి అని, సోదర స్మృతి అని, సోదరీ స్మృతి అని, దేశనాయక స్మృతి అని అనేక రకాలుగా వర్గీకరించుకోవచ్చు.

ఎన్ని ఉన్నప్పటికీ భార్యావియోగం తనను ఏమీలేనివాణ్ణిగా మిగిల్చివేసిందని దువ్వూరి రామిరెడ్డిగారు తమ భార్యాస్మృతి నావిష్కరిస్తూ వాపోయారు.

**"ఉప్పులోపింప మిగతవి యుండి కూడ**
**జవియు సారంబు కొఱవడు సాదకమున**
**మనసు గలిసిన యిల్లాలు మణిగిపోవ**
**నన్ని యుండియు లేనట్టులయ్యె నాకు"**

ఆంగ్ల సాహిత్య ప్రభావం వల్ల ఆధునికయుగంలోనే స్మృతి కవిత్వమావిర్భవించిందని చెప్పుకోవచ్చు. 19వ శతాబ్దం చివర వావిలాల వాసుదేవశాస్త్రి గారు పిత్రారాధనము, రుక్మిణీస్మరణము అనే కావ్యాలు రాశారు. ఇవి రెండూ స్మృతి కావ్యాలే. అప్పటి నుంచీ స్మృతికావ్యాలు చెదురు మదురుగా వచ్చాయి.

భావకవులలో ప్రఖ్యాతి వహించిన రాయప్రోలు సుబ్బారావుగారు గోపాలకృష్ణ గోఖలే మరణానికి తట్టుకోలేక ఆయన పేరుమీదుగా ఒక స్మృతి కావ్యాన్ని రచించారు. భావకవిత్వోద్యమంలో వచ్చిన తొలి స్మృతి కావ్యమిదే కావచ్చు. తర్వాత బసవరాజు అప్పారావు, విశ్వనాథ, నాయని సుబ్బారావు మొదలైనవారు ఎన్నో స్మృతి కావ్యాలను, గీతికలను వెలయించారు.

గురజాడ అప్పారావు గారి నిర్యాణానంతరం దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు రాసిన గేయం చక్కని స్మృతి కావ్యమే. అప్పారావుగారి గీత శీకరములు.

**"యుగయుగంబుల నుండి మ్రోగెడు**
**విశ్వగాన వియత్తరంగిణి**
**భంగముల నుప్పొంగున"**ని కవి ఊహించాడు.

ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారి మృతికి బసవరాజు అప్పారావు గారు –

**"ఏల పాడేనింక యమునా కల్యాణినే**
**లీలా మానవుడు గోపాలుడు లేడాయె"** అని దుఃఖావిలురయ్యారు.

కాశీనాథునివారు శివైక్యం చెందగానే ఆంధ్రకవులెందరో స్మృతి గీతాలు రచించారు. వానిలో తుమ్మలవారు రాసిన 'విశ్వదాత' పేర్కొనదగిన స్మృతిగీతం. దీనిలో కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు **'మాతృదాస్య పాశఛేద కౌశల్యమును గన్న కర్మయోగి'**గా **బలికర్ణమాంధాతల విస్మృతికిందెచ్చు విశ్వదాత'**గా **'చదువులమ్మకు సేవ సలుపు బంటుగా'** కీర్తింపబడ్డారు.

గాంధీజీ నిర్యాణానంతరం వెలువడిన ఖండకావ్యాల్లో జాషువా గారి **'బాపూజీ'** కావ్యం ఎన్నదగినది. **'మగ్గినపండు', 'క్షమాప్రవాసి'** యైన మహాత్ముడు తుపాకి గుండ్లకు బలియైపోయిన విషయాన్ని తలచుకొని కవి **'ఇదియే పోవడమా! జగజ్జనక! రానే రావుగా'** అని ఆక్రోశించారు. **'భారతజ్యోతి గప్పున నారిపోయిన'**దని **'జగమొక్కుమ్మడి ఱొమ్ము గ్రుద్దుకొని మూర్ఛన్ దేలి తబ్బిబ్బు చెందినద'**ని, **'ఖదరు రాటాల ఝుంకార రవళి'**తో పాటు **'గందు పేదల నోటి కబళరాసి'** కూడ ఆగిపోయినట్లేయని కరుణ రసాత్మకంగా చిత్రించారు జాషువా.

భావకవిత్వం బావామరదళ్ళ కవిత్వమని కొందరు ఎద్దేవా చేశారు. అది ఊహాజగత్తులోనే విహరించిందని వాస్తవ స్పర్శ దానికి లేదని మరికొందరు విమర్శించారు. ఏది ఏమైనా భావకవిత్వం భావుకుల మనఃఫలకాల మీద చెరగని ముద్ర వేసింది. కొన్నాళ్ళకు తన అస్తిత్వాన్ని కోల్పోయి భావకవిత్వం మరుగున పడింది. అయినప్పటికీ ఇతర కవిత్వోద్యమాలకు పరోక్ష ప్రేరణగా భావకవిత్వం కనిపిస్తుంది.

**ఆధారగ్రంథాలు**

1. ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు – ప్రయోగములు – డా॥ సి.నారాయణరెడ్డి.

2. తెలుగు సాహిత్య సమీక్ష (రెండవ సంపుటం) – ఆచార్య జి.నాగయ్య.

3. తెలుగులో ఆధునిక కవితారీతులు – ఆచార్య మద్దూరి సుబ్బారెడ్డి.

4. ఆధునికాంధ్ర కవిత్వం ఆవిర్భావ వికాసాలు – ఆచార్య ఎస్వీడి చంద్రశేఖర్.

****

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 7 35 హైదరాబాద్ మే : 2023

# మాతృ శతకం – వస్తు వైశిష్ట్యం

**డా. జొన్నలగడ్డ భారతి**, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, విద్యానగర్, హైదరాబాద్. ఫోన్ : 8919996936

**మాతృదేవోభవ –** ఎదుటివారినుండి ఏ ప్రయోజనాన్ని ఆశించకుండా ఇచ్చే గుణం ప్రేమ అనీ, ఎదుటి వారి అభ్యున్నతి కోసం సర్వస్వం వదులుకునే గుణం త్యాగం అనీ, ఈ రెండు గుణాలు కలిసిన రూపం మాతృమూర్తి అనీ పెద్దలు చెపుతుంటారు. ఆ విశిష్టతను అక్షరంగా శతకోణాలుగా **'మాతృశతకం'** అనే పేరుతో పాఠకుని అనుభూతికి అందించిన ఘనత **మాతూరి వెంకట అప్పావు మొదలారి** గారిది. తల్లికి మొదటి వందనం సమర్పించటం భారతీయ సంస్కృతిలో భాగం. ఆ సంప్రదాయాన్ని అనుసరిస్తూ కవి అప్పావుగారు **'తల్లిని బోలరెవ్వరన్'** అనే మకుటంతో శతక రచన చేసి వంద వందనాలు తెలిపారు. 1861 లో అప్పావు గారి కుమారుడు మీనాక్షిదాసు చేత మొదటగా ముద్రించబడిన ఈ శతకం 1928 లో వావిళ్ల సంస్థ ద్వారా పునర్ముద్రణ పొందింది. అప్పావు మొదలారి అనే పేరు ద్రావిడ ప్రాంతానికి చెందిన కవి అని సూచిస్తుండగా మీనాక్షిదాసు అనే పేరు మధురై ప్రాంతానికి చెందిన తెలుగువారనే ఊహకు అవకాశం ఇస్తోంది.

తెలుగు సాహిత్యంలో భావకవిత్వయుగంలో స్త్రీకి సముచిత గౌరవం లభించిందని చదువుతుంటాం. కానీ అంతకంటే ఎంతోముందే మాతృత్వవిశిష్టతను సరళమైన భాష, వాస్తవ ఉదాహరణలతో ఈ శతకం వివరించింది. ఈ విషయాన్ని ఈనాటి సాహితీప్రియులకి పరిచయం చేస్తూ వ్యాసరచితమైన వాయుపురాణం లోని **'మాతృవందనం'** అనే 16 శ్లోకాలలోని విషయానికి శతకాంతర్గత విషయానికి మధ్య ఉన్న కొన్ని పోలికలను ఇక్కడ వివరిస్తాను.

**"గర్భధారణకు ముందునుండి పుత్రవాంఛతో సతులువ్విళ్లూరు విధము, గర్భభారముచే గృశించుచు సత్పుత్రునికై జనని పొందు నాందోళనము, కుమారుని శ్రేయోవృద్ధులకు, విద్యావిశేషాలకు దల్లి యానందించు విధము రమణీయముగా, మనోహరముగా, స్వభావానుకూలముగా, రసవత్తరముగా వర్ణింపబడియున్నది. – కొడుకు, కోడలు కలిసిమెలిసి యున్నప్పుడు, మనుమడు కలిగినప్పుడు మాతృదేవి పొందు సంతోషపారవశ్యములీగ్రంథమున సజీవముగా జిత్రించియున్నాడు."** అని శ్రీ శేషాద్రిరమణకవులు ఈ శతకవిశిష్టతను వివరించారు. (భక్తిశతకసంపుటము – 2 వావిళ్ళ 1928)

భారతీయులకు వేదాలు ధర్మాచారణకు మార్గదర్శకాలు. అయితే పితృఋణం తీర్చుకునే మార్గం చెప్పిన వేదాలు మాతృఋణం తీర్చుకునే మార్గం చెప్పలేదని విజ్ఞులు అంటారు. తన ప్రాణాన్ని పణంగా పెట్టి బిడ్డకు జన్మనిచ్చే మాతృమూర్తి ఋణం తీర్చలేనిది కావటం వలననే సర్వసంగపరిత్యాగులై ఉండీ ఆదిశంకరులు, రమణమహర్షి వంటివారు తల్లికి మరణానంతర క్రియలను చేసి కొంతలోకొంత ఋణవిముక్తులవటానికి ప్రయత్నించటం చూస్తుంటాం. అలాగే మాతృఋణవిముక్తికై కవి అప్పావు ఈ శతక రచన చేశారనవచ్చు. సామాన్య స్త్రీ, జగన్మాత అనే వ్యత్యాసం లేకుండా ప్రతి తల్లీ పోల్చలేనిదనే సత్యాన్ని చాటుతున్న 'తల్లిని బోలరెవ్వరన్' అనే మకుటంలోని భావం శతకాంతర్గతమాతృగతభావనలన్నింటికీ మకుటాయమానమైనది. తల్లి హృదయానికి అద్దం పట్టిన ఈ శతకంలోని ప్రతి పద్యం ఒక కమనీయ దృశ్యాన్ని ఆవిష్కరించి పాఠకులను అలరిస్తుంది. ఈ శతకంలోని పద్యాలు ఉత్పలమాల, చంపకమాల ఛందస్సులో వ్రాయబడ్డాయి. భాష శుద్ధవ్యవహారికం.

స్త్రీ జీవితంలో వివాహానికి ముందునుండి వివాహానంతరం సంతానాన్ని పొంది వారిని పెంచి పెద్దచేసి మనుమల్ని పొందేదాకా పడే తపన, ఆరాటం వర్ణించటంలో ప్రస్ఫుటమయ్యే



కవి సూక్ష్మ పరిశీలనాశక్తి పాఠకుని ఆశ్చర్యచకితుని చేస్తుంది.

ఒక స్త్రీ తన జీవితంలో నిర్వహించే అనేకకార్యాలలో, పోషించే వివిధ పాత్రలలో ఒకానొకటి అయినా అతి ముఖ్యమైనది అయిన తల్లి పాత్ర ఈ శతకంలో ప్రధాన వస్తువు. మరొక ప్రాణిని సృష్టించే అపరబ్రహ్మగా తల్లి స్థానం విశిష్టమైంది. సృష్టికర్తగా పరిణమించటానికి ముందు, తరువాత రెండు దశలలోనూ స్త్రీచుట్టూ నెలకొని ఉండే పరిస్థితులు, తన శరీరంనుంచి రూపుదిద్దుకున్న జీవి చుట్టూ అల్లుకుపోయే స్త్రీ హృదయం ఈ శతకంలో అద్భుతంగా ఆవిష్కరింపబడ్డాయి.

**"శ్రీపతియైనగాని విదుశేఖరుడైనను బోధనోక్తులనుదెల్పను తల్లిని బోలరెవ్వరన్"** (మా.శ. 1 )

సాధారణంగా కవులందరూ పాటించే సామాన్య లక్షణం "శ్రీ"తో రచనను ఆరంభించడం. ఈ శతకకవికూడా దానిని అనుసరించాడు. సాధారణంగా ముక్తక రచనలైన శతకాలలో వస్త్వైక్యం ఉండదు.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 7  UGC Care List Approved Journal
హైదరాబాద్ మే : 2023



కానీ ఈ మాతృశతకంలో ప్రతి పద్యం తల్లి హృదయాన్ని, తల్లి చేసే కార్యకలాపాల్ని వర్ణించడంవలన ఇందులో వస్త్వైక్యం సాధించబడింది. శతకంలోని మొదటి మూడు పద్యాలు త్రిమూర్తుల పత్నులను స్ఫురింపచేస్తాయి. ఆ తల్లులవంటి తల్లులను పాఠకుల స్మృతిపథానికి తెస్తాయి.

చిన్నతనంలో ఆటలాడుకునే సమయంలో కొయ్యబొమ్మలని పుత్రులుగా సంభావిస్తూ లాలన చేసే అమ్మాయిలలో మాతృ హృదయాన్ని సున్నితంగా కింది పద్యంలో ఆవిష్కరించారు.

**"చిఱుతతనంబునన్ చెలులజేరి విహారముసల్పువేళ నా**
**దరమున గొయ్యబొమ్మను ముదంబున బుత్రునిగాదలంచి తా**
**బరవశమొంది వేడుక నెపంబిడి లాలనజేసి మిక్కిలిన్**
**మురిపముగాంచి మోహమున నూల్కొను దల్లిని బోలరెవ్వరున్."**

(మా.శ. 3)

మరోపద్యంలో పరలోక సుఖాన్నిచ్చేకొడుకును కనలేని అందం అదెందుకు అని చింతిల్లే తల్లిని గురించి చెప్తారు. చిలుకలులేని పంజరంలాగా చంద్రుడు లేని రాత్రిలాగా, కలువలులేని కొలనులాగా, కొడుకులేని అందం నిరుపయోగమైందిగా తల్లి భావించడం వెనకాల సామాజిక ప్రభావాన్ని, ధోరణిని ఇక్కడ మనం గుర్తించవచ్చు.

**"ఇలగల దేవతాతతులనెల్ల మనంబుననెంచి నామముల్**
**పలుమఱు నోట బల్కుచును బార్వతిగేహము జొచ్చి శాంభవీ**
**లలిత కుమార సంభవ ఫలప్రదమైన వివాహమింక గా**
**వలెనని మ్రొక్కి వేదు సుతవాంఛకు దల్లిని బోలరెవ్వరున్"**

(మా.శ. 5)

ధర్మబద్ధమైన దాంపత్యజీవన ఔన్నత్యాన్ని స్ఫురింపచేసిన పద్యమిది. కుమారసంభవఫలితాన్ని ఇచ్చే వివాహం కావాలని అమ్మాయిలు కోరుకున్నట్లు వర్ణించడం ద్వారా తుచ్ఛమైన కామాన్ని కాకుండా **'ప్రజాతంతుంమావ్యవచ్ఛేత్సీ'** అనే వేద ధర్మాన్ని ఆచరణలో పెట్టే ఉదాత్త వ్యక్తిగా స్త్రీకి విశిష్ట గౌరవాన్ని అందించారు కవి. అంతటి ఉదాత్త భావన కలిగిన స్త్రీ తల్లి స్థానంలో నిల్చినపుడు ఆమెను పోలగలిగినవారెవ్వరూ ఉండరనే సత్యాన్ని ఎవరైనా ఒప్పుకుని తీరాల్సిందే.

పుత్రులని కలిగిన స్త్రీలు ఏ నోము నోచారో, ఉపవాసాది పూజలు, అన్నదానాలు, నాగప్రతిష్ఠలు, సముద్రస్నానాలవంటివి ఏం చేశారో తెలుసుకుని వాటిని పూర్తిచేసే క్రమంలో ఎంతటి వ్యయప్రయాసల కైనా ఎలా ఓరుస్తుందో, ఎంతటి నియమనిష్ఠలనైనా ఎలా ఆచరిస్తుందో వరుస పద్యాలలో వివరించారు. లోకసామాన్య ధోరణులని కళ్ళకు కట్టించిన ఈ పద్యాలు మాతృత్వమధురిమను ఆస్వాదించటానికి ఉవ్విళ్లూరే మహిళల మనోదర్పణాలు.

పుత్రులకోసం ఇష్టదేవతలకు ముడుపులు కట్టటం, గర్భంకోసం వివిధ ఔషధాలు సేవిస్తూ ధర్మచింతనతో కాలం గడపటం, గర్భం ధరించిన విషయం తెలియగానే లోపల ఉన్న పిండానికి కావలసిన శక్తినిచ్చే ఆహారాదులను తన ఇష్టాయిష్టాలు పక్కకి పెట్టి గ్రహించడం, గర్భరక్షణ కోసం రక్షరేఖలు కట్టుకోవడం, గాలి ధూళి సోకకుండా విభూతి పెట్టుకోవడం వంటి అంశాలన్నింటినీ ఏ చిన్న విషయమూ వదలకుండా తన శతకంలో చోటు కల్పించారు కవి అప్పావు గారు.

పుత్రుడు కలగగానే తాను పడిన కష్టాన్నంతా మర్చిపోయి అన్నీ సాధించినట్టు సంతోషించే తల్లి హృదయాన్ని ఈ శతకంలో చూడచ్చు. అలాగే పురిటి గదిలోకి ఎవరుబడితే వారు రాకుండా గదిబయట వృద్ధస్త్రీలను కాపుంచటం, బిడ్డ జాతక విశేషాలను పండితులనుండి తెలుసుకోవటం, అనుభవమున్న స్త్రీల చేత ఉగ్గు పోయించడం వంటి విషయాలను వరుసక్రమం తప్పకుండ వర్ణించి ఇటు వంటి తల్లిని పోలరెవ్వరున్ అని పాఠకునికి స్వీయానుభవాలు స్ఫురణకు వచ్చేలా పద్య నిర్మాణం చేశారు కవి.

బిడ్డ ఎలా పుట్టినా, ఏ అవలక్షణాలు కలిగి ఉన్నా తల్లికి భారం కాదు. బిడ్డ ఆరోగ్యంగా, క్షేమంగా ఉండటాన్ని మించిన సంపద ఏదీ తల్లికి ఉండదు. రూపురేఖలు ఎలా ఉన్నాయో తెలీని బిడ్డకోసం తన రూపురేఖలు మారినా పట్టించుకోకుండా, బిడ్డకు జన్మనిచ్చి తాను పునర్జన్మ ఎత్తే తల్లి ఆ బిడ్డ కోసం చేదు కషాయాలు, ఔషధాలు సేవిస్తుంది. కట్టెకారం వంటి పదార్థాలను బాలింతలకు తినిపించడం ఇప్పటికీ మన సాంప్రదాయంలో ఉంది. బిడ్డకు పాలిచ్చే దశలో ఉన్న తల్లి తీసుకునే ఆహార ప్రభావం బిడ్డమీద పడుతుంది కాబట్టి తల్లి కాగానే నోరుకట్టుకుని పథ్యం చేసే తల్లి గొప్పదనాన్ని ఎవరితో పోల్చగలమంటారు కవి. అలాగే తమ వంశచంద్రుడైన కొడుకు విడిచే మలమూత్రాలని చల్లని చందననీరుగా భావించి ఆనందించటం వంటి సాధారణ దృశ్యాలెన్నిటినో ఈ శతకం స్ఫురణకు తెస్తుంది.

పసిబిడ్డ ఉన్న ఇంట్లో 24 గంటలలో చోటుచేసుకునే ప్రతి అంశమూ పద్యరూపాన్ని పొందడం ఈ శతకంలో మనం చూడచ్చు. అలాగే దినదినప్రవర్ధమానమవుతున్న బిడ్డ చేసే పనులలో కనబడే ప్రతి మార్పు ఈ శతకంలో ప్రస్తావించబడుతుంది.

**"కడువడి నెందరిన్ గనినగాని తనూజులు చెంతజేరిపై**
**బడి మురిపెంపు బెంపు నెఱబాధలు పెట్టినగాని వేపటం**
**బడక నితోధికంబయిన బాలురగన్వలెనంచు బాళిలో**
**బొడమి చరించుచుండు విరిబోణిని దల్లిని బోలరెవ్వరున్"**

(మా.శ. 46)

ఈ పద్యం చదువుతుంటే 'కన్నమ్మకే వాపి, తిన్నమ్మకే వాపి' అనే నానుడి గుర్తుకు వస్తుంది. ఆహారపదార్థాల రుచి తెలిసి ఆనందించేవాడు ఇంకా తినాలనుకుంటాడు. బిడ్డ స్పర్శ అందించే ఆనందాన్ని అనుభవించిన తల్లి ఇంకా బిడ్డలు కావాలనుకుంటుంది. ఎంతమంది పిల్లలైనా తల్లికి బరువుకాకపోవడం ఎంతసత్యమో ఈనాడు పదిమంది బిడ్డలకి వృద్ధాప్యంలో ఉన్న తల్లి బరువుకావడం కూడా అంతే నిజం .

**"పెరచిరుతన్మథింప గనిపెంచిన యాబిడ చాడి చెప్పినన్"**

(మా.శ. 49)

తోటి పిల్లలతో ఆటలాడే సమయంలో కొడుకు చేసే పనుల గురించి ఎవరైనా చాడీలు చెప్తే ప్రతి తల్లి కొడుకు అమాయకుడని వెనకేసుకు వస్తుంది. ఇంటికి తిరిగివచ్చిన తరువాత కొడుకుకి బుద్ధి చెప్పే ప్రయత్నం చేస్తుంది. అలాగే బిడ్డకి షడ్రసోపేతమైన భోజనం పెట్టి తిన్న తరువాత ముద్ద అయినా ముట్టలేదని చెప్పే తల్లిప్రేమ ఈ శతకంలో అక్షరంగా మారింది. పాఠకులందరూ ఆయా సందర్భాలలో తమ తల్లిని గుర్తు చేసుకోకుండా ఉండలేరు.

అల్లరి చేసిన కొడుకుని దండించబోయే తండ్రిని అడ్డుకునే తల్లి, అడిగింది ఇవ్వాలని మంకుపట్టు పట్టి మారాం చేసే పిల్లవాడు కోరింది ఇచ్చే తల్లి, చదువుకోవటానికి బడికి పంపించి వదిలిరాలేక తచ్చాడే తల్లి కొడుకుకి ఏ చిన్న ఇబ్బంది కలిగినా ఆందోళన పడే తల్లి, సంపదలను,అందరిమెప్పును అందించే చదువు ప్రాధాన్యాన్ని కొడుక్కి వివరించే తల్లి, విద్యావంతుడై, ఉద్యోగస్తుడైన కొడుక్కి గుణవంతు రాలైన అమ్మాయితో వివాహం జరిపించి మూడులోకాలు ఏలినట్టు భావించే తల్లి, కొడుకు కోడళ్ళ అన్యోన్యతకు పొంగిపోయే తల్లి, మనుమడికోసం కోడలి చేత నోములు, వ్రతాలు చేయించే తల్లి, కొడుకు ఎంత ఎదిగినా ఏ స్థాయికి చేరినా ధర్మమార్గాచరణ ప్రాముఖ్యతను ఉద్బోధించే తల్లి, తన శక్తి ఉడిగినా పుత్రుడి క్షేమం కోసమే ప్రార్థనలు చేసే తల్లి, హరిహరాదులు కూడా ఓర్చుకోలేని బాధలను కొడుకు కోసం భరించే తల్లి, ఇలా తల్లియొక్క వివిధ రూపాలను కంటికిరెప్పలా కొడుకును కాపాడే తల్లి ప్రయత్నాన్ని కవి ఈ శతకంలో అద్భుతంగా వర్ణించారు.



**వేదవ్యాసరచిత మాతృవందనశ్లోకాలతో పోలిక**

వాయుపురాణంలో వ్యాసమహర్షి 16 శ్లోకాలతో మాతృవందనం చేశారు.

**"గర్భస్య ధారణే దుఃఖం విషమే భూమి వర్త్మని**
**తస్యనిష్క్రమణార్థాయ మాతృపిండం దదామ్యహం"**

గర్భం ధరించడమే దుఃఖం. దానికితోడు ఎగుడు దిగుడు నేల మీద నడవడం అంతకన్నా కష్టం. ఆ కష్టం కలిగించినందుకు ప్రతిగా ఈ మాతృపిండాన్ని సమర్పిస్తున్నాను అన్న వ్యాసుడి శ్లోకగత భావాన్ని గ్రహించి ఈ శతకకర్త :

**"కడువడి మీర నందనుని గర్భములో భరియించి యింటిలో**
**నడిచెడివేళ దా బనులు నాణెముగా నొనరించువేళ నిం**
**పదరగ గూరుచుండు నెడనైన ప్రయాసములోర్చి గాననీ**
**పుడమిని లోకమాత యనబోలిన దల్లిని బోలరెవ్వరున్"**

(మా.శ. 97)

అనే పద్యంలో అందించారు.

**"మాసి మాసి కృతం కష్టం వేదనాప్రసవేషుచ**
**తస్యనిష్క్రమణార్థాయ మాతృపిండం దదామ్యహం"**

ప్రసవ పర్యంతం నెలనెలా కష్టం కలిగించినందుకు ప్రతిగా ఈ మాతృపిండాన్ని సమర్పిస్తున్నాను అని తల్లి కష్టాన్ని కొడుకు చేత గుర్తింపచేశాడు వ్యాసమహర్షి.



ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 7  హైదరాబాద్ మే : 2023



మాతృశతకకర్త అప్పావు ఈ శ్లోకచ్ఛాయను తన పద్యంలో ప్రతిఫలింప చేశారు.

**"ప్రసవమునొందునాడు పాడు బాములు చూచిన బ్రాణహానియై
యొసగినగాని లోన గసటెంతయు లేకయె పుత్రవాంఛలో
మసలెడు గాన నింకిట సమాన దయారసపూర్ణులెవ్వరీ
వసుమతి లోన దివ్యగుణవార్ధిని దల్లిని బోలరెవ్వరున్"**

(మా.శ. 98)

**"పాపాయౌ కటుద్రవ్యాణి క్వాథాని వివిధానిచ
తస్యనిష్క్రమణార్థాయ మాతృపిండం దదామ్యహం"**

ఇది అది అనకుండా అన్నీ రకాలైన చేదు కషాయాలూ తినడం, తాగడం చేయవలసి వచ్చింది నా వల్ల. అందుకు ప్రతిగా ఈ మాతృపిండాన్ని నీకు సమర్పిస్తున్నాను.

**"రాత్రేమూత్రపురీషాభ్యామ్ ఖిద్యతే మాతృకర్పటే
తస్యనిష్క్రమణార్థాయ మాతృపిండం దదామ్యహం"**

రాత్రిపూట మలమూత్రాలతోనే పక్కతడిపి నీకు సుఖం లేకుండా చేసినందుకు ప్రతిగా ఈ మాతృపిండాన్ని నీకు సమర్పిస్తున్నాను. (వాయుపురాణం)

**శిలాక్షరం**

**(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం - సమాలోచన)**

ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.




సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి
సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య
వెల : 300/-

**సంప్రదించండి.**
**మూసీ మాసపత్రిక**
**ఫోన్: 934 7971177**

**"పెనకువ మీరునంత తనబిడ్డ పయింగలయట్టి బాళిచే
తను మలమూత్రముల్గడుముదంబున నెమ్మెయి బూసినట్టి చం
దన హిమనీ సౌరభము దారి దలంచు నిజాన్వయాబ్ధి చం
ద్రుని గనినట్లు పొంగు భళిరే యల దల్లిని బోలరెవ్వరున్"**

(మా.శ. 31)

పై శ్లోక భావం ఈ పద్యంలో వికసించిన విధానానికి వ్యాఖ్యానం అవసరంలేదు. కారణం ఏమనగా మాతృవందనం చేసిన కవులతో పాటు పాఠకులూ సహృదయులే.

మాతృశతకంలో కవి ఒక చోట తల్లిని **'తనుజేప్సితార్థఫలదాయిని'** గా అభివర్ణించారు. కానీ పుత్రుడు కోరకుండానే అన్నీ సమకూరుస్తూ తల్లి బిడ్డకి అనేక విధాల ఆధారమవుతుంది. గర్భంలో ఉన్న బిడ్డకు తల్లి తన ఆహారంలో భాగం ఇస్తుంది. పుట్టిన బిడ్డకు శరీరాన్నిపిండి ఆహారాన్ని అందిస్తుంది. ఎదిగే బిడ్డకు ఎన్నో శ్రమలకోర్చి ఆహారాదులు సమకూరుస్తుంది. రోగపీడితుడైన బిడ్డకోసం ఆహారం వదిలి ఉపవాసాది దీక్షలు చేస్తుంది. అటువంటి తల్లిని పోలిన వారు ఉండరనే కవి భావన అక్షరసత్యం.

లోకంలోని అనేక అంశాలను తల్లి రూపంగా భావించడం మన సంప్రదాయం. భూమాత, వనదేవత, దేశమాత.. అంటూ వివిధ రూపాలలో తల్లిని ప్రత్యక్షంచేసే అద్భుతమైన సంస్కృతి కలిగిన భారతదేశంలో ఈనాడు స్త్రీలపట్ల నిర్లక్ష్యంగా, అమానవీయంగా, వ్యవహరిస్తున్న వ్యక్తుల సంఖ్య పెరుగుతోంది. ఎక్కడ స్త్రీలు పూజింపబడతారో అక్కడ దేవతలు నివసిస్తారు అనే సూక్తి అపహాస్యమవుతోంది. ఈ ధోరణిని అరికట్టాలంటే తల్లిగా స్త్రీమూర్తి గొప్పతనాన్ని సునిశితంగా సవివరంగా చాటిచెప్పిన ఇటువంటి రచనలు మరుగున పడకుండా అందరికీ చేరువ కావాలి. పాఠ్యాంశాలలో వీటికి చోటు కల్పింపబడాలి.

తల్లి సహనానికి ప్రతీక అనేది ఎంత నిజమో, అవసరమైతే ఎదిరించే శక్తిగా ఉండటంకూడా అంతే అవసరం. నవరాత్రులలో దుర్గారూపిణియై జగన్మాత దానినే ఉద్బోధిస్తోంది. తల్లిగా మారే ప్రతి స్త్రీ తనలో నిబిడీకృతమైన ఆ శక్తిని గుర్తించేందుకు ఇటువంటి రచనలు ఉపకరిస్తాయి. మే నెల రెండవ ఆదివారం పాశ్చాత్య దేశాలలో అంతర్జాతీయ మాతృదినోత్సవం జరుపుకునే సంప్రదాయం ఉంది. అయితే మానవుడి జీవితంలో మాతృ ప్రాధాన్యత ఒక్కరోజుకు పరిమితం కాదనే సత్యాన్ని అద్భుతంగా చాటి చెప్పింది ఈ శతకం.

**ఉపయుక్తాలు**
**ఆంధ్రభారతి.కామ్**
**మాతృశతకమ్ - మాతూరి అప్పావు మొదలారి**
**మాతృవందనం - చాగంటి కోటేశ్వరరావుగారి వ్యాఖ్యానం**

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 7 (39) హైదరాబాద్ మే : 2023

# 'సావిత్రి' : శ్రీ అరవిందుల వారి ఆధునిక మహాకావ్యం

**వేలూరి కృష్ణమూర్తి,** మైసూరు, ఫోన్ : 944 897 7877



మానవ జీవితం పరమ లక్ష్యమేమిటి? అనాది కాలంనుండి ఈ ప్రశ్న అందరూ అడుగుతూ వస్తున్నదే. కాని, ఆ ప్రశ్నకు ఉత్తరాలు మాత్రం ఎన్నెన్నో! ఒక్కొక్క జవాబుకూడ దాని భిన్న-విభిన్నమైన దృష్టికోణమై వుంటుంది. వీటిలో 'అమృతత్వం' లేక 'మోక్షం'. మన ఇహ జీవితంలోనే సాక్షాత్కరింప జేసుకోవడం కూడ ఒక లక్ష్యంగా పరిగణించబడింది. దీనికి కొన్ని మార్గాలున్నవి. అలాంటిదొక మార్గం పట్టిన సాధకులకు మార్గసూచిగా నిలువగలిగే గొప్ప తాత్విక మహాకావ్యం శ్రీ అరవిందులవారి సావిత్రి. సావిత్రి-సత్యవంతుడి కథ అందరికీ తెలిసినదే. మహాభారత కథలో వున్న సత్యవాన్-సావిత్రి ఉపాఖ్యానం మార్కండేయ ముని ఇంతకు మునుపు పురాణకాలంలో పాండవుల పత్ని ద్రౌపదిలాగే సావిత్రి కూడ దృఢ చిత్తురాలైన ప్రతివ్రతగా జీవించిన స్త్రీరత్నమని, ఆమె కథను చెబుతారు. సావిత్రి-సత్యవంతుడి కథ మన దేశం జనుల మనసులలో లోతుగా పూడుకుపోయిన ఒక అద్భుత కథ. ఈ కథ ఆధారంగా అరవిందులవారు ఇంగ్లీషులో 'సావిత్రి' (SAVITRI: A Legend and a Symbol— first published in 1950-51) అన్న ఒక తాత్విక మహా కావ్యాన్ని రచించారు.

అరవింద ఘోష్ ఒక క్రాంతికారి స్వాతంత్ర పోరాట యోధుడుగానూ, ఒక గొప్ప ఆధ్యాత్మ సాధకుడుగానూ భారతీయులకు చిరపరిచితుడు. భారతీయ పరిపాలనా సేవా వ్యవస్థలో (ICS) విజయం సాధించి మొదలు బరోడాలోని సయాజీరావ్ గాయక్ వాడ్ వారి సంస్థానంలో ఒక ఉన్నత అధికారంలో వుండి అనంతరం భారత స్వాతంత్ర సంగ్రామం విషయంలో ఆసక్తి కలిగి క్రాంతికారుడన్న పట్టాన్ని కట్టుకొని, చివరకు నిరంతర యోగసాధనలో 'మహర్షి' అని అనిపించుకొన్నవాడు శ్రీ అరవింద ఘోష్. సాధకుడుగా పాండిచ్చేరిలో తన జీవితానికి సార్థక్యాన్ని కనుగొని అరవింద మహర్షి అయ్యాడు. మహర్షి శ్రీ అరవిందులు భారతీయ గొప్ప యోగులలో ఒకరు. వారు, కవి, విద్వాంసులు, మహాయోగి, స్వాతంత్ర యోధుడు. బెంగాలీ ప్రాంతంలో జన్మించి స్వాతంత్రానికై పోరాటం చేసి చివరకు పాండిచ్చేరిలో నివసించి దివ్యజ్ఞానం పొంది ఎన్నో గొప్ప కృతులను రచించిన మహనీయుడు. వారు రచించిన కృతులలో The Life Divine, The Secret of the Veda మరియు Savitri ఆధునిక భారతీయ సాహిత్యంలో హిమాలయ సదృశమైన అనుపమ కృతులు. శ్రీ అరవిందులవారి మొదటి గ్రంథమైన The Life Divine గద్య కావ్యం. రెండవ గ్రంథం Savitri పద్య కావ్యం. The Secret of the Veda, ఆగస్ట్ 1914 నుండి జనవరి 1920 వరకు ధారావాహికంగా ARYA పత్రికలో ప్రచురింపబడి 1956లో పుస్తక రూపంలో వచ్చింది. మాతృభాషైన బెంగాలీతోపాటు బాల్యం నుండే ఆంగ్లభాష అభ్యసించినందున అరవింద ఘోష్ కు రెండు భాషలలోనూ ప్రావీణ్యత వుండినది. 'సావిత్రి' శ్రీ అరవింద ఘోష్ అంగ్ల భాషలో రచించిన మహాకావ్యం. సావిత్రి మహాకావ్యం ఆంగ్లభాషలో ప్రకటింపబడిన మొట్టమొదటి దార్శనిక మహాకావ్యం. ఆధునిక ఆంగ్ల సాహిత్యచరిత్రలో ఇదొక అత్యుత్తమమైన / ఎల్లలులేని మహాకావ్యమన్న పేరు గడించింది. ఈ కృతి మొదలు బంగాలిభాషకు అనువాదమైంది. అనంతరం హింది, అలాగే ఎన్నో ఇతర భారతీయ భాషలలోనికి, సంక్షిప్త రూపంలోనో లేక సంపూర్తిగానో- అనువదింపబడినది. ఈ 'సావిత్రి' కృతి అరవిందులవారి సృజనశీల మహోన్నత కృతి. ఈ కథలో యమునితో వాదించి, మరణించిన భర్తను మరలా బ్రతికించుకొన్న సావిత్రి కథ భారతీయ పరంపరలో మహాభారతం యొక్క భావమై నిలిచిపోయింది. ఈ కావ్యానికి స్ఫూర్తి యిచ్చిన కథానకం, ఒక ఉపాఖ్యానంగా మహాభారతంలో ఉల్లేఖింపబడిన సావిత్రి-సత్యవంతుడి కథ, అందరికీ , తెలిసినదే. మహాభారతం అరణ్య పర్వంలో ఒక ఆఖ్యాయికగా వున్న ఈ కథే అరవిందులవారి 'సావిత్రి' మహాకావ్యానికి మూలం. మహాభారతంలో 700 పాదాలున్న కథను అరవిందుల కావ్యంలో 24,000 పాదాలతో పన్నెండు కాండలలో విస్తరింపబడింది. ఈ కథ పందిరిని/హందరవన్ను వాడుకొని ప్రతీకాత్మకమైన ఈ కథలోని ముఖ్య పాత్రలైన సావిత్రి-

సత్యవంతుడు–అశ్వపతి–ద్యుమత్సేన, యమ, మరియు నారదులవారు – వీరి పేర్ల సంకేతార్థాలను ఔచిత్య పూర్ణంగా విస్తరించి, మానవ జీవితంలో అమృతత్వాన్ని సాకారం చేసుకోవడం ఎలా సాధ్యమని చూపారు. ఇరవైనాలుగువేల పాదాలున్న ఈ మహా కావ్యాన్ని శ్రీ అరవిందులవారు తమ యాభై ఏళ్ళ జీవిత కాలంలో రచించారు.

సావిత్రి కావ్యం లోని ఈ పాత్రలు, మృత్యుముఖం మట్టంనుండి అమరత్వపు దివ్యచేతనం వైపు, అలాగే దివ్యజీవనం వైపు తీసుకు వెళ్ళడానికి కారణులని అరవిందులు తమ కావ్యంలో వక్కాణించారు. అది సావిత్రి కావ్యం అఖండ ఆశయం కూడ. అరవిందులవారు తమ కావ్యంలో చిత్రించిన రూపకం, ప్రతిమా సంకేతాలు, అసాధారణమైన వ్యుత్పత్తి, మౌలికమైన కల్పన, దట్టమైన వర్ణనలతో, రమ్యమైన చిత్రంలా, అలాగే అనితర సాధారణమైన దర్శన దృష్టితో శ్రీ అరవిందులవారి సావిత్రి కావ్యం సహృదయులైన చదువరులకు అనన్యమైన అనుభవాన్ని కలిగిస్తుంది. పాతివ్రత్య ధర్మానికి మరొక పేరైన సావిత్రి, తన వివేకంతో యముడిని మెప్పించి భర్త సత్యవంతుడిని మరలా పొందిన ధీర మహిళ. ఈ విధంగా సావిత్రి భారతీయులకు సతీత్వానికి ఒక మాదిరియై సతీసావిత్రి అనే ప్రసిద్ధురాలవుతుంది.

సావిత్రి తండ్రి మద్రదేశపు రాజైన అశ్వపతి. తల్లి మాళవ దేశం రాజకుమారి మాలతి. ఆ రాజ దంపతులు పదునెనిమిది సంవత్సరాల కాలం 'సావిత్రి'దేవి ఉపాసన చేసి బ్రహ్మ అనుగ్రహంతో కూతురిని పొంది, ఆ బిడ్డకు సావిత్రి అనే నామకరణం చేస్తారు. ప్రబుద్ధురాలై యుక్త వయసుకు వచ్చిన సావిత్రి, సాల్వరాజు ద్యుమత్సేన కుమారుడైన సత్యవంతుడి గుణగణాలను గురించి విని అతడే తన భర్తగా నిశ్చయించుకొంటుంది. అతని తండ్రి ద్యుమత్సేన, విధివశాత్తు రాజ్యాన్ని, కంటి చూపును పోగొట్టుకొని భార్యా సమేతుడై అరణ్యంలో ఆశ్రమ జీవితం సాగిస్తున్నారని, సత్యవంతుని ఆయుష్షు మరొక సంవత్సర కాలమేనని, నారదుడిద్వారా సావిత్రి తండ్రి అశ్వపతి తెలుసు కొంటాడు.

చూస్తూ చూస్తూ అల్పాయుడికి కూతురిని యివ్వలేక, అలాగని ఆమె కోరికను కాదనలేక కుమిలిపోతున్న రాజు అశ్వపతికి నారదుడు నచ్చజెప్పడంతో తన కుమార్తె వివాహాన్ని సత్యవంతుడితో జరిపిస్తాడు. కాని, సత్యవంతుడు తండ్రిగారి రాజ వైభోగాలను ఇష్టపడక ఒక సామాన్య మనిషిగా జీవించడానికి ఇష్టపడుతాడు. భర్తే ప్రత్యక్ష దైవమని భావించిన సావిత్రి సతీధర్మం ప్రకారం భర్తవెంటే వుంటానని నిర్ణయించి అతడితో అరణ్యవాసం చేస్తుంది. మద్ర దేశపు రాజకుమారిగా, ఎంతో సౌకుమార్యంగా, అత్యంత గారాబంగా పెరిగిన సావిత్రి అతి సామాన్యమైన ఇల్లాలుగా, అత్యంత నిరాడంబర జీవితం గడుపుతూ భర్త అనురాగంలో, అత్త మామల సేవలో మునిగి తేలుతోంది. సంవత్సరాలు గడుస్తాయి. ఈలోగా నారదుడు చెప్పిన గడువు రానే వచ్చింది. ఒక రోజు కట్టెలు తేవడానికి అడవికి వెళ్ళిన సత్యవంతుడిని పాము కరుస్తుంది. ఉన్నట్లుండి కళ్ళు తిరిగి సత్యవంతుడు కుప్పకూలి పడిపోతాడు. ఎంతసేపైనా భర్త యింటికి వెనుదిరగలేదని అతడిని వెదుకుతూ వచ్చిన సావిత్రి, అలా పడివున్న భర్తను ఎత్తి తన ఒడిలో పడుకోబెట్టుకొంటుంది. కాని, సత్యవంతుడు మరణించినాడని తెలిసి సావిత్రి అఘాతానికి లోనై తీవ్రమైన దుఃఖాన్ని సహించలేక మూర్ఛపోతుంది.

మెలకువైనంతనే, చనిపోయిన తనభర్త సత్యవంతుడి ఆత్మను పాశంతో వున్న కాలయముడు తీసుకుపోతున్నది. తన పాతివ్రత్య మహిమతో చూచి కాలయముణ్ణి అడ్డుకొంటుంది. అపుడు కాలయముడు సావిత్రితో, **'నేటితో నీకు నీ భర్తతో ఋణం తీరింది. నీ భర్తకు జరపాల్సిన సంస్కారాలు జరిపి నీ దోవన నువ్వు పొమ్మని'** చెప్పి వెళ్ళడానికి ఉద్యుక్తుడౌతాడు. వెంటనే హెచ్చరిక వహించి సావిత్రి కాలయముడి వెంటపడుతుంది. తన భర్తను విడువలేనని అతని దారికి అడ్డుపడి తన భర్త ఆత్మను వెనుదిరిగించమని ప్రార్థిస్తుంది. కాలయముడు నానా ప్రకారంగా బాధలు–మరణాలు భూలోకంలో అనివార్యమన్న లౌకిక ధర్మాన్ని తెలిపి ఆమెను దూరంగా వుండమని ప్రయత్నిస్తాడు. కాని సావిత్రి భర్త ఆత్మను తీసుకొనిపోవడానికి విడువదు. తననూ వెంట తీసుకొని పొమ్మని హఠం చేస్తుంది. సత్యవంతుడి ఆయుష్షు ముగిసినది. అందువల్ల నియమాన్ని ఉల్లంఘించడం ఎవరివల్ల సాధ్యం కాదు. అతని ఆత్మను తీసుకొని పోయితీరాలని యముడు ఎంతగా చెప్పినా భర్తను తననుండి తీసుకుపోవడం అసాధ్యం. అతడిని విడిచిపెట్టకుంటే అతనితో నా ప్రాణాన్నికూడా తీసుకుపోవాలని హఠం చేస్తుంది. భర్తలేని బ్రదుకు తనకు అక్కరలేదని అంటుంది. సావిత్రి హఠం యముడిని యిక్కట్టులో పడవేస్తుంది. తన వెంటే వస్తున్న సావిత్రిని యముడు యిలా అంటాడు : **'నీ ధైర్యానికి మెచ్చా. ఏదైనా వరం కోరుకో యిస్తా,'**నని అంటాడు. సావిత్రి తన అత్త మామలకు చూపుతో పాటు పోగొట్టుకొన్న రాజ్యాన్ని ప్రసాదించమని కోరుతుంది. యముడు ఆమె కోరికను మన్నించి వాటిని ప్రసాదిస్తాడు. ఇంతైనా, సావిత్రి తన వెంటే రావడం చూచిన యముడు: 'తల్లీ, నీ కోరిక తీర్చాను గదా. ఇకమీదైనా వెనుదిరుగ మంటాడు. పోనీ, మరొక వరం యిస్తా. ఏం కావాలో కోరుకోమని అంటాడు. అపుడు సావిత్రి తన పుట్టింటి వారికి వారసులు కావాలని కోరినది. అశ్వపతికి నూరు మంది పుత్రులను యముడు అనుగ్రహించాడు. కాని, సావిత్రి యముడి వెంటే వెళ్ళి అతడితో, **'స్వామీ ఏడడుగులు నడిస్తే అపరిచితులైనా బంధువులవుతారని పెద్దలంటారు కదా! మనమిరువురం కలిసి అంతకన్నా ఎక్కువ దూరమే కలిసి నడవడంవల్ల ఆత్మబంధువులమయ్యాముకదా!'** అని అంటుంది. యముడు సావిత్రి వాక్చాతుర్యానికి, సమయస్ఫూర్తికి ముగ్ధుడై

సత్యవంతుడిని పునరుజ్జీవుడిని చేస్తాడు. స్థూలంగా ఇదీ కథ.

సత్యవంతుడు తనలోనే దైవీ సత్యాన్ని ధరించిన ఆత్మ. కాని, ఆ ఆత్మ అవిద్యతో పాటు మృత్యుపాశంలో పతనమైంది. సావిత్రి, దివ్యశ్రుతి, సూర్యుడి కుమార్తె. పరమ సత్యం అధిదేవత. ఆమె పతిత. ఆత్మను ఉద్ధరించడానికి భూమి మీదకు వచ్చినటువంటిది. మానవత్వంనుండి అమరత్వానికి ఎదగడానికి సహాయపడిన శక్తి. సత్యవాన్ తండ్రి ద్యుమత్సేన జ్యోతిమూర్తి యొక్క ప్రభువు. దివ్యమైన మనసుకు యజమాని. అయినా, స్వర్గ సామ్రాజ్యాన్ని చూడలేని గ్రుడ్డివాడుగా ఉండిపోయాడు. ఇలా వున్నప్పటికీ ఇది కేవలం సాహిత్యం యొక్క ఉపమా రూపకం కాదన్నది మహర్షి అరవిందులవారి నిలువు. వీటితో మనము సాక్షాత్ సంపర్కం పెంచుకోవచ్చు. మానవునికి అవి మర్త్య స్థితినుండి అమర్త్య స్థితికి, జీవితం మరియు దైవీ చేతనానికి దారి చూపుతుంది. ఆ కారణంతో, 'సావిత్రి' కావ్యం గొప్ప తాత్విక అనుభవాన్ని యిచ్చే అరవిందులవారి గొప్ప రచన. ఎందరో పండితుల ప్రకారం, అరవిందులవారు సావిత్రి మహా కవ్యాన్ని ఒకే వూపులో రచించిన కృతి కాదని అన్నారు. ఎన్నో సంవత్సరాల తపస్సు ఫలితంగా రచింపబడిన మహాకావ్యం 'సావిత్రి.' ఈ కథాకావ్యాన్ని అరవిందులు మొదట రచించడానికి ప్రారంభించినది, యిది మన పురాణాలలోని ఒక రోమాంచనకారి కథ అన్న దృష్టితో! కాని, దీని రచన ప్రారంభించి ముందుకు సాగినంతా దాని స్వరూపం, నిడివి, గాఢత మార్పు చెందసాగింది. అది ఒట్టి పురాణ కథ మాత్రమే కాక, అదొక సంకేత స్వరూపాన్ని దాల్చిన కారణంతో ఆ కావ్యానికి A legend, a Symbol అన్న ఒక ఉప-శీర్షికను యిచ్చారు అరవిందులు. ఈ కావ్యం విస్తారమవుతూ చివరకు 12 పర్వాల గాత్రంతో, ఎన్నో సర్గలతో, 23,813 పాదాల నిడివితో ఆధునిక మహాకావ్యమైంది!

సావిత్రి తండ్రి అశ్వపతి ప్రాణానికి యజమాని. జీవశక్తికి సంకేతం. అతడు మానవ జన్మతోపాటు ఆత్మసాధన చేసినవాడు. చావు గురించిన సత్యం శోధించటమే సావిత్రి మహా కావ్యం మూల వస్తువు. మానవవికాసంవైపు గమనమిచ్చే సావిత్రిని తెలుసుకోవడానికి ప్రకృతి-పురుషుడి సంబంధం గురించి తెలుసు కోవాల్సినది అనివార్యమన్నట్టు సావిత్రి మహాకావ్యం విస్తరించినది. ఆకర్షణ, వికర్షణలు రెండూ ప్రకృతి-పురుషుడి అవిభాజ్య గుణాలు. ప్రకృతిని వేరుచేసి పురుషుడుగాని, పురుషుడిని వేరుచేసి ప్రకృతిగాని సృష్టి కార్యాన్ని నిర్వహించడం సాధ్యం కాదు. ఈ విషయం గురించి సాంఖ్యయోగం స్పష్టంగా తెలియపరిచినది. ప్రకృతి-పురుషుడు దారి తప్పితే జీవ జగత్తు వినాశనానికి నాంది పలికినట్టేనని సాంఖ్య యోగ తెలుపుతుంది. సాంఖ్య యోగ గురించి లోతుగా అధ్యయనం చేసిన అరవిందులవారు తన సావిత్రి మహాకావ్యంలో ఈ సాంఖ్య యోగతత్వాన్ని స్పష్టంగా ధ్వనింపజేశారు.

ద్యుమత్సేన కుమారుడు సత్యవంతుడికి సంబంధించిన ఈ కథ ద్వారా పుట్టుకకంటే ఎక్కువగా పరీక్షకు లోనయ్యేది మరణమని! మరణం గురించి సాంఖ్య యోగ నేపథ్యంలో అరవిందులవారు తమ సావిత్రి మహాకావ్యం ద్వారా సుదీర్ఘమైన తాత్విక చర్చకు అవకాశం కల్పించారు. చావు గురించి ప్రశ్న మరియు ఆలోచనలు భారతీయ పరంపరకు మాత్రమే పరిమితం కాదు. ఆత్మకు సంబంధించిన జిజ్ఞాసలకు యముడితో వాదించి జవాబులు కనుగొన్న కఠోపషనిత్తులోని నచికేతుడిలా సావిత్రికూడ ఈ పరంపరను ముందుకు తీసుకుపోతుంది. ఈ కథను యోగతోపాటు తత్వ శాస్త్రం నేపథ్యంలో చావు స్వరూపం, అలాగే అవినాభావ సంబంధాలు చావు-పుట్టుకలతో వున్న పోరాటాన్ని ప్రకృతి-పురుషుడు తత్వాల సాంఖ్యయోగ నేపథ్యంలో అరవిందులు మనకు తెలుపుతారు.

శ్రీ అరవింద ఘోష్ గారు తమ దీర్ఘకాల యోగసాధన ద్వారా, మరియు తాను పొందిన సిద్ధి ద్వారా వారు మానవకులం యొక్క భూత-వర్తమాన-అలాగే భవిష్యత్ కాలాల ఒక భవ్యం మరియు పరిపూర్ణమైన దర్శనాన్ని సాక్షాత్కరింప జేసుకొన్నారు. అది వారి అనేక గద్య మరియు పద్య కృతులలో అభివ్యక్తమైంది ప్రముఖంగా అది LIFE DIVINE అన్న కృతిలో గద్యరూపాన్ని దాల్చింది. అదే, 'సావిత్రి' కథావస్తువు పద్య రూపం దాల్చి మహాకా వ్యమయింది. జిజ్ఞాసతో మొదలైన జీవితం పూర్ణయోగంగా ఎలా మారుతుందో శ్రీ అరవిందులవారు భవ్యంగా చిత్రించారు. తన అద్భుతమైన కవితా శైలిలో అధిమానస అతిలోకమైన మహాయోగి పొందే దర్శనానికి, అనుభూతికి, అతిలోకమైన కవితాభివ్యక్తి అరవిందుల 'సావిత్రి' మూల మహాభారతంలో వచ్చే అలాగే భారతీయ పరంపరలో వాడుకలో వున్న సావిత్రి-సత్యవంతుల కథను శ్రీ అరవిందులు చాలామటుకు తమ మహాకావ్యంలో అనుసరించినా, వారు కొన్ని మార్పులను చేసుకొన్నారు. ఈ మార్పులలో ముఖ్యమైనది వారు కథలోని పాత్రలను తాము సాక్షాత్కరింప జేసుకొన్నదానికి అనుగుణంగా తీసుకొచ్చిన గాఢమైన సాంకేతికత, దాని స్వభావాన్నే మార్చివేసింది. ఈ మహా కావ్యంలో అరవిందులవారు సాక్షాత్కరింపజేసుకొన్న అంశాలు కొన్నిచోట్ల దట్టంగానూ కొన్నిచోట్ల పలుచగానూ ఎదురౌతాయి. ముఖ్య పాత్రల గురించిన వర్ణనలు, ప్రతిమలు ఒకటి వెంట ఒకటి/వరుస వరుసగా వస్తాయి. కొన్నిచోట్ల వారి భాషాశైలి సరళంగా వున్నా, చాలాచోట్ల అది సంకీర్ణరూపం దాల్చుతుందుదానికి తోడు అది సూక్ష్మమూ, అలాగే ధ్వనిపూర్ణమై వుంటుంది.

ఈ మహాకావ్యం ప్రారంభమయ్యేది నిశరాత్రి గాఢ చీకటిలో నుండి బయటికివచ్చి సృష్టి వెదజల్లే మొదటి వెలుగు కిరణాల స్పర్శను పొందుతున్నపుడు. అందుకే వారు, **'దేవతలు మెలకువలోకి రావడానికి ముందరి క్షణమది'** (It was the hour before the Gods awake) అన్న వాక్యంతో ప్రారంభించారు ఈ మహాకావ్యాన్ని.

ఈ కావ్యం మొదటి సర్గానికి అరవిందులవారు 'మహోదయం' (The Symbol of Dawn) అని పేరు పెట్టారు. ఈ కావ్యం యొక్క సాంకేతిక స్వరూపం యిక్కడినుండే ప్రారంభమౌతుంది. సావిత్రి జీవితానికి సంబంధించిన కథానకం మాత్రం ఈ (సర్గంలోని) ఉప శీర్షికలో సుమారుగా 200 పాదాలకు పైగా కొనసాగుతుంది. సావిత్రి కన్నులు విప్పిన ఆరోజు ఆమె జీవితం ఆయుష్షులో అత్యంత ముఖ్యమూ మరియూ మహత్వకరమైన రోజు. సత్యవంతుడిని ప్రేమించి అతడిని వివాహం చేసుకొని అతని ఆశ్రమానికి వచ్చి అతడితో సంసారం చేయడం ప్రారంభించి సరిగా ఒక సంవత్సరం గడిచిన రోజది! నారద మునులవారు చెప్పిన భవిష్యం ప్రకారం, ఈ రోజు సత్యవంతుడు మరణం చెందాల్సిన రోజు. ఈ విషయం సావిత్రి ఒక్కదానికి మాత్రమే తెలుసు. సత్యవంతుడికిగాని, అతడి తల్లిదండ్రులకుగాని తెలియదు. ఈ రోజు ఆమె మనఃస్థితి ఎంత జటిలంగా, భావ సంకీర్ణతతో కూడివున్నదన్న సూక్ష్మమైన వర్ణన ఈ మొదటి ఉప – శీర్షికలో చిత్రించబడింది. ముఖ్యంగా ఈ క్రింది పాదాలు గమనించాలి : తాను వ్యథ చెందుతున్న రహస్యాన్ని ఆమెవరికీ చెప్పజాలనిది శాంతంతో కూడిన ముఖపద్మం, ధీరత తన నోటిని కప్పినది. ఆమె మానవత్వం కూడ అర్ధ దైవికమైంది. సర్వగతమైన చేతనానికి ఆమె గొప్ప చేతనం తెరచుకొన్నది!

**'దుఃఖంతో జీవించడం, మృత్యువును దారిలో అడ్డుకోవడ'**మని ఆమె దృఢమైన నిర్ణయం చేసివున్నా మానవ సహజమైన తొణికిసలాట తప్పలేదు. చివరి ఈ రెండుపాదాలలో ఆమె అంతరంగ స్థైర్యాన్ని వర్ణిస్తూ **'సత్యవంతుడు మరణించేది ఈ రోజే'!** అని రచించిన కవిగారి ఉక్తి యింతకు మునుపు పూర్తిగా ఆమె అనుభవించిన సంకీర్ణ అనుభవాలపై వెలుగు చూపుతుంది. మొదటి పుస్తకం, రెండవ సర్గం శీర్షికకు 'ప్రస్తుత ప్రశ్న' (The Issue). సత్యవంతుడితో యిది తన జీవితంలో చివరి రోజని భవిష్యం చెప్పివున్నా, దానిని అలా జరుగడానికి ఆమె సిద్ధంగా లేదు. కాని దానిని **'తప్పించగల శక్తి తనలో, తన ప్రేమలో వున్నదా?'** అన్నది ఈనాడు ఆమెను చింతకు లోనుచేసింది. గడిచిపోయిన రోజులను నెమరువేసుకొని తన గతాన్ని అవలోకించిన సావిత్రి తన బాల్యం, యవ్వనం, పతిశోధన, స్వీకారం, అతడితో తపోవనంలో గడిపిన 12 నెలల దాంపత్య జీవనాన్ని జ్ఞాపించుకొన్నది. అశ్వపతిరాజుగారి కుమార్తె సావిత్రి రాకుమారిగా, తండ్రిచాటు బిడ్డగా ఉన్నంత కాలం రాజభోగాలనుభవించింది. ఆమెకు స్వయంవరం జరిగినపుడు సకల సద్గుణ సంపన్నుడైన సత్యవంతుడు అల్పాయుష్కుడు, ఒక సంవత్సర కాలం మించి జీవించడని నారదులవారు చెప్పినా సావిత్రి అతడినే వరిస్తుంది. ఎదురౌతున్న చావుకు తాను శరణవ్వాలా లేక చావే తన ప్రేమకు శరణయ్యేలాగా చేయాలా అన్నది ఆమె ఎదుర్కోవాల్సిన అప్పటి ప్రశ్న:

ఇపుడామె చేరిన మెట్టు జీవితం విఫలం కావాలి లేదా, ఈ జగత్తులో చావనే (జగదచావు) గవిలోనికి దూరి, అసహాయ జీవితపు హక్కులను ఎత్తిపట్టి సాధించింది. ప్రేమించే తన అధికారం, ఆమె మహాసంకల్పం. దీనిని తనకు మాత్రమే కాదు, పూర్తి మానవజాతి ప్రేమయోగసిద్ధికై ఆమె ఎత్తుకొన్న మహా కార్యం.

దీని తరువాత మొదటి పుస్తకంలోని మిగిలిన సర్గాలలోనూ, రెండు మరియు మూడవ పుస్తకంలోని అన్ని సర్గాలలోనూ ఆమె తండ్రి అశ్వపతి చేసిన యోగసాధన మరియు, వారు ప్రతి మెట్టులోనూ పొందిన అనుభవాల విస్తారమైన వర్ణన ఉన్నది. ఇందులో శ్రీ అరవిందులవారి ఆత్మారవిందం ఎలా వికసిస్తూ పోయినదన్న స్పష్టమైన సూచనలున్నాయి. శ్రీ అరవిందులవారు జగత్తు మిథ్య అని, క్లేశమని, దుఃఖమని తిరస్కరించలేదు. ఈ జగత్తు, ఈ చైతన్య పురుషుడిలాగే సత్యం అని కనుగొన్నారు. భౌతిక వికాసంలాగే ఆత్మ వికాసం కూడ క్రమ క్రమంగా Step by Step వివరించారు.

అరవిందుల సావిత్రి మహాకావ్యాన్ని అర్థం చేసుకోవడం అంత సులభం కాదు. యోగ నేపథ్యంలో పూర్తి కథా సరణి కొనసాగుతుంది. సావిత్రి పోరాటానికి సంకేతమైతే, సత్యవంతుడు జీవితానికి సంకేతమౌతాడు. మృత్యు దేవతైన యముడితో సావిత్రి చేసే వాదం, అతడిచ్చే వరాల ద్వారానే మృత్యుదేవతనే చిక్కుకు లోను చేసే జాణతనం, పూర్తి జీవిత పోరాటాన్ని, అలాగే సాధనను చిత్రిస్తుంది. ఈ మహాకావ్యం యొక్క విశిష్ట రూపం ప్రపంచంలోని యితర మహాకావ్యాలలో అగుపించని స్థానం వున్నది. దీని గురించి అనేకమంది ఎన్నో వ్యాసాలను, గ్రంథాలను వ్రాసివున్నారు.


# ఆలోకనం

**(తెలంగాణ 31 జిల్లాల చరిత్ర సాహిత్య సాంస్కృతిక సమాచారం)**

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మూసీ మాసపత్రిక ప్రత్యేకంగా సంకలనం చేసిన గ్రంథం ఆలోకనం.

తెలంగాణ 31 జిల్లాలకు సంబంధించిన విలువైన సమాచార సూచిక ఇది.

330 పేజీల ఈ గ్రంథం విలువైన రంగు చిత్రాలతో కూడుకుని ఉన్న విశేష గ్రంథం.

అన్ని రకాల కాంపిటీషన్ పరీక్షలకు కూడా వినియోగపడే సమగ్ర సమాచార దర్పణం.

**మూసీ కార్యాలయంలో దీనిని పొందదలచిన వారికి కేవలం 300/- (అసలు 500/-) కు మాత్రమే అందిస్తున్నాం. సంప్రదించండి.**

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 7 (43) హైదరాబాద్ మే : 2023

# ప్రపంచ సాహిత్యంగా తెలుగు : అంతర్జాలం పాత్ర

**డా. వెంకట రామయ్య గంపా,** ఆచార్యులు, ఢిల్లీ విశ్వవిద్యాలయం. ఫోన్ : 995 860 7789

**(ఈ వ్యాసం యొక్క ముఖ్య ఉద్దేశం ఆంగ్లంలో ఉన్న ప్రపంచ సాహిత్యం అనే అంశాన్ని తెలుగు పాఠకులకు పరిచయం చేయడం, ప్రపంచ సాహిత్య లక్షణాలు తెలుగుకు ఎంతవరకు అన్వయం అవుతాయి అని పరిశీలించడం, తెలుగు సాహిత్యం ప్రపంచ సాహిత్యంగా పరిగణించడానికి అంతర్జాల సాహిత్యం ఏ విధంగా దోహదపడుతుందో వివరించడం. ఆంగ్లంలో డేవిడ్ డామ్రోష్ సంపాదకత్వం వహించిన వరల్డ్ లిటరేచర్ ఇన్ థియరీ అనే పుస్తకం లోని సమాచారాన్ని ఆధారం చేసుకుని వ్యాసాన్ని రచించడం జరిగింది.)**

విశ్వవిద్యాలయ స్థాయి బోధనలో కొన్నిచోట్ల సాహిత్యాన్ని మేజర్ మరియు మైనర్ అనే పద్ధతుల్లో అధ్యయనం చేయడం జరుగుతూ ఉంది. మేజర్ అంటే ఎక్కువ ప్రాచుర్యం పొందిన భాషా సాహిత్యాలు, మైనర్ అంటే స్థానికంగా ఉన్న భాషా సాహిత్యాల అధ్యయనం అనే ఆలోచనతో విద్యార్థులు సాహిత్యపరమైన అంశాలను ఎంచుకుంటారు. చాలా విశ్వవిద్యాలయాలు అధిక సంఖ్యలో విద్యార్థులు మేజర్ అని భావించే ఆంగ్ల సాహిత్య అధ్యయనం వైపు మొగ్గు చూపడం, తక్కువ సంఖ్యలో ప్రాంతీయ భాషా సాహిత్యాలను ఎంపిక చేసుకోవడం సహజంగా జరుగుతూ ఉంది. అలాకాకుండా ప్రత్యేకంగా భారతీయ భాషల్లో ఒక అంశాన్ని మేజర్‌గా ఎంచుకోవాలని అనుకున్నప్పుడు విద్యార్థులు ఎక్కువ శాతం హిందీని లేదా సంస్కృతాన్ని ఎంపిక చేసుకుంటున్నారు. మైనర్ అంశంగా భారతదేశంలోని ప్రాంతీయ భాషల సాహిత్యాన్ని అధ్యయనం చేస్తున్నారు.

ఇక్కడ బోధనలో జరుగుతున్న అంశాలను గమనించినట్లయితే అంతర్జాతీయంగా ఆంగ్ల సాహిత్య అధ్యయనానికి ఎక్కువ విద్యార్థులు ప్రాధాన్యతనిస్తే భారతదేశంలోకి వచ్చిన తర్వాత హిందీ భాషా సాహిత్యాల అధ్యయనానికి అధిక సంఖ్యలో విద్యార్థులు లభించడం, తక్కువ సంఖ్యలో ప్రాంతీయ భాషల అధ్యయనం జరుగుతూ ఉ ఒడడం గమనించాల్సినటువంటి అంశం.

కానీ 1990 తర్వాత భాషా సాహిత్యాల అధ్యయనంలో చాలా మార్పు వచ్చింది. మేజర్, మైనర్ అనే అంశాల ఎంపికల అధ్యయనాల విషయంలోనూ చాలా మార్పు కనిపిస్తుంది. ముఖ్యంగా అమెరికా, యూరోప్ దేశాలలో మైనర్ అంశంగా ఇతర దేశాలకు సంబంధించినటువంటి సాహిత్యాన్ని ప్రపంచ సాహిత్యంలో భాగంగా అధ్యయనం చేస్తూ ఉన్నారు. ఆంగ్ల భాషా సాహిత్యాలలో ఇప్పటికే విస్తృతంగా పరిశోధన జరిగింది. పరిశోధకులు, విద్యార్థులు నూతన అంశాలను ఎంపిక కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో



భాగంగా అప్పటివరకు మైనర్ అంశాలుగా భావించిన ఇతర దేశాల సాహిత్యాలు అనువాదాల రూపంలో కనిపిస్తూ ఉండడంతో పరిశోధన చేయడానికి విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారు. తులనాత్మక అధ్యయన శాఖలలో ప్రపంచ సాహిత్య బోధన అనేటువంటిది ముఖ్యమైన అంశం. ప్రపంచ సాహిత్యం అనే భావన 19వ శతాబ్దంలోనే ప్రారంభమైంది. కానీ విశ్వవిద్యాలయాలలో విస్తృతంగా వ్యాప్తిలోకి రావడం మాత్రం 1990ల తర్వాత మాత్రమే. అందుకు ముఖ్య కారణం ప్రపంచీకరణ. పారిశ్రామికీకరణ తర్వాత వ్యవస్థలో పలు మార్పులు రావడానికి కొంత సమయం పట్టింది. ప్రపంచీకరణ తర్వాత వ్యవస్థలో ఎవరు ఊహించని స్థాయిలో అత్యంత వేగంగా మార్పులు సంభవించాయి. ఈ మార్పులు సాహిత్యంలోనూ చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా సాంకేతిక పరిజ్ఞానం తెలుగు భాషా సాహిత్యాలు విశ్వవ్యాప్తంగా ఉన్న సాహిత్య అభిమానులను ఏకం చేశాయి. ప్రపంచంలోని అన్ని మూలల నుంచి సాహిత్య అభిమానులు ఒకచోట చేరడానికి సాంకేతిక పరిజ్ఞానం ఎంతో దోహదపడింది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం సామాన్యులకు సైతం అందుబాటులోకి వచ్చింది. ఈ సాంకేతిక కారణం వలన పుస్తకం ముద్రణ రూపంతో పాటు ముద్రణేతర రూపంలోనూ లభిస్తూ ఉంది. ఈ సదుపాయం వలన రచయితలకు తమ రచనలను పాఠకులకు చేరవేసే సౌలభ్యం సులభం అయింది. ముద్రణా ఖర్చులు భరించలేని వారు సాంకేతిక పరిజ్ఞానంతో రచనలను సాఫ్ట్ కాపీ రూపంలో పాఠకులకు చేరవేస్తున్నారు. పాఠకులు కూడా క్రమంగా

సాఫ్ట్ కాపీని చదవడానికి అలవాటు పడ్డారు. ముఖ్యంగా కరోనా సమయం తర్వాత సాధారణ పాఠకులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పుస్తకాలను చదవడం అలవాటు చేసుకున్నారు. గతంలో శతాబ్దాల కాలం వరకు కొన్ని తెలుగు రచనలు మాత్రమే చలామణిలో ఉన్నాయి. అతి తక్కువమంది పాఠకులు మాత్రమే ఉన్నారు. సాహిత్య రచనల సంఖ్య క్రమంగా పదుల సంఖ్యలో పెరగడానికి కొన్ని శతాబ్దాల కాలం పట్టింది. పాఠకుల సంఖ్య కూడా చాలా కొద్దిమందికే పరిమితమై ఉండేది. కానీ ప్రస్తుతం తెలుగులో ప్రతి సంవత్సరం వందల సంఖ్యలో సాహిత్య రచనలు వెలువడుతున్నాయి. కొన్ని వేల సంఖ్యలో సాహిత్య పాఠకులు ఉన్నారు. ప్రపంచం నలుమూలల నుంచి తెలుగు సాహిత్యం వెలువడుతూ ఉంది. ఇటువంటి సందర్భంలో తెలుగు ప్రాంతీయ సాహిత్యమా? లేక ప్రపంచ సాహిత్యమా? అని చర్చించాల్సిన అవసరం ఉంది. ఆంగ్ల, ఫ్రెంచ్, జర్మన్ సాహిత్యాల వంటివి ప్రపంచ సాహిత్యంగా భావించినప్పుడు భారత దేశంలో ఉన్న ప్రాంతీయ భాషల్లో ఉన్న సాహిత్యాన్ని ప్రపంచ సాహిత్యంగా పేర్కొనాలా? లేక ప్రాంతీయ సాహిత్యంగా పేర్కొనాలా? అనేటువంటిది ముఖ్యమైనటువంటి ప్రశ్న.

**ప్రపంచ సాహిత్య భావన :**

జర్మన్ రచయిత జోహన్ వోల్ఫ్ గాంగ్ వాన్ గోథే (1749-1832) వరల్డ్ లిటరేచర్ (ప్రపంచ సాహిత్యం) అనే ఆలోచనను 1827 సంవత్సరంలో ప్రపంచానికి పరిచయం చేసినట్లు విమర్శకులు పేర్కొంటున్నారు. మరి కొంతమంది విమర్శకుల అభిప్రాయం ప్రకారం ప్రపంచ సాహిత్యం అనే ఆలోచన అంతకు పూర్వమే ఉన్నప్పటికీ వ్యాప్తిలోకి రాలేదని చెబుతారు.

కొన్ని ఆలోచనలు / సిద్ధాంతాలను నిర్వచించడం సులభం కాదు. నిర్వచనాలకు లొంగని అంశాలు ఎన్నో ఉన్నాయి. ఆ సిద్ధాంతాలను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి తప్ప నిర్వచించడం కష్టం. ఆ కోవలోకి చెందినటువంటిది ప్రపంచ సాహిత్యం అంటే ఏమిటో నిర్వచించడం. ఒక నిర్వచనం ప్రకారం **'ప్రపంచ సాహిత్యంలో ఉత్తమమైనదిగా సూచించే రచనలో ఒక 'యూనివర్సల్ అప్పీల్' ఉండాలి'..** అని విమర్శకుల భావన. ఈ అభిప్రాయం ప్రకారం సాహిత్యం మూల్యాంకనంలో ఒక కఠినమైన విధానం కనిపిస్తుంది. ఈ నిర్వచనం ప్రకారం కేవలం కొన్ని రచనలు మాత్రమే ప్రపంచ సాహిత్య రచనలుగా నిలుస్తాయి. మరికొంతమంది విమర్శకులు ప్రపంచ సాహిత్యాన్ని చాలా సాధారణంగా పేర్కొంటూ సులభంగా వివరించే ప్రయత్నం చేశారు. వారి అభిప్రాయం ప్రకారం **'సాహిత్యంలో ఉత్తమమైన విలువలను ఉచ్చరించకుండా ప్రపంచ సాహిత్యాన్ని ప్రపంచ సాహిత్యంగా పరిగణించాలని'** పేర్కొన్నారు. ఈ నిర్వచనం స్పష్టంగా ఉన్నప్పటికీ, విపరీతమైన సరళత ఉంది. ఒక నిర్వచనం ప్రకారం చాలా ప్రపంచ సాహిత్యం పాశ్చాత్య సాహిత్యం అని ఆంగ్ల విమర్శకుల భావన. ప్రపంచ సాహిత్యం అంటే కేవలం పాశ్చాత్య సాహిత్యమే కాకుండా తక్కిన సాహిత్యాలను కూడా ప్రపంచ సాహిత్యంగా పరిగణించే క్రమంలో నిర్వచనాన్ని కొంతమంది విమర్శకులు సులభతరం చేశారు.

**ప్రపంచ సాహిత్యం- గోథే ఆలోచనలు :**

గోథే యొక్క వరల్డ్ లిటరేచర్ (ప్రపంచ సాహిత్యం) భావన పందొమ్మిదవ శతాబ్దం ప్రారంభంలో ఐరోపాలో ప్రజాదరణ పొందింది. అందుకు కారణం ఆ సమయంలో ఆనాడు జర్మనీలో ఉన్న సార్వజనీనమైన (కాస్మోపాలిటన్) రాజకీయ వాతావరణం. అటువంటి సందర్భంలో పారిశ్రామిక విప్లవ రూపంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని అభివృద్ధి వైపు నడిచే మార్గం కనిపించింది. ప్రజల్లో చైతన్య వాతావరణం కలిగి ఉండేది. సారవంతమైన భూమితో పాటు ప్రజలు కష్టించే స్వభావాన్ని కలిగి ఉన్నారు.. వీటికి గోథే అపారమైన ప్రతిభ సాహితీ శ్రోతలను ఆకర్షించింది. ఆనాడు ఐరోపాదేశాల మధ్య శాంతియుత సహజీవనం ఉండాలని ప్రజలు కోరుకున్నారు. కానీ అందుకు విరుద్ధంగా నెపోలియన్ వంటి వారు యుద్ధాలను కాంక్షించారు. అటువంటి సందర్భంలో గోథేకు విదేశీయులపట్ల ఉన్న ఆదరణ, విదేశీ పాత్రికేయులు, మేధావులలో ఆయన ప్రతిష్ఠను పెంచింది. ఫలితంగా వారు పేర్కొన్న అభిప్రాయాలు ఇతరులు ఆమోదించే పరిస్థితి ఏర్పడింది. ఆనాటి పాఠకులు, ప్రజలు వస్తువులను పరస్పరం మార్పిడి చేసుకోవడం ద్వారా ప్రజల్లో ఉపయోగం ఎలా ఉంటుందో సాహిత్య రచనల్లో కూడా అంతర్జాతీయంగా పరస్పరం అనువాదం చేసుకొని అధ్యయనం చేసినప్పుడు ఉత్తమ సాహిత్య అధ్యయనానికి బాటలు వేసినట్లు ఉంటుందని భావించారు. ఈ ఆలోచన తర్వాత కాలంలో విమర్శకులు సాంస్కృతిక బహుళజాతివాదం ఆలోచనకు దగ్గరగా ఉందని పేర్కొన్నారు.

వరల్డ్ లిటరేచర్ థియరీ అనే పుస్తకంలో గోథే **'ఒక ఉన్నత లక్ష్యం ఉంది, దానిని ప్రస్తుతానికి నేను ఎత్తి చూపాలనుకుంటున్నాను. ఎక్కడ చూసినా మానవజాతి పురోగతి గురించి, ప్రపంచ, మానవ సంబంధాల భవిష్యత్తు గురించి వింటూ, చదువుతూనే ఉంటాం. దీని స్వభావం ఎలా ఉన్నప్పటికీ, మరింత వివరంగా పరిశోధించడం మరియు నిర్ణయించడం నా కార్యాలయం కాదు, ఒక సాధారణ ప్రపంచ సాహిత్యం ఏర్పడుతోందని నేను విశ్వసిస్తున్నాను.'** అని పేర్కొన్నారు.

గోథే ఆలోచనలు ఉన్నతంగా ఉన్నప్పటికీ అతని ఆలోచనలలో కూడా కొంత పరిమితి ఉందని మరి కొంతమంది విమర్శకుల భావన. ముఖ్యంగా గోథేకు ప్రపంచ సాహిత్యం అంటే యూరోపియన్ సాహిత్యం మాత్రమే, ఈ వాస్తవం అతని ఆలోచనలను నేటి కాలంలో ఉన్న ఇతర సాహిత్యాలనుండి వేరు చేస్తుంది

గోథే కాలం నాటికి జర్మన్ సాహిత్యంలో పలు మార్పులు చోటు చేసుకున్నాయి. కళలు, సాహిత్యం ఉత్తమ స్థితిలో ఉన్నాయని గోథే భావించారు. ఆ కలలో సాహిత్యం మిగిలిన ప్రపంచంలో తెలియాలని, అది అనువాద రూపంలో సాధ్యమవుతుందని ఆలోచించారు. అప్పటికే సాహిత్యంలో ప్రత్యేక స్థానంలో ఉన్న ఫ్రెంచ్ సాహిత్యానికి భిన్నంగా జర్మన్ సాహిత్యాన్ని వ్యాప్తి చేయాలని గోథే భావించారు. జర్మన్ జాతీయ భావాన్ని తిరిగి ప్రతిష్టించే ఆలోచన ఇక్కడ కనిపిస్తుంది. అయినప్పటికీ ఇతర భాషా సాహిత్యాల పట్ల గౌరవం ఇష్టాన్ని కలిగి ఉన్నట్లు వారి రచనల ద్వారా విమర్శకులు పేర్కొన్నారు.



**ప్రపంచ సాహిత్యం – రవీంద్రనాథ్ ఠాగూర్ అభిప్రాయం :**

1907వ సంవత్సరంలో రవీంద్రనాథ్ ఠాగూర్ వరల్డ్ లిటరేచర్ అనే వ్యాసంలో విశ్వసాహిత్యపు ఆలోచనలను పేర్కొన్నారు. వ్యాస పరిమిత దృష్ట్యా వారి పేర్కొన్న అంశాన్ని తెలుగులో క్లుప్తంగా ఇక్కడ పేర్కొనడం జరిగింది. వారి అభిప్రాయం ప్రకారం **'సాహిత్యాన్ని ఒక నిర్దిష్ట ప్రదేశానికి, కాలానికి పరిమితం చేస్తే అది నిజమైన వెలుగులో చూడబడదు. విశ్వజనీనమైన మానవత్వం సాహిత్యంలో వ్యక్తమవుతుందని గ్రహించినట్లయితే, రెండవదానిలో చూడదగినదాన్ని మనం గుర్తించగలుగుతాము. రచయిత కేవలం రచనా సాధనంగా మారితే తప్ప ఏ సాహిత్య రచనా విజయం సాధించదు. మానవ జాతి భావాలను రచయిత తన ఆలోచనల్లో గ్రహించి, తన రచనలో మానవాళి బాధను వ్యక్తపరిచినప్పుడే ఒక రచన సాహిత్య ఉత్తమ శ్రేణి రచనలలోకి చేరుతుంది. సాహిత్యాన్ని విశ్వమానవుడు, మహానుభావుడు నిర్మించిన ఆలయంగా మనం భావించాలి.'** అని పేర్కొన్నారు.

**ప్రపంచ సాహిత్యంగా తెలుగు :**

ఆంగ్లంలో లభిస్తున్న సమాచారాన్ని విశ్లేషించినప్పుడు తెలుగు సాహిత్యం అనేది ప్రాంతీయ సాహిత్యమా? లేక ప్రపంచ సాహిత్యమా? అనేటువంటి ఆలోచన వస్తుంది. భారతదేశం ఒక ప్రత్యేక దేశంగా 1947 తర్వాత మాత్రమే మనం పేర్కొంటున్నాము. అంతకు పూర్వం చిన్నచిన్న రాజ్యాలు ఉన్న ఒక చిన్నపాటి ప్రపంచంగా భారతదేశాన్ని భావించాలి. 11వ శతాబ్దంలో తెలుగు ప్రాంతాన్ని పలు రాజ్యాలు పరిపాలించాయి. చిన్నచిన్న రాజ్యాలుగా దక్షిణ భారతదేశంలో తెలుగు ప్రాంతాలు ఉన్నాయి. నన్నయ భారతాన్ని రచించే కాలం నాటికి రాజరాజ నరేంద్రుడు పరిపాలిస్తున్న రాజమహేంద్రవరం చాలా చిన్న రాజ్యం. అటువంటి రాజ్యాలు ఆనాడు తెలుగు ప్రాంతంలో చాలా ఉన్నాయి. మనం నివసిస్తున్న రాజ్యానికి వెలుపల ఉన్న ప్రాంతాన్ని మరొక రాజ్యంగాన్ని లేదా ఇప్పుడున్న పరిభాషలో చెప్పాలంటే ప్రపంచంలో మరొక ప్రాంతంగా పేర్కొనాలి. గతంలో సోక్రటీస్, అరిస్టాటిల్ కాలం నాటి గ్రీకు ప్రపంచంలో వెలసిన కాలంలో జనాభా మరియు సాహిత్య పాఠకులు పరిమితంగానే ఉన్నారు. కానీ ఆనాడు వెలువడిన సాహిత్యాన్ని ఈనాడు ప్రపంచ సాహిత్యంగా మనం పేర్కొంటున్నాం. అదేవిధంగా గమనించినప్పుడు 11 శతాబ్దం నాటికి తెలుగు భాష పాతికకు పైగా చిన్న చిన్న రాజ్యాలలో వేల సంఖ్య జనాభాగా ఉండింది.

ఇదే విషయాన్ని సులభంగా చెప్పడానికి మరొక ఉదాహరణగా తీసుకొని చెప్పవచ్చు. ఉదాహరణకు ఇటీవల కాలంలో విశ్వవిద్యాలయాలలో జరుగుతున్న సాహితీ సదస్సులు విశ్వవిద్యాలయ స్థాయిలోనా, రాష్ట్రస్థాయిలోనా, జాతీయస్థాయిలోనా, ప్రపంచ స్థాయిలోనా అనేది ముఖ్యమైన విషయం. సదస్సులో ఇతర ప్రాంతం నుంచి ప్రతినిధులు ఉంటే దాన్ని జాతీయ సదస్సుగాను ఇతర దేశంలో నుంచి ప్రతినిధులు ఉంటే దాన్ని ప్రపంచస్థాయి సదస్సుగాను పేర్కొంటున్నారు. అలాగే తెలుగు భాష ఆనాడు వారి స్థానిక ప్రాంతంతో పాటు సుదూర ప్రాంతాల్లో ఉన్న తెలుగు ప్రాంతాలలో కూడా ప్రజల వ్యవహారంలో ఉండడంతో పాటు ఆ భాషలో రచనలు వెలబడ్డాయి. ఆ విధంగా చూసినప్పుడు 11వ శతాబ్దం నాటికి తెలుగు ప్రపంచ భాష. ఆనాటి లెక్కల ప్రకారం తెలుగు భాష కనీసం 20 నుంచి 30 రాజ్యాలలో వ్యవహారంలో ఉండేది అని చరిత్ర ద్వారా తెలుసుకోవచ్చు.

ఆచరణాత్మకంగా ప్రపంచ సాహిత్య నిర్వచనాన్ని విస్తృతపరచ వలసిన అవసరం ఉంది. ప్రపంచ సాహిత్యానికి ముఖ్యమైన ఆధారం అనువాదాలు లేదా అనుసృజనలు. ఏదైనా ఒక రచనలో విశ్వజనీనమైన అంశం ఉన్నపుడు విశ్వ సాహిత్యంగా పేర్కొనవచ్చు. ఆ రచనలు చేసిన కవిని విశ్వకవిగా పేర్కొనవచ్చు. ప్రపంచ సాహిత్యానికి ముఖ్యమైన ఆధారం అనువాదాలు లేదా అనుసృజనలు. ఇప్పుడు అన్ని రకాల భాషల్లో రాసిన సాహిత్యం అనువాద రూపంలో లభిస్తూ ఉంది. ఈ కారణం వలన ప్రతి పాఠకుడు, తన ప్రాంతంతో సంబంధం లేకుండా అనువాదాల ఆధారంగా ప్రపంచ సాహిత్యాన్ని అధ్యయనం చేసే అవకాశం ఉంది. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా ఉన్నటువంటి సాహిత్య



రచనల్లో క్లాసిక్‌గా చేరుకోదగినటువంటిది వ్యాసమహర్షి రచించిన మహాభారతం. తెలుగులో వెలువడినటు వంటిది వ్యాసమహర్షి రచించిన వ్యాస మహాభారత అనుసృజనగా తెలుగులో లభిస్తుంది. ఆ విధంగా చూసినప్పుడు తెలుగులో మొదట వెలువడినది ప్రపంచ సాహిత్యంలో భాగమైన మహాభారత రచన. తెలుగు సాహిత్యంలో మొదటికవిగా పేర్కొంటున్న నన్నయ విశ్వసాహిత్యాన్ని తెలుగువారికి పరిచయం చేసే క్రమంలోని మహాభారతాన్ని అనుసృజన చేసినట్లు భావించి విశ్వసాహిత్య అధ్యయనం తెలుగులో పదకొండవ సాహిత్య శతాబ్దంలోనే ప్రారంభమైనట్లు పేర్కొనవచ్చు. తర్వాత కాలంలో వచ్చిన వీరశైవ రచనలు సమాజంలో ఉన్న అసమానతలను రూపుమాపి కులవర్గ రహిత సమాజం కోరుకున్నట్లు కనిపిస్తుంది. తెలుగులో 19వ శతాబ్దం వరకు వెలువడిన సాహిత్యంలో ఎక్కువభాగం సంస్కృతం నుంచి లేదా ఇతర భాషల్లో ఉన్న సాహిత్యాన్ని తెలుగులోకి అనుసృజనలు చేసినట్లు కనిపిస్తుంది. తర్వాత కాలంలో వచ్చిన ముఖ్యమైన రచనలన్నీ భాషా పరంగాను లేదా వస్తువు పరంగాను కూడా ఇతర భాషల్లో లేదా ప్రాంతాల్లో ప్రముఖంగా ఉన్నవే. శ్రీనాథుని రచనలు, పోతన ఆంధ్ర మహాభాగవతం, ప్రబంధ యుగంలో వెలసిన ముఖ్యమైన రచనలు అన్నీ కూడా వస్తు పరంగాను భాషాపరంగాను ఇతర భాషల్లో ఉన్న అంశాలు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. ఈ అంశాలను పరిశీలించినప్పుడు తెలుగు రచనలు, రచయితలు, ప్రపంచ సాహిత్యంలో భాగంగా కనిపిస్తాయి. ప్రపంచ సాహిత్యాన్ని తెలుగు వారికి పరిచయం చేసినట్లు మనం అర్థం చేసుకోవాలి. ప్రపంచ సాహిత్య అధ్యయనం అనేది చాలా సంవత్సరాల క్రితమే తెలుగులో ప్రారంభమైనట్లు భావించాలి.

ఇతర ప్రాంతాలలో ఉన్న సంస్కృతీ సంప్రదాయాలను తెలుగువారికి పరిచయం చేసినట్లుగా భావించాలి. ముఖ్యంగా సంప్రదాయ సాహిత్యంలో తెలుగు సంస్కృతితో పాటు ఇతర భాష సంస్కృతులను రచనల్లో పేర్కొన్నారు. తర్వాత కాలంలో ఇతర ప్రాంతాల్లో ఉన్న సంప్రదాయాలు మన ప్రాంతంలో కొనసాగడం వలన అవి తెలుగు సంప్రదాయాలుగా మనం భావిస్తూ ఉన్నాము. ఏది తెలుగు సంప్రదాయం, ఏది కాదని తెలుసుకోవడం ప్రస్తుతం కష్టమైన విషయం.

తెలుగు సాహిత్యంలో కొంతమంది కవులను విశ్వ కవులు అని మనం పేర్కొంటున్నాం. ఉదాహరణకు వేమన, గుర్రం జాషువా గారికి విశ్వకవి అనే పేరుతో సంబోధిస్తున్నాం. విశ్వకవులు తెలుగులో ఉన్నప్పుడు మరి తెలుగులో వెలువడుతున్నటువంటి సాహిత్యాన్ని విశ్వసాహిత్యంగా పేర్కొనలేమా? కొన్ని సందర్భాలలో కొన్ని నిర్వచనాలు, అంశాలు అన్ని భాషలకు సాహిత్యాలకు అన్వయం కావు. అటు ఆంగ్లంలోనూ తెలుగులోనూ ఏది విశ్వసాహిత్యం? ప్రపంచ సాహిత్యాన్ని ఎలా అధ్యయనం చేయాలనేటువంటిది క్లిష్టమైన విషయం. తెలుగులో విశ్వసాహిత్యం అనే అంశం చర్చకు వచ్చినప్పుడు తెలుగులో వెలువడిన రచనలు తప్ప మిగిలిన భాషల్లో ఉన్న రచనలను పేర్కొంటున్నాం. ఉదాహరణకు ప్రపంచ కథాసాహిత్యం పేరుతో సాకం నాగరాజు, వాకా ప్రసాద్‌లు ఒక కథా సంకలనాన్నీ తీసుకు వచ్చారు. ప్రపంచ వ్యాప్తంగా సాహిత్యంలో తిరుగుబాటు ఉద్యమాలు అనే పేరుతో నిఖిలేశ్వర్ ఒక పుస్తకాన్ని తీసుకొచ్చారు. అందులో ప్రపంచ సాహిత్యంలో యువతరం తిరుగుబాటు, ఈ తిరుగుబాటు ఎందుకు? ఆఫ్రికాలో పెల్లుబికిన ప్రజా సాహిత్యం, చీకటి అడవులలో వినిపించిన వేకువ గీతం, హిందీలో నయీ కవిత.. మొదలైన వ్యాసాలు ఉన్నాయి. అయితే ఇందులో కనిపిస్తున్నవి తెలుగు సంబంధించి రెండు వ్యాసాలు మాత్రమే ఉన్నాయి. ప్రపంచ సాహిత్యాన్ని పరిచయం చేయడం అంటే మన భాషలో ఉన్న సాహిత్యాన్ని తప్ప తక్కిన భాషల్లో ఉన్న సాహిత్యాన్ని పరిచయం చేయడం అనే అభిప్రాయం ఉంది.

అయితే ప్రస్తుతం తెలుగు ప్రపంచ స్థాయిలో ఎలా ఉందని గమనించినప్పుడు భిన్నమైన అభిప్రాయం కలుగుతుంది. ఆధునిక విద్య ఫలితంగా వలసలు పెరిగాయి. ప్రయాణాలు, వలసలు, ప్రచురణలు ప్రపంచ సాహిత్యాన్ని దగ్గరకు చేస్తున్నాయి. తెలుగువారు నేడు ప్రపంచంలోని ముఖ్యమైన దేశాలలో నివశిస్తున్నారు. అక్కడ వారి అనుభవాలను తెలుగు పాఠకులకు సాహిత్య రచనల రూపంలో అందిస్తున్నారు. ప్రవాస సాహిత్యం / డయాస్పోరా సాహిత్యం నేడు సాహిత్యంలో కొత్త విషయాలను పరిచయం చేసింది. తెలుగులోని ముఖ్యమైన రచనలు ఆంగ్లంలోకి అనువాదమయ్యాయి. వేల్చేరు నారాయణ రావు గారు వంటి వారు ప్రాచీన తెలుగు సాహిత్యానికి సంబంధించిన కొన్ని ముఖ్యమైన రచనలను ఆంగ్లంలోకి అనువదించారు. అనువాద స్థాయి ఎలా ఉన్నప్పటికీ తెలుగు అనువాద రచనలను ప్రపంచ స్థాయి ప్రచురణ సంస్థలు పుస్తకాలను

ముద్రించడం వలన తెలుగు పుస్తకాలు ఆంగ్ల పాఠకులకు ప్రపంచవ్యాప్తంగా పరిచయమయ్యాయి.

**తెలుగును ప్రపంచ సాహిత్యం చేయడంలో అంతర్జాల సాహిత్యం పాత్ర :**

అంతర్జాల సాహిత్యం 1990 తర్వాత ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి వచ్చింది. కేవలం కంప్యూటర్ తెర పైన ఎలక్ట్రానిక్ మాధ్యమం ద్వారా లభిస్తున్న సాహిత్యాన్ని మాత్రమే అంతర్జాల సాహిత్యంగా పేర్కొంటున్నారు. ఈ అంతర్జాలంలో ఉన్న సాహిత్యం ముద్రణ రూపంలో లభించదు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అంతర్జాల సాహిత్య అధ్యయనం ప్రత్యేకంగా కనిపిస్తుంది అంతర్జాలం పరిచయమైపోయిన తర్వాత ప్రపంచ దృక్పథాన్ని సాహిత్యాన్ని మార్చేసింది. ఈ అంతర్జాలం కారణంగా ఒక సాహిత్యాన్ని కేవలం ఒక ప్రాంతానికి పరిమితం చేయడానికి అవకాశం లేదు. ప్రపంచం మొత్తం ఒక గ్లోబల్ విలేజ్ గా మారిపోయింది. ఈ గ్లోబల్ విలేజ్ లో అన్ని భాషలు సాహిత్యాలు సమానమే. అన్ని భాషలకు సాహిత్యాలకు ప్రపంచ స్థాయి గౌరవం ఉంది. అందుకు కారణం అంతర్జాలంలో లభిస్తున్న సాంకేతిక పరిజ్ఞానం. ఒక భాషలో చెప్పిన అంశాన్ని అంతర్జాలంలో ఉన్న సాంకేతిక పరిజ్ఞానంతో మరొక భాషలోకి సులభంగా అనువదించుకోవచ్చు. కొన్ని సందర్భాలలో ప్రతి అంశం కూడా ఉత్తమంగా అనువాదం కాకపోయినప్పటికీ సామాన్య విషయం ఒక భాష నుంచి మరొక భాషకు అర్థమయ్యే విధంగా ఉంది. ఉదాహరణకు అంతర్జాల పత్రికలలో ప్రచురితమైనటువంటి అంశాలు ప్రపంచంలోని ముఖ్యమైన భాషల్లోకి అనువాదం చేసుకొనే వెసులుబాటును అంతర్జాలం కల్పించింది. పాఠకుడు తనకు నచ్చిన అంశాన్ని ఎంపిక చేసుకొని తనకు నచ్చిన భాషలోకి అనువాదం చేసుకొని చదువుకునే వెసులుబాటు ఉంది. అంతేకాకుండా నచ్చిన అంశానికి తిరిగి అక్కడే తన అభిప్రాయాన్ని వెలిబుచ్చే అవకాశం ఉంది. ఈ కారణంగా పాఠకుడికి రచయితకు మధ్య ప్రత్యక్ష సంబంధం తక్షణమే కలిగే అవకాశం ఉంది. కొన్ని సందర్భాలలో ఆరోగ్యకరమైన చర్చ మరికొన్ని సందర్భాలలో వివాదాలకు అవకాశాలు ఉన్నాయి. అయినప్పటికీ ఒక రచన స్థానిక భాష నుంచి ప్రపంచ భాషకు మారడమే కాకుండా పాఠకుల సంఖ్యను పెరగడానికి అంతర్జాల సాహిత్యం దోహదపడుతూ ఉంది. తెలుగులో ఇప్పటికే ప్రముఖమైనటువంటి అంతర్జాల పత్రికలు చాలా ఉన్నాయి. ముఖ్యంగా ఈమాట, విహంగా, మధురవాణి, కౌముది, సృజన రంజని, కొలిమి, ఔచిత్యం, సారంగా మొదలైనవి కేవలం సాహిత్య పత్రికలు. ఇవి అంతర్జాలం ద్వారా నడుస్తున్నటువంటి పత్రికలు. పత్రిక పుస్తక రూపంలో ముద్రణ లేదు. ఇందులో కొన్ని పత్రికలు విదేశాల నుంచి నడుస్తున్నాయి. కొన్ని పత్రికలు ప్రమాణాలతో కూడిన సాహిత్యాన్ని పాఠకులు




అందిస్తున్నాయి. తెలుగు ప్రాంతాలతో పాటు విదేశాలలోనూ తెలుగు సాహిత్య రచన వ్యాసంగం జరుగుతూ ఉంది. లక్షలమంది తెలుగువారు విదేశాలలో నివసిస్తున్నారు. వందల సంఖ్యలో సాహిత్య రచనలు వస్తున్నాయి. ఇటువంటి సందర్భంలో తెలుగును ప్రాంతీయసాహిత్యంగా పేర్కొనాలా? లేక ప్రపంచ సాహిత్యంగా పేర్కొనాలా?

సామాజిక మాధ్యమాలలో లభిస్తున్న సాహిత్యం విద్యా సమాచారంతో పాటు వినోదాన్ని కలిగిస్తూ ఉంది. సాహిత్యం నచ్చన యాసలో రాసుకునేలా, చర్చించుకునేలా సామాజిక మాధ్యమాలు అవకాశాన్ని కల్పిస్తున్నాయి. ప్రపంచంలో ఎక్కడ ఉన్నా సామాజిక మాధ్యమాలలో సాహిత్యాన్ని ప్రచురించుకునే అవకాశం కలిగింది. ముఖ్యంగా ఎటువంటి ఖర్చు లేకుండా తన సాహిత్య రచనలు పాఠకులకు పంచుకునే సౌకర్యం కలిగింది. ఫేస్బుక్, వాట్సప్ వంటి సామాజిక మాధ్యమాలలో సాహిత్యానికి సంబంధించి అనేక సమూహాలు ఉన్నాయి. ఒక్కొక్క సమూహంలో వందల సంఖ్యలో పాఠకులు ఉంటున్నారు. కొన్ని సందర్భాలలో ఆరోగ్యకరమైన చర్చ, మరికొన్ని సందర్భాలలో వివాదాలు విమర్శలు కొనసాగుతూ ఉన్నాయి. సామాజిక మాధ్యమాల కారణంగా అనేకమంది కొత్త రచయితలు పుట్టుకొస్తున్నారు. కొన్ని సమూహాలు ఆరోగ్యకరమైన చర్చ జరిగినప్పుడు కొత్త రచయితలు నేర్చుకోవడానికి అనేక అవకాశాలు సామాజిక మాధ్యమాలు కనిపిస్తున్నాయి. అలాగే అప్పటికే పేరును రచయితలకు ప్రత్యేక సమూహాలు ఉండడంతో పాటు పాఠకుల ఆదరణ ఎక్కువగా ఉంటుంది. పాఠకుల సంఖ్య పెరిగేకొద్దీ భాషా గౌరవం పెరుగుతుంది.

ప్రస్తుతం ప్రపంచం సాహిత్యంగా గుర్తింపు పొందుతున్న భాషలలో ఉన్న జనాభా, సాహిత్య పాఠకులతో పోల్చినప్పుడు తెలుగువారి జనాభా పాఠకులు కూడా దాదాపు సమానంగానే ఉన్నారు. ఉదాహరణకు ఫ్రాన్స్, జర్మనీ మొదలైన దేశాల జనాభాతో దగ్గరగా లేదా కొంచెం ఎక్కువే తెలుగు వారి జనాభా ఉంది. రచనల సంఖ్య కూడా ఆ స్థాయిలో ఉంది. (రచనలో నాణ్యత విషయాన్ని ఇక్కడ ప్రస్తావించకూడదు. ఇదే విషయాన్ని ప్రపంచ సాహిత్య సిద్ధాంతం అనే అంశంలో కొంతమంది విమర్శకులు కూడా పేర్కొన్నారు)

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 7

హైదరాబాద్ మే : 2023

# విజయ సౌధం



నడిచిన కాళ్ళన్నీ తీరం చేరవు
పాడిన పాటలన్నీ గెలుపు గీతాలు కావు
విజయతీరం కొందరిదే
విజేతదే విజయ దరహాసం

సాలు పొడూత ఆకుపచ్చ చందమామ
ఉద్యమించినంత దూరం గుమ్మడిపూల పరిమళం
ఎలుగెత్తిన ఆశయాల పిడికిళ్ళు
అంబరాన విజయకేతనం
అడుగడుగు దేశానికి నమూనా!



విసిరేయబడ్డ తంగేడుపూవు
రాష్ట్ర చిహ్నమైన అస్తిత్వం ఆకాశం
భూమలు నదులై
పంటల పండుగలైతున్నాయి
అవమానాలన్నీ
అజేయ నిర్మాణాలై మెరుస్తున్నాయి
సూర్యుడు స్నేహితుడై
చీకట్లన్నీ వెలుగు వెన్నెలలై పూస్తున్నాయి

రాష్ట్ర సాధనే కాదు
పునర్నిర్మాణమూ యుద్ధమే
నూతన సచివాలయం
ఆధునిక పరిపాలనకు మకుటం
ప్రజాస్వామిక సౌధం
తెలంగాణ ఆత్మగౌరవ బావుటా...!

లుంబిని పార్క్ ఎదురుగా
సాగర తీరాన ప్రజా కార్యాలయం
అమరవీరుల ఆశీర్వాదాలు
రాజసం ఉట్టిపడే కాంతిపుంజం
పరిపాలన సౌలభ్యం అధునాతన సౌధం
సకల సౌకర్యాల సమాహారం

దక్కన్ కాకతీయ శైలి
తెలంగాణ తల్లి కిరీటంలా గుమ్మట గోపురాలు
భారీ జాతీయ చిహ్నాలు
హుస్సేన్ సాగర్ జలాల్లో
విజయసౌధ ప్రతిబింబం
రెండువందల అరవై ఐదు అడుగుల
ఎత్తున తెలంగాణ ఐకాన్



నూతన నిర్మాణం ప్రగతి చిహ్నానికి అద్దం
అంబేద్కర్ పేరు చారిత్రక నిర్ణయం...
భారత రత్నకు గొప్ప నివాళి...
సంతకాలన్నీ కాలం మీద చరిత్రలే
నవ్వులన్నీ నక్షత్రాలే....

**వనపట్ల సుబ్బయ్య**
ఫోన్ : 94927 65358




## కీ.శే. ఆచార్య రవ్వా శ్రీహరి గారిపై మూసీ ప్రత్యేక సంచిక

మహామహోపాధ్యాయులు, బహుభాషా పండితులు, ఉస్మానియా, హైదరాబాదు విశ్వవిద్యాలయాలను తమ బోధనతో పునీతం చేసినవారు, ద్రవిడ విశ్వవిద్యాలయానికి పూర్వ ఉపాధ్యక్షులు, తిరుమల తిరుపతి దేవస్థానాలలో ప్రచురణల అధికారిగా పనిచేసిన వారు, భాషా సాహిత్యాలపై అపూర్వమైన కృషి చేసిన నిరంతర సాహితీ కృషీవలురు, సౌమ్యులు అయిన ఆచార్య రవ్వా శ్రీహరిగారు ఇటీవల పరమపదం చేరిన విషయం మనందరికీ తెలిసిందే. మూసీ పత్రికకు, బిఎన్‌శాస్త్రిగారికి అత్యంత ఆప్తులైన ఆచార్య శ్రీహరిగారి స్మృతి సంచికగా జూన్ సంచిక వెలువడబోతుందని ముందుగా పాఠకులకు తెలియజేస్తున్నాం. వారికి మూసీ మాసపత్రిక తరపున హృదయపూర్వక శ్రద్ధాంజలి ఘటిస్తున్నాం.

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 7

హైదరాబాద్ మే : 2023

# కథా సాహితి కథల సంకలనాలు – ఆదివాసుల అస్తిత్వ చిత్రణ

**లెంక సత్యనారాయణ,** తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నర్సంపేట. ఫోన్ : 998 732 382




కథాసాహితి కథా వార్షిక సంకలనాల ప్రచురణ సంస్థ. కథా వార్షిక సంకలనాలు రావడానికి ప్రధానంగా కృషి చేసినవారు చేకూరి రామారావు, హరి పురుషోత్తమరావు, హైదరాబాద్ బుక్‌ట్రస్ట్ (హెచ్‌బిటి) అను సంస్థ. ప్రజాసాహితి పత్రికా సంపాదకుడుగా పని చేసిన వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్ కథాసాహితి వార్షిక కథల సంకలనాలకు ప్రధాన సంపాదకులు. నూతనమైన శైలి, శిల్పాలతో, కథా వస్తువుకు సంబంధించిన కొత్తదనం, సమకాలీన మైన సమస్యలను, విస్తృత వర్గాల జీవిత చిత్రణను వాళ్లయాస భాషలో చెప్పడం ఈ కథా సంకలనాల ప్రత్యేకత. తెలుగు కథను వందేళ్ళపాటు వర్ధిల్లునట్లు చెయ్యడం కథా సాహితి వారి కథాసంకలనాల లక్ష్యం.

కథాసాహితి కథల సంకలనాలో ఆదివాసుల జీవిత చిత్రణ, వారి అస్తిత్వానికి చెందిన కొన్ని కథలు గలవు. ఆ కథల ద్వారా ఆదివాసుల అస్తిత్వాన్ని నిరూపించడం, ఆదివాసులు తమ అస్తిత్వాన్ని కోల్పోవడానికి గల కారణాలు విశ్లేషించడం ఈ వ్యాసము యొక్క ముఖ్య ఉద్దేశ్యము. ఆదివాసులు తమ జీవిత మూలాలను విడిచిపెట్టి పరాయీకరణ చెందడానికి పెక్కు కారణాలున్నాయి. అభివృద్ధిలో భాగంగా గిరిజనుల జీవనశైలిలో మార్పులు రావడం, వ్యాపారం పేరుతో తెలివి గల పల్లపు ప్రజలు ఆదివాసుల అమాయకత్వాన్ని దోచుకొవడం, పరుగులు తీస్తున్న ప్రపంచీకరణ ప్రభావం, అభివృద్ధి పేరుతో అమాయకులైన ఆదివాసులకు అటవీ భూములుపైన, ఉత్పత్తులు పైన అధికారం లేకుండా చెయ్యడం మొదలైన అనేక అంశాలు మూకుమ్మడిగా దాడిచేసి ఆదివాసులు తమ అస్తిత్వాన్ని కోల్పోయేటట్లు చేసినవి. ఈ అంశాలు మల్లిపురం జగదీష్ రాసిన శిలకోల, ఇప్పమొగ్గలు కథల్లోను, అట్టాడ అప్పలనాయుడు రాసిన చిటికినవేలు కథ ద్వారా నిరూపించబడుచున్నవి.

**ఆదివాసులు – విషయ పరిచయం :**

భారత దేశంలో సామాజిక వ్యవస్థకు, విద్యకు దూరమై ఏ మాత్రం అభివృద్ధిని సాధించని ఆదివాసులు ఈ దేశంలో ఎందరోగలరు. రాజ్యాంగములోని 342వ ఆర్టికల్ ప్రకారం 500 గిరిజన తెగలు ఉన్నట్లు తెలుస్తుంది. గిరిజనులను ఆదివాసులుగా పరిగణిస్తున్నాము. ఆది అంటే మొదట అనీ, ఆదివాసులంటే మొదటి నుండీ ఈ భూమిపై ఉన్నవాళ్ళు అని అర్థం. **"గిరిజనులు పదంలోని గిరి అంటే కొండ అని, జనులంటే ప్రజలని భావము. కొండ ప్రాంతాల్లో నివసించే వాళ్లని అర్థం. ఉత్తర భారతీయ భాషల్లో గిరిజలను ఆదివాసు లంటారు"(1)**. ఆదివాసుల జీవిత చరిత్రను తెలుసుకోడానికి వారి చారిత్రక సమాచారం కొంత వరకు దోహదపడుతుంది. **"ప్రాచీన ఆచారాలను సంప్రదాయాలను వీడకుండా కొండల్లో కోనల్లో అనాగరికంగా జీవిస్తున్న తెగలను గిరిజనులు అని అంటారు. కొండల మీదనే తొలుత నివాసాలు కల్గి ఆటవిక సంపదనే తమ జీవితానికి ఉపాధిగా గ్రహించిన వారిని, కొండల్లో ఉండే కొద్దిపాటి చదును ప్రదేశాన్ని గుర్తించి అక్కడ ఎదిగిన చెట్లును కూల్చి పోడు వ్యవసాయం చేసుకొనే వాళ్ళను కొన్ని తెగలుగా ప్రభుత్వం గుర్తించింది. వీళ్ళంతా గిరిజనులు" (2)** పైన చెప్పబడిన అంశాలను పరిశీలించినపుడు ఆదివాసుల మూలాలు, వారి ఉనికి కొంత వరకు తెలుస్తుంది.

**కథా సాహితి కథల ద్వారా ఆదివాసుల అస్తిత్వ నిరూపణ:**

**శిలకోల :** ఈ కథ కథాసాహితి వారి కథల సంకలనం కథ 2009లో ముద్రించబడినది. ఈ కథలో చామంతి ప్రధానపాత్ర. ఒక గిరిజన స్త్రీ తన అస్తిత్వాన్ని నిలుపుకోడానికి చేసే ప్రయత్నం ఈ కథలో కన్పిస్తుంది. వ్యాపారం పేరుతో వచ్చిన పల్లపు గిరిజనేతర వ్యక్తి ఒక గిరిజన స్త్రీని భోగ వస్తువుగా మార్చి వాడుకోవడం, గిరిజన పథకాల ద్వారా వచ్చిన లబ్ధిని పొందడం, అమాయకులైన గిరిజన జాతిని అవమానించడం, చివరకు తన ద్వారా పుట్టిన కుమార్తెను పార్టీ టిక్కెట్ కోసం రాజకీయ నాయకుల పక్కలోకి పంపించడానికి వెనుకాడని రాక్షసుడు నుంచి చామంతి తన అస్తిత్వాన్ని కాపాడుకోడానికి చేసిన పోరాటం ఇందులో చెప్పబడింది.

జగన్నాథం వ్యాపారం పేరుతో వచ్చి గూడెంలో చామంతి తండ్రికి అప్పిచ్చి కందులు, జొన్నలు తీసుకొనేవాడు. పొగాకు ముక్క, సారా చుక్క రుచి చూపించి కాంట్రాక్టర్‌గా అవతరించి చామంతి తండ్రి పేరు మీద శాంక్షనైన పనిని తాను నేస్తంతో వేలిముద్రలు వేయించుకొని, పనిమూర్తిచేసి లాభపడ్డాడు. **"ఎదుటివాళ్లను నమ్మడం ఈ నేల గొప్పతనమో, అమాయకత్వమోగాని ఆ నమ్మకాన్ని సొమ్ము చేసుకోవడం మాత్రం పల్లపోడి నైపుణ్యం"(3)**. స్వచ్ఛమైన అమాయకులైన గిరిజనులు

తెలివిగల పల్లపోని మోసానికి బలికావడం అనాదిగా జరుగుతుంది. పదవతరగతి వరకు చదువుకున్న చామంతికి గూడెంలో టీచర్ ఉద్యోగం రాగా ఆమెను నమ్మించి తనకు పెళ్ళి జరిగిన విషయం చెప్పకుండా వివాహం చేసుకున్నాడు. ఈ విషయం చామంతికి తెలిసేటప్పటికి చామంతి గర్భవతి. ఈ విధంగా చామంతి జీతానికి, జీవితానికి అధికారి జగన్నాథం. కట్టుబాట్లును వదులుకున్న తనకు తగిన శిక్షపడిందని చామంతి బాధపడింది. చామంతి తల్లిదండ్రులు గోచిగుడ్డలతో, పాతబట్టలతో పోడుచేసుకొనేవారు. సెల్‌ఫోన్, టీ.వి, ఫ్రిజ్‌లు చామంతి ఇంటికి వచ్చి చేరాయి. హైహీల్స్, కొత్తచీరలు, సెంటులు చామంతికి వచ్చాయి. ఇవన్నీ ప్రపంచీకరణ ఫలితమే. వీటి వలన ఆదివాసుల మూలాలు క్రమంగా తొలగిపోతున్నవి. గిరిజన జాతి సంస్కృతిని పూర్తిగా ధ్వంసం చేస్తున్నది ఈ ప్రపంచీకరణ. **“సంస్కృతి అంటే కేవలం ఆట, పాట, సంగీతం, సాహిత్యం మాత్రమేకాదు. ప్రజల యొక్క జీవన విధానం సంస్కృతి. సమస్త మానవ సంబంధాల సారం సంస్కృతి. ప్రజల హృదయాలలో కదిలి భావాలలో మెదిలి దైనందిన చర్యలతో ప్రదర్శితమయ్యే జీవితాచరణే సంస్కృతి. మనం నాగరికత యొక్క ఏ పొరల మీద జీవిస్తున్నామో తెలియపరిచే కొలబద్ద సంస్కృతి”(4)**. గిరిజనుల గొప్ప సంస్కృతిని, జీవన విధానాన్ని ప్రపంచీకరణ మార్చేస్తుంది. చామంతి జీతం డబ్బులతో చిట్టీలు వేసి గూడెంలోగల భూములను కొని వాటిని చామంతి పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించగా లాభాలు జగన్నాథం సొంతమౌతున్నాయి. కారణం 1/70 చట్టం ప్రకారం గిరిజన ప్రాంత భూములు తన పేరు మీద ఉంటే అవి చెల్లవు గనుక జగన్నాథం అలా చేసాడు. జగన్నాథం యస్టీ నియోజక వర్గం టిక్కెట్ భార్య పేరుమీద పొంది తాను చక్రం తిప్పాలనుకున్నాడు. చామంతి తన ఉద్యోగాన్ని వదులుకోడానికి ఇష్టపడలేదు. **“బోడి ఉద్యోగం పట్టుచీర కట్టుకోడాని కిస్తే చింకి పాతకి సాపిందట ఒకిర్తి అలాగున్నదినీ వరస. అందుకే అన్నారు మిమ్మల్ని కొండోళ్లని”** అని జగన్నాథం లేడి మాంసపు రుచికి అలవాటుపడ్డ పులిలా చామంతి సర్వస్వాన్ని అపహరించి చివరకు గిరిజనజాతినే హేళన చేస్తాడు. పార్టీ టికెట్ పొందే ప్రయత్నంలో భాగంగా గెస్ట్‌హౌస్‌లో ఇంఛార్జ్ వద్దకు పంపాలి, పాపను పిలిపించమన్నపుడు చామంతి గుండెల్లోకి శిలకోల గుచ్చినట్లైంది. ప్రతిజీవి తనమనగడకు ప్రతిబంధకము కలిగినపుడు ఏదో రకంగా తనను తన జాతిని కాపాడే ప్రయత్నం చేస్తుంది. అది జాతి ధర్మం. అది జీవిత ధర్మం. కాబట్టి చామంతి జగన్నాథంను గట్టిగా కాలితో తన్నగా మల విసర్జనాల మధ్య పడ్డాడు. ఈ విధంగా ఆదివాసి స్త్రీ చామంతి తన ఆస్తిత్వాన్ని కాపాడుకుంది.

**ఇప్పమొగ్గలు :** ఈ కథ కథా సాహితి వారి కథల సంకలనం కథ 2011లో ముద్రించబడినది. మారుతున్న కాలానికి అనుగుణంగా తాను మారకుండా తన జాతి అస్తిత్వాన్ని, వ్యక్తిత్వాన్ని నిలుపుకోడానికి పోరాటం చేసిన యువతి బూది ఈ కథలో ప్రధానపాత్ర. బూది బాల్యమంతా అక్క జ్యోతి బుజాలపైనే సాగింది. జ్యోతి ఐ.టీ.డి.ఏ.లో ఏయెన్నెమ్ ట్రైనింగ్ చేసింది. పట్నవాసిని నమ్మిమోసపోయి ఆత్మహత్య చేసుకుంది. **“మంచిపిల్ల వాడి మాయలో పడిపోయింది. వాడి కాంట్రాక్ట్ పనులుకోసం పిల్లని వాడుకున్నాడు ఎన్నాళ్ళని భరించగలదు. మనసు చంపుకోలేక..ప్చ్” (5)**. బూది అక్క తెలివైన పట్నపోని చేతిలో మోసపోయి జీవితానికి ముగింపు పలికింది. బూది తన జాతికి కలిగే అవమానం, కష్టాలను ధైర్యంతో ఎదిరించింది. గిరిజన సహకార సంస్థలు, ఐ.టీ.డి.ఏ.లు, గిరిజనాభివృద్ధికి తోడ్పాటు నందించాలి. కాని ఆసంస్థలు, అందులో ఉద్యోగులు ఇంకా ఆదివాసులును అనాగరికులుగా భావించి అవమానపరుస్తున్నారు. బూది హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులో డిప్లొమా పూర్తి చేసింది. సర్టిఫికెట్లతో ఉద్యోగానికి ఎదురుచూస్తుంది. **“మారుతున్న కాలంలో గిరిజనులు మారాలి. సభ్య సమాజంతో కలిసి నడవాలి. పోటీ పడాలి. అభివృద్ధి సాధించాలని”** పీవో చెప్పాడు. మారుతున్న కాలాని కనుగుణంగా గిరిజనులు మారాలని కొరుకున్న సభ్యసమాజం దానిని హర్షించడం లేదు. జాతిని అవమానపరుస్తుంది. దూరం పెడుతుంది. హోటల్ మేనేజ్‌మెంట్ డిప్లొమా సర్టిఫికేట్‌తో ఉద్యోగానికి దరఖాస్తు చెయ్యడానికి ఐ.టీ.డి.ఏ.కు వెళ్ళినపుడు ఆఫీసులో గుమస్తా **“బ్రీడో..హైబ్రీడు ఆరోజుల్లో ఏజెన్సీని పల్లపోలు ఒక తిన్నగవుం చేరేటి? షావుకార్లు, సోండీలు, పోలీసు...ఆళలోనయిదీ”** అని తన జాతి అందచందాలు అనుమానించి మాట్లాడటం బూదికి చాలా దు:ఖాన్ని తెప్పించింది. ప్రకృతి ఒడిలో గిరి అందచందాల నడుమ అచ్చమైన ఆహ్లాదంలో కల్మషం లేని స్వచ్ఛమైన మనసుతో పెరిగిన గిరిజనులు అందంగా ఉండటంలో తప్పేంలేదు. పైగా వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని వారిని నిందించనవసరంలేదు. అడవిని నమ్మి కొండకొనల్లో నివసిస్తున్న గిరిజనులపట్ల ఇంత నీచ భావన ఎందుకు. అతిథులను గౌరవించడం గిరిజనుల సంప్రదాయం. నమ్మిన వారితో స్నేహం చెయ్యడం వారి సంస్కారం. నలుగురితో నడవడానికి నగరానికి వస్తే అడుగడుగున అవమానించడం, గిరిజనుల పుట్టుకను గూర్చి నీచంగా మాట్లాడే వీళ్ళు నాగరికులేన అన్నది ప్రశ్న. గిరిజనులను గూర్చి కథా రచయిత వి.ఆర్. రాసానిగారు ఇలా చెప్పిరి. **“గిరిజనులంటే నాగరిక సమాజానికి దూరంగా, నేటి సమాజం అనుభవిస్తున్న సాంకేతిక పరమైన సౌకర్యాలకు, ఆర్థిక సమృద్ధికి, పాలనాపరమైన పథకాల ఫలితాలకు దూరంగా ప్రకృతిలో ప్రకృతిగా కలిసిపోయి అడవులపై ఆధారపడి జీవించే ఆదివాసులు. బతుకుపోరాటంలో ఆహారాన్వేషణ చేస్తూ ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశానికి తరలిపోయే అస్థిరవాసులు, సంచార తెగలు. ఒకప్పుడు అడవులపై జీవించినా కారణాంతరాల వలన ఎప్పుడో మైదాన ప్రాంతంలోకి వచ్చి స్థిరపడి బతుకుతెరువు కోసం నేర్చిన విద్యలను లేదా తమ శ్రమను నమ్ముకొని సంచారం చేస్తూ బతికే సామాజిక వర్గాలు. కులవృత్తులపై ఆధారపడి**

ఇతర కులాలకు ఆశ్రితకులాలుగా జీవించే తెగలు. సంచార తెగలు, గిరిజనులు." **(6)** బూది హోటల్లో సర్వర్‌గా ఉద్యోగం చేస్తు కష్టమర్స్ ఎలాంటి చూపులు ఎక్కడ చూసినా, వెకిలి చేష్టలు చేసినా మొదట భరించింది. హోటల్ మేనేజర్ **"హోటల్‌కి ఇంపార్టెంట్ గెస్ట్స్ వస్తున్నారు. వారిని రాత్రికి రిసీవ్ చేసుకోవాలి"** అన్నపుడు బూది అంగీకరించలేదు. వచ్చిన అవకాశాన్ని వినియోగించుకోవడంలోనే ఉంది ఎదుగుదల రహస్యం అని నీతివాక్యాలకు విషం పూసి హితబోధ చేసిన హోటల్ మేనేజర్ మాటలను బూది తిరస్కరించి, ఆ అవకాశమేదో కోరుకున్నవారికి ఇవ్వమని ఉద్యోగం వదిలి వెళ్ళిపోయింది. నాగరికత, సంస్కృతి ముసుగులో తన జాతికి జరుగుతున్న అన్యాయాన్ని భరించలేక తన జాతి మూలాలను కాపాడటానికి బూది ప్రయత్నించింది.

**చిటికెన వేలు :** ఈ కథ కథా సాహితి వారి కథల సంకలనం కథ 2018లో ముద్రించబడినది. ఈ కథా రచయిత అట్టాడ అప్పలనాయుడు. అభివృద్ధి పేరుతో నేటి ప్రభుత్వాలు ఆదివాసుల అస్తిత్వాని పూర్తిగా కనుమరుగు చేస్తున్నవి. ఖనిజాల కోసం, రిజర్వాయర్ల కోసం, కంపెనీలు, రిసార్ట్, పార్కుల కోసము ఆదివాసుల అటవీ భూమిని బడా కాంట్రాక్టర్లకు పూర్తిగా ధారాదత్తంచేసి గిరి పుత్రుని ఉనికి లేకుండా పూర్తిగా అడవులను విధ్వంసం చేస్తున్నవి. అడవులు ఆదివాసులకు అడవులతో గల సంబంధము విడదీయ రానిది. ఆదివాసుల జీవనోపాధికి కీలకమైనవి. హస్తకళా నైపుణ్యానికి ముడి సరుకునిచ్చేది అడవి. అనేక ఔషధాలను సమకూర్చి రకరకాల ఉత్పత్తులకు కేంద్రమైన అడవి ఆదివాసుల జీవనాడి. ఆదివాసులకు జవసత్వాలను సమకూర్చే ఔషధం. అడవి అభివృద్ధి పేరుతో కనుమరు గౌతుంటే, ఆదివాసుల అస్తిత్వం కనుమరుగైన విధానం ఈ కథలో కన్పిస్తుంది. కొత్త కొత్త మార్కెట్ శక్తులు అడవుల్లోకి ప్రవేశించి అభివృద్ధి చిత్రపటాన్ని కళ్లముందుంచి ఆదివాసుల సహత్వాని పూర్తిగా ధ్వంసం చేస్తున్నవి. ఆదివాసుల అభివృద్ధికి, అస్తిత్వానికి నెహ్రూ ప్రతిపాదించిన పంచశీల సూత్రాలు ఉత్తమమైనవి. అవి ఆదివాసుల ఉనికి కాపాడటానికి తోడ్పడతాయి. ఆ సూత్రాలు.

**1. "ఆదివాసీ ప్రజలు వాళ్ళ స్వశక్తి ఆధారంగా అభివృద్ధి చెందాలి కాని వాళ్ళపై బలవంతంగా ఏమీ రుద్దకూడదు. వాళ్ళ కళారూపాలను, సంస్కృతులను ప్రోత్సహించాలి.**

**2. భూమిపైన, అడవులపైన ఆదివాసుల హక్కులను గౌరవించాలి.**

**3. ఎక్కువమంది బయట వాళ్ళను ఆదివాసీ ప్రాంతంలోకి పంపకుండా చూడాలి.**

**4. లెక్కకుమించిన పథకాలతో ఆదివాసీ ప్రాంతాలను అతిగా పరిపాలించకూడదు. వాళ్ళ సామాజిక, సాంస్కృతిక వ్యవస్థలకు అనుగుణంగా మనం పనిచేయాలి. అంతేగాని వాటికి వ్యతిరేకంగా మనం పనిచేయకుడదు.**

**5. ఫలితాలను ఖర్చు పెట్టిన సొమ్ముతో కొలవకుండా గుణాత్మకంగా వచ్చినటు వంటి మానవశీల శ్రేష్టతను బట్టి పరిగణించాలి" (7).**

నేటి సమాజం, ప్రభుత్వాలు ప్రపంచీకరణ మాయజాలంలో కొట్టుకుపోతున్నవి. కనుక నెహ్రు వంటి మహనీయుల ఆచరణలను తుంగలోకి తొక్కి ఆదివాసీ జాతి అస్తిత్వాన్ని మంటగలుపుతున్నవి. సోమన్నగూడ సవరజాతి పెద్ద సోమన్న. ఈ గూడ ప్రకృతి రమణీయత మధ్య రెండు కొండలనడుమ ఉంది. అడవిని ఆనుకొని రెండు పర్వతాల మధ్య నుండి నిత్యం ప్రవహించే గడ్డవుంది. దాని పేరు ప్రాజెక్టు అధికారి ఎస్.జి.ఫాల్స్‌గా మార్చాడు. ప్రభుత్వ రికార్డులో ఇది ఇటికగూడ. ఒకప్పటి పెద్దజమీ. అడవంటుకున్నది. సోమన్న భుజాన తుపాకి వేలాడింది. గూడ పేరు సోమన్నగూడ అయింది. ప్రస్తుతం సోమన్న గూడలో పెద్ద ఎత్తున మార్పులొచ్చాయి. **"పల్లపు ఉప్పు, కిరసనాయిలు, నూలు బట్టలు, ఇప్పసారా... యివే... ఈటితోనే మనం అప్పులపాలయిపోనాం!... ఇపుడన్నిటికీ పల్లానికి పట్టణానికి పరిగెడుతున్నాము. కరణం నాయుడ్లూ... పల్లము, పట్నము గూడకు వోచ్చిసినాయి".** సోమన్న దు:ఖములో ఆదివాసులు తమ మూలాలను కోల్పోయి, పరాయి కరణచెంది అస్తిత్వాన్ని కోల్పోయినట్లు కన్పిస్తుంది. సోమన్నకు జైలు నుండి విడుదలైనపుడు ఆర్థిక సహాయం కింద గెడ్డెగువున గల ఎకరం భూమి ప్రభుత్వం ఇచ్చింది. క్రికెట్ బేట్లూ బంతులు, కిట్‌లు గూడెంలోకి చేరాయి. ఆడవి పచ్చదనం, ఆఫీసులు, పి.వో బంగ్లాలు, జి.సి.సిలు, అతిథి గృహాలు, హాస్టళ్లు, బ్యాంకులు, దుకాణాలు, బ్రాందీషాపులు, సారకొట్లు, పోలీస్ స్టేషన్లతో నిండిపోయినవి. ఇవి అడవి పచ్చదనాన్ని, ఆదివాసి ప్రాంతంలో ఆదివాసులు లేకుండా చేసినవి. యస్.జీ.ఫాల్స్ బాగా క్లిక్ అయింది. రెండు కొండల్లో గల గ్రానైట్, బాక్సైట్ ఖనిజాల కోసం బడాకంపెనీలు త్రవ్వకాలు జరుపుతున్నాయి. ఉద్యోగం, కాంపెన్సేషన్ ఇస్తామని ఎకరం భూమిని డెవలప్‌మెంట్ కొరకు తీసుకుంటామని పీ.వో. సోమన్న దగ్గరకు ఒప్పంద పత్రాలతో వచ్చాడు. సోమన్న అందుకు అంగీకరించనందుకు మనవడు బుధుడికి కోపమొచ్చింది. సోమన్నదొర మరుచటిరోజు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశాడు. పత్రాలతో పాటు చిటికినవేలు పొట్లాన్ని పీ.వో.కు అందించాడు. **"దారే సరయింది కాదో నేనే మళ్లిపోనానో నాకే తెల్దు. ఈ బతుక్కు మీరు దారిచూపుతనన్నారు. 'అదిగది దారికాదు' అని ఋజువు పరచలేను. నేనొక దారి చూపలేను. మీ దారిని నమ్మలేను, మీరు ఊరిల ఒకలాగ మాటాడ తారు. యిదిగీ కుర్చీల కూసున్నపుడింకొకలాగ మాటాడతారు. మీ మాటకి మీరాతకీ తేడా వుంటది. మిమ్మల్ని నడిపించే వోళ్ళు యేరేగా వుంటారు. చట్టమని మీరనుకుంతారు, రాజ్జెమని, నీననకుంతాను" (8)** అని చెప్పిన సోమన్న దొర మాటల్లో ఆదివాసులు దారి తప్పుతున్నారని, వారందరూ ప్రభుత్వం జపించే అభివృద్ధి మంత్రంలో

# నేతల కాలం



దారులు ఏవైతేనేం
దారుణం జరిగింది
పేపర్ లీకేజీల కాలం
పతివ్రతలు తప్పు చేసిన పాపం
అది ఈ తరానికొక శాపం
అవిటి పిల్లల తల్లికి తలకెక్కిన శోకం
రాజకీయ నేతలకిప్పుడిదొక ఆటస్థలం
ఆకలి మీదున్న మీడియాకు
అంది వచ్చిన విందు భోజనం
విద్యార్థుల భవిత బాండములో
అవినీతి అను విషపుచుక్క కలిసింది
అధికార పక్షమేమిటి....?
ప్రతిపక్షమేమిటి....?
నాయకులే నయవంచకులై
కులం కాని కులపెద్దగా
మతం కాని మత గురువుగా
మాయలు చేయడం
మర్మాలను తొక్కడం
ఉద్యాగాలంటే పడక
ఉద్యమాలంటే గిట్టక
రైతువేషాలు వేసి
బతుకు పాటలు గట్టి
చావుపాడెను ఎక్కించడం
వికలాంగులకు, వితంతువులకు
వృద్ధులకు, ఉద్యోగులకు
చెలిమ నీళ్లనుత ఆపించడం
బొర్రలు దువ్వుకునేలా పండబెట్టడం
నడిస్తే ఆయాసమొచ్చేలా
అరిసే తోలుబొమ్మలా ఎగిరెలా
అప్పుల కుప్పగా చేసిరీ రాష్ట్రాన్ని
అందెపు లొట్టలా మార్చిరీ రాష్ట్రాన్ని
ఎటు చూసినా ఏవగింపులే
ఉట్టి బుర్రమీసాల డాంబికాలే
నా నేలతల్లికి ఏం గతిపట్టేరా
ఎన్ని నోముల ఫలమిదిరా
స్వరాష్ట్రంలోనే శోకాలు
స్వంత ఇంటిలోనే ఉరికంబాలు
స్వర్ణకాంతులీను కన్నెపిల్లలాంటి రాష్ట్రాన్ని
పాలకులు పిండారులై ఎముకల గూడు
చేసిరి గదరా
నిండుసభలో ద్రౌపదికి పట్టిన గతిని
మరోమారు చూపించిరి గదరా...
కన్నీళ్ళు ఎండిన కనుగుంటలాయే
కలలు సచ్చిన కళేబరమాయే
కళ తప్పిన వృద్ధమాతగా మారే
నా తెలంగాణా నియంతలే పంజరపు
రామచిలకయ్యింది
నా తెలంగాణా తరతరాల బానిసత్వానికి
తల్లి అయ్యింది

**డా. కందుల శ్రీను**
ఫోన్ : 855 597 6629

మునిగిపోయారని, వారిది నిజమైన అభివృద్ధి కాదని, వారిని నడిపించేది కొన్ని రాజ్యాంగేతర బలమైన శక్తులని వారందరి ఫలితంగా ఆదివాసుల ఉనికి, వారి బ్రతుకులు పూర్తిగా ధ్వంసమౌతున్నవని అర్థం.

**ముగింపు :**

భూమికోసం, భుక్తికోసం నిరంతరం పోరాడే అమాయకులైన గిరిజనులు ప్రపంచీకరణ ఫలితంగా సమాజంలో వస్తున్న మార్పుల వలన తమ స్థిరత్వాన్ని, సహజత్వాన్ని, అస్తిత్వాన్ని కోల్పోతున్నారు. ప్రతి జాతి అభ్యుదయ పథంలో ప్రయాణించాలి. ప్రభుత్వము తన వంతు సహాయాన్ని ఆయాజాతులకు అందించాలి కాని అభివృద్ధి క్రమంలో జరగబోయే మార్పులు జాతిమూలాలను ఛేదించకూడదు. జరిగే అభివృద్ధి ప్రకృతిలో మమేకమై, ప్రకృతిలో భాగమై, ప్రకృతితో సహజీవనం చేస్తున్న ఆదివాసులకు మంచి ఫలితాలనందించాలి. కాని ఆ అభివృద్ధి ఆదివాసులకు శాపం కారాదు.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. కరీంనగర్ బుక్‌ట్రస్ట్, "అడవిలో వెన్నెల", పుట, 2.
2. నాయని కృష్ణకుమారి, "తెలుగు కావ్య కళాపరిచయ భాగం", పుట, 42.
3. మనసు ఫౌండేషన్, "పాతికేళ్ల కథ 1999 – 2014", పుట, 645.
4. జనసాహితి ప్రచురణ 1999, "మాతృబాషా సంస్కృతి", పుట 8.
5. కథా సాహితి, కథల సంకలనం "కథ 2011", పుట 109.
6. "సంచార తెగలు గిరిజనులు" రాసాని వి.ఆర్. విపుల మార్చి 2010, పుట, 5-6.
7. "భారతీయ గిరిజన సంస్కృతి–సమాజం", తెలుగు అకాడమి హైదరాబాద్, పుట 110.
8. కథా సాహితి కథల సంకలనం, "కథ

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 7 (53) హైదరాబాద్ మే : 2023

# నీలగిరుల యాత్ర

**ప్రవీణ్ కుమార్ బోళ్ళ,** ఫోన్ : 998 475 899

ఇరవై గంటల ప్రయాణం తర్వాత ఇంకా ఎప్పుడు దిగుదామా అని కుతూహలంగా బ్యాగులన్నీ సర్దుకొని తలపుల వద్దకి వెళ్లి నిల్చున్నాం. రైలు పూర్తిగా ఆగకముందే నేను ప్లాట్‌ఫామ్ మీదికి దిగి, కోయంబత్తూర్ గాలిని గుండెలనిండా పీల్చుకున్న. మిత్రుడు శేషు, అశ్విని జంట, మేమూ కలసి ఎదో ఒక యాత్రకి వెళ్ళాలని కొన్నేండ్లుగా అనుకొని, జనవరిలో పాపికొండల యాత్రకి వెళ్ళినా తనివితీరక మళ్ళీ మార్చి నెలలో ఊటీ యాత్రకి ప్రణాళిక వేసాము. శేషు, అశ్విని, వాళ్ళ బాబు నిహాంత్ భార్గవ్, నేను, నా సహచరి సౌజన్య. మా రెండు జంటలతో పాటు పర్శురాం, రమేష్ అందరం కలిసి ఉదకమండల యాత్రకి బయలుదేరాము.

మమ్మల్ని దించి వెళ్తున్న శబరి ఎక్స్‌ప్రెస్‌కి బాయ్‌బాయ్ చెప్పి, రైల్వేస్టేషన్ బయటికి వెళ్ళి షఫీక్‌కి ఫోన్ చేసి రెండు నిముషాలు మాట్లాడిన తర్వాత అర్థం అయింది. షఫీక్‌కి ఇంగ్లీష్ అర్థం అవ్వట్లేదని, హిందీ అస్సలే రాదని. చివరికి వాట్సాప్‌లో మేమున్న లొకేషన్ పంపించాక వచ్చి మమ్మల్ని పికప్ చేసుకున్నాడు. రైల్వేస్టేషన్ వెనకవైపు ఉన్నానని, ఆలస్యం అయ్యి ఇబ్బంది అయినందుకు సారీ చెప్పాడు. రైలు ప్రయాణంలో సరిగ్గా ఏమీ తినలేక ఆకలితో ఉన్న మాకు, షఫీక్ ఆలస్యం చేయడంవల్ల కోపం వచ్చినా, వచ్చిన వెంటనే తను నవ్వు మొహంతో సారీ చెప్పగానే అన్నీ మాయమయ్యాయి, ఆకలి తప్ప. మా ఆకలి బాధ షఫీక్ కి అర్థం అయ్యేలా చెప్పగానే, మాకు అర్థం అయ్యేలా కొద్దిదూరంలో మంచి హొటల్ ఉంటుందని, అక్కడ ఆపుతానని సగం సైగలు సగం భాషతో కలిపి చెప్పాడు. వెంటనే అంతకముందు నా కేరళ యాత్రలో నాకు మంచి స్నేహితుడిగా మారిన "అంజ్వెల్ హాలీడేస్" ఓనర్ శైజు కి ఫోన్ చేసి మా భాష సమస్య గురించి చెబితే, **"ఏమీ కాదు తను మ్యానేజ్ చేయగలడు, నాకన్నా షఫీక్ మిమ్మల్ని బాగా చూసుకోగలడు. మీకు ఇచ్చిన మాట ప్రకారం మంచి డ్రైవర్ ని మాత్రమే కాదు, మంచి గైడ్ ని కూడా పంపించాను. ఎంజాయ్ ది ట్రిప్"** అని చెప్పి ఫోన్ కట్ చేసాడు.

కోయంబత్తూర్ నుండి ఊటీ సుమారు 90 కిలోమీటర్ల దూరం ఉంటుంది. అరగంట ప్రయాణం తర్వాత షఫీక్ నిజంగానే మాకు మంచి టిఫిన్ తినిపించి, అన్ని ప్రాంతాల గురించి వివరిస్తూ ముందుకు తీసుకెళ్ళాడు. మెల్లిమెల్లిగా వాతావరణం మొత్తం మారిపోతుంది. కొబ్బరితోటలు, అరటితోటలు, బాదం కాయల చెట్లు మాకు స్వాగతం పలికాయి. ఘాట్ రోడ్ల మీదికి చేరుకున్నాక, షఫీక్ కారు అద్దాలు దించి, ఏసీ ఆఫ్ చేసాడు. ఏం చేస్తున్నాడని గమనించే లోపే కొండలమీది నుండి స్వచ్ఛమైన చల్లగాలి మా మొహాలకు



కొడుతోంది. అప్పటివరకు పీల్చిన ఏసీ గాలికి ఆ స్వచ్ఛమైన గాలికి ఎంతో తేడా ఉంది. ఘాట్ రోడ్లలో వంపులు తిరుగుతున్నా కొద్దీ మా కడుపుల్లో లోపడం మొదలయింది. షఫీక్ మాకు తలా ఒకటి కవర్ ఇచ్చి అవసరం ఉంటే వాడుకొమ్మన్నాడు. మా బాధని అర్థం చేసుకొని మధ్యమధ్యలో మంచి లొకేషన్స్‌లో ఆపుకుంటూ తీసుకెళ్ళాడు. అలా కొద్దిదూరం ముందుకు వెళ్ళగానే ఒకచోట మమ్మల్ని పోలీసులు ఆపారు. ఊటీకి కవర్లు తీసుకెళ్లడం నిషేధమని, దానితో పాటు మాలో ఇద్దరు మాస్క్ లు కూడా పెట్టుకోలేదని షఫీక్‌ని పదివేల రూపాయల ఫైన్ కట్టమన్నారు. శేషు కారు దిగి అక్కడ ఉన్న పోలీస్ ఆఫీసర్ వద్దకి వెళ్ళి, మా కారు డ్రైవర్ కి నిబంధనలు తెలియవని, దానితో పాటు మాకు ఆ ఘాట్ రోడ్లలో వాంతింగ్ రావడం వల్ల మాస్క్‌లు తీసేసి కవర్లు పట్టుకెళ్తున్నామని వివరించి చెప్పాడు. అవన్నీ విన్న పోలీసులు మాకు అక్కడి నిబంధనలు చెప్పి వదిలేసారు. ఫైన్ కట్టాల్సి వస్తదనుకొని భయపడ్డ షఫీక్ చాలా ఆనంద పడ్డాడు. ఎంతో కృతజ్ఞతగా థాంక్స్ చెప్పాడు.

ముందుగానే బుక్ చేసుకున్న గదుల వద్దకి చేరేసరికి మధ్యాహ్నం అయింది. ఆ ఊటీ కొండలలో ఒక వైపుగా ఉన్న చిన్న కొండపైన ఉన్న ఇంటిలోని మూడు గదులు ఒక హాల్ ఉన్న మొదటి అంతస్థుని మూడు రోజులకి తీసుకున్నాము. మేము వెళ్లిన ప్రాంతంలో ఆరోజు ఉదయం నుండి ఏదో ఎలక్ట్రికల్ పని నడుస్తుందని ఉదయం నుండి కరెంట్ లేదు. చల్లని నీళ్లతో స్నానం చేయడం సాహసమే అయింది. ఇక ఆలస్యం చేయకుండా నీలగిరుల్లో అతిపెద్ద కొండ దక్షిణ భారతంలో 'అనైముడి' తర్వాత ఎత్తయిన కొండ 'దొడబెట్ట'కు బయల్దేరాము. దగ్గరివరకు వెళ్ళాక, ఆ దారిలో ఏవో పునర్నిర్మాణాలు జరుగుతున్నాయని గత కొంతకాలంగా యాత్రికులను అనుమతించట్లేదని తెలిసింది. ఇక చేసేదేమి లేక నిరుత్సాహంతో టీ మ్యూజియంకి

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 7  హైదరాబాద్ మే : 2023



వెళ్ళాము. ఆ టీ మ్యూజియంలో అక్కడి ప్రాంతంలోని తేయాకు తోటల గురించి, కార్మికుల గురించి వివరించే డాక్యుమెంటరీ సందర్శకుల కోసం ప్రదర్శించారు. తేయాకు మొక్కలు కొన్ని వందల సంవత్సరాలు బతికుండి ఉత్పత్తిని ఇస్తాయని గుర్తొచ్చిన ప్రతీసారి నాకు ఆశ్చర్యం కలుగుతుంది. ఆ టీ మ్యూజియం లోనే ఉన్న చాకోలేట్ ఫ్యాక్టరీలోని కార్మికులతో కొద్దిసేపు ముచ్చట్లు పెట్టి వాళ్ళ ప్రేమతో మాకిచ్చిన చాకోలేట్స్‌ని రుచి చూసాము. అక్కడే ఉన్న అనేకరకాల చాయ్ లను కూడా వదలలేదు. తర్వాత బోటానికల్ గార్డెన్ కి వెళ్లేసరికి సాయంత్రం అయింది. గాలులు మరింత చల్లగా మారడం మొదలయింది. అప్పటివరకు హైదరాబాద్‌లో 40 డిగ్రీల ఉష్ణగ్రతలో ఉన్న మేము ఒక్కసారిగా 10 డిగ్రీల ఉష్ణోగ్రతలోకి వెళ్లేసరికి మా శరీరాలు కొద్దిగా ఇబ్బంది పడ్డాయి. బోటానికల్ గార్డెన్ మొత్తం కలియ తిరిగాక, గార్డెన్ బయటే ఉన్న టిబెటన్ మార్కెట్ వెళ్ళాము. అక్కడి దుకాణాల్లో దాదాపు అన్ని టిబెట్ దేశస్థులవేనట. అక్కడినుండి వచ్చి ఊటీలో స్థిరపడిపోవడం వల్ల టిబెటన్ మార్కెట్ గా ప్రాచుర్యం పొందింది. ఆ ప్రాంతమంతా రంగురంగుల జెండాల దండలతో కళకళలాడుతూ కనిపించింది. ఇంకా చలి తీవ్రత పెరుగుతుంటే ఇక తట్టుకోలేక తొందరగా గదుల్లోకి చేరిపోయాము.

రెండవరోజు పొద్దున్నే సిద్ధమయ్యాక షఫీక్ మమ్మల్ని ఒక హోటల్‌కి తీసుకెళ్ళాడు. ఆ హోటల్ ఒక కొండవాలులోని పెంకుటిల్లులో దట్టమైన పొదలమధ్యన ఉంది. అప్పటికే మాకు షఫీక్ పైన నమ్మకం ఏర్పడింది. అలా తీసుకెళ్ళాడంటే అదీ స్పెషల్ అని అర్థమైంది. వాళ్ళ ఇంట్లోనే నిర్వహిస్తున్న ఆ చిన్న హోటల్ లో తిన్నాక నిజంగా మన ఇంట్లోనే తిన్నంతగా తృప్తి కలిగింది. మిగతా రెండు రోజులు కూడా పొద్దున్నే వెళ్లడం అక్కడం తినడం మా దినచర్య అయింది. ఆ పదార్థాల రుచులకు మాత్రమే కాదు, వాళ్ళ ప్రేమకు కూడా అలవాటు పడిపోయాము.

ఆ రోజు అవాలంచే లేక్‌రూట్‌లో ఉండే ప్రాంతాలన్నీ సందర్శిస్తూ ఆస్వాదించాలని నిర్ణయించుకున్నాం. మొదటగా పైన్ ఫారెస్ట్‌కి వెళ్ళాం. ఆకాశాన్ని తాకుతున్నట్లున్న పైన్ చెట్ల మధ్యలోంచి కొంత లోతైన ప్రాంతానికి దిగగానే ఒక సరస్సు ఉంది. ఆ సరస్సు ఒడ్డున పర్యాటకులందరూ ఫోటోలు దిగుతూ బిజీ బిజీగా ఉన్నారు. ఒక్క క్షణం ఆగి చుట్టూ ప్రాంతాన్ని పరిశీలిస్తే, ఇంకా పూర్తిగా తొలగిపోని పొగమంచు పొరల్లోంచి చీల్చుకుంటూ వస్తున్న కిరణాలు నిచ్చలమైన నీటిపై పడి బంగారు వర్ణాన్ని పైన్ చెట్లకు అద్దిన దృశ్యం అద్భుతంగా తోచింది. అక్కడి యాత్రికులందరూ బంగారు వర్ణంలో ధగధగా మెరిసిపోతున్నారు. ఆస్వాదించాలే గాని ఎన్నటికీ చెరిగిపోని మనోహర దృశ్యమది. లోయలోంచి పైన్ చెట్లను దాటి రోడ్డుపైకి వచ్చాక యాత్రికులను అటూఇటూ తిప్పుతున్న గుర్రాలు కనపడ్డాయి. ఒక గుర్రాన్ని మాట్లాడుకొని ఫోటోలు దిగి ముందుకు కదిలి 6th మైల్ వ్యూ పాయింట్ దాటి 9th మైల్ వ్యూ పాయింట్ వద్ద ఆగాము. ఆ ప్రాంతాన్నే వెల్ రాక్ డౌన్స్ అని కూడా అంటారు. అక్కడ ఉన్న తొద గిరిజనుల మోడల్ హౌస్ మమ్మల్ని ఎంతో ఆకట్టుకుంది. ఒక చిన్న కొండలాంటి ప్రాంతాన్ని మెలికలు తిరిగిన దారుల వెంట పైకి ఎక్కగానే ఒక్కసారిగా మనోహర దృశ్యం సాక్షత్కరించింది. మేము నిలుచున్న పచ్చని కొండచుట్టూ లోయలాంటి ప్రాంతం, ఆ లోయల తర్వాత దట్టమైన అడవితో నిండిన ఎత్తయినా కొండలు. మన తెలుగు సినిమాల్లో ఆ లొకేషన్స్ కొన్ని వందల సినిమాల్లో కనిపిస్తాయి. నిజానికి ఊటీలోని ప్రతీప్రాంతం మన తెలుగు సినిమాల్లో కనిపించేవే.

అక్కడినుండి పైకర వాటర్ ఫాల్స్ వద్దకి వెళ్ళాము. కారు దిగిన ప్రాంతం నుండి సుమారు రెండు కిలోమీటర్లు నడిస్తే గాని పైకర వాటర్ ఫాల్స్ చేరలేము. కానీ అంతటి అందమైన ప్రాంతాన్ని ఎంత కష్టమైనా వదులుకోకూడదు. ఆ వాటర్ ఫాల్స్ వద్ద మాకు డెబ్బయి సంవత్సరాల పైన ఉన్న ఇద్దరు అక్కాచెల్లెళ్లు పరిచయం అయ్యారు. ఒకరిది కలకత్తా మరొకరిది బెంగళూరు. ఇద్దరు కలిసి ఒక నెల రోజులనుండి అన్ని ప్రాంతాలు అలా తిరుగుతూనే ఉన్నారట. మాకు కూడా మీలా తిరగడం ఇష్టమని చెబితే **"మేము మీ వయసులో జీవితంలోని అనేక కారణాలతో కాలు బయటపెట్టలేకపోయాము, ఇప్పుడు స్వేచ్ఛగా ఇలా రెక్కలు కట్టుకొని తిరుగుతున్నాం. ఇన్ని ఏండ్ల జీవితం ఒక ఎత్తు, గత నెలరోజుల జీవితం ఒక ఎత్తు. మీరు ఇలాగే దేశంలోని అన్ని ప్రాంతాలను సందర్శించండి"** అని మమ్మల్ని దీవించారు. అంతేకాదు శేష మొబైల్ నెంబర్ తీసుకొని, కలకత్తా, బెంగుళూరులు వచ్చినప్పుడు కచ్చితంగా వాళ్ళింట్లో ఒక్కోరోజు ఉండాలని మాపై ఎంతో ప్రేమని కురిపించారు. ఆ తర్వాత చివరగా అవలాంచే లేక్ చేరుకున్నాం. ఒక బోట్ లో చెరువు లోని రెండుకొండల మధ్య ఇరుకైన ప్రాంతం వరకు వెళ్ళాక అసలైన అవలాంచే అందాలున్నాయి. చెరువులో నీళ్లు సగం లోతులోకి తగ్గిపోవడం వల్ల మేము మరింత లోతులో ఉండి ఆ గుట్టలు చెట్లు కనువిందు చేసాయి. తిరుగు ప్రయాణంలో 6th మైల్ వ్యూ పాయింట్ వద్ద కొద్దిసేపు సేదతీరి ఆ రోజు చివరగా సిటీ మధ్యలో ఉన్న ఊటీ లేక్ కి వెళ్ళాము. అది మానవ నిర్మిత అందమైన సరస్సు. సరస్సు చుట్టూ ప్రహరీ

లాగా ఉన్న దేవదారు వృక్షాలు ఆ ప్రాంతాన్నంత అందంగా మార్చివేసాయి. చలి విపరీతంగా పెరగడం మొదలైన వెంటనే సాయంత్రం కాకముందే గూటిలోకి చేరుకున్నాం.

మేము రూమ్స్ వద్దకి వెళ్ళగానే, అవి మాకు అద్దెకిచ్చిన వ్యక్తి మా వద్దకి వచ్చి మా యాత్ర గురించి అడిగి, మాకు కొన్ని సలహాలు ఇచ్చాడు. అతడు దాదాపు రెండుగంటలకు పైగా మాట్లాడుతు మాతో ఎన్నో విషయాలు పంచుకున్నాడు. తను చెన్నైలోని ఒక వ్యక్తికి చెందిన ఆ చుట్టుపక్కల ఇండ్లని కొన్ని సంవత్సరాలకు లీజుకు తీసుకొని, యాత్రికులకి అద్దెకి ఇస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. తన ఊరి పైన అక్కడి ప్రజలపైన తనకున్న ప్రేమ వెలకట్టలేనిది. అక్కడికి టూరిస్టులుగా వచ్చిన కొందరు ధనికులు అక్కడ స్థిరాస్తులు కొని అనేక ఇండ్లను నిర్మించి వ్యాపారాలు చేస్తున్నారని, స్థానికేతరులు భూములు కొని విచ్చలవిడిగా నిర్మాణాలు చేపట్టడం వల్ల ఊటీ తన సొంత అస్తిత్వాన్ని కోల్పోయిందని, స్థానిక గిరిజనులు కూలీలుగా మారిపోతున్నారని ఎంతో బాధ పడ్డాడు. తన చిన్నప్పటి ఊటీకి ఇప్పటి ఊటీకి చాలా తేడా ఉందని, పర్యాటకం పేరుతో అక్కడి ప్రకృతి విధ్వంసానికి గురవుతుందని ఆవేదన చెందాడు. అతడు మాట్లాడి వెళ్ళాక నన్ను ఎన్నో ఆలోచనలు ముంచెత్తాయి. మానవుడి దృష్టి పడని ప్రాంతాలు ఎంత స్వచ్ఛంగా ఉన్నాయో, మానవుడు అడుగుపెట్టిన ప్రాంతాలు అంతటి విధ్వంసానికి గురైనాయని అనడంలో ఎటువంటి సందేహం లేదు.

మూడవ రోజు ఉదయాన్నే మా పెంకుటిల్లు హోటల్ లో ఆతిథ్యం స్వీకరించాక కూనూర్ వైపు ప్రయాణం ప్రారంభించాము. కూనూర్ దాటి లాంబ్స్ రాక్ వ్యూ పాయింట్ వెళ్లే దారి సన్నగా ఉండి ఒకవైపు లోయలతో ప్రమాదకరంగా ఉండడంతో పాటు, దారి పైన పందిరిలా కప్పబడ్డ చెట్లు, లోయల నిండా తేయాకు తోటలతో అద్భుతంగా ఉంది. తేయాకు తోటలను చీల్చుకుంటూ గమ్యం చేరగానే, ఒక వ్యక్తి మా వద్దకి వచ్చి "గైడ్ కావాలా సర్" అని అడిగాడు. నేను అప్పటికే ఆ ప్రాంతాలన్ని యూట్యూబ్‌లో చూసాను కాబట్టి అవసరం లేదన్నాను. మేము ముందుకు నడుస్తున్నా కొద్దీ అతడు మాతోపాటే వస్తూ, "మూడువందలు ఇవ్వండి చాలు సర్, ఎంతో ఖర్చుపెట్టుకొని ఇంత దూరం వచ్చారు, మా గురించి కూడా ఆలోచించండి సర్" అని అనగానే నేను అతడి వైపు చూసాను, అతడికి ఏం అర్థమయిందో తెల్వదుగాని మమ్మల్ని గైడ్ చేయడం మొదలుపెట్టాడు. ఇక మేము ఆపదల్చుకోలేదు. మాకు మొదటగా ప్రెగ్నెంట్ లేడీ వ్యూ చూపిస్తూ దూరంలోని కొండలను వివరించాడు. అప్పటికి కొద్దికాలం క్రితమే త్రివిధ దళాల అధిపతి బిపిన్ రావత్ గారు ప్రయాణిస్తున్న హెలికాప్టర్ ప్రమాదం జరిగిన ఆ కొండల్లోని ఒక మూలన ఉన్న ప్రదేశాన్ని చూపించాడు. పక్కనే ఉన్న సూసైడ్ పాయింట్, ఎలిఫెంట్ రాక్ లను చూపిస్తూ లాంబ్స్ రాక్ పైకి తీసుకెళ్ళాడు. అక్కడినుండి చుట్టుపక్కల ప్రాంతాలన్ని వివరించాడు. అక్కడ ఉన్నప్పుడు నా సహచరి సౌజన్య అస్వస్థతకు గురయింది. మేమిద్దరం కిందివైపుకు వచ్చి దట్టమైన అడవి మధ్యలో సన్నని దారిపక్కన యాత్రికులు సేదతీరడానికి వేసిన కుర్చీలలో కూర్చున్నాం. మాతో పాటు మరో రెండు



జంటలు కూడా ఆ ప్రాంతంలోని ప్రశాంతతని ఆస్వాదిస్తూ ఉన్నారు. ఎన్ని అందమైన ప్రాంతాలను చూసినా, అటువంటి ప్రాంతంలో లభించే ఆనందం వేరు. కొద్దిసేపటి తర్వాత మా వాళ్ళందరూ వచ్చారు. అశ్విని, సౌజన్య తో కొద్దిసేపు మాట్లాడాకా నావైపు చూసి "అన్న, సౌజన్య కు ఏం ప్రాబ్లెమ్ లేదు. మనం ట్రిప్ నుండి అనుభూతులను మాత్రమే కాదు, అంతకన్నా ఎక్కువే తీసుకెళ్తున్నాం" అన్నది. అశ్విని బిఫార్మసి చదవడం మాత్రమే కాదు, తనొక బిడ్డకి తల్లి కూడా.

కారుపార్కింగ్ ప్రాంతంలోకి వచ్చాక మా గైడ్ తో ఫోటో దిగి బాయ్ చెప్పినం. తను మరికొందరు యాత్రికుల కోసం వెళ్ళాడు. మేము తెలుగులో మాట్లాడుకుంటుంటే విని పక్కనే ఉన్న సోడాల బండి అక్క మమ్మల్ని మన తెలుగువాళ్లేనా అని పలకరించింది. అక్క దగ్గరికి వెళ్ళి, సోడాలు తాగుతూ, మామిడికాయలు తింటూ ముచ్చట్లు పెట్టాము. ఆమెని చిత్తూరు జిల్లాలోని ఒక మారుమూల గ్రామంనుండి ఆ నీలగిరుల్లోని మారుమూల గ్రామంలోని వ్యక్తికి ఇచ్చి పెళ్లి చేసాక, అక్కడ అలా దుకాణాలు నడుపుతూ జీవనం సాగిస్తుందట. అక్కడి చుట్టుపక్కల గ్రామాలలోని కొన్ని విశేషాలను మాతో పంచుకుంది. అక్కడ దొరికే మూలికలను, మసాలాలను కొనుక్కొని సోడాల అక్కకి, బావకి బాయ్ చెప్పి డాల్ఫిన్ నోస్ వ్యూ పాయింట్ వైపు ప్రయాణం ప్రారంభించాము. మేము కూనూర్ దాటిన తర్వాత నుండి ఆ రోజంతా మా ప్రయాణం అందమైన తేయాకు తోటల్లోనే సాగుతుంది. ముఖ్యంగా

# అసలు ముఖం

నీకంటూ
ఏమి మిగుల్చుకోని
నిన్ను చూస్తూ
ఇంటి అద్దం
గుక్కపట్టి ఏడుస్తుంది

నీ రెక్కలు కట్టుకొని
ఎగిరిన పిల్లపక్షులు
గాయం కనబడనీయకుండా
నిన్నే పొడుచుకుతింటుంటాయి
కళ్ళద్దాల మాటునుండి
నీ అసలు ముఖాన్ని
వెతుక్కునే లోపలే
నీ గుండె మొరాయిస్తుంది

నువు మోయలేనంత చక్కెరశాతం
నీతో జతకూడుతుంది
నీ ఇంటిలో
నీ వారనుకున్న వాళ్ళ మధ్యలో
నువు ఒడిలోకెత్తుకొని మురిసిన
నీ రెండు కళ్ళే
నిన్ను దగ్గరుండి మరీ ఓడిస్తాయి

నిన్ను ఒంటరిని చేసి
నువు చేసిన త్యాగాలన్నింటిని
ఓ కుప్పగాపోసి
మాటలతో నిప్పంటించి
నీ జీవితకాల కీర్తిని
చిటికెలో బూడిదచేస్తాయి

నువు శవంగా మారకముందే
నిన్ను గోతిలో పూడ్చేసే
ఉపాయాలెన్నో
నీ చుట్టూ వల పన్నుతాయి

అనాథపక్షిగా
అవతారమెత్తకముందే
అయ్యో! నాలుగురాళ్ళయినా
దాచుకోవాల్సి ఉండే అని
నలుగురి మాటలు
కళ్ళను తడిచేయక ముందే
నీకోసం నువ్వు కొంత
దాచుకోవాలి

చివరియాత్రలోనైనా
నీ కళ్ళు చెమ్మగిల్లకుండా
ఉండాలంటే
చితిలోనైనా
ప్రశాంతంగా నిద్రపోవాలంటే
వాళ్ళలాగే నువ్వు
నటించడం నేర్చుకోవాలి



తండ హరీష్ గౌడ్
897 843 9551

డాల్ఫిన్ నోస్ వ్యూ పాయింట్ చుట్టుపక్కల ప్రాంతాలన్నీ తేయాకు తోటలతో కనువిందు చేసాయి. అద్దెకు తీసుకున్న బైనాక్యులర్‌లతో అందాలన్నీ ఆస్వాదించాక, తిరుగుప్రయాణంలో ఒక తేయాకు తోట వద్ద ఫోటోలు తీసి ప్రింట్ ఇస్తున్న ఒక వ్యక్తి ఆగాము. నీలగిరుల్లోని ఆదిమజాతి గిరిజన తేయాకు కార్మికులు 'బడగ' ల వేషధారణలో ఫోటోలు దిగి, చాలా సేపు ఆ తోటల్లో రెక్కలు కట్టుకొని విహరించాము. అక్కడి నుండి కూనూర్‌లో ఉన్న హైదరాబాద్ బిర్యానీ హౌస్‌లో రుచికరమైన బిర్యానీ తిని ఊటీ లోని రోజ్ గార్డెన్ కి చేరుకున్నాము. రోజ్ గార్డెన్‌లో వేల రకాల గులాబీ పువ్వులను చూసి ఆరోజును ముగించాం.

మూడవరోజుకల్లా మా పెంకుటిల్లు హోటల్ మా చుట్టాల ఇల్లులా మారిపోయింది. షఫీక్ మాకు మంచి స్నేహితుడిగా మారిపోయాడు. టిఫిన్ చేయడంతో పాటు నేను పార్సిల్ కూడా కట్టుకున్నాను. ముందుగా అనుకున్న ప్రకారం మేము ఊటీ నుండి కూనూర్ కి టాయ్ ట్రైన్ లో ప్రయాణం చేసాము. మొత్తం ఊటీ యాత్రలో తప్పనిసరిగా చేయాల్సిన ప్రయాణమది. టాయ్ ట్రైన్ ఊటీ నుండి మెట్టుపాల్యం వరకు ఉంటుంది, కానీ మేము గంట ప్రయాణం తరువాత వచ్చే కూనూర్ లోనే దిగాము. టాయ్ ట్రైన్ ప్రయాణం మొత్తం లోయలు కొండలు తోటల్లోంచి, టన్నెల్స్ గుండా సాగుతూ మధురానుభూతిని మిగులుస్తుంది. ఆ రైలు ప్రయాణంలో ఉద్యోగ విరమణ పొంది యాత్రకి వచ్చిన జంట మాకు స్నేహితు లయ్యారు. ఊటీలో వారిది మొదటిరోజు ప్రయాణమని మిగతా మూడు రోజుల కొరకు మా వద్ద సమాచారం తీసుకున్నారు. కూనూర్ నుండి కోయంబత్తూర్ వైపు గిరగిరా కిందికి జారుతూ కారులో వెళ్ళిపోయాము. తూర్పు కనుమలను పశ్చిమ కనుమలను కలిపే ప్రాంతం గూడలూరు వద్ద ఒకసారి ఆగి ముందుకు కదిలాము. కోయంబత్తూర్ నుండి సుమారు 30కిలోమీటర్ల దూరంలోని ఈషా ఫౌండేషన్ వారి ఆదియోగి విగ్రహం వద్దకు వెళ్ళాము. వెళ్లే దారిలో ద్రాక్ష తోటలు, కొబ్బరి, అరటి తోటలు ఎక్కువగా ఉన్నాయి. తొందర తొందరగా ఆదియోగి విగ్రహం వద్ద ఫోటోల కార్యక్రమం మిగించుకొని కోయంబత్తూర్ రైల్వే స్టేషన్ కి చేరాము. షఫీక్ మాకు స్టేషన్ బయట ప్రేమతో ఒక హగ్ ఇచ్చి తిరిగివెళుతుంటే కారు కంటికి

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 7  హైదరాబాద్ మే : 2023

# తాళ్ళపాక సంకీర్తనలు

**శివప్రియ,** ఫోన్ : 996 408 2076




**(తాళ్లపాక సంకీర్తనలు. సం. డా. వేటూరి ఆనందమూర్తి, గంధం బసవ శంకరరావు, పద్మభూషణ్ డా.కె.ఐ. వరప్రసాద్ రెడ్డి (పేజీలు: 369, వెల: 120, ప్రతులకు: తి.తి.దే. తిరుపతి)**

తాళ్ళపాక వారి సంకీర్తనా సాహిత్యం 'క్షీరసముద్రం' లాంటి దన్నారు శ్రీమాన్ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు. ఈ పాలసంద్రానికి ఏత మెత్తడం సాధ్యమా? అయినా వేటూరి ప్రభాకరశాస్త్రి, రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ, ఉదయగిరి శ్రీనివాసాచార్యులు, గౌరిపెద్ది రామసుబ్బశర్మ మొదలైన మహానుభావులెందరో తాళ్లపాక వారి వేలాది సంకీర్తనల్ని వెలుగులోనికి తెచ్చి ధన్యులయ్యారు. ఇంకా చెప్పాలంటే తెలుగు జాతికి అపారమైన సిరిసంపదల్ని కూర్చిపెట్టారు.

తిరుమల తిరుపతి దేవస్థానం వారు తాళ్లపాక సంకీర్తనల్ని మొదట 35 సంపుటాలుగా ప్రచురించి, తర్వాత వాటిని 29 సంపుటాలుగా ముద్రించి, భక్తకోటికి, కావ్యప్రియులకు రసామృతంగా అందించారు. బ్రహ్మశ్రీ వేటూరివారు 'అన్నమాచార్య చరిత్ర' ద్విపద కావ్యాన్ని వెలికి తీసి, అనర్ఘమైన పీఠికతో 1949లో శ్రీ వేంకటేశ్వర 'ఓరియంటల్' రీసర్చి ఇన్‌స్టిట్యూట్ ద్వారా ప్రచురింపచేశారు. నాటి నుండి నేటి వరకు ఈ సాహితీ యజ్ఞం కొనసాగుతూనే వుంది. డా. వేటూరి ఆనందమూర్తి, గంధం బసవ శంకరరావు, పద్మభూషణ్ డా. కె. ఐ. వరప్రసాద్ రెడ్డిగార్ల సంపాదకత్వ- పరిష్కరణలో ఈ తాళ్లపాక సంకీర్తనలు' ప్రత్యేక సంపుటంగా 2022లో తి.తి.దేవస్థానం, తిరుపతి ద్వారా ముచ్చట గొలిపే విధంగా వెలువడింది. ఈ పుస్తకంలోని 284 తాళ్లపాక సంకీర్తనలు ఆపాత మధురాలు. ఇక ఆచార్య వేటూరి ఆనందమూర్తి గారి రెండు పీఠికలు, డా. తాడేపల్లి పతంజలి గారి పీఠిక, గంధం బసవ శంకరరావు గారి పీఠిక - వెరసి ఈ నాలుగు పీఠికలు ఆలోచనామృతాలే. శాంతా బయోటెక్ అధినేత డా.కె.ఐ.వరప్రసాద్ రెడ్డిగారి శాంతావసంతా ట్రస్ట్ హైదరాబాద్ సహకారంతో తి.తి.దే.వారి ఆధ్వర్యంలో వెలువడ్డ 'తాళ్లపాక సంకీర్తనలు' ప్రాముఖ్యమేమిటో తెలుసుకుందాం.

'తాళ్లపాక సంకీర్తనలు' వ్రాత ప్రతిని శ్రీమాన్ తాళ్లపాక వేంకట శేషాచార్యులవారు 1941లో శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యపరిశోధన సంస్థకు అప్పగించారు. తాళ్లపాక వంశీకులైన శ్రీతాళ్లపాక సూర్య నారాయణయ్య గారు 'అన్నమాచార్య చరిత్ర' వ్రాతప్రతిని 1940లో శ్రీ వేం. ప్రా. పరిశోధన సంస్థకు సమర్పించారు. శ్రీ తాళ్లపాక వేంకట శేషాచార్యుల వారి 'తాళ్లపాక సంకీర్తనలు' వ్రాతప్రతిని వేటూరి ప్రభాకరశాస్త్రి గారు తమ 'అన్నమాచార్య చరిత్ర' పీఠికలో (1949) పేర్కొని అందులోని కొన్ని పాటల్ని పరిష్కరించి ప్రచురించారు. తర్వాత రాళ్లపల్లి వారు కూడా తమ సంపాదకత్వంలో వెలువడ్డ తాళ్లపాక సంకీర్తనల సంపుటాల్లో (1955,56) ఈ అమూల్యమైన వ్రాతప్రతి 'తాళ్లపాక సంకీర్తనలు'లో కర్తల పేర్లు తెలియని కొన్ని కీర్తనలున్నా యనీ, పైగా తర్వాతి పదకర్తల రచనలు కూడా కొన్ని కలగా పులగమయ్యాయని రాళ్లపల్లి వారు అన్నమాట కొత్త పరిశోధనకు దారి తీసిందని ఆచార్య ఆనందమూర్తి అన్నారు. (తాళ్లపాక సంకీర్తనలు - ఒక పరిశోధనాత్మక పరిశీలన. మొదటి పీఠిక- 2005. పేజి: Xiii) శాంతా బయోటెక్నిక్స్ లో పరిశోధకులైన గంధం బసవ శంకరరావు గారు 1941 నాటి 'తాళ్లపాక సంకీర్తనలు' వ్రాతప్రతిని పరిష్కరించి చక్కని పీఠిక రాయమని ఆచార్య వేటూరి ఆనందమూర్తిగారిని కోరారు. ఆయన భక్తిశ్రద్ధల సత్ఫలమే ఈ సుకృతిలోని రెండు పీఠికలు. కాగా 'తాళ్లపాక సంకీర్తనలు' లో మూర్తిగారు చేసిన పాఠపరిష్కరణలు, ఇచ్చిన వివరాలు కూడా విలువైనవే.

ఆచార్య ఆనందమూర్తిగారు మహాపండితులైన మానవల్లి రామకృష్ణ కవి, పితృపాదులైన ప్రభాకరశాస్త్రిగారి కొన్ని సూచనల్ని పరిశోధకుల దృష్టికి తెచ్చారు. తాళ్లపాక తిరువేంగళనాథుని జీవిత చరిత్రము కార్వేటి నగర సంస్థానంలో వున్నదన్న విషయంపై గవేషణ జరగాలి. ఈ తిరువేంగళ నాథుడు పెద తిరువేంగళనాథుడే కాబోలు అన్న వూహ ఆనందమూర్తి గారిది. ఇతని తమ్ముళ్లిద్దరికి-చిన్నన్నకు చిన తిరువేంగళనాథుడనే పేరుంది. మరి తిరువేంగళనాథుని జీవిత చరితము వీళ్లల్లో ఎవరి గురించి రాసినదని ఆచార్య మూర్తిగారి ప్రశ్న. చిన్నన్న తన తాతగారి, సోదరుల్లో ఒకరి గురించి రాసినవాడు తన తండ్రిగారైన పెదతిరుమలాచార్యుల వారి గురించి రాయకుండా వుంటారా అన్నది ఆచార్యుల వారి అనుమానం.

**'తాళ్లపాక సంకీర్తనలు'** వ్రాతప్రతిలో కొందరు పదకర్తల పేర్లు లేకుండానూ, మరి కొందరి పేర్లు కలగలిసి వున్నాయని అన్నారు మూర్తిగారు. **'శ్రీ వేంకటనాథ'** ముద్రగలవి చిన తిరుమలాచార్యుల వనీ, **'శ్రీ వేంకటేశ, అలమేల్మంగా సమేత శ్రీ వేంకటేశ్వర'** ముద్ర గలవి, పెద తిరుమలాచార్యులవనీ, రకరకాలుగా వున్న **'తిరువేంకటనాయక'** ముద్రలతో వున్న సంకీర్తనలు అన్నమయ్యవనీ నిర్ధారింపబడ్డాయన్నారు ఆనందమూర్తిగారు. ఈ **'తాళ్లపాక సంకీర్తనలు'** వైశిష్ట్యాన్ని వారు ఇలా చెప్పారు. ఈ గ్రంథంలో వేంకట ముద్రగల అముద్రితాలై కొత్త కీర్తనలు సుమారు 150కి పైగా

వున్నాయన్నారు డా.ఆనందమూర్తిగారు. ఈ పుస్తకంలో 'శ్రీకృష్ణ ముద్రగల సంకీర్తనలు దాదాపు 15 సంకలింపబడటం కూడా విశేషమే. తంజావూరు సరస్వతీమహల్ గ్రంథాలయంలోని **'వేంకటేశ పదములు/ నానావిధములు'** అనే సంకలనం కాగితపు ప్రతిలోని 21 శ్రీ కృష్ణ పదాల్ని తెప్పించుకొని, వాటిని పరిష్కరించి, విశ్లేషించి ఆచార్య వేటూరి వారు హైద్రాబాద్ నుంచి వెలువడ్డ 'రసమయి' ఆగష్టు 2005 సంచిక నుండి కొంతకాలం పాటు ధారావాహికంగా వ్యాసాలు వెలువరించారు. తాళ్లపాక పదకర్తల్లో మనకింతవరకు ముగ్గురు మహానుభావులే తెలుసు- అన్నమయ్య, పెద తిరుమలాచార్యులు, చిన తిరుమలాచార్యులు. కాని డా. ఆనందమూర్తి గారి కొత్త పరిశోధనవల్ల తాళ్లపాక చిన్నన్న నాలుగవ పదకర్తగా, శ్రీకృష్ణపదాల రచయితగా తెరమీదకు రావడం సంతోషించదగ్గ విషయం. ఈ మహత్తర కార్యం సాధించిన ఘనత ఆచార్య వేటూరి ఆనందమూర్తి గారికే చెందుతుంది. తాళ్లపాక చిన్నన్న **"శ్రీకృష్ణ"** ముద్రతో రాసిన సుమారు 36 సంకీర్తనల్ని డా. మూర్తిగారు ఈ పుస్తకంలో పొందుపరిచారు. (పేజి: 136) క్లుప్తంగా చెప్పాలంటే డా. వేటూరి ఆనందమూర్తిగారి ఈ రెండు పీఠికలు కొత్త పరిశోధన లకు నిధానాలు, మరి కొన్ని నూతన పరిశోధనలకు ప్రేరకాలు.

**'తాళ్లపాక పాటల మాటల మూటలు'** అనే ముందుమాట రాసిన డా. తాడేపల్లి పతంజలి గారి తాళ్లపాక కొన్ని సంకీర్తనల వ్యాఖ్యానాలు పసిడికి పరిమళం సంతరించిపెట్టినాయి. **'అలరచంచలమైన', 'ఏమొకొ చిగురుటధరమున', 'పొడగంటిమయ్య మిమ్ము పురుషోత్తమా', 'అంగనామంగనామన్తరే'** ఈ నాలుగు సంకీర్తనల అంతః సౌందర్యాన్ని వెల్లడించిన డా. తాడేపల్లి వారి లోచూపు ప్రశంసనీయం. (పేజీలు : xxxvii-xiiv) **"ఆహా! శ్రీ వేంకటాద్రినాథ! రే!'** సంకీర్తనకు వ్యాఖ్యానం (పేజీ : 41-44) చేసిన విధానం బహుధా స్తుత్యం. ఈ పదంలో పేర్కొనబడ్డ శైవ, వైష్ణవ నవనాథుల్ని ప్రస్తావిస్తూ డా. పతంజలి గారు ఈ విషయమై మరి కొంత పరిశోధన అవసరమని భావించడం గమనార్హం.

'తాళ్లపాక సంకీర్తనలు' సంపాదకుల్లో రెండవ వారైన గంధం బసవ శంకరరావు గారి మనవి మాట 'ఇదొక భగీరథ ప్రయత్నం…భావి పరిశోధకులు చక్కగా గమనించి నూతన పరిశోధనకు పూనుకోవాల్సిన సంగతి. ఈ సత్కృతి సంపాదకత్రయం అవబృథస్నానం చేసి ధన్యత కాంచిందేమో కానీ ఆ భగీరథ ప్రయత్నం ఇంకా పూర్ణత సాధించవలసి వుందనుకుంటాను.

2022లో వెలువడ్డ ఈ **'తాళ్లపాక సంకీర్తనలు'** - తాళ్లపాక వారి పదసాహిత్యానికి కొత్త సింగారమే, బంగారమే ఈ పుస్తకంలోని 284 సంకీర్తనల్లో కొత్తవి 212. ఈ సంకీర్తనల్లో చాలా వాటి చమత్కారాల్ని, విశేషాల్ని సంపాదకులైన డా. ఆనందమూర్తి, గంధం బసవ శంకరరావు గారలు అక్కడక్కడ తెలియజేశారు. సంపాదక ద్వయం ప్రతిభానిదర్శనాలు కొన్నింటిని చూద్దాం. అయ్యయ్యో వేంకట రమణా!' (పేజి:12) సంకీర్తనలోని "యెగ్గు తిని వచ్చేవు- యింతి జడ గొట్టెనని" అనే మాటను గమనిస్తే కూచిపూడి వారి 'భామాకలాపం' నాయిక నాయకుణ్ణి జడతో కొట్టే శృంగారాభినయం గుర్తుకు వస్తుందంటారు వేటూరి ఆనందమూర్తిగారు. కూచిపూడి నాట్యంపై తాళ్లపాక సంకీర్తనల ప్రభావం పరిశోధించాల్సిందన్న ఆచార్య వేటూరి వారి అభిప్రాయం గమనింపదగ్గది.

'ఏమని వినేమొకో' సంకీర్తనకు అర్థమిచ్చిన సందర్భంలో 'చనుజక్కవలు' అనే పదానికి పొరపాటున 'గుండ్రని చకోరములు' (పేజి : 90) అన్న అర్థం ఇయ్యబడింది. ఇక్కడ గుండ్రని చక్రవాకాలు అని వుండాల్సింది.

"ఏలర?నాతో యింత చలమేలరా రంగా' అన్న సంకీర్తన (పేజి: 102) లో వ్యాఖ్యాత గంధం బసవ శంకరరావు గారన్నట్లు 'అభిసారిక' వ్యథకాదది, అది విరహోత్కంఠిత విరహతాపం.

'భూషణము లవి మేటి' చిన తిరుమలాచార్యుల ఈ సంకీర్తన (పేజి : 243) ప్రభావం శ్రీ పాదరాయల 'భూషణ కె. భూషణ ఇదు భూషణ' దాసర నామంపై వుందనీ, ఆ పాటను చాలా సుకుమారమైన మాటల్లో తెలుగులోకి అనువదించి చూపారు డా. ఆనందమూర్తిగారు. (పేజి: 244-245) కవి కావ్య పదప్రయోగ కోశాలు పదాల అభిధార్థాల నిచ్చి వూరకుంటాయి కాని కవికావ్య భావకోశాలు ఆయా కవులు వివిధ సందర్భాల్లో ప్రయోగించిన పదాల వైలక్షణ్యాన్ని తేటతెల్లం చేస్తాయని అలాంటి భావకోశాల ప్రచురణ జరగటం అవసరమన్న ఆచార్య వేటూరి ఆనందమూర్తి మాట పరిణత పండితులు, ప్రబుద్ధ పదకోశ నిర్మాతలు గమనించాలి.

ఆచార్య వేటూరి ఆనందమూర్తి లోతైన పరిశోధన, సూక్ష్మమైన పరిశీలనలు ఈ గ్రంథ మంతటా పరుచుకు పొయ్యాయి. తాళ్లపాక సంకీర్తనల పరిశోధనను నాచన సోమన, పోతన, సూరన మొదలైన కవుల కావ్యాల తులనాత్మక పరిశీలనవైపు భావి పరిశోధకుల నాకర్షిస్తున్నాయి. ఆచార్య ఆనందమూర్తిగారి కొన్ని లోచూపులు 'తాళ్లపాక సంకీర్తనలు' దప్పంగా వున్న కాగితాల మీద, అందమైన, పొందికైన అక్షరాలతో, చూడ ముచ్చటైన చిత్రాలతో కన్నుల పండుగ చేస్తూ వెలువడింది. తిరుమలలో తాళ్లపాక వారి స్వగృహం (పేజి: 33) ఎంత నిరాడంబరమో! ఎంత అలౌకికానంద దాయకమో! అట్లే తమిళనాడు, తిరునల్వేలిలోని వేంకటా చలపతి గుడిలోని అన్నమయ్య విగ్రహం (పేజి : 290) కర్నాటక రాష్ట్రం, కోలారు లోని అన్నమయ్య విగ్రహం (పేజి:335) అంద చందాల పుట్టిళ్లు : బహుళార్థ సాధకమైన ఈ గ్రంథం తాళ్లపాకవారి మాటల్లోనే చెప్తే 'నీ నామము వెల సులభము, ఫల మధికము.'

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 7 (59) హైదరాబాద్ మే : 2023

# బంజారా జీవితాల ప్రతీక – ఝోళి

**ఆచార్య కరిమిండ్ల లావణ్య, అధ్యక్షులు, తెలుగు అధ్యయన శాఖ, తెలంగాణ విశ్వవిద్యాలయం, నిజామాబాద్,**

**ఫోన్ : 98484 10244**






స్వచ్ఛమైన ప్రకృతికి ప్రతీకగా ఉన్న బంజారాల జీవితాలను ఆవిష్కరించినవి ఝోళి కథా సంపుటంలోని కథలు. ప్రాచీన మూలాలకు ఆధునిక సమాజపు అద్దకాలను పోసగిన విభిన్న, వైరుధ్య కథలివి. షోడశ సంస్కారాలు, ద్వాదశ జ్యోతిర్లింగాలు, పన్నెండు మాసాలన్నట్లుగా రూపుదిద్దుకున్నాయి. వర్తమాన సమాజంలో బంజారాలు ఎదుర్కొంటున్న సమస్యలను గతానుగతికంగా మలిచినది రచయిత్రి ఆచార్య సూర్యా ధనంజయ్. నిరుపేదలుగా ఉన్న గిరిజనులు, వారికి వారే సమస్యలను పరిష్కరించుకుంటూ బతుకుతున్న ఈ గిరిజనులు, మైదాన ప్రాంత సమాజంతో కలిసి, తమకు వర్తిస్తుందేమోనని ఆశపడుతూ ప్రభుత్వ పథకాల వెంట వెళ్ళి ఆగమైన బతుకులు, తమను తాము రక్షించుకోగలమని తెలిసినా ఇతర పరిష్కారాల కోసం వెతుక్కుంటూ, ఆ వెతుకులాటలో ఏమీ దొరకలేదనే ఆవేదన ఇలా... అనేకం వీరి కథల్లోని సారాంశ నేపథ్యాలు.

పేదరికం వల్ల వచ్చిన ఆలోచనలు పేగు బంధం తెంచుకునేదాకా వెళ్ళింది. పిల్లలను పెంచలేమన్న, పోషించలేమన్న అధైర్యంతో తన కడుపున పుట్టిన బిడ్డనే అమ్మేయాలన్న ఆలోచనలకు మూలాలు ఎక్కడు నుంచి వచ్చాయని వెతుక్కోవలసిన అవసరం ఉన్నదని **ఝోళి** కథ చెబుతున్నది. ఆధునిక కాలంలో మార్పులొచ్చాయని చెప్పడానికి నిదర్శనంగా, ఆశావాదంతో జీవితాలను గడుపాలనే నేపథ్యాన్ని చూపుతూ ఝోళి కథానాయిక కలెక్టరు అవుతుంది. **"అరె ముందుకెళ్లండిరా బాబూ"**. అంటూ రచయిత్రి కేకలు పెట్టి అరుస్తున్నట్లుగా ఉన్నదీ కథా సారాంశం. ఈ కథల్లోని కోణాలను పరిశీలించినపుడు అవసరం, కుటుంబ బాధ్యతలు, ప్రేమానురాగాలు, బంజారాల మనస్తత్వాలు – జీవన రీతులు – సంస్కృతి, బంజారేతరుల మనస్తత్వాలు, ఆధునిక సమాజం, దరిద్రం, పేదరికం, అసమానతలు, ఆశావాదం, స్త్రీల చైతన్యం, బంజారాల సంక్షేమం, అంతర్మథనం, ప్రపంచీకరణలో పరిణామ వికాసం వంటివి కనిపిస్తాయి.

హైద్రాబాదు, నల్గొండ, వరంగల్ ప్రాంతాల సమాజం, మనుషుల మనస్తత్వాలు ప్రధానంగా చోటుచేసుకున్న కథలు. కొడుకుకోసం, కన్నపేగు ఎంతగా ఆవేదన చెందుతుందో చెప్పే కథ **"ఉత్తర మొచ్చింది"**. నిత్యం చేసుకునే పనులకు తోడు, రోజూ కొడుకు లేడనే ఆవేదనను భరిస్తూ తల్లిదండ్రులు అనేక సంవత్సరాలు గడపడం చాలా కష్టం. ఆ వేదనను అనుభవించి, సమాధానం దొరికిన తరువాత పొందే ఆనందం వర్ణనాతీతం. **"పార్థూ, మంత్రియా వర్షిస్తున్న దుఃఖసాగరం ప్రేమసాగరమై చుట్టూరా చూస్తున్న వారికి భాష అర్థం కాకున్నా ఎల్లలులేని తండ్రి కొడుకుల ప్రేమ భావం వారి మనసులను తాకి తడిపివేసింది"**. ఇదీ రచయిత్రి సమాధానం ఉత్తరమొచ్చింది కథలో.

రచయిత్రి తాను పుట్టిన ప్రాంతంపై ఎంత్కైతే అవగాహన కలిగి ఉన్నదో, జీవిస్తున్న ప్రాంతంపై కూడా అంతే. అందుకు మనకు ఉస్మానియా యూనివర్సిటీ, తార్నాక ప్రాంతాలను చూపిస్తుంది. చిన్నప్పటి మస్తానన్నను తన మధుర స్మృతుల్లో నుండి మాయం చేసుకోకపోవడం ఆనాటి బంజారాల అమాయక మనస్తత్వాలను, కట్టుబాట్లను, నమ్మకాలను రచయిత్రి చెబుతూనే వాటిని పటాపంచలు చేసిన విధానం వివరిస్తుంది. కథలో తానే లీనమై ఉన్నట్లుగా చైతన్య స్రవంతి విధానాన్ని ప్రదర్శిస్తుంది రచయిత్రి. ఎక్కడికక్కడ బంజారా పండుగల్లో ప్రధానంగా జరుపుకునే రాఖీ, జ్వరం వచ్చినా అది మహాభూతం అని తలిచి రకరకాల వైద్యాలను బంజారాలు చేసే విధానం, ఊర్లో పంచాయితీలు, వాటికి అనుబంధంగా పరిష్కారాలు, బంజారాల భూములపై పెత్తందార్ల ఆక్రమణలు, తీజ్ బుట్టలు, చింతచెట్లు, మామిడిచెట్లు, పశువులు – గొడ్ల కొట్టాలు, పెళ్లి ముచ్చట్లు, ఇట్లా అన్నీ బంజారాల జీవితాలను పూర్తిగా ఆవిష్కరించాలనే ఆలోచనలు రచయిత్రి కథల్లో ఉన్నాయి. బంజారాలు స్వయంకృషితో సాధించిన విషయాలను చూపుతూనే, ఇంకా ముందుకెళ్ళాలని ఆశావాదం కథల్లో బలంగా ఉన్నది.

నియంతృత్వపు కట్టుబాట్ల నుండి విముక్తి అంబాలీకి కల్పించింది. నూతన భవిష్యత్ వైపు అంబాలీని పయనింపజేసిన అరుణ అంతకుముందు బంజారా, మైదాన ప్రాంత సమాజాలను అనుభవపూర్వకంగా చదివింది. అందుకే మరో అరుణోదయానికి

ప్రతిబింబమైంది. ధర్మిబాయి దౌకాన్ కథలో ధర్మిబాయితో పాటు బంజారా సంస్కృతి పట్టణాలకు కూడ పాకిందని, మన సంస్కృతిని మరవకూడదని కథా పాత్రల ద్వారా చెప్పిస్తుంది రచయిత్రి. గోపాలా నాయక్, సరోజలు బతుకడం కోసం జీవనాన్ని మార్చుకోవడం వల్ల కలిగిన నష్టాన్ని కుమారుడు భరత్ రూపంలో తీర్చుకుంటారు. తరతరాల సంస్కృతి కొనసాగాలి కాని, అంతరించిపోకూడదనే సంస్కారం చెప్పిన కథ ధర్మిబాయి దౌకాన్. తండాల్లోని యాభై సంవత్సరాల చరిత్ర నుండి, పృథ్వీరాజ్ చౌహాన్ కాలమైన ఐదు సంవత్సరాలకు పాఠకులను తీసుకొని పోయి హైద్రాబాద్‌కు తీసుకొచ్చి నేటి ఆధునిక కాలంలోని రెండు భిన్న సంస్కృతుల కుటుంబాలను ఏకం చేసి, బంజారా సంస్కృతి ప్రకారమే వివాహం చేయించి, జంటను ఏకం చేస్తుంది కథకురాలు. అనేక మలుపులు తిరిగిన కథ ఆదరణ లేక రోడ్డున పడ్డ ధర్మిబాయిని దౌకాన్ పెట్టుకునేటట్లు ప్రోత్సహించి, కొత్త జీవితాన్ని ఇవ్వడం ఈ ధర్మిబాయి దౌకాన్ కథ కొసమెరుపు.

ధర్మిబాయి, అరుణబాయి, పారుబాయి, రామిబాయి, అంబాలీ, లక్ష్మీ, బాజుబాయి, సుజాత, కమ్లిబాయి, రమణీబాయి, కోటీశ్వరీబాయి, ధ్వాళీబాయి, సక్కుబాయి, మారోణిబాయి, సోని ఇలా కథా నాయికలకు ప్రాధాన్యమిస్తూ కథను కథానాయిక చుట్టూ పరిభ్రమింపజేస్తుంది రచయిత్రి. తనకొచ్చిన కష్టాన్ని ఛేదించి ముందుకెళ్ళే ప్రయత్నం **ఝోళి, ఉత్తరమొచ్చింది, మస్తానన్న డబ్బా, అంబాలి, ధర్మిబాయి దౌకాన్, పారబాయి, మనాది, కేసులా** కథల్లో బలంగా చూపించింది రచయిత్రి. చైతన్య ప్రవంతి విధానంలో సాగిన యాడికో ఉత్తరం కథలో వికృత చేష్టలకు పరాకాష్ఠ అయింది ప్రపంచం అంటూనే స్త్రీల జీవితాలను స్త్రీలే సరిదిద్దుకోవాలని కోరుతుంది. స్త్రీ చైతన్యం కోసం అంతకు ముందున్న స్త్రీలను ఉదాహరణగా చూపుతుంది. విద్యను ఆయుధంగా మలచుకోవాలని ఆధునిక కోణాన్ని చూపిస్తుంది. “ఒక రాణి రుద్రమ, సమ్మక్క, సారక్క, ఇందిరాగాంధీ, సరోజినీ నాయుడు, చాకలి ఐలమ్మ, పూలీబాయి, రమణీబాయి, మల్లు స్వరాజ్యం, కిరణ్‌బేడీలా మహిళ తనను తాను మార్చుకోవాలి. తన శక్తియుక్తులు లోకానికి చాటా”లని ప్రోత్సాహ, ఉత్సాహాలను ఇచ్చే సంభాషణలను రచయిత్రి చాలా చోట్ల చేర్చింది. అందుకే ఈ కథా సంపుటి ముందుమాటలో డా. రఘు ఇలా ఆవిష్కరించారు. **“రచయిత్రి పురోగమన ఆదర్శ దృక్పథాన్ని ప్రకటిస్తుంది”**.

పల్లీబుట్ట వెనుక ఇంత విషాదగాథ ఉందా అని ఆశ్చర్యాన్ని పాఠకులు ప్రకటించేలా మలిచిన కథ **పల్లీబుట్ట**. ఎంతో లోతుగా పరిశీలనలు ఉంటే తప్ప **“పళి పళి వేయించినవి, ఉడకబెట్టినవి”** లోని **“పళి పళి”** పదాలు బయటికి రావు. ప్రతి రోజూ ప్రయాణం చేసే సక్కుబాయి ఎన్నో విషాధ సంఘటనలు, అనుభవాలు, భయాలు, కష్టాలు, నష్టాలు ఎదుర్కొంటున్నది. ఎంతో మంది ప్రయాణికుల భిన్న మనస్తత్వాలను చదివిన సక్కుబాయి సంపాదించిన ఆ కొద్ది డబ్బును కూడ కాజేయాలనుకున్న ఆకతాయిలు సమాజంలో ఉంటారని, నిరంతరం జాగ్రత్త అవసరమంటుంది రచయిత్రి. **“పగలును మింగేసిన రాతిరి”** సక్కుబాయిని గాయాలపాలు చేస్తుంది. తన బిడ్డలకు అచేతన స్థితిని కల్పిస్తుంది. కాని, ఆశావాదంతో రేపటి గురించి ఆలోచనలు మొలకెత్తింపజేస్తుంది రచయిత్రి.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనను కూడ రికార్డు చేయాలనే సంకల్పం రచయిత్రిలో ఉండటంతో **మనాది** వంటి కథ రాయగిలిగింది. తెలంగాణ ఉద్యమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థుల పాత్ర, అందులో బంజారా యువకుడైన ప్రవీణ్ అమరుడైన విధానం పాఠకులకు మనాదిని కలిగించేది. **“స్వరాష్ట్రమే ఊపిరిగా పోరాటం చేసిన ప్రవీణ్ నాయక్ అమరుడయ్యాడు”** అనే కొటేషన్లు కథలో చేర్చి రాయడంతో సంభాషణల్లో అక్కడక్కడ పరిశోధకురాలుగా ద్విపాత్రాభినయం చేస్తుంది రచయిత్రి.

కరోనా కాలాన్ని రికార్డు చేయడం క్యాంపస్ కథ ద్వారా తెలపడం, అందులోనూ బంజారా పాత్రలనే మలచడం, ఈ కథ ప్రత్యేకత. నిత్యం సందడిగా ఉండే ఉస్మానియా విశ్వవిద్యాలయం కరోనా వల్ల మూగబోయిన వైనం చెబుతూనే తండా వైపు పాఠకులను పరుగెత్తిస్తుంది రచయిత్రి. ఆధునిక సమాజంలో తాను అనుకున్న విధంగా సవాళ్ళను ఎదుర్కొంటూ బతుకొచ్చని బతుకు పోరాటంలో ఓడిపోమని కథా రచయిత్రి మస్తానన్న డబ్బాలో సుజాతగా, క్యాంపస్‌లో అనితగా, ఝోళిలో విజయగా, అంబాలిలో అరుణ బాయిగా, ధర్మిబాయి దౌకాన్‌లో సరోజగా, యాడికో ఉత్తరంలో పుత్లీబాయిగా, పారుబాయిలో రోజారాణిగా పరకాయ ప్రవేశం చేసింది.

రచయిత్రి మాటలు పరిశీలిద్దాం. **“పేదరికం, అసమానతలున్న సమాజంలో ఆడబిడ్డల్ని పోషించలేని కడు దుర్భర పరిస్థితుల్లో బంజారాలున్నారు. జాతిని జాగృతం చేసిన ధీర వనితలున్నారు. ఈ కథలు బంజారాల జీవన నాడిని పాఠకులకు అందజేస్తాయని, వేదనాభరితమైన అవశేషాల స్వరాన్ని లోకానికి వినిపించాలనేదే నా ఈ ప్రయత్నం”**. ఈ ప్రయత్న ఫలితమే **“గంగ్ర హన్మంతరావు స్మారక పురస్కారం”** లభించడం. ఝోళిపై **“తెలుగు విశ్వవిద్యాలయంలో ఆచార్య మునిరత్నం నాయుడుగారి పర్యవేక్షణలో ప్రవలిక చేస్తున్న యం.ఫిల్ పరిశోధన”** – ఆవేదనా ప్రతిఫలనాలు.

బంజారా సంస్కృతి, ఆచారవ్యవహారాలను, జీవనాన్ని బలంగా చూపుతూ, నేటి ఆధునిక జీవన మలుపులను కథల్లో చూపిస్తూ, కొత్త దోవ చూపిన కథలివి. బంజారా, మైదాన ప్రాంత సమాజాలకు నున్నని దోవను వేస్తూ, హిమ్మత్ ఉండాలెగాని, ఎక్కడ్కైనా స్వేచ్ఛగా బతుకొచ్చని చెప్పిన బతుకు దోవను చూపిన కథలు. బంజారా తండాల్లోని విద్యార్థులకు ఈ కథలు చేరితే ఈ కథల్లోని ప్రత్యక్ష సాధక బాధకాలను అర్థం చేసుకొని వారి వారి జీవితాలకు పునాదిని నిర్మించుకునే ప్రయత్నం ఈ కథల ద్వారా వారు సాధించవచ్చు.



**గోదావరి (నానీలు)**
ఎస్. ఆర్. పృథ్వి
వెల : 60 /-
**ప్రతులకు :** శ్రీమతి పి. ఉషారాణి, 104-6-140, ఎం.జి. స్ట్రీట్, రామకృష్ణ నగర్, రాజమండ్రి - 533 101. ఫోన్ : 9492704750

**స్వకృతి**



**వేశ్యమాత (క్షేమేంద్రుని సమయమాతృకా అనువాదం)** డా. వద్దేపల్లి శ్రీనివాసరావు
వెల : 225 /-
**ప్రతులకు :** రచయిత, శ్రీ సీతారత్నం నిలయం, మార్కండేయ వీధి, చెరువు బజారు, జగ్గయ్యపేట - 521 175. ఫోన్ : 739 691 2978



**భారత రత్న 'అటల్ బిహారీ వాజ్‌పేయి'**
డా. షేక్ హసీన
వెల : 99 /-
**ప్రతులకు :** e-mail: haseenajournalist@gmail.com.



**అడుగడుగున గుడి ఉంది**
కస్తూరి రాకా సుధాకర్ రావు
వెల : 130 /-
**ప్రతులకు :** ఫోన్ 9121548857



**కీ.శే. డా. శ్యామలాంబ**
**జనహిత (ఆమె జీవితం వైద్యానికే అంకితం)**
డా. షేక్ హసీన, సీనియర్ జర్నలిస్ట్
అమూల్యం
**ప్రతులకు:** e-mail: haseenajournalist@gmail.com.



**భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము**
డా. షేక్ హసీన
వెల : 50 /-
**ప్రతులకు :** భాను పబ్లికేషన్స్, హైదరాబాద్.
ఫోన్ : 703 2929 486

## మూసీ పబ్లికేషన్స్ వారి పుస్తకములు

**వివరాలకు : మూసీ మాసపత్రిక, 3-4-245/1, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్ -27, ఫోన్ - 27560616**

1. భారతదేశ చరిత్ర - సంస్కృతి (17భాగాలు 4,5 మరియు 7 నుండి 21 వరకు) రూ. 175/- ఒక్కొక్క భాగానికి రూ. 2875 - 00
2. బ్రాహ్మణ రాజ్య సర్వస్వము రూ. 1200 - 00
3. నల్లగొండ జిల్లా కవులు - పండితులు రూ. 350 - 00
4. మల్యాల వంశ చరిత్ర - శాసనములు రూ. 100 - 00
5. శాసన సంపుటి రూ. 150 - 00
6. కందూరు చోడుల శాసనములు - చరిత్ర - సంస్కృతిరూ. 100 - 00
7. షబ్నవీస్ శతజయంతి సంచిక రూ. 100 - 00
8. విజయనగర శాసనములు - సాహిత్య సాంస్కృతిక విశేషములు 90 - 00
9. త్రిపురాంతక దేవాలయ శాసనములు రూ. 75 - 00
10. పులిజాల రంగారావు సంక్షిప్త జీవిత చరిత్ర రూ. 75 - 00
11. దేవాలయ వాస్తుశిల్పము రూ. 50 - 00
12. మూసీ ద్వైవార్షిక ప్రత్యేక సంచిక రూ. 50 - 00
13. మూసీ 'తెలుగు సంస్కృతి' ప్రత్యేక సంచిక రూ. 75 - 00
14. 'సుచరిత' (బి.ఎన్.శాస్త్రి సంస్మరణ) ప్రత్యేక సంచిక రూ. 100 -00
15. మూసీ 'మన తెలుగు' ప్రత్యేక సంచిక రూ. 100 - 00
16. ఆంధ్రదేశ శాసన సాహిత్యంలో స్త్రీలు రూ. 175 - 00

## చిరునామా

**మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.**

**చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా**
**సంపాదకుడు, మూసీ మాసపత్రిక, ఇం.నెం. 2-2-1109/ బికె-ఎల్.ఐ.జి.10, బతుకమ్మకుంట, బాగ్అంబర్‌పేట, హైదరాబాద్-500013.**

**చందాలకు ఆన్‌లైన్ అకౌంట్**
**స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట, హైదరాబాద్.**
**అకౌంట్ నెం. 52019740642**
**IFS Code : SBIN0020083**
**editormusi@gmail.com**

# కార్మిక వీరుడా ... ఓ శ్రామిక ధీరుడా...

**పల్లవి :**

నింగీ నేలకు నిచ్చెన వేసీ
కలల బాటలకు హద్దులు చెరపి
ప్రగతి వెలుగులకు తలుపులు తెరచిన కార్మిక వీరుడా ।
కాలచక్రంతో సమంగ నడిచే శ్రామిక ధీరుడా ॥
కార్మిక వీరుడా ... ఓ శ్రామిక ధీరుడా ॥

**చరణం 1 :**

కమ్మరి కొలిమి, కుమ్మరి చక్రం
సాలెల మగ్గం, జాలరి పగ్గం
కొడవలి, అంపం, పారా, గునపం
ప్రతీ సాధనము పరువుకు రూపం
ఉలితో చెక్కిన శిల నీ దర్పం కార్మిక వీరుడా
సాధనమొందెడు ఋషి నీ తత్త్వం శ్రామిక ధీరుడా ॥
కార్మిక వీరుడా ... ఓ శ్రామిక ధీరుడా ॥

**చరణం 2 :**

ఆకలి తీర్చే అన్నదాతవూ
మానం నిలిపిన నేత కారుడవు
నిర్మాణాలకు విశ్వకర్మవు
ఆర్థిక సృష్టికి అపర బ్రహ్మవు
అనుదిన ప్రతిజన ఆప్త మిత్రుడవు కార్మిక వీరుడా ।
నిత్య పోరాట మృత్యుంజయుడవు శ్రామిక ధీరుడా ॥

**చరణం 3**

ఉరుకుల పరుగుల ఉదయపు వేళల
ఉరకలు వేసే ఉషస్సు నీవు
ఘనమగు మనుగడ సాగగ నేర్పిన
నవ నాగరికతకు నాందివి నీవు
సకల వృత్తులకు శక్తివి నీవు కార్మిక వీరుడా ।
సర్వ యుక్తులకు ఆయువు నీవు శ్రామిక ధీరుడా ॥
కార్మిక వీరుడా ... ఓ శ్రామిక ధీరుడా ॥

**చరణం 4**

రాజు పేదను భేదమె లేని
నిస్వార్థ సేవయే నీ చిరునామా
కణకణ మండే గనులను త్రవ్వే
కాయకష్టమే నీ సంతకము
కల్మష మెరుగని నీ చిరునవ్వు కార్మిక వీరుడా ।
కలివిడితనమె కలిమి బలిమి శ్రామిక ధీరుడా॥
కార్మిక వీరుడా ... ఓ శ్రామిక ధీరుడా ॥

**చరణం 5**

నీ స్వేదం చిందే కర్మభూమిలో
ధర్మబీజముల సేద్యం చేస్తూ
బంగరు భవితను పంచుట కొరకు
పరిపరి విధముల పరిశ్రమించే
నీ విజయ గాథలు వినుతి గాంచెరా కార్మిక వీరుడా ।
విశ్వవీధిలో ప్రతిధ్వనించెర శ్రామిక ధీరుడా॥







**డా. బి. నీలిమా కృష్ణమూర్తి**
హైదరాబాద్. ఫోన్ : 97000 80030




Scanned with OKEN Scanner